RNI No.APTEL/15835/2019

ప్రజా

మణిపూస

మాసపత్రిక

తెలుగు మాసపత్రిక

సంపుటి - 1 సంచిక - 3 | ఏప్రిల్ - 2020 | పేజీలు : 62 | వెల : 25/-



Office Address

D.No.10-12-6/44, Plot No.302,
Sai Towers 1, Rednam Gardens,
Visakhapatnam.530002

విషయ సూచిక

ప్రజా మీడియా నెట్‌వర్క్

PRAJA MEDIA NETWORK

కనపర్తి రాజారావు
చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

Registration No.1140/2019

సాయి టవర్స్-1, ఫ్లాట్ నెం.302, రెడ్డం గార్డెన్స్, విశాఖపట్నం. ఫోన్ : 94924 23833

సంపాదకీయం



గ్రామస్వరాజ్యం సాధ్యమా?

మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపన, అంబేద్కర్ సూత్రీకరించిన రాజ్యాంగబద్ధత ఆచరణలో ఎంతవరకు సాధ్యమనే ప్రశ్నలు ఎన్నో ఏళ్ళుగా ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. పంచాయతీరాజ్ వ్యవస్థ సంపూర్ణంగా బలోపేతం అవ్వడం కలగానే మిగిలిపోతోందని నిపుణుల వేదన అరణ్యరోదనే అవుతోందని భావించాలి. రాజకీయస్వార్థాలకు,వ్యక్తిపెత్తందారీకీ పరిపాలనా వికేంద్రీకరణ మేడిపండు చందంగానే మారిపోయింది. పైకి వికేంద్రీకరణ అని చెబుతున్నప్పటికీ లోలోపల కేంద్రీకృత పాలననే కోరుకుంటున్న రాజకీయ వ్యవస్థ గ్రామస్వరాజ్య సంకల్పానికి తూట్లు పొడుస్తోంది. న్యాయంగా కేంద్రప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందాల్సిన నిధులు నేరుగా పంచాయతీలకే చేరాలి. అవి ఏ స్థాయిలో చేరుతున్నాయన్నది పంచాయతీరాజ్ వ్యవస్థను గమనిస్తున్నవారికి, అందులో భాగస్వామ్యులవుతున్నవారికీ తేటతెల్లమే. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ఉండే ఈ వ్యవస్థలో జిల్లాస్థాయి తప్ప మిగిలినవాటికి రాష్ట్ర ఎన్నికల కమీషన్ పరిధిలోనే, పర్యవేక్షణలోనే ఎన్నికలు జరుగుతాయన్నది చట్టం చెప్పే మాటలు.అసలు ఎన్నికలు జరగకుండా ఉండడానికే కొందరు మొగ్గు చూపిస్తున్నారు.సర్పంచి అనే పదవి కీలకం.ఆ పదవిని డమ్మీ చేసే విధానాలే రాజ్యమేలే పరిస్థితులు చాలాచోట్ల వచ్చేస్తున్నాయి. ఒకప్పుడు జిల్లా పరిషత్ అధ్యక్షుడు, పంచాయతీ సమితి అధ్యక్షుడు అంటే ఎంతో గౌరవం ఉండేది.ఈ పరిపాలనా వ్యవస్థకు కేంద్ర బిందువులుగా నిలిచి అధికారం సాగించేవారు. ఒకప్పుడు పంచాయతీ సమితి పరిధి ఒక నియోజకవర్గం పరిధి స్థాయిలో ఉండేది.ఇటు గ్రామాల సమస్యలు, అవసరాలు, పరిస్థితులు బాగా ఎరిగి ఉండేవారు. అటు అధికారగణంతోనూ సమన్వయం చేసుకొని సుపరిపాలన అందించేవారు. పార్టీలకు అతీతంగా పాలన సాగేది. ఆ వ్యవస్థ క్రమంగా నిర్వీర్యం అయిపోయింది.రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి అయిన కొత్తల్లో బాంబేలో లో జరిగిన ఏ ఐ సి సి సమావేశంలో ఆయన ఒక కీలకమైన ప్రశ్న లేవనెత్తారు. కేంద్రప్రభుత్వం చేపట్టే పథకాలు 85 శాతం గ్రామాలకు చేరడం లేదన్నది దాని సారాంశం. గ్రామాలను బలోపేతం చేయాలి, తద్వారా పట్టణీకరణ తగ్గించాలి అన్నది ఆయన ఆశయం.ఇది కార్యరూపం దాల్చడానికి చట్ట సభల్లో బిల్లులు ప్రవేశపెట్టారు. 1991లో రాజీవ్ గాంధీ మరణానంతరం పివి నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో ఉభయసభల్లోనూ బిల్లులు పాస్ చేయించి, చట్టబద్ధత కల్పించారు. పివి నరసింహారావు పీరియడ్ వరకూ ఆశయ సాధనలో కొంత ఫలవంతమైంది.దేశంలో... కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో లో కొంతవరకూ పంచాయతీరాజ్ వ్యవస్థ పకడ్బందీగా నడిచింది.పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే సంకల్పానికి మహాత్మాగాంధీ తర్వాత రాజీవ్ గాంధీ, పివి నరసింహారావు, మణిశంకర్ అయ్యర్ త్రయం పాటుపడ్డారనే చెప్పాలి.కర్ణాటకలో రామకృష్ణ హెగ్డే, పశ్చిమ బెంగాల్ లో జ్యోతిబసు, కేరళలో వామపక్ష ప్రభుత్వాలు కొంతమేరకు ఆచరణలో విజయం సాధించాయి.ప్రస్తుతం, ఈశాన్య రాష్ట్రాలలో కొంతవరకూ స్వతంత్రత ఉన్నట్టుగా భావించాలి. ఆంధ్రప్రదేశ్ లో వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సెక్రటేరియట్ అనే వినూత్న విధానం రూపకల్పన చేశారు.గ్రామపరిపాలనను బలోపేతం చెయ్యడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య గ్రామ, వార్డ్ కార్యదర్శులు వారధులుగా వ్యవహరించి, 500 రకాల సేవలు సక్రమంగా, నేరుగా అందడానికి బాధ్యత వహించడం, తద్వారా 5 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించడం ఈ వ్యవస్థ కల్పించే ప్రయోజనాలు. స్థూలంగా పంచాయతీరాజ్ వ్యవస్థను మిక్కిలి శక్తిమంతం చెయ్యడం దాని సారాంశం. ఈ తరహా భారతదేశంలోనే మొట్టమొదటి విధానం. ఏ రాష్ట్రంలోనూ ఇంతవరకూ ఇటువంటి వ్యవస్థ నిర్మాణం జరుగలేదు. ఆశయం మంచిదే అయినప్పటికీ, సర్పంచుల పాత్ర మిధ్యగా మారిపోయింది, అనే విమర్శలు వచ్చాయి. ఒకరకంగా చెప్పాలంటే, సంప్రదాయ పంచాయతీరాజ్ వ్యవస్థకు ప్రత్యామ్నాయ లేదా సమాంతర వ్యవస్థగా ఇది కన్పిస్తోందని పరిపాలనా పండితుల అభిప్రాయం.ఈ విధానం శ్రీకారం చుట్టి కొన్ని నెలలే అయ్యింది.దీనిపై సమగ్రమైన అభిప్రాయాలు ఇప్పుడు వ్యక్తం చెయ్యడం భావ్యం కాదు.భవిష్యత్తులో కొంతకాలం గడిచిన, నడిచిన తర్వాతే వీటి సమగ్ర ఫలితాలు తెలుస్తాయి. పంచాయతీరాజ్ నిర్మాణంలో విధులు, నిధులు ప్రధానమైన విషయాలు. 21 రకాల విధులు ఉన్నాయి. ఇవి దేశవ్యాప్తంగా సంపూర్ణంగా అమలుకావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సంపూర్ణంగా పంచాయతీరాజ్ వ్యవస్థల్లోకి బదిలీ అవ్వాలి. ఆదాయం పెంచేమార్గంలో పన్నుల వాటా కూడా పెంచారు. అవి కూడా చేరడం లేదు. రాజ్యాంగం ప్రకారం పరిపాలన వీరే సాగించాలి. కానీ రాజకీయ వ్యవస్థలే ఎక్కడికక్కడ పెత్తనం చేస్తున్నాయి. ఉదాహరణకు జిల్లా పరిషత్ ఛైర్మన్ లు ఉన్నప్పటికీ, ఎక్కడ నుండో వచ్చే జిల్లా ఇంచార్జి మంత్రులు ఈ వ్యవస్థపై పెత్తనం చేస్తున్నారని, తద్వారా జిల్లా ఛైర్మన్ లు డమ్మీ అయిపోతున్నారనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. స్థానిక పరిస్థితులపై వేరే ప్రాంతాలకు చెందిన మంత్రులకు ఏమాత్రం అవగాహనలు ఉంటాయని కొందరు ప్రశ్నిస్తున్నారు. స్థానిక పరిపాలనలో, ప్రజలలో పంచాయతీరాజ్ ప్రతినిధులకు ప్రాబల్యం తగ్గిపోతోందని చెప్పవచ్చు. ఆ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే, వారి పెత్తనమే పంచాయతీరాజ్ వ్యవస్థపై ఉంటోందన్నది ప్రధానమైన ఆరోపణ. గతంలో పంచాయతీరాజ్ వ్యవస్థపై ప్రధానమంత్రిస్థాయిలో సమీక్షలు జరిగేవి. కొన్నేళ్ల నుండి సమీక్షలు కూడా పెద్దగా జరగడం లేదు. ప్రజల నిష్పత్తి బట్టి, ఉపాధ్యాయుల సంఖ్య, డాక్టర్ల సంఖ్య ఇంకా గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది. ఇది వదిలిపెట్టి, రాజకీయ క్రీడలో భాగంగా, పోలింగ్ బూతుల స్థాయిలో ఆయా పార్టీలవారి సంఖ్యను పెంచుకొనే మార్గాల అన్వేషణలో పంచాయతీరాజ్ వ్యవస్థలను ఎంచుకోవడం దురదృష్టకర పరిణామాలు. దేశ ప్రగతికి పట్టుకొమ్మలు పల్లె సీమలు. గ్రామీణభారత సమున్నత ప్రగతికి మూలక్షేత్రాలు పంచాయతీరాజ్ వ్యవస్థలు. వీటిని సంస్కరించుకోవాలి. సమీక్షించుకోవాలి. రాజ్యాంగస్ఫూర్తిలో భాగమైన ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధానాలకు ఇప్పటికైనా రాజకీయ పార్టీలు స్వస్తి చెప్పాలి. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనకు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాలకులు నడుం చుట్టాలి. దేశ భవితకు కదంతొక్కాలి.

చీఫ్ ఎడిటర్

తెలంగాణా కేసీ ఆర్ సిక్సర్

ఎంతో మంది తెలంగాణ అమరవీరుల త్యాగఫలంతో, ఉద్యమకారుల పోరాటంతో 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్

నీళ్లు, నిధులు, నియామకాలు.. ఈ నినాదంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేసింది. కోట్లాది మందిని ఏకం చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన దిశగా సాగింది. ఎంతో మంది తెలంగాణ అమరవీరుల త్యాగఫలంతో, ఉద్యమకారుల పోరాటంతో 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. సరిగ్గా ఆరేళ్లు పూర్తయ్యాయి. ఈ ఆరేళ్లలో తెలంగాణ రాష్ట్రం ఎటు వైపు పయనించింది? అభివృద్ధి తీరు ఎలా ఉంది? స్వరాష్ట్ర పాలనలో విస్మరించినవి ఏంటి? అని ఆరా తీస్తే.. కాళేశ్వరం ప్రాజెక్టు, సీతారామ, పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలు తదితర ప్రాజెక్టులతో కళకళ లాడుతోంది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు రాష్ట్రానికి వెన్నెముకలా మారాయి.

ఇక, రైతు బంధు దేశ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించింది. రైతు బీమా, కేసీఆర్ కిట్లు, ఆసరా పెన్షన్లు, కంటి వెలుగు వంటి పథకాలతో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోంది. ఐటీలోనూ మంచి ఫలితాలు రాబడుతూ దేశానికి దిక్సూచిలా మారింది. అటు.. పారిశ్రామిక అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పరిశ్రమలకు రాయితీలతో పాటు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు ఇచ్చేందుకు టీఎస్ ఐపాస్ వంటి విప్లవాత్మక విధానాలకు శ్రీకారం చుట్టింది. ఫలితంగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో ప్రత్యేకించి హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టేందుకు దోహదపడింది.

పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా కూడా పెట్టుబడి దారులకు అనుకూలమైన సులభతర వాణిజ్య, పారిశ్రామిక విధానం ఉండేలా ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ (TS-IPASS) చట్టం చేసి, సులభతర అనుమతుల విధానం ప్రవేశ పెట్టింది. విద్యాపరంగానూ రాష్ట్రం అభివృద్ధి సాధించింది.

60 ఏళ్ల తరబడి పోరాటాలు.. ఎన్నో ఉద్యమాలు.. ఎందరో అమర వీరుల ప్రాణత్యాగాల ఫలంగా ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిన రోజు ఇది. ఉమ్మడి రాష్ట్రంలో తమకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా శక్తి వంచన లేకుండా పోరాడిన తెలంగాణ ప్రజలు.. సొంత రాష్ట్ర కలను నెరవేర్చుకున్నారు. 1969 నుంచే తెలంగాణ కోసం ఉద్యమాలు ప్రారంభం కాగా.. టీఆర్ఎస్ ఆవిర్భావంతో తెలంగాణ ఉద్యమానికి రాజకీయ వేదిక దొరికినట్లయ్యింది. 2009లో కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షతో తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరింది. 2011లో చేపట్టిన సకల జనుల సమ్మెతో ఢిల్లీ పాలకుల్లో ఆలోచన మొదలైంది. చివరకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా 2013 జూలైలో కాంగ్రెస్ పార్టీ ప్రకటన చేసింది. నీళ్లు, నిధులు, నియామకాల కోసమంటూ జనం కొట్లాడి మరీ సాధించుకున్న తెలంగాణ.. ప్రత్యేక రాష్ట్రంగా అవతరించి ఆరేళ్లు పూర్తయ్యాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక ఏ మార్పులొచ్చాయో చూద్దాం.

విద్యుల్లతల తెలంగా

2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగా.. తొలి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారు. ఈ ఆరేళ్లలో రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించింది.



తెలంగాణ వస్తే చీకట్లు తప్పవని నాటి పాలకుల చేసిన హెచ్చరికలు తప్పని నిరూపిస్తూ.. విద్యుత్ కోతల్లేని రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేయడమే కాదు.. సోలార్, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని సైతం గణనీయంగా పెంచుకుంది. విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగినా సరే.. డిమాండ్‌కు సరిపడా సరఫరా చేస్తోంది. కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్‌ను నిర్మించడంతోపాటు.. భూపాలపల్లిలో మధ్యలో ఆగిపోయిన 600 మెగావాట్ల కేటీపీపీని ఏడాదిలోపే పూర్తి చేసింది. విద్యుల్లతల తెలంగాణగా రాష్ట్రం అవతరించింది.

మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ భేష్

గతంలో తెలంగాణ ప్రాంతం కరువు కాటకాలతో తీవ్రంగా సతమతం అయ్యేది. ఉమ్మడి రాష్ట్రంలో చెరువులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ తప్పి దాన్ని సరిదిద్దేందుకు కేసీఆర్ సర్కారు మిషన్ కాకతీయ పేరిట చెరువులను పునరుద్ధరణకు నడుం బిగించింది. వేలాది చెరువులకు పునరుజ్జీవం పోసింది. దీంతో చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ఇక తెలంగాణలో మరో ప్రధాన సమస్య ఫ్లోరైడ్. నల్గొండలో ఉన్న ఫ్లోరైడ్ బాధితులను చూస్తే మనసు విలవిల్లాడుతుంది. ఇలాంటి కష్టం పగోడికి కూడా రావద్దనిపిస్తుంది. దీనికి ప్రాధాన కారణం తాగునీరు. దీంతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసి మంచి నీరు అందిస్తున్నారు. గోదావరి తలాపునే పారుతున్నా.. ఇన్నాళ్లూ బోరు నీళ్లు మాత్రమే తాగిన పల్లెవాసులు ఇప్పుడు గోదావరి నీళ్లను రుచి చూస్తున్నారు.

రైతు బంధు అద్భుతం

ఇక తెలంగాణ సర్కారు తీసుకొచ్చిన కళ్యాణ లక్ష్మీ పథకం, రైతు బంధు లాంటి పథకాలైతే ఓ సంచలనం. మిగతా రాష్ట్రాలు సైతం వీటిని అమలు పర్చడానికి ఆసక్తి చూపాయి. పేదింటి ఆడ పిల్లలకు పెళ్లికి డబ్బులు ఇవ్వడం కోసం రూపొందించిన కళ్యాణ లక్ష్మీ/ షాదీ ముబారక్ పథకం అందరి ప్రశంసలు పొందింది. రైతు బంధు పథకం ద్వారా ఎకరానికి రూ.5 వేలు చొప్పున ప్రతి ఏటా రెండు విడతల్లో పది వేల రూపాయల చొప్పున నేరుగా రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం చేస్తోంది. కేంద్రం సైతం ఈ పథకం స్ఫూర్తితో కిసాన్ యోజనను ప్రారంభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రైతు బంధు కోసం రూ.7 వేల కోట్లను మంజూరు చేసింది.

హాస్పిటళ్లలో మెరుగుపడ్డ మౌలిక వసతు

తెలంగాణ ఏర్పాటయ్యాక తెలంగాణలో సర్కారీ దావఖానాల రూపు రేఖలు మారిపోయాయి. ఒకప్పుడు అప్పు చేసైనా ప్రయివేట్ హాస్పిటళ్లకు వెళ్లే రోగులు... ఇప్పుడు ప్రభుత్వ వైద్యం వైపు చూస్తున్నారు. ఆసుపత్రుల్లో మౌలిక వసతులను సమకూర్చి.. నాణ్యమైన వైద్యం అందేలా చూస్తున్నారు. ఇక గర్భిణులు ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రసవం చేయించుకుంటే.. కేసీఆర్ కిట్ పేరిట రూ.2150తో ఓ కిట్ అందజేస్తున్నారు. ఆడ పిల్ల పుడితే రూ. 13 వేలు, మగ పిల్లాడు పుడితే రూ. 12 వేలు అందజేస్తున్నారు. దీంతో అనవసరపు సిజేరియన్లు తగ్గడమే కాదు.. శిశుమరణాలు కూడా తగ్గుముఖం పట్టాయి. కానీ హైదరాబాద్‌లో భారీ పెద్దాసుపత్రుల నిర్మాణం ఇంకా జరగాల్సి ఉంది.

వృద్ధులకు 'ఆసరా

ఆసరా ఫించన్లు పేదలకు నిజంగానే ఆసరానిస్తున్నాయి. రూ.200 పెన్షన్‌ను రూ.2016కు పెంచారు. అంతే కాదు ఫించన్ దారుల సంఖ్య కూడా 26 లక్షల నుంచి 38 లక్షలకు పెరిగింది. సామాజిక పెన్షన్ల కోసం తెలంగాణ రూ.12 వేల కోట్లు ఖర్చుపెడుతోంది. బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు కూడా పెన్షన్లు అందిస్తోంది. తెలంగాణ వచ్చాక చేనేతన్నల తలరాత మారింది. తెలంగాణ ఆవిర్భవించిన తొలి ఐదేళ్లలో ప్రభుత్వం సంక్షేమ రంగానికి పెద్ద పీట వేసింది.

జలసిరుల తెలంగాణ

ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల విషయంలో అన్యాయం జరుగుతుందని తెలంగాణ ప్రాంత వాసులు ఆరోపించేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా గోదావరి, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకునేందుకు కేసీఆర్ సర్కారు ప్రయత్నాలు చేస్తోంది. ఎగువన ఉన్న మహారాష్ట్రను ఒప్పించి గోదావరి నదిపై భారీ ఎత్తున కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. ఈ మధ్యే కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌ను సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు. నీరు పల్లమెరుగును అని సామెత ఉండగా.. నీరు శిఖరాగ్రానికి చేరునూ... అన్నట్లుగా 618 మీటర్ల ఎత్తున ఉన్న కొండపోచమ్మ సాగర్‌లోకి గోదావరి జలాలను పంప్ చేస్తున్నారు. కోటి ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా తెలంగాణ సర్కారు ముందుకు వెళ్తోంది. ఇక రైతుల కోసం రూ.5 లక్షల కవరేజీతో రైతు బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఒక్క గుంట భూమి ఉన్న రైతు అయినా సరే ప్రమాదవశాత్తూ చనిపోతే.. బీమా మొత్తాన్ని అందజేస్తున్నారు.

ఐటీలో మేటిగా..

తెలంగాణ ఉద్యమం సమయంలో హైదరాబాద్‌లో ఐటీ రంగం వృద్ధి నిలిచిపోయింది. ఉద్యమాల కారణంగా ఐటీ కంపెనీలు కొత్త కార్యాలయాల ఏర్పాటుకు వెనుకడుగు వేశాయి. కానీ ఇది తాత్కాలికమే అని నిరూపిస్తూ.. ప్రత్యేక రాష్ట్రం అవతరించాక హైదరాబాద్ ఐటీ వేగంగా పురోగమిస్తోంది. బెంగళూరుకు ధీటుగా భాగ్యనగరం ఐటీ సంస్థలను ఆకర్షిస్తోంది. తెలంగాణ ఏర్పాటయ్యాక దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించాయి. రాష్ట్రం ఏర్పాటయ్యాక తొలి ఏడాది రాష్ట్ర ఐటీ ఎగుమతుల విలువ రూ.66 వేల కోట్లు ఉండగా.. 2019-20 నాటికి రూ. 1,28,807 కోట్లకు చేరాయి. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ లాంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లో సైతం ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఐటీ రంగం ద్వారా తెలంగాణలో 5.80 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు

నియామకాల్లేక.. నిరుద్యోగుల్లో నిరాశ

తెలంగాణ ఏర్పాటయ్యాక నీళ్లు, నిధుల సమస్య చాలా వరకు తగ్గింది. కానీ నియామకాల విషయంలో మాత్రం ఒకింత నిరాశే ఎదురైంది. తెలంగాణ వస్తే ఏమొస్తది అంటే ఇంటికో ఉద్యోగమొస్తదని నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు ఆశించారు. కానీ తెలంగాణ ఏర్పాటై ఆరేళ్లు గడుస్తున్నా ఆశించిన రీతిలో నియామకాలు జరగలేదనేది వాస్తవం. తెలంగాణలో 2.86 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉండగా.. ఈ ఆరేళ్లలో 27 వేలకుపైగా మాత్రమే ఖాళీల భర్తీ జరిగిందని విద్యార్థి సంఘాలు వాదిస్తున్నాయి. కోర్టు కేసులతో టీఎస్‌పీఎస్సీ చేపట్టిన నియామకాలు ముందుకు కదలడం లేదు. జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. అంతే కాదు నిరుద్యోగ భృతి ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీఆర్ఎస్.. ఇప్పటికీ ఆ హామీని అమలు చేయడం లేదు. దీంతో నిరుద్యోగ యువత ఉద్యోగాల కల్పన విషయంలో తీవ్ర నిరాశతో ఉంది. ఇక డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం అమలు విషయంలోనూ ప్రజల్లో అసంతృప్తి ఉంది.

పెరుగుతున్న రుణ భారం

తెలంగాణ వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టుల కారణంగా రాష్ట్రంపై అప్పుల భారం కొండలా పెరిగిపోయింది. 2019 సెప్టెంబర్లో తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ ముందు ఉంచిన కాగ్ రిపోర్టు ప్రకారం రాష్ట్ర రుణ భారం రూ. 1.42 లక్షల కోట్లు. కాగా 2014-19 మధ్య తెలంగాణ సర్కారు ప్రాజెక్టులపై రూ.79 వేల కోట్లకుపైగా ఖర్చు చేసింది. గత ఆర్థిక సంవత్సరం నాటికే తెలంగాణ అప్పుల భారం రూ.2 లక్షల కోట్లు దాటిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయాక తెలంగాణపై రూ.75 వేల కోట్ల అప్పుల భారం ఉంటే.. ఈ ఆరేళ్లలోనే అవి రూ. 2 లక్షల కోట్లు దాటాయని ప్రతిపక్షం విమర్శిస్తోంది. 2024 నాటికి తెలంగాణ అప్పులు రూ. 5 లక్షల కోట్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. ప్రభుత్వం మాత్రం అభివృద్ధి, సంక్షేమం కోసం అప్పులు చేయడం తప్పు కాదంటోంది. ధనిక రాష్ట్రమైన తెలంగాణ లాక్‌డౌన్ వల్ల ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోతోందని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు

బంగారు తెలంగాణ దిశగా అడుగులు

గత ఆరేళ్లలో తెలంగాణపై అప్పుల భారం పెరగడమే కాదు తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. నియామకాలు, అప్పులు పెరగడం, పేదలకు ఇళ్లు లాంటి అంశాల్లో అసంతృప్తులను మినహాయిస్తే స్థూలంగా చూస్తే.. గత ఆరేళ్లలో తెలంగాణ ప్రగతి పథంలో సాగింది. హైదరాబాద్ ఐటీ రంగం, పట్టణాల పురోగతి, పల్లెసీమల్లో రైతులకు భరోసా ఇవ్వడం, చేనేతలకు తోడుగా నిలవడం.. ఇలా అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం పాటిస్తూ.. ఇది మన ప్రభుత్వం అనే భరోసాను ప్రజలకు కలిగించింది. తొలి ఆరేళ్లలో బంగారు తెలంగాణ దిశగా అడుగులు పడ్డాయి. నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న దాశరథి మాటలను నిజం చేసే దిశగా తెలుగు రాష్ట్రం ముందుకెళ్తోంది.

దాస్యవిమోచకుడు అంబేడ్కరుడు

– ప్రొఫెసర్ కె.పి. సుబ్బారావు



భారతదే ప్రత్యేక కుల వ్యవస్థ, దాని పొడిగింపు అంటరానితనం, అంటారని తనం కుల వ్యవస్థనుండి, కుల వ్యవస్థ హిందూ సమాజము నుండి పుట్టింది. పన్నెండు పదమూడు దశాబ్దాలలో జరిగిన సంస్కరణోద్యమాలు కుల వివక్షతను వ్యతిరేకించాయిగాని కులాన్ని వదులుకోమని చెప్పలేదు. కుల నిర్మూలణ కార్యక్రమాన్నిచ్చింది ఒక్క అంబేడ్కర్ మాత్రమే. డా.అంబేడ్కర్ అందించిన కుల నిర్మూలనా కార్యక్రమం ఎంతవరకూ విజయవంతమయ్యిందనే విషయాన్ని అటుంచి దాని మీద అనేక అనుకూల, ప్రతికూల వాదనలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. 1848లో కారల్ మార్క్స్, ఏంగెల్స్ రచించిన కమ్యూనిస్ట్ మానిఫెస్టో, 1936లో అంబేడ్కర్ అందించిన కులనిర్మూలనలు వెలువడిన కాలమాన పరిస్థితులు, విషయపరిజ్ఞానం వేరైనా రెండు గ్రంధాల (ఆ మాటకు వస్తే చిన్న పుస్తకాలు) పై నేటికీ చర్చ జరుగుతూనే ఉంది. కమ్యూనిస్టులు 'వర్గ' నిర్మూలనకు, అంబేడ్కరీయులు కుల నిర్మూలనకే పరిమితమయ్యారని చెప్పలేము. సాంప్రదాయ అంబేడ్కర్ వాదులు కులాన్ని నిర్మూలించే బదులు బౌద్ధ మతాన్ని అవలంబిస్తున్నారు. సాంప్రదాయ కమ్యూనిస్టులు మూస కార్యక్రమాలకే పరిమితమౌతున్నారు. నీల్ లాల్ జై భీమ్ కామ్రేడ్లు లాంటి ప్రయోగాలు జరుగుతున్నప్పటికీ ఎక్కువగా విఫలమవ్వడమే జరగుతుంది. ఈ రెండు రకాల విధానాలలో కుల నిర్మూలనా కార్యక్రమం లేకపోతే రెండూ విఫలమౌతాయి. సరిగ్గా ఇక్కడే అంబేడ్కరూ తన ఆలోచనలు చాలా అవసరమౌతాయి. కులాన్ని కాపాడుకోవాలనుకొనేవాడు కులవాది, దాన్ని వదులుకోవాలనుకునేవాడు కులనిర్మూలనావాది. డా॥ అంబేడ్కర్ కులవాది కాదు, కుల నిర్మూలనావాది. తన రచనలలోను, ప్రసంగాలలోను పూలదండలోని దారంలో కుల నిర్మూలనా భావం దాగి ఉంటుంది. తరతరాల నుండి కుల రక్కసి కోరల్లో నలిగిపోతున్న తన ప్రజలను విముక్తి చేయడానికి తన జీవితాంతం పనిచేసాడు. తన ప్రజలుండే స్థితిని బానిసత్వంతో సమానంగా చూసాడు. ఆ బానిస సంకెళ్లు తెగ్గొట్టి తన ప్రజలను రక్షించడానికి అవతరించిన దాస్యవిమోచకుడు.

భారతదేశంలో బానిసవ్యవస్థ ఒక సంస్థాగత రూపంగా లేనప్పటికీ సారంలో అనేక రకాలుగా ప్రజలను ముఖ్యంగా ఆనాటి అస్పృస్యులను పీడించింది. ఆర్యుల క్రింద నలిగిన. వెలివేయబడ్డ వారిని దాస్యులుగాను, దాసులుగాను ఆ తర్వాత బానిసలుగా చూడబడ్డారు. వారు అగ్ర వర్ణాలకు సేవకులుగా మారారు. తరతరాలుగా అమలు పర్చబడిన వెట్టి (చాకిరి) బానిసత్వరూపమే. అస్పృస్య స్త్రీలను గుడికి బంధీగా చేసి దేవదాసి / మాతంగులుగా మార్చిరి ఈ బానిసత్వంలోని భాగమే అందుకే తన ప్రజలు బానిసత్వంలో మ్రగ్గుతున్నారని, వారిని మనుష్యులుగా గుర్తించడమే లేదని అం

బేద్కర్ వాపోయేవాడు. హిందూ మతంగా మారిన చాందస బ్రహ్మణ వాదం మనుస్మృతిని ఆధారంగా చేసుకొని అట్టడుగు కులాలను భక్తి, దేవుడు, కర్మ సిద్ధాంతాలతో కట్టిపడేసారు. జంతువులకంటే హీనంగా వారిని చూసారు. ఈ పరిస్థితిని వ్యతిరేకిస్తూ అంబేద్కర్ అనేక కార్యక్రమాలు, స్వచ్ఛందంగా చేబట్టాడు. అనేక సభలు, సమావేశాలు నిర్వహించాడు. వాటిలో ఇప్పటికీ గొప్పగా చెప్పుకోదగ్గవి 1927లో ప్రారంభించిన 'మహద్' (చెరువు) పోరాటం, 1930లో మొదలపెట్టిన కాళారాం దేవాలయ ప్రవేశం కొరకు చేసిన ఉద్య మాలు. ఈ రెండు ఉద్యమాలు అస్పృశ్యులు కేవలం నీళ్ల త్రాగడానికో, దేవాలయ ప్రవేశానికే పరిమితమైనవికావు. అవి తన జాతి వారి కనీస మానవహక్కులకొరకు చేసిన చారిత్రాత్మక పోరాటాలు.

అంబేద్కర్ ఆలోచనలోని ప్రధాన స్రవంతి "ఆత్మ గౌరవం, స్వీయ చైత న్యం లాంటి ఉత్కృష్టమైన భావాలు తమ బ్రతుకుల గురించి సరియైన అవ గామనలేని వారు. కనీస సామాజిక స్పృహ లేని వారైన తన ప్రజల్లు ఈ ఆభావాలను నూరుపోసేవాడు మన బ్రతుకులను మనమే మార్చుకొనగల దృఢ సంకల్పంతో ఉండేవాడు అంబేద్కర్ మన బ్రతుకులింతే నని బానిసత్వంలో కూరుకూపోయిన తన ప్రజలకు కొంత ఆత్మస్థైర్యాన్ని నింపినవాడు. అంబే ద్కర్, నీవు ఒక బానిసవు, బానిస పని పదే పదే అంటే ఆ బానిస సింహం వలె లేచి గర్జిస్తాడని చెప్పిన అబ్రహం లింకన్ మాటలను అంబేద్కర్ అను నిత్యమూ మననం చేసుకొనేవాడు. తన ప్రజలు బానిసలు కాదని మేకలనే బలియిస్తారుగాని, పులులను కాదనే తన ప్రజలు సింహాలుగా బ్రతకాలని కోరికతో తన ప్రజల్లో కదలిక తీసుకురావడంలో విజయవం తమయ్యాడు అంబేద్కర్. తాను మొదలుపెట్టే ప్రతీ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే వారు. అస్పృస్యులేగాక సానుబూతి, సహానుభూతి గల ఇతరకుల స్తులు కూడా అంబేద్కర్ చేపట్టిన కార్యక్రమాలలో పాల్గొనే వారు. ఆయనచేసే ప్రసంగాలకు ముగ్ధులయ్యేవారు. ఆయన మాటల్లోని నిజాయితీని మెచ్చుకొ నేవారు. అందుకే వారికి ఏకైకనాయకుడయ్యాడు.

బ్రిటీష్ వారు 1919లో భారతీయుల పరిస్థితులను అంచనావేయడానికి పంపిన సౌత్‌బరో కమిషన్ ముందు హాజరై తన ప్రజలకడగండ్లను ఏకరు వుబెట్టాడు. అనేక సంస్కరణలను సూచించాడు. అందులో ముఖ్యమై నది. అస్పృస్యులు ఉన్నత విద్యకొరకు ఎన్నో సూచనలు చేసాడు. అప్పటికే కొల్హా పూర్ చత్రపతి మహారాజు లాంటి వారు సంస్కరణోద్యమంలో నిమగ్నులై ఉన్నారు. వారు అంబేద్కర్ ప్రతీకార్యమానికి చేయూత నిచ్చే వారు. వారి దన్నుతో అంబేద్కర్ అనేకమైన కార్యక్రమాలకు కార్యచరణను రూపొందించాడు. తన జాతిని మేల్కొల్పడానికి 1920లో మూక్‌నాయక్ (Leader of the Mute) అనే పత్రికను ప్రారంభించాడు. ఆ పత్రికను ప్రారంభిస్తూ నేటి భారతదేశం అనేక రుగ్మతలకు కేంద్రం. అందులోని హిందూ సమాజం (మతం) అనేక గదులున్న ఒక పెద్ద భవనం. ఆ భవనంలో పైకి ఎక్కడానికి గాని, క్రిందికి దిగడానికి గాని నిచ్చెన ఉండదు. ఏ గదిలో పెట్టినవాడు ఆ గది లోనే చావాలి. క్రింది గదిలో పుట్టిన వాడు ఎంత జ్ఞానవంతుడైనా పై గది లోకి వెళ్ళడానికి అర్హతలేదు. ఏ అర్హతులు లేకున్నా కొంతమంది పైకి ఎగ బ్రాకవచ్చు. ప్రాణం ఉన్న, ప్రాణం లేని వాటిని కూడా దేవుడని నమ్మే హిం దువులు తమ అన్నదమ్ములను అస్పృస్యులుగానూ, అశుబ్రత గల వారిగానే చూస్తారన్నాడు. అలాంటి పరిస్థితులు ఆధునిక యుగంలో కూడా ఆచరణలో ఉండడం, ఏదో రూపంలో ప్రత్యక్షమవ్వడం మనం చూస్తూనేవున్నాము. యదాస్థితి కొనసాగుతుంది. కాకపోతే వేరేరూపాలలో. ఆనాటి అంబేద్కర్ కాలం నాటికి ఇప్పటికీ సమాజంలో చాలా మార్పులు వచ్చాయని మనమం దరమూ ఒప్పుకుంటాము. భౌతికావసరాలు పెరిగాయి. వేష భాషలు మారాయి కాని మనిషిలో అనుకున్నంత మార్పు రాలేదనే చెప్పాలి. దానికి నిదర్శనం ఈనాడు దళితులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, హత్యలు మాన భంగాలు, రిజర్వేషన్ల వలన దళితుల్లో కొంత మంది ఉద్యోగాలు సంపాదిం చుకొని ఆర్థికంగా బలపడ్డారు. వారి భౌతిక పరిస్థితుల్లో కొంతమేరకు మార్పు వచ్చింది. మరికొందరు కాకతాళీయంగానో, చైతన్యంతోనే కులాంతర వివా హాలు చేసుకొంటున్నారు. ఇలా కొంతమేరకు ఆర్థిక, సాంఘిక రంగాలలో మార్పు వచ్చినా సాపేక్షంగా సమాజంలో మార్పురాలేదు. ఇంకా కులమే నిర్ణాయిక అంశమై ప్రజల మస్తిష్కాన్ని వదిలిపెట్టలేదు.

భారతదేశ పునాది కులం ఈ కులం వర్గంపై నివురుగప్పిన నిప్పులా దాక్కొంది. కులంలో వర్గముంది. వర్గంలో కులం ఉంది. ఇది పాత వాదనే. కాని ఈ మార్పులు దళితుల్లో కూడా గోచరిస్తున్నాయి. ఉన్నత చదువులు, పదవుల్లో ఉన్న దళితులు క్రింది తరగతి దళితులతో వియ్యాన్ని అందుకోరు స్నేహహస్తాన్ని చాచరు. పై అంతస్తులో ఉన్నామని క్రింది వారిని సమా నంగా చూడలేని పరిస్థితి ఉంది. ఇక్కడ కన్పించేది వర్గతత్వమే. దీనినే కొంతమంది సామాజిక వర్గం (Social Class) గా పరిగణిస్తారు. ఇక్కడ సామాజిక వర్గమంటే కులసమూహం కాదు. వర్గంతో కూడిన కులం, కులంతో కూడిన వర్గ తత్వం అందరూ ఒకే కులమైన ఆర్థికంగానూ, హోదా పరంగాను ఒకే ఒకరుకాదు అందరూ మా కులమే నని అగ్రకులాల వారు కూడా అంటారు. గాని ఆచరణకు వచ్చేసరికే వారిలోని గూఢంగా దాగి ఉన్న వర్గ ఆలోచనరీతి బయటకి వస్తుంది.


అసలు మనసమాజం కులవర్గ సమాజమా లేక వర్గ (వర్ణ) కుల సమా జమా? ఈ ప్రశ్న కుల వర్గ విశ్లేషణకు దారితీస్తుంది. కులం వర్గంగా మారుతుందా, వర్గం కులంగా మారుతుందనే విషయంపై చర్చోపచర్చలు జరిగాయి. జరుగుతున్నాయి. వర్గం గురించి మాట్లాడే వారంతా కమ్యూ నిస్టులు కాదు. కులాన్ని ప్రశ్నించే వారంతా అంబేద్కర్ వాదులు కాదు.

సాంఘిక హోదా కొరకు మతం మారితే కులంపోదు. కులంకోసం మతం మారినా, కులం పోదు, కులం ఒక వాస్తవాన్ని నమ్మనివారు కులాన్ని పూర్తిగా బహిష్కరించలేదు. అందుకే అంబేద్కర్ కులం ఒక మానసిక స్థితి' అన్నాడు మతం మారే దళితులకు మతచైతన్యమేగాని కుల నిర్మూలనా చైతన్యముండదు. అందుకే వారు సాంఘిక, రాజకీయ ఉద్యమాలకు దూరంగా ఉంటారు. దైవ చింతనకో, ఆధ్యాత్మికకు కట్టుబడిపోతారు. ఉద్యమాల్లో పాలుపంచుకోకుండా కేవలం ప్రార్థనలకే పరిమితమైపోతారు. యూరప్ దేశాలలో లాగ లిబరేషన్ థియోలజీ మత రాడికాలిజం మనదేశంలో ప్రవే శించడానికి చాలా కాలమే పడుతుంది. రాజకీయ చైతన్యం గల దళితులు ఏదో ఒక ఆదిపత్య కులానికో, నాయకుడికి చెందిన రాజకీయ పార్టీకి బం దీలౌతున్నారు. స్వేచ్చగా, స్వచ్ఛందంగా, సగౌరవంగా కొనసాగినప్పుడే అది నిజమైన రాజకీయాలౌతాయి. దళితుల్లో కొంతమంది స్వంతపార్టీలు పెట్టినా ఒకే కులానికే పరిమితమైపోతున్నారు. మిగిలిన సమాంతర కులస్తులను కలుపుకొని పోతే పోతున్నారు. దీనికి కారణం కులాలలోని అంతర్గత కుల తత్వం కులవిభజన, కుల దొంతరులూ ఎటూ ఉన్నాయి. అణగారిన ప్రజల్లో ఐకమత్యం సాధించడానికీ, కోల్పోయిన హక్కులను తిరిగి పొందడానికి బోధించు - సమీకరించు - పోరాడు అనే త్రిపీఠకాలను అంబేద్కర్ అందిం చాడు వాటిని సరిగ్గా ప్రస్తుత పరిస్థితులకు అన్వయించుకోవాలి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం, లౌకిక నియమాలు దళితుల సమాజపు పునాదిగా మారినప్పుడే కులరహిత వర్గరహిత సమాజాన్ని నిర్మిం చుకోగలరు. అంబేద్కర్ బానిసత్వాన్ని రూపుమాపాలని జీవితాంతం కృషి చేశారు. మనం మన ప్రజలను మళ్లీ ఆ భానిసత్వానికి గురికాకుండా అడ్డుకట్టవేయాలి. డా॥అంబేద్కర్ ఆశయాన్ని ముందుకు తీసుకొని పోవాలంటే ఆత్మగౌరవ స్థాయినుండి, ఆత్మ రక్షణకు, ఆంతిమ రక్షణ నుండి దాస్య విముక్తి కొరకు ఉద్యమించింది.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 'ఆత్మకథ'



ఆచార్య **దార్ల వెంకటేశ్వరరావు,**
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనివర్సిటీ,
హైదరాబాద్,
ఫోను: 9182685231



అంబేద్కర్ ఒక ఆత్మగౌరవ పతాకం. అంబేద్కర్ ఒక నిలువెత్తు ఆత్మ విశ్వాసం. అంబేద్కర్ దళితులకు ఒక గొప్ప చైతన్యం. అంబేద్కర్ అనేక సమ స్యలకు పరిష్కార కేంద్రం. అంబేద్కర్ ప్రపంచానికి ఒక అద్భుతం. అంత అలా అంబేద్కర్ తన రచనలతో, తన ప్రసంగాలతో, తన భావజాలంతో, తన కార్యాచరణతో దళితులందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు. భారతీయ పౌరులందరి ఆలోచనల్లో కొత్త వెలుగయ్యాడు. అంబేద్కర్ గా ప్రసిద్ధులైన డాక్టర్ భీమారావు రాంజీ అంబేద్కర్ అణచివేతల్నీ, అవమానాల్నీ ఎదుర్కుంటూనే తాను ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తిచేశాడు. ఆయన తన మేధోశక్తినంతా అణగారిన, పీడిత వర్ణాలు, వర్గాల వారందరికీ ఉపయోగిస్తూ ఎలా ఆశాజ్యోతి కాగలిగాడని ప్రపంచం నేడు ఆయన్ని లోతుగా అధ్యయనం చేస్తుంది. ఆయన చేపట్టిన ఉద్యమాల వల్ల, ఆయన పట్టుదలతో రూపొందించిన అనేక చట్టాల వల్ల ఎన్నో రంగాల్ని ప్రభావితం చేయగలిగాడు. అలాగే సాహిత్యాన్ని కూడా ఆయన శక్తివంతంగానే ప్రభావితం చేశాడు. ఆయన రచనల్ని చదువుతున్నప్పుడు ఆయన స్వయంగా రాసుకున్న 'ఆత్మకథ' మరిం ఉత్సాహాన్నిస్తుంది. కేవలం అది ఆయన జీవితమే కాదనీ, భారతీయ దళితులందరి జీవితం దానిలో ఉంది. దళితులు రాసే సాహిత్యంలో ఆయన 'ఆత్మకథ' తమకు తెలిసినా, తెలియకపోయినా ఆ జీవితం మాత్రం తమ రచనల్లో ప్రతిఫలిస్తుందనిపిస్తుంది. ఆయన ఆత్మకథకు సంబంధించిన కొన్ని విశేషాల్ని ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

అంబేద్కర్ తన ఆత్మకథను 'వెయిటింగ్ ఫర్ ఎ వీసా' (Waiting for a Visa) అనే పేరుతో కొన్ని జ్ఞాపకాలుగా రాసుకున్నాడని దాన్ని ఎడిట్ చేసినవాళ్లంటున్నారు. అంబేద్కర్ దీన్ని అమెరికా, యూరప్ నుండి తిరిగి వచ్చిన తరువాత లో దీన్ని రాశాడు. అంబేద్కర్ రచనలు, ప్రసంగాల సంకలనంలో భాగంగా 1993 లో మహారాష్ట్ర విద్యా శాఖ దీన్ని ప్రచురించింది. అంతకు ముందు దీన్ని 1990లో పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రచురించింది. (Dr. Babasaheb Ambedkar: Writings and Speeches, Vol. 12, edited by Vasant Moon (Bombay: Education Department, Government of Maharashtra, 1993), Part I, pp. 661-691) దీని సంపాదకుడు వసంత్ మూన్ అంబేద్కర్ రాసుకున్న ఆత్మకథాత్మక విషయాల్ని ఒక పేరాలో స్పష్టంగా పేర్కొన్నాడు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన "డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచనలు– ప్రసంగాలు" 12 వ సంపుటి లోని ఐదో భాగం (పుటః 669 నుండి 685 వరకు) అది "అన్ని మతాలవారికీ అస్పృశ్యులే" అనే శీర్షికతో ఉంది. వసంత్ మూన్ ముందుమాటను తెలుగులో అనువదిస్తూ వెయిటింగ్ ఫర్ ఎ వీసా' అనే పేరుని ప్రస్తావించకుండా దాన్ని "అన్ని మతాలవారికీ అస్పృశ్యులే" శీర్షిక కింద దాన్ని ప్రచురిస్తున్నట్లు అనువాదకులు పేర్కొన్నారు. 1996లో ప్రచురించిన ఈ సంపుటానికి ప్రధాన సంపాదకులుగా ఆచార్య నాయని కృష్ణకుమారి, డి.వి సుబ్బారావు, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ మాడభూషి శ్రీధరాచార్యులు సంపాదకులుగా వ్యవహరించారు. ఆచార్య నాయని కృష్ణకుమారి గారు తన 'ముందు మాట'లో అనువాదం గురించి వివరిస్తూ డాక్టర్ వి. కృష్ణారావు, కె.శ్రీనివాస్, ఆచార్య జయధీర్ తిరుమల రావు, శ్రీ ఆర్.వి.ఆర్ , సంపాదకులు గా వ్యవహరించిన వారూ ఈ అనువాదంలో పాల్గొన్నారని తెలిపారు. కానీ, ఎక్కడా ఆ భాగం అంబేద్కర్ ఆత్మకథ అని గానీ, ఆత్మకథలాంటిదని గాని కనీసం పేర్కొనలేదు. అంబేద్కర్ దానికి Waiting for a Visa అని పేరుని వీసా కోసం ఎదురుచూపు అని గానీ

ప్రవేశ అర్హతకై నిరీక్షణ అని గానీ లేదా మరింత సంక్షిప్తంగా నిరీక్షణ/ఎదురుచూపు అని కూడా అనువాదం చేసే వీలుంది. సాధారణంగా ఆత్మకథలు రాసుకునేవారు తమ ఆత్మకథలకు కొన్ని పేర్లు పెట్టుకుంటారు. అలాగా అంబేద్కర్ కూడా పెట్టుకున్నారు. కానీ అనువాదకులు ""అన్ని మతాలవారికీ అస్పృశ్యులే" అని పేరు పెట్టారు. అలా పేరు పెట్టడంలో గల ఆంతర్యమేమిటని చాలా మందికి అనిపిస్తుంది.

అంబేద్కర్ రాసుకున్న ఈ పుస్తకం ఆరు భాగాలుగా ఉంది. దీనిలో సంక్షిప్తంగా ఉపోద్ఘాతం, ఆరు చిన్న చిన్న భాగాలు ఉన్నాయి. మొదటి నాలుగు భాగాల్లో తన జీవితంలో ఎదురైన స్వీయానుభవాల్ని రాసుకున్నాడు. అస్పృశ్యతను ఎదుర్కొన్న ఇతరుల అనుభవాల్ని మిగతా రెండు భాగాల్లోనూ పేర్కొన్నాడు.

"అస్పృశ్యత గురించి విదేశీయులకు తెలుసు. కానీ, ఆ దురాచారాన్ని దగ్గర నుంచి చూడలేదు. కనుక, అదెంత దారుణమైందో అర్థం చేసుకోలేరు. అగ్రవర్ణాల హిందువులు అధికసంఖ్యలో ఉన్న గ్రామాలలో ఊరి చివర చెత్త కుప్పల సరసన హిందువుల ఇళ్ళ ముందు ఆహారం అడుక్కుని, దుకాణాలకు దూరంగా నిలబడి నూనెలు, దినుసులు కొనుక్కొని, ప్రతి ఇల్లూ తనదే అనుకుంటూ, ఊరంతా తనదే అనుకుంటూ ఎవరినీ అంటకుండా ఎవరికీ కాకుండా ఎంత ఘోరంగా బతుకుతున్నారో అర్థం చేసుకోవడం వారికి కష్టమే. అగ్రవర్ణాల వారు అస్పృశ్యుల పట్ల ప్రవర్తించిన తీరుని వారికి అర్థమయ్యేటట్లు వివరించడమే" (పుట: 669) ఈ పుస్తకం లక్ష్యంగా చెప్పుకున్నారు. ఇది ఈ పుస్తకానికి రాసుకున్న ఉపోద్ఘాతం లోనిది. ఈ భాగాన్ని జాగ్రత్తగా ఆలోచిస్తే, భారతదేశంలో ఉన్న అస్పృశ్యత నాటి పాలకులైన విదేశీయులకు తెలియాలి. దాన్ని తన జీవితానుభవాల్ని జోడించి చెప్పాలనుకున్నారు. ఇది ఆనాటికే కాదుబీ నేటికీ దళితులకున్న పరిస్థితిని వివరిస్తుంది.

చిన్నప్పుడు ప్రయాణాల్లో ఎదుర్కొన్న అవమానాలు:

మొదటి భాగంలో తన కుటుంబం గురించి వివరించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశం వచ్చిన తర్వాత అంబేద్కర్ పూర్వీకులంతా వారసత్వవృత్తుల్ని వదిలేసి, కంపెనీ సైన్యంలో చేరారు. ఆయన తండ్రి కూడా సైన్యంలో చేరి చేరుకుని, పదవీవిరమణనాటికి సుబేదార్ హోదావరకూ చేరారు. తర్వాత కుటుంబపోషణ కోసం అంబేద్కర్ తండ్రి మరలా వివిధ పనులు చేయాల్సివచ్చింది. దానిలో భాగంగానే సతారాజిల్లా గోరేగావ్ లో నాటి దుర్భిక్ష పీడితులకు పనికల్పించడం కోసం చెరువుతవ్విస్తుంటే, అక్కడ అంబేద్కర్ తండ్రి క్యాషియర్ గా చేరారు. అంబేద్కర్ కుటుంబమంతా నాటి బొంబాయి ప్రెసిడెన్సీలో గల రత్నగిరి జిల్లా, దాపోలీ తాలూకాలో ఉండేది. తండ్రి పదవీవిరమణ తర్వాత దాపోలి నుండి సతారాకు వచ్చేశారు. సతారాలో కుటుంబాన్ని పెట్టి తండ్రి గోరేగావ్ లో పనిచేయడానికి వెళ్ళారు. ఆ విధంగా కుటుంబం సతారాలోనూ, తండ్రి గోరేగావ్ లోను ఉండాల్సివచ్చేది. సతారాలో చదువుకోవడానికి అవకాశం ఉండడం వల్ల తండ్రి వాళ్ళ కుటుంబాన్ని అక్కడే ఉంచారు. వేసవి సెలవుల్లో గోరేగావ్ రమ్మని తండ్రి ఉత్తరం రాసేవాడు. గోరేగావ్ వెళ్ళడానికి రైలు సౌకర్యం ఉంది. కానీ, ఆ రైలు ఆగే స్టేషన్ తమ ఊరికి పదికిలోమీటర్ల దూరంలో ఉండేది.

ఒక వేసవి సెలవులకు అంబేద్కర్, తన అన్నయ్య, తన అక్కకొడుకు కలిసి తండ్రి దగ్గరకు వెళ్ళినప్పుడు జరిగిన సంఘటనను అంబేద్కర్ కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. "గోరేగావ్ కు వెళ్ళడమంటే సరదాగా ఊహించుకునేవాళ్ళం. చాలా వస్తువులు సిద్ధం చేసుకున్నాం. ఇంగ్లీషు తరహాలో కొత్తషర్ట్ లు కుట్టించుకుని, బాగా మెరిసిన రాళ్ళు పొదిగిన టోపీలు, కొత్త బూట్లు, పట్టు అంచు ధోవతులు ప్రయాణానికి ముందే సిద్ధం చేసుకున్నా" మని వర్ణించడంలో వాళ్ళు పడిన సంతోషం, వాళ్ళ తండ్రిని కలుసుకోబోతున్న ఉత్సుకత అన్నీ చక్కగా వర్ణించారు. ఒక గుర్రం బండి (టాంకా)లో రైల్వేస్టేషన్ కి వెళ్ళి, టిక్కెట్లు కొనుక్కొని, సరదాగా నిమ్మ పానీయాలు కొనుక్కొని త్రాగుతూ ప్రయాణం సాగించారు. తాము వెళ్ళవలసిన గోరేగావ్ లో రైల్వేస్టేషన్ లేదు. దానికి దగ్గర్లోని 'మాసూర్' లో దిగి అక్కడ నుండి మరలా గోరేగావ్ కి నడిచి లేదా ఏదైనా బండిలో గాని చేరుకోవాలి. తాము వస్తున్నట్లు ముందుగానే తండ్రికి తెలియజేస్తే, స్టేషన్ కి ఎవరొకర్ని పంపిస్తానని చెప్పాడు. అలాగే, తండ్రికి ముందుగానే ఉత్తరం రాశారు. కానీ, ఒక ప్యూన్ చేసిన పొరపాటువల్ల తండ్రి ఆ ఉత్తరం చేరలేదు. అందువల్ల ఆ స్టేషన్ కి ఎవరూ రాలేదు. దిగిన వాళ్లంతా వెళ్ళిపోయినా దిక్కుతెలియక అక్కడే ఉండిపోయిన వీళ్ళని స్టేషన్ మాస్టార్ నిలదీశాడు. ముందుగా టిక్కెట్ చూపించమన్నాడు. చూపించి, తాము వెళ్ళవలసిన ఊరివివరాలు, తమ వివరాలు చెప్పిన సన్నివేశం అంబేద్కర్ లోని ఆత్మగౌరవాన్ని తెలియజేస్తుంది. " స్టేషన్ మాస్టార్ మమ్మల్ని బ్రాహ్మణ పిల్లలని అనుకుని ఉంటారు. మా పరిస్థితి తెలిసి ఎంతో బాధపడ్డారు. మామూలుగానే అందరు హిందువులను అడిగినట్టే మేమెవరమని అడిగారు. నేను ఒక్క క్షణం కూడా సంకోచించకుండా 'మహర్'లమని చెప్పాను. అతని ముఖంలో హఠాత్తుగా మార్పులు వచ్చాయి. అతనిలోవిద్వేషం పొంగుతున్నదని నేను గమనించాను. నా జవాబు వినగానే అతను స్టేషన్ లో తగ గదిలోకి వెళ్ళిపోయాడు. మేం ఎక్కడున్నామో అక్కడే నిలబడ్డాం. సూర్యుడస్తమిస్తున్నాడు. నాన్నరాలేదు, ఆయన నౌకరూ రాలేదు..." తర్వాత ఆ స్టేషన్ మాస్టారే మళ్లీ వచ్చి, గోరేగావ్ ఎలా వెళ్ళాలో చెప్తాడు. కిరాయికి ఎండ్లబండిని తీసుకొని వెళ్లాలి. కానీ, తాము మహర్ లమని చెప్పడం వల్ల అక్కడున్నవాళ్ళెవరూ రాలేదు. అప్పుడు స్టేషన్ మాస్టారే వాళ్ళలో ఎవరైనా బండితోలగలిగితే కిరాయికి బండి దొరుకుతుందని చెప్పడం, తమకి వచ్చిని చెప్పడంతో ఒక కిరాయి బండివాడు ఒప్పుకుంటాడు. కానీ, బండిని వాళ్ళే తోలుకుంటూ పోవాలి. బండివాడు వాళ్ళను ముట్టుకోకుండా నడిచివస్తాడన్నమాట! ఆ తర్వాత ఒక రాత్రంతా ఒక టోల్ కలెక్టర్ గుడిసె దగ్గర గడిపారు. ఆ గుడిసెకు దూరంగా ఒక కొండ ఉంది. అప్పటికి రాత్రి పదిగంటలవుతుంది. వీళ్ళకు ఆకలివేస్తుంది. తాము తెచ్చుకున్నపదార్థాలున్నాయి. తినాలంటే నీళ్ళు కూడా కావాలి. ఆ టోల్ కలెక్టర్ని నీళ్ళడిగారు. కానీ, ఆ కొండదగ్గరకెళ్ళి తెచ్చుకోమన్నాడు. ఆ సమయంలో ఆ కొండదగ్గరకు వెళ్ళడం మంచిది కాదని వాళ్ళన్నయ్య చెప్పాడు. అందువల్ల ఆ రాత్రి ఆకలితో అలాగే పడుకున్నారు. దీని గురించి అంబేద్కర్ రాస్తూ "నాకు అప్పుడు జరిగిన సంఘటన మీంచి మనసు మళ్ళడం లేదు. మా దగ్గర కావలసినంత తిండిపదార్థాలున్నాయి. కడుపులో ఆకలి మండుతున్నది. అయినా ఆకలితో నిద్రపోవాలి. ఎందుకంటే నీళ్ళు లేవు. నీళ్ళు ఎందుకు లేవంటే మేం అస్పృశ్యులం కనుక..." అని ఆవేదన చెందుతాడు. బహుశా ఇలాంటి సంఘటనలే తర్వాత ఆయన నీళ్ళ కోసం జరిపిన ఉద్యమాలకు నేపథ్యమై ఉంటాయి. ఎలాగైతే పదకొండు గంటలకు గోరేగావ్ చేరుకుంటారు. ప్రయాణాల్లో దళితులు పడే అవమానాల్ని తనకెదురైన వాస్తవిక సంఘటనలతోనే హృదయాన్ని కదిలించేశైలిలో

ఆత్మకథ కొనసాగింది.

పాఠశాలలో నిర్బంధపు అవమానాలు:

అంబేద్కర్ తన తొమ్మిదవ యేట ఎదుర్కొన్న పాఠశాల అనుభవాల్ని కూడా ప్రస్తావించారు. "నా పాఠశాలలో నేను ర్యాంకును బట్టి కూర్చోవడానికి వీల్లేదు. విడిగా ఎక్కడో ఎవరికీ అంటకుండా ఒంటరిగా కూర్చోవాలి. బళ్లో నాకు విడిగా తట్టుగుడ్డముక్క కూచోవడానికి ఇస్తారనీ తెలుసు. బడిలో శుభ్రం చేసే పనివాడు కూడా దాన్ని ముట్టుకోడు. నేను ఆ తట్టు ముక్కను తీసుకుపోయి రాత్రి ఉతుక్కుని, మర్నాడు నేనే క్లాసుకి తెచ్చుకోవాలన్నమాట. బళ్ళో పిల్లలకు దప్పిక వేస్తే వెళ్ళి ట్యాంకు కుళాయి విప్పి నీళ్ళు తాగుతారు. టీచర్ అందుకు అనుమతిస్తే అంతే చాలు. కానీ నాపరిస్థితి వేరు. నేను కుళాయి ముట్టడానికి వీల్లేదు. స్పృశ్యుడెవరైనా కుళాయి విప్పితే తప్ప నాకు నీరు తాగే అవకాశం లేదు. నాకు టీచర్ అనుమతి ఒక్కటే సరిపోదు. బళ్ళో ప్యూను వెంట ఉండాలి. అతనినే అందుకు నియోగిస్తారు. ప్యూన్ లేకపోతే నాకు నీళ్ళు ఉండవన్నమాట. 'ప్యూన్ లేడు కనుక నీళ్ళు లేవు' అన్న మాటలు చాలు పరిస్థితి వివరించడానికి.."

ఇది చదివితే హృదయం ద్రవించి పోతుంది. ఈ సమాజం దళితుల్ని ఎంతగా అవమానించిందో అర్థమవుతుంది. అవమానాలకు క్రుంగిపోకుండా, వాటిని ధైర్యంతో ఎదుర్కొని తనకు జరిగిన అవమానాలు భవిష్యత్తులో మరెవ్వరికీ జరగకూడదని భావించి మహానుభావుల్లో అంబేద్కర్ ప్రథమగణ్యుడు.

మరికొన్ని అవమానాలు:

నేటికీ చాలా గ్రామాల్లో దళితులకు రజకులు బట్టల్ని ఉతకరు. 'నాయీ బ్రాహ్మణులు' దళితులకు క్షవరం చెయ్యరు. ఈ పరిస్థితి చాలా చోట్ల నేటికీ కొనసాగుతూనే ఉంది. కానీ, కొంతమంది దీన్ని ఒప్పుకోరు. ఇంకా అలాంటి సంఘటనలెక్కడ జరుగుతున్నాయని కొట్టిపారేస్తుంటారు. అంబేద్కర్ తన అనుభవాల్ని ఇలా రాశాడు. " ఇంట్లో బట్టలను మా చెల్లెలే ఉతికేది. సతారాలో చాకలివారు లేరని కాదు. మేం అస్పృశ్యులం. కనుక, చాకలివారు మా బట్టలను ముట్టరు. అంతేకాదు, క్రాప్ చేయించడం కూడా మా అక్కే చేసేది. నాకయినా అంతే. చేసి చేసి ఆమెకు క్షవరంలో నైపుణ్యం కూడా వచ్చింది. మంగలికి డబ్బులు ఇవ్వలేమనికాదు. మమ్మల్ని మంగలి కూడా ముట్టడు కనుక."

ఉన్నత విద్యానంతరం ఇండియాలో జరిగిన అవమానాలు:

అంబేద్కర్ ప్రతిభను గమనించిన బరోడా మహారాజు అమెరికాలో చదువుకోవడానికి ఆర్థిక సహాయం చేశారు. అందువల్ల తొలిసారి చదువులకు బరోడా మహారాజే కారణం. కానీ, తర్వాత కూడా విదేశాల్లో మరలా సొంత డబ్బుతో అంబేద్కర్ చదువుకున్నాడు. దీని గురించి చెప్పుకుంటూ అంబేద్కర్ "1913 నుంచి 1917 వరకూ న్యూయార్క్ లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నాను. 1917 లో లండన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో చేరాను. చదువులు పూర్తి కాకముందే భారత్ రావలసి వచ్చింది. బరోడా రాజ్యం నన్ను చదివించింది కనుక, ఆ రాజ్యంలో పనిచేయవలసిన బాధ్యత నాపై ఉంది. కనుకనే నేను ఇండియా రాగానే నేరుగా బరోడాకు వెళ్ళాను." అని రాసి, తర్వాత అక్కడ తాను కనీసం ఉండడానికి చోటులేక పడిన పరిస్థితిని చెప్తుంటే ఒళ్ళు గగుర్పాటు కలిగిస్తుంది. నేటికీ గ్రామాల్లో మాటెలా ఉన్నా, పట్టణాలు, నగరాల్లో సహితం దళితులకు ఇళ్ళను అద్దెకివ్వని స్థితి కనిపిస్తోంది. 2020 వ సంవత్సరంలోనే ఇంకా ఇలా ఉందంటే, నూరు సంవత్సరాల పైగా వెనక్కి వెళితే ఇంకెలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఒక్కసారిగా తాను విదేశాల్లో ఉన్నప్పుడెలా ఉండేదో గుర్తు చేసుకుంటూ ఇలా రాసుకున్నాడు.

"అయిదేళ్ళపాటు యూరప్‌లో, అమెరికాలో నివసించిన నా మనసులో నేను అస్పృశ్యుడినన్న విషయమే గుర్తుకురాకుండా పోయింది. భారత్ లో నేనెక్కడికి వెళ్ళినా నా అస్పృశ్యత నాకూ, ఇతరులకూ ఇబ్బంది కలిగించేదే. స్టేషన్ బయటకు వచ్చిన తర్వాత " ఎక్కడికి వెళ్ళాలి? నన్నెవరు స్వీకరిస్తారు' అనే ప్రశ్నే నన్ను వేధించసాగింది" దీన్ని చదువుతుంటే భారతదేశంలో ఉన్నత విద్యాభ్యాసాన్ని చేసి మరలా తమ తమ గ్రామాలకు వెళ్ళిన దళిత యువతకు ప్రస్తుతం ఎదురౌతున్న సంఘటనలే గుర్తుకొస్తుంటాయి. నేటికీ అనేకమంది దళితులు తాము చదివిన విద్యాసంస్థల్లో గొప్పప్రతిభను ప్రదర్శించగలిగినా, తమ గ్రామాల్లో తమ ప్రతిభ కులం ముందు తెల్లబోవాల్సివస్తుంది. పి.జిలు, డాక్టరేట్లు చేసి కూడా కనీసం డిగ్రీ కూడా చదవని వాళ్ళముందు చేతులు కట్టుకొని నిలబడాల్సిన సంఘటనలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి.

ఈ భాగంలో అంబేద్కర్ బరోడా రాజ్యంలో ఉద్యోగం చేస్తూ తన నివాసం కోసం పడిన ఇబ్బందుల్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.బరోడా మహారాజు కార్యాలయంలో అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో ప్రొబెషనర్ గా అంబేద్కర్ కి పోస్టింగ్ ఇచ్చారు. అంబేద్కర్ ఉండడానికి అనేక చోట్ల వెతికినా ఎక్కడా నివాసం దొరకలేదు. చివరికి ఒక పార్శీల కోసం నిర్వహించే సత్రంలో చేరాడు. "పార్శీలు జొరాస్ట్రియన్ మతాన్ని అవలంబిస్తారు. వారి మతం అస్పృశ్యతను పాటించదు. కనుక నన్ను తాకరేమో నన్న భయం లేదు" అనుకుంటూ దానిలోకి వెళ్లాడు. ఆ సత్రంలో కూడా పార్శీలు అంబేద్కర్ ఎవరో తెలుసుకొని బయటకు వెళ్ళగొట్టేశారు. అప్పుడు అంబేద్కర్ మానసిక స్థితిని ఇలా వర్ణించుకున్నారు. " ...ఖాళీ చేయాల్సిందే. లేకపోతే ప్రమాదకరమైన పరిణామాలు తప్పవని బెదిరించి వెళ్లిపోయారు. నేను క్రుంగిపోయాను. నా గుండె కూడా ఒక్క క్షణం గుబగుబలాడింది. అందరినీ తిట్టుకున్నాను. ఏడ్చాను. అవును. నాకెంతో విలువైన ఆశ్రయం మళ్లీ నేను కోల్పోయాను. నిజానికది జైలుగది కన్నా గొప్పది కాదు. అయినా, నాకెంతో విలువైంది.

"డజను మంది పార్శీలు చేతి కర్రలతో దారుణంగా నావైపు చూడ్డం నేను బిక్కమొగంతో క్షమకోసం భయపీడితుడినై నిస్సహాయంగా నిల్చోవడం పద్దెనిమిది సంవత్సరాల సుదీర్ఘకాలం గడిచినా నా మనసునుంచి చెదిరిపోని దృశ్యాలుగా మిగిలాయి. నా కెప్పుడూ అది గుర్తొస్తూనే ఉంటుంది. ఎప్పుడు గుర్తొచ్చినా కళ్ళు చెమ్మగిల్లుతాయి. అప్పుడు నాకు తెలిసింది-హిందువుకు అస్పృశ్యుడైనవాడు పార్శీలకు కూడా అస్పృశ్యుడే -అని"

మూడో భాగంలో అప్పటి బొంబాయి ప్రభుత్వం నియమించిన వివిధ కమిటీల్లో అంబేద్కర్ పనిచేసిన అనుభవాల్ని రాశాడు. అస్పృశ్యుల బాధల్ని పరిశోధించడానికి వేసిన ఒక కమిటీలో సభ్యుడిగా చాలీస్ గావ్ లో తనను తీసుకెళ్ళడానికి నిరాకరించిన టాంగా యజమానుల ఆలోచనల్ని వివరించారు. అంబేద్కర్ ని తన టాంగాలో ఎక్కించుకొని వెళ్ళడానికి ఇష్టపడక, టాంగా నడపడం తెలియని ఒక అస్పృశ్యుడ్ని బండితోలడానికి నియమించడం, దానివల్ల ఆ బండి బోల్తా కొట్టడం వంటి సంఘటనల్ని

రాస్తూ " హిందూ టాంగావాలా, అతనెంత తక్కువస్థాయివాడయినా, ఇతర అస్పృశ్యులందరికన్నా, బారిస్టర్ -ఎట్-లా చదివిన అస్పృశ్యుడికన్నా గొప్పవాడని భావిస్తారని అప్పుడు తెలిసింది" అని బాధపడ్డారు.

నాల్గో భాగంలో తాను పిక్నిక్ లో జరిగిన సంఘటనను వివరించారు. దళిత వర్గాల ఉద్యమంలో పనిచేసే తన సహచరులతో కలిసి నాసిక్, తర్వాత దౌలతాబాద్, ఔరంగాబాద్ తదితర ప్రాంతాల్ని చూడాలనుకున్నారు. అప్పటికి (1934) నిజాంరాజ్యంలోనే ఔరంగాబాద్ ఉండేది. అంటే ముస్లిముల పాలన. ఔరంగాబాద్ వెళ్ళే దారిలోనే ఉన్న దౌలతాబాద్ కోట చారిత్రక ప్రాధాన్యం కలిగిందని, దాన్ని చూద్దామనుకొని వెళ్లారు. కోట ద్వారం దగ్గర చిన్న చెరువు ఉంటుంది. అక్కడ అంబేద్కర్, ఆయన సహచరులు ఆ నీటిలో ముఖం కడుక్కున్నారు. కోటలోకి వెళ్తుంటే "ఒక ముసలి మహ్మదీయుడు గేటు దగ్గరనుంచి వస్తూ 'ఢేఢ్ (అస్పృశ్యులు) మంచినీటిని మైలపరిచారు. అంటూ తిట్టడం మొదలు పెట్టారు" అని ముస్లిములకు కూడా దళితులు అస్పృశ్యులేనంటూ తనకు ఎదురైన అనుభవాల్ని వివరించారు.

ఇంతవరకూ అంటే మొదటి మూడు భాగాల్లోను అస్పృశ్యతనం వల్ల తనకు జరిగిన అవమానాల్ని వివరిస్తే, మిగతా రెండు భాగాల్లోనూ ఒక ఉపాధ్యాయుడికీ, ఒక భంగీ బాలుడికి జరిగిన అవమానాల్ని మనముందుంచారు.

మనం ఇంతవరకూ చూసిన అంబేద్కర్ స్వీయానుభవాల్ని, వాటిని వివరించిన తీరుతెన్నుల్నీ చూస్తే అంబేద్కర్ కున్న సాహిత్యశైలికూడా తెలుస్తుంది. వాస్తవాన్ని వర్ణిస్తూనే కథాకథనంలా ఆయన తన ఆత్మకథను వివరించారు. ఆయన రాసిన రచనలన్నింటిలోనూ ఎంతో స్పష్టత ఉంటుంది. సంఘటనల్ని కళ్ళకు కట్టినట్లు చెప్పడంలో అంబేద్కర్ రచనల్లో కనిపించే ఒక విశిష్టత. ఆయన వేదాల్ని, రామాయణ, భారత, భాగవతాల్ని, కొన్ని పురాణేతిహాసాల్ని విశ్లేషించిన రచనలు ఆయనలోని చారిత్రక దృక్పథాన్ని, సామాజిక అవగాహనను తెలియజేస్తుంది. తెలుగు సాహితీ వేత్తలు అంబేద్కర్ రచనల్ని తప్పకుండా చదవాలి. డి.డి.కోశాంబిని, రొమిల్లా థాపర్ నీ ఉదాహరించేవాళ్ళు, అంబేద్కర్ నీ చదివితే సాహిత్య విమర్శలో కూడా ఆయన ఆలోచనలు ఎంత బలమైనవో తెలుస్తాయి.

ఇంతకీ అంబేద్కర్ Waiting for a Visa అని పేరు పెట్టి తన ఆత్మకథను పూర్తిగా రాయలేదేమిటా అనిపిస్తుంది. కానీ, ఆయన ఆత్మకథ రాసే సమయాన్ని కూడా ఉద్యమాలకే కేటాయించారనిపిస్తుంది. అయినా అంబేద్కర్ జీవితం, ఆయన దినచర్య గురించి అనేకమంది రాశారు. వాటన్నింటికీ మాత్రం ఇదే మూలం అని మాత్రం గుర్తించకతప్పదు. అందుకే Waiting for a Visa ను అంబేద్కర్ ఆత్మకథ అనే దానికంటే, దానిలోని సారాంశాన్ని బట్టి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు"అన్ని మతాలవారికీ అస్పృశ్యులే" అనే పేరు పెట్టారనిపిస్తుంది. ఆరు భాగాల్లోనూ కేంద్రీకృతమైన అంశం అస్పృశ్యతే. అందువల్లనే అనువాదకులు ఆ పేరు పెట్టి ఉండొచ్చు. కానీ, దాని వల్ల అంబేద్కర్ ఆత్మకథాత్మక భాగమదేనని సాధారణ పాఠకులు కూడా వెంటనే గుర్తించే అవకాశం ఉండదనుకుంటున్నాను. ఏది ఏమైనా అంబేద్కర్ జీవితంలోని సంఘటనల్ని చదువుతుంటే ప్రతి దళితుడూ తనకు జరిగిన అనుభవాలే అనుకుంటాడు. అక్కడ జరిగిన సంఘటనలన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించగల నైపుణ్యం అంబేద్కర్ కి ఉందని ఈ కొద్దిపాటి సంఘటనల్ని చూసినా మనకు అర్థమవుతుంది. అందుకే అంబేద్కర్ గురించి ప్రతి దళితుడూ నేడు ఇలా అనుకుంటాడనుకుంటున్నాను.

నువ్వు నా చీకటిని పారద్రోలిన సూర్యుడవు
నువ్వు నా బానిసత్వాన్ని ఓడించిన యోధుడవు
నువ్వు నా అవమానపు సంకెళ్లు తొలగించిన రాజ్యాంగానివి
నువ్వు నా మూతికి వేలాడే ముంతను తొలగించిన
నిలువెత్తు ఆత్మగౌరవానివి!
నువ్వే లేకుంటే
నన్నింకా ఆ మనుస్మృతి మంటల్లోనే కాల్చుకుతినేవారు
నువ్వే లేకుంటే
ఆ మతమౌఢ్యం గోతిలోనే నన్ను పరుగెత్తమనేవారు
నువ్వే లేకుంటే
ఆదిమానవుడిలా నన్నింకా అలాగే సంచరించమనేవారు
నువ్వు లేకుంటే
భారత భవిష్యత్తు అంధకారబంధురమయ్యేది
అందుకే నువ్వే నేనై
నేనే నువ్వై ముందుకెళుతూ ....
జైభీమ్!

అంబేద్కర్ రచనల్ని పరిశీలిస్తే తాను రాసుకున్న అన్ని రచనల్లోనూ ఆ యా సందర్భాల్లో ఆయన తన జీవితానుభవాల్ని వివరిస్తున్నట్లే ఉంటుంది. తానొక సజీవ పాత్రగా ఆయన మనతో మాట్లాడుతున్నట్లు రాయడం ఆయనకున్న గొప్ప కళ. తాను ఏ విషయం గురించి మాట్లాడాలన్నా ఆయన ముందుగా కొంత నోట్స్ రాసుకునేవాడు. తాను మాట్లాడవలసిన ప్రసంగాన్ని ముందుగానే సిద్ధం చేసుకునేవాడు. తననెవరైనా ఏదైనా ముఖ్యమైన విషయం మీద అభిప్రాయాలు కోరినా, వాటికి లిఖితపూర్వకంగా సమాధానాలివ్వడం అంబేద్కర్ కి అలవాటు. అలా ఆయన అనేక విషయాల్ని పుస్తకాలుగా రాశాడు. కానీ, ఆయన చనిపోయిన తర్వాత ఆ రచనలన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆయన రచనల్ని ప్రచురించాలని అంబేద్కర్ అనుయాయులు అనేక సంవత్సరాలు పోరాడితే గాని ప్రభుత్వం వాటిని ప్రచురించడానికి అంగీకరించలేదు. ఈ లోగా ఆ పెట్టెల్లో పెట్టిన ఆ పుస్తకాలు చాలా వరకూ చెదలు పట్టి పాడైపోయాయి. అవన్నీ దొరికితే మరెన్నో విషయాలు తెలిసుండేవి. బహుశా ఆయన రాసుకున్న ఆత్మకథ కూడా అలాగే కనుమరుగైపోయిందేమో! భారతదేశంలో అంటరానితనం వల్ల ఎదురైన అవమానాలను తన వ్యక్తిగత అనుభవాలుగా దీనిలో రాశాడు. నిజానికి అవి అంబేద్కర్ కి ఎదురైన అవమానాలు మాత్రమే కాదు, అది భారతదేశంలో ఉన్న దళితులందరికీ ఎదురైన అవమానాలు గా అభివర్ణించుకోవచ్చు.ఈ అనుభవాల్ని వివరిస్తూ అంబేద్కర్ తన జీవితంలో ఎదురైన అస్పృశ్యతను ఎలా ఎదుర్కోవలసి వచ్చిందో ఆ వాస్తవికతను యూరోపియన్లు గ్రహించడం కష్టమన్నారు. అంబేద్కర్ రాసుకున్న ఆ జ్ఞాపకాలు కొలంబియా విశ్వవిద్యాలయం, న్యూయార్క్ లో నేడు పాఠ్యాంశమైంది. ప్రొఫెసర్ ఫ్రాన్సిస్ డబ్ల్యూ. ప్రిట్చెట్ (Prof FrancesW.Pritchett) భారతదేశంలో అంటరానితనం వల్ల అంబేద్కర్ ఎదుర్కొన్న అవమానాలను, దాన్ని అధిగమించిన తీరునీ ఆ పాఠ్యాంశం ద్వారా నేడు విద్యార్థులకు బోధిస్తున్నారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో యే యూనివర్సిటీలో అయితే అంబేద్కర్ చదివారో అదే న్యూయార్క్ కొలంబియా యూనివర్సిటీలో నేడు ఈ 'అంబేద్కర్ ఆటోబయోగ్రఫీ' పాఠ్యగ్రంథంగా వుంది.

కరోనా! మైడియర్ సోషలిస్టు

– డా॥ వి రత్నాకర్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్



కరోనా!మైడియర్ సోషలిస్టు
ఓ నా ప్రియమైన ప్రేమికురాలా!
కనిపించని కరీనావి కత్రీనా కైఫ్ వి నీవేనే
నీ దుంపతెగ నువ్వెంత కిలాడిదానివే ..

రేయ్ పెద్దోడా ..
కుదురుగా నీ కాలు ఉండదుకదరా
నాలుగు నిమిషాలు ఇంటి పట్టున
ఉండవుకదరా.. అనేవోడు నాన్న నాగయ్య
పంతులు..

అసలు ఇయ్యాల నాన్నే ఉండుంటే కాలు
కదపని ఇల్లు దాటని నన్ను సూసి ఎంత
ఆనంద సంబరమయ్యేవోడో కదా...

అయినా మైడియర్
ముసొడ్డు ప్రేమికురాలా..
నువ్వెంత సామ్యవాదివే..
మాగొప్ప సమతావాదివి నువ్వు

మాఊరు పెరిదేపి గొప్ప కమ్మినిట్టు
ముప్పరాజు శేషయ్య
ఆపక్క ఆలకూరపాడు కళ్యాణరావుల్లా
నేలని నింగిని ఊరిని పల్లెని ఏకం చేసి

ఆ అల్లేటిలో ఆ సెరువులో ఒకే వాలున
నీల్లు తాపిన ఈ యుగపు
సిసలైన విప్లవకారిణివే నువ్వు

రాళ్ళు రప్పలు మూల విరాట్టులై
వర్ధిల్లే ఈమూర? ప్రపంచంలో
అజ్ఞానాల అహంకారాల నిచ్చెనమెట్ల

తాయెత్తుల కనికట్టుల సోమరిపోతుల
పూజల పునస్కారాల
మోసకారిబాబాలకి బలే గిరిగీసావు కదే.

ఊరికో వెలివాడని నిస్సిగ్గుగా
నిలిపిన ఈవర్ణ భారతాన్నే
అతిపెద్ద అంటరానివాడగా
నిలిపావు కదే నువ్వు

సామాజిక వెలివేతల నిర్బంధాల
మారణకాండల మరణ మృదంగాల పవిత్ర
కుల సమాజానికి

క్వారంటైన్ ఐసోలేషన్ సోషల్ డిస్టెన్స్
ల పేరుతో తరాల అంటరానితనాల వెలుల
బలుల ఆరని అగ్గిమంటల
రగిలే కడుపు కోతల్ని భలే తెలియ చెప్పావుకదే.

అణ్వాయుధాలతో ఆధిపత్యాలతో
అగ్రదేశాన్ని భూలోకస్వర్గాన్ని అని
విర్రవీగే అమెరికాకి ఆ యూరప్ కి

నాజీలకి రవి అస్తమించని సామ్రాజ్యాలకి
డొక్కచించి
డోలుకట్టి గోడకుర్చీ వేయించావు కదా

అరుణపతాకాల చైనా
ఉత్తర కొరియాల కట్టడులు ఆదర్శాలు
క్యూబా డాక్టర్ల సాహసాలు త్యాగాలు
స్వార్థ ప్రపంచానికి దండోరా వేసి చూపావుకదే.

అయినా మైడియర్ కరోనా
ప్రియమైన ప్రేమికురాలా
మందులేని మాయదారి రోగమా

ఓ కరోనా వైరస్ మాదేశ కులవైరస్
కి ఎంత గొప్పగా అడ్డుకట్ట వేసావే
శతాబ్దాల దశకాల మార్క్సిజం గాంధీయిజం
అంబేద్కరిజాలు ఇజాలు

జెండాలు ఎజెండాలు నేర్పలేని
మార్చలేని పసుపునీళ్ళకి పంచతాలకి
సానిటైజర్లని పరిశుభ్రతలని క్రమశిక్షణని
ప్రయోగశాలల పరిశోధనల అవసరాన్ని
తెలిపిన నిలువెత్తు నిజానివి నీవు..

ఏది ఏమైనా మైడియర్ కరోనా
అప్రకటిత మూడో ప్రపంచ యుద్ధానివి నీవు
నూట ముప్పై కోట్ల దేశాన్ని
ఐదు కోట్లు దాటుతున్న తెలంగాణని
రాజ్యాన్ని అధినేతల్ని ప్రజాక్షేమం వైపు
భలేగా మలుపు తిప్పావు

క్షణం తీరికలేని లేనట్టు నటించే
జనానికి ఆవేగాలకి ఏం ఆనకట్ట వేసావే
కల్లముందు నిజాల్ని మరిచిన
పరలోక రాజ్యపుకలలకి కట్టడివైనావే

కరోనా! మైడియర్ సోషలిస్టు
మరువదు లోకం
నీవిచ్చిన ఈ కుదుపుని
ఓ సింహావలోకనాన్ని

నీవిచ్చిన మాలోకి మేము తొంగిచూసుకునే
ఈ అనంతమైన అవకాశాన్ని
నువ్వు సృష్టించిన ఈశ్మశాన నిశ్శబ్దాన్ని

మహాత్మ ఫూలే, డాక్టర్ అంబేద్కర్‌ల ఆర్థికతత్వం : అవలోకనం

భారతదేశం ఆర్థికంగా, రాజకీయంగా, అంతర్జాతీయంగా చోటు చేసుకున్న నేటి విశ్వీకరణ పరిస్థితుల్లో ఒకటిన్నర శతాబ్దం కిందటే హక్కుల పునాదులు, సంక్షేమ ఆలోచనలు, విద్యా విధానాల గురించి ఉద్యమించిన మహాత్మ ఫూలే, డాక్టర్ అంబేద్కర్‌ల ఆర్థిక తత్వాన్ని అవలోకనం చేసుకోవడం అవసరమ యింది. భారత దేశంలో మొదటిసారి ఈ దేశ అణగారిన ప్రజల తరుపున ఒక మేధావిగా అభివృద్ధి చెంది మహాత్ముడిగా నిలిచిన జోతిరావ్ ఫూలే ఈ దేశ చరిత్రను, సామాజిక పరిస్థితుల్ని అవగా హన చేసుకో వడంలోను విశ్లేషణా పద్ధతుల్ని వాడటంలోను, కారల్‌మార్క్స్ సమకాలీనుడిగా తన శైలిని కనబరిచారు. ఈ సిద్ధాంతాన్ని వివరించి ముందుకు తీసుకుపోయినవాడు డాక్టర్ అంబేద్కర్ అని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. కారల్‌మార్క్స్ మాదిరిగా జోతిరావ్ ఫూలే, అంబేద్కర్‌లు తమ భావాలకు క్రమబద్ధమయిన సిద్ధాంత రూపం ఇవ్వలేదు. మహాత్మ జోతిరావు ఫూలే భారత సామాజిక వ్యవస్థలోని అసమానతల్ని, బానిసత్వాన్ని అమెరికా నీగ్రో జాతి సమస్యతో 1873 లోనే పోల్చిన వ్యక్తి. ఈయన 'సతారా' సమీపంలో గల 'కటగన్' గ్రామాని చెందిన కుంటుంబంలోనివారు. ఫూలే ముత్తాత 'చాగులా' భూమిశిస్తు, పంటల తనిఖీ ఉద్యోగి. పీష్వాల పాలనలో సామాజిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న కుటుంబం. పూల వ్యాపారం చేస్తూ పూనాలో స్థిర నివాసాన్ని ఏర్పరుచుకున్న కుటుంబం. 11, ఏప్రిల్ 1827లో గోవిందరావు, చిమ్నాబాయ్‌లకు ఫూలే జన్మించారు. 1891 ఇదే ఏప్రిల్ నెల 14 తేదీన మధ్యప్రదేశ్ 'మౌ' కంటోన్మెంటు ప్రాంతంలో రాంజీసక్పాల్, భీమ్‌భాయ్‌లకు బాబాసాహెబ్ భీమ్‌రామ్ రాంజీ అంబేద్కర్ జన్మించారు.



డాక్టర్ జి.కె.డి.ప్రసాద్
ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యునికేషన్ విభాగం,
ఆంధ్రాయూనివర్శిటీ, విశాఖపట్నం.

డాక్టర్ అంబేద్కర్ 1915లో 'ఏనిషియంట్స్ ఇండియన్ కామర్స్' సిద్ధాంత వ్యాసాన్ని కొలంబియా విశ్వవిద్యాలయానికి సమర్పించారు. 1923లో 'ది ప్రాబ్లెమ్ ఆఫ్ రూపీ' సిద్ధాంత వ్యాసాన్ని 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్'కి సమర్పించి డాక్టరేట్ డిగ్రీని సాధించారు. 1916లో 'నేషనల్ డివిడెంట్ ఆఫ్ ఇండియా – చారిత్రాత్మక విశ్లేషణ' అనే సిద్ధాంత వ్యాసాన్ని కొలంబియా యూనివర్శిటీకి సమర్పించి మరో డాక్టరేట్ డిగ్రీ పొందారు. ఆయన అమెరికాలో రాజకీయార్థికశాస్త్రం, వాణిజ్యం, ద్రవ్యం వంటి విభిన్న అంశాల్లో మూడు డాక్టరేట్ డిగ్రీలు పొందారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి, కార్మిక సంక్షేమ రక్షణలు, లౌకికవిద్య, గ్రామీణాభివృద్ధికి తగిన ప్రణాళికలు, కనీసవసరాలు, గ్రంథాలయాల ఏర్పాటును పేర్కొనడం ప్రపంచ మేధావుల మన్ననలను పొంద డానికి కారణమయింది. ఈ సందర్భంలో 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక 'అంబేద్కర్ సామ్యవాద, సంక్షేమ ఆలోచనావిధానాన్ని' అభినందించింది.

సామాజికం గాను, ఆర్థికంగాను శూద్రులు ఎదుర్కొంటున్న కష్టాలను ఫూలే సవివ రంగా బహిర్గతం చేశాడు. ఫూలే పాశ్చాత్య సిద్ధాంతాలను చదవకపోయినప్పటికీ భవిష్యత్ సమాజం కోసం, సంపూర్ణ సమానత్వం కోసం రాక్షసరాజు బలి స్థాపించిన ధర్మ రాజ్యాన్ని ప్రాతిపదిక చేసుకున్నాడు. ఒక దేశ పౌరాణికగాథలో పేర్కొన్న బలివా మనుల ఘర్షణని శూద్రుల, బ్రాహ్మణుల మధ్య కుల పోరాటంగా విడమర్చి చెప్పిన ఫూలే ఆధునిక భారతదేశ చరిత్రలోనే మొదటివాడు. ప్రజల్లో వ్యాప్తిలో వున్న గాథలు, పశ్చిమ దేశాలు జరిపిన పరిశోధనల ఆధారంగా ఫూలే చాతుర్వర్ణ వ్యవస్థ పుట్టుక మీద తన సిద్ధాంతాన్ని రూపొందించారు. డాక్టర్ అంబేద్కర్ ఫూలే వారసత్వాన్ని కొనసాగిస్తూ అభివృద్ధి చేశారు.

మహాత్మ జ్యోతిరావ్ ఫూలే చిన్ననాటి నుంచి సామాజిక, రాజ కీయ, ఆర్థిక అంశాల పట్ల అవగాహన పెంపొందించుకున్న మనిషి. ఈ ఆలోచనా విధానమే ఫూలే పునర్నిర్మాణవేత్తగా అవతరిం చడానికి కారణమ యింది. ఎన్.ఆర్. ఫడ్కె రచన 'ఎ లైఫ్ ఆఫ్ జస్టిస్ ఎమ్.జి. రనడే' గ్రంథంలో 1885లో వ్యవసాయ రంగం దీన స్థితిలో వున్నప్పటికీ రనడే వంశపారంపర్య భూస్వామ్య వర్గం ఎంతో సామాజిక ప్రయోజనకర పాత్ర వహిస్తుందని మాట్లాడిన మాటల్ని ఫూలే తీవ్రంగా ఖండించారు. పందొమ్మిదవ శతాబ్దిలో మహారాష్ట్ర ప్రాంతంలోని వ్యవసాయ పరిస్థితులు దీనంగా వున్నాయి. ఈ స్థితిగతులను తెలియజే యడానికి ఆధారంగా వున్న రచనల్లో 'చేతావని' ప్రధానమయినది. బ్రిటీష్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది.

నీటి పారుదల విషయంలో ఉద్యోగుల నిర్లక్ష్యం రైతుల బతుకుల్ని చితికిపోయేటట్టు చేశాయని ఫూలే వాదన వివరిస్తుంది. ఈ అంశాలని ఫూలే తన రచన 'షేత్ కార్యాంచ అసూడ్'లో వ్యక్తం చేశారు. 'చేతావని' తెలుగు భాషలో 'హెచ్చరిక' అనే అర్థం వచ్చే ఈ దీర్ఘవ్యాసంలో పీష్వాల కాలంలో మహారాష్ట్ర శూద్ర, అతిశూద్ర వ్యవసాయ దారులు, శ్రామికుల దుర్భర స్థితిని ఫూలే వివరించారు. మితిమీరిన బ్రాహ్మణ పాలన వ్యవసాయ అభివృద్ధికి ఎటువంటి ప్రాధాన్యతను ఇవ్వలేదు సరికదా పన్నుల దోపిడీకి పాల్పడిందని ఫూలే పేర్కొన్నారు. మహాత్మ జోతిరావ్ ఫూలే రచనల్లో ప్రధానమయి నది 'గులాంగిరి' నాటకం. 19వ శతాబ్దిలో మహారాష్ట్రలోని శూద్రకులాల స్థితిగతులను వివరించే రచన ఇది. ప్రతి కులానికీ జనాభా ప్రతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని అప్పటి బ్రిటీష్ ప్రభుత్వానికి ఫూలే సూచించారు. సాంఘిక అసమాన తలకు, అవకాశ లోపాలకు రిజర్వేషన్లు అవసరమని ఆనాడే గ్రహించిన మేధావిగా ఆయన్ని పేర్కొనవచ్చు.

1982 అక్టోబర్19న జోతిరావ్ ఫూలే హంటర్ కమిషన్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఇది విద్యా కమిషన్ అయినప్పటికీ విద్య, ఆర్థిక వ్యవహారాలు పరస్ప రం ఒకదానితో మరొకటి ముడిపడిన అంశాలు కాబట్టి ఫూలే వాటిని ప్రస్తావిం చారు. నేటి ప్రభుత్వం ఉన్నత వర్గాలను మాత్రమే విద్యావంతులుగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతుందని విమర్శించారు. రైతుల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమయితే నిమ్నకులాల్ని కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరే ఏర్పాట్లు చేయాలి. ప్రజలందరికి విద్యనందించి వారు ఉద్యోగులుగా మారి ఆర్థికంగా సుస్థిరత సాధించే దిశగా ప్రోత్స హించాలి. పేదరికంలో మగ్గిపోతున్న పల్లెల్లో వ్యవసాయదారుల పిల్లలకు విద్యనం దించాలి. అంతేగాక పశువులు కాయడానికో, వ్యవసాయపనులకో పరిమితమ వుతున్న ఈ బాలలకు ఉపకారవేతనాలు మంజూరు చేసి చదువుకు ప్రోత్సహించాలి. చదువులో చురుకుదనం కనబరిచినవారికి పోత్సాహకాలు అందజేయాలని ఫూలే పేర్కొన్నారు. వ్యవసాయం చేసుకొనే కులాల నుంచి వచ్చిన యువతకు శిక్షణ ఇచ్చి ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దాలి. రైతు కులాల నుంచి, శ్రామిక కులాల నుంచి ఉపాధ్యాయులను తీర్చిదిద్దడం ఈ దేశ భవిష్యత్‌కు చాలా అవసర మన్నారు. ఫూలే చేతి వృత్తులను ప్రోత్సహించారు. ప్రభుత్వ ఉద్యోగాలు గురించి మాత్రమే వేచి చూడకుండా మనిషి జీవించడానికి ఈ వృత్తులు ఉపకరిస్తాయన్నారు. స్వయం ఉపాధి భావన ఆనాడే ఫూలే ఆలోచించారు. ఉత్పత్తి కులాలు దుర్భర జీవితా లను అనుభవిస్తున్నాయని, ప్రాణాలు తోడే వడ్డీ వ్యాపారులు పచ్చగా బతుకుతున్నా రన్నారు. శూద్రులు చెల్లించే పన్నులతో సంపన్న ఉన్నత కులాల పిల్లల చదువుకు వెచ్చిస్తూ వాళ్ళకు వట్టి చేతులు చూపుతున్నారని ఆయన ఆవేద వ్యక్తం చేశారు.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ క్యాబినెట్‌లో న్యాయశాఖ మంత్రిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లు అనే గొప్ప సంఘసంస్కరణను ఈదేశంలో ప్రవేశపెట్టారు. పురుషులకి, స్త్రీలకి మధ్య గల అసమానతల్ని రూపు మాపకుండా ఆర్థిక సమస్యల్ని పరిష్కరించడానికి చట్టాల్ని తయారు చేయడం రాజ్యాంగాన్ని కించపర్చడం అని అంబేద్కర్ పేర్కొన్నారు. రాజ్యాంగ మీద జరిగిన చర్చల్లో కూడా ఆయన ఇలానే స్పందించారు. 'అణగారిన వర్గాలు', 'ఇతర వెనుకబడిన కులాలు' వంటి పదాలు ఈ కోవకు చెందినవే. స్వాతంత్ర్యానికి పూర్వం ఇంత దూరదృష్టితో డాక్టర్ అంబేద్కర్ ఉపయోగించిన పదజాలం తదనంతర కాలంలో 'ఓబీసీ'లకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్యమాల్లో ఆర్థిక పరిస్థితిని పరిగ ణించాలన్న అంశం కూడా మిళితమై వుండటాన్ని గమనించవచ్చు. డాక్టర్ అంబేద్కర్ ఆర్థిక విధానాలను ఆచరణాత్మక పంథాలో పరిశీలించారు. డాక్టర్ అంబేద్కర్ ఏర్పాటు చేసిన 'షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్' పార్టీ ప్రణాళికలో బీమాను జాతీయం చేయాలని; మద్య నిషేధం ఆచరణ సాధ్యం కానిది, అందుకే దీని మీద పన్నులు విధించి ఆర్థిక వనరులు సమకూర్చుకోవచ్చని; అంతేగాక పార్టీ సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ఏ విధానానైనా అనుసరిస్తుందని; జీవితం మీద పార్టీ ఆలోచనా విధానం పూర్తిగా జాతీయతతోనూ, ఆధునికతతోను కూడి వుంటుందని పేర్కొ న్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, సహకార వ్యవసాయానికి డాక్టర్ అంబేద్కర్ మద్దతు పలికారు. బంజరు భూముల్ని నిమ్నకులాలకు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజిక కారణాలతో హిందూమతాన్ని నిరాకరిం చడంతో పాటు ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించవలసి వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మౌలికమయిన విధానాల్ని అనుసరిస్తున్నట్టు ప్రకటించారు. ఈ పంథా 1936లో ఇండిపెండెంట్ లేబర్‌పార్టీని స్థాపించే వరకు కొనసాగింది. ఇది కేవలం నిమ్నకులాల రాజకీయ ప్రాతినిధ్యం కోసమే కాకుండా, కార్మికవర్గ ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఏర్పాటయింది. ఈ రాజకీయపార్టీ మేనిఫెస్టో బ్రిటీష్, అమెరికా రాజకీయ, ఆర్థికవేత్తల మన్నల్ని పొందింది. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ప్రణాళికలో ప్రధానంగా సాంఘిక, ఆర్థిక, ప్రజాస్వామ్య అంశాల్ని మిళితం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా సమకాలీనంగా జరుగుతున్న సామ్యవాద పోరాటాల్లాగే పురోగమన దృక్పథంతో ముందుకు దూసికొచ్చింది. పరిశ్రమలు ప్రజల ప్రయోజనాలను కాపాడే విగా వుండాలని, ప్రభుత్వ హయాంలోనే యజమాన్యం వుండాలని ఆకాంక్షించింది. ఈవిధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేసింది. ఆగస్టు 8, 1936 'జనత'లో డాక్టర్ అంబేద్కర్ పేర్కొన్న విధంగా ఇండిపెండెంట్ లేబర్‌పార్టీ పార్టీ విధానాలు ఏ వర్గం ప్రజలకైనా వ్యతిరేకంగా వుంటే ఆర్థిక వ్యవస్థను మార్చే విధంగా చర్యలు తీసుకుంటామనే విషయాన్ని స్పష్టం చేసింది. కర్మాగార కార్మికుల రక్షణ, సంక్షేమాలకు సంబంధించిన పటిష్టమయిన చట్టాన్ని తీసుకొస్తామని వాగ్దానం చేసింది. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో వివిధ రూపాల్లో కొనసాగుతున్న అప్పటి కొంకణ, విదర్భ ప్రాంతాల్లో జమీందారీ వ్యవస్థ చేతుల్లో నలిగిపోతున్న కౌలురైతులకు రక్షణ కల్పించడానికి తగిన విధంగా స్పందిస్తామన్నారు. డాక్టర్ అంబేద్కర్ నిర్వహించిన 'జనత' పత్రికలో పెట్టుబడిదారుల, భూస్వాముల చర్యల్ని ఎండగట్టేది. కార్మిక వర్గం నిరసనలు, రైతుల తిరుగుబాట్లకు సంబంధించిన వార్తలను ప్రచురించేవారు. కుల, వర్గ దృక్పథాలను సమాంతరంగా విశ్లేషించిన పత్రికగా దీనిని పేర్కొనవచ్చు. భారత కార్మిక వర్గంలో వామపక్షవాదులు పలుకుబడి పెంచుకున్న నేపథ్యంలో దళిత రాజకీయ కార్యకర్తల్లో అవగాహన కల్పించడానికి 'జనత' పత్రికలో మార్క్సిజంపై చర్చలు, వాదోపవాదాలు, వ్యాఖ్యానాలను ప్రచురించేవారు. ఆర్థిక ఆలోచనలకు సంబంధించి దళిత కార్యకర్తల నుంచే డాక్టర్ అంబేద్కర్ తీవ్రవాద ధోరణిలో కొనసాగాలనే ఒత్తిడి వుండేది. ఎందుకంటే అక్కడి దళితులంతా కౌలుదార్లు, రైతులు, కూలీలు కావడం వల్ల ఈ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొంకణ ప్రాంతంలో ఖోటీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడటం వల్ల అంబేద్కర్ నెలకొల్పిన కొత్తపార్టీ వర్గ లక్షణం బయటపడింది. వలసపాలనలో వున్న భారతదేశంలో రైతు ఉద్యమం ఉద్భవించింది. రైతు సంస్కృతి కలిగిన మహారాష్ట్ర లోతట్టు ప్రాంతంలో రైత్వారీ వ్యవస్థ వుండేది.

1930 నాటికి కౌలుదార్లు భారీగా సంఘటితమయ్యారు. కొంకణ ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్ని ప్రారంభించారు. ఖోటీవ్యవస్థ రద్దు కోసం 1937లో డాక్టర్ అంబేద్కర్ ఒక బిల్లు ప్రతిపాదించారు. ఆ సమయంలోనే బొంబాయికి మొదటి రైతు యాత్ర జరిగింది. కొంకణప్రాంత వాసి ఇండిపెండెంట్ లేబర్‌పార్టీ సభ్యుడు శ్యాంరావ్ పరులేకర్, చిత్రే, గుజరాతీ రైతునాయకుడు ఇందూలాల్ యాజ్ఞిక్, కమ్యునిస్టు నాయకుడు ఎస్.ఎ.డాంగేతో కలిసి ఈ యాత్రకు నాయకత్వం వహిం చారు. అనంతరం బి.టి.రణదివే, జి.ఎస్. సర్దేశాయి వంటి కమ్యునిస్టు నాయకులు అంబేద్కర్‌తో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. 1938 జనవరి 12న ఇరవై వేలమంది రైతులతో బొంబాయి కౌన్సిల్‌యాత్ర నిర్వహించారు. దీనిని భారత్‌కిసాన్ కాంగ్రెస్ ర్యాలీతో పోల్చారు. ఈయాత్రలో 'ఖోట్ వ్యవస్థను రద్దుచేయండి'; 'సాహూకార్ల ఆధిపత్యాన్ని అణచివేయండి'; 'డాక్టర్ అంబేద్కర్ వర్థిల్లాలి' మొదల యిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చేసిన ఉపన్యాసం కమ్యుని స్టుల్ని ఆకర్షించింది. కాంగ్రెస్ ధనికులకు అండగా నిలుస్తుందనే విషయం ప్రజలం దరికీ తెలియాలని, కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా సంఘటితం కావాలనే నినాదంతో మార్క్సిజాన్ని సమర్థిస్తూ ప్రకటన చేశారు.

"నిజంగా ప్రపంచంలో రెండే కులాలు వున్నాయి. మొదటి రకం ధనికులు కాగా, రెండో రకం పేదలు. వీరు కాకుండా మధ్యతరగతి ఒకటి వుంది. అది అన్ని ఉద్యమాలను నాశనం చేస్తుంది." అని డాక్టర్ అంబేద్కర్ పేర్కొన్నారు. అంతేగాక ఇక్కడ వున్న కమ్యూనిస్టు నాయకులందరి కంటే మార్క్సిజానికి సంబంధించిన సాహిత్యాన్ని ఎక్కువగా, విపులంగా చదివానన్నారు. ఈ సిద్ధాంతం ఆచరణలో నిలవాలి. ఆ కోణంలో భారతీయ కమ్యూనిస్టులు పనిచేస్తే రష్యాలో విజయవంతమ యినంత సమయం, శ్రమ ఇక్కడ పట్టదని ఉద్ఘాటించారు. తాడిత వర్గాల పోరాటాలకు సంబంధించినంత వరకు కమ్యూనిస్టు సిద్ధాంతం నిమ్నకులాలకు సన్నిహితమయి నదని అభిప్రాయపడుతున్నట్టు అంబేద్కర్ 15 జనవరి, 1938 'జనత' పత్రికలో ప్రకటించారు. సామాజిక సమానత్వంలో కులాన్ని మార్క్స్ ఎప్పుడు నిర్ణయాత్మక శక్తిగా పేర్కొనలేదని, భారతదేశంలో కులం ప్రజానీకాన్ని చీలుస్తున్నట్టుగానే యూరప్‌లో జాతీయత కార్మికులను విడదీస్తుందని ఆయన భావించారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఒక్కటే కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించేదిగా డాక్టర్ అంబేద్కర్ పిలుపు నిచ్చారు. కార్మికవర్గ బలాన్ని సమీకరించదలచుకుంటే మతపరమయిన బానిస త్వాన్ని, మానసికపట్టును ముందు నాశనం చేయాలి అప్పుడే శ్రామికవర్గ సమైక్య పోరాటాల్లో కులనిర్మూలన కూడా సాధ్యమవుతుందని అంబేద్కర్ వివరించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1956 ఖాట్మాండ్‌లో జరిగిన ప్రపంచ బౌద్ధ మహాసభలో 'మార్క్సిజం – బౌద్ధం' అంశం మీద ప్రసంగించారు. వర్గ సంఘర్షణ, దోపిడీ, జాతీయకరణ, లేదా ప్రైవేటు ఆస్థి రద్దు మొదలయిన అంశాలు మీద మార్క్సిజం విశ్లేషణలు అనుభవపూరకంగా నిరీర్యమయిపోతాయని; వీటికంటే బిక్కు సంఘంలోని స్వచ్ఛంద కమ్యూనిజం మెరుగైనదిగా ఆయన పేర్కొన్నారు. పాళీ భాషా రచనల్లో వ్యాపారస్తులు సంపద సమకూర్చుకోవడానికి తగిన గౌరవం లభించింది. సంపాదన, దాని అనుభవం నిజాయితీగా వుండాలనే విషయం అంబేద్కర్ మీద ప్రభావం చూపాయని చెప్పడానికి ఎలియనార్ జెలియో రచనలు ఆధారంగా వున్నాయి. ప్రాపంచికంగా అనేక సిద్ధాంతాల్ని అధ్యయనం చేసిన డాక్టర్ అంబేద్కర్, స్వయంగా సమాజ పోకడలను అవగతం చేసుకొని వాటి వెనుక గల శక్తుల్ని అంచనా వేసిన జోతిరావు పూలే లను ఈ దేశ అణగారిన వర్గాల, కులాల ప్రజల కోసం సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా తాత్వికతను సాధించిన మహనీయులుగా స్మరించడం ఎంతైనా అవసరం.

ఇంగ్లీషు మీడియం విద్య - దేశాభివృద్ధి

- కోటేశ్వరరావు కనపర్తి, ఐపియస్ రిటైర్డ్

దేశంలో ఆంగ్లేయులు 1835 సం.లో ఇంగ్లీషు విద్యను ప్రవేశ పెట్టు వరకు కూడా 90% ప్రజలైన శూద్రులు, దళితులు, స్త్రీలు చదువుకో రాదు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మాత్రమే గురుకులాలో చదువు కోవాలి. ఆంగ్లేయులు పరిపాలన నిర్వహించడానికి దేశంలోని అనేక భాషలు నేర్చుకోవడం కష్టమై ఇంగ్లీషు విద్య ప్రవేశపెట్టాలని నిర్ణయిం చారు. స్థానిక ప్రజలను నియంత్రించడానికి పాలనా సహాయకులుగా, గూడాచారులుగా బ్రాహ్మణులను, జమీందారులను, సంపన్నులను నియ మించారు. 1774లో కలకత్తానందు సుప్రీంకోర్టు స్థాపించినపుడు సంస్కృ తంలో వున్న హిందూ చట్టాలను తర్జుమా చేయడానికి బ్రాహ్మణ పండి తులను నియమించారు. 1835లో మెకాలే సంస్కరణల్లో భాగంగా ఇంగ్లీషు విద్యను ప్రవేశపెట్టుచున్నట్లు ప్రకటించారు. వారు ప్రతిపాదించిన Downward filtration theory ప్రకారం పైనున్న అగ్రకులాలను ఇంగ్లీషులో ట్రైన్ చేస్తే అది కింది కులాల వారికి విస్తరించుననివారు నమ్మి నారు. ఆ ప్రకారం 1880-81 నాటికి 1,38,895 మంది చదువుకోవడం జరిగింది. ఐదు యూనివర్శిటీలో 15,081 మంది డిగ్రీలు చదివారు.

పాశ్చాత్య ఇంగ్లీషు విద్య నభ్యసించిన రాజారామ్ మోహన్ రాయ్, మహాత్మా పూలే లాంటి కొందరు 19వ శతాబ్దంలో సాంస్కృతిక ఉద్యమాలు నడిపారు. 1885లో కాంగ్రెసు స్థాపన కాలంలో దానికి నాయకత్వం వహిం చిన గాంధీ, నెహ్రూ, బోస్ మున్నగు వారంతా దేశ విదేశాల్లో ఇంగ్లీష్ విద్యనభ్యసించిన వారే.

స్వాతంత్ర్య అనంతరం ప్రధానులు, గవర్నర్ మున్నగు ఉన్నత పదవులు అధిష్ఠించిన ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ మున్నగు వారంతా విదేశాల్లో ఇంగ్లీష్ చదువు కొనినవారే. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహిస్తున్న కేటీఆర్, కవిత, నారా లోకేష్ లాంటి వారు మెరికాలో ఇంగ్లీష్ విద్య చదివినవారే. అమెరికా, ఇంగ్లాండు, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తున్న దాదాపు కోటి మందికి ఇంగ్లీషు విద్య వలననే సాధ్యమైనది.

విదేశాలలోవున్న ప్రవాస భారతీయులు 2018సం.లో భారత దేశానికి దాదాపు 80 బిలియన్ డాలర్ల డబ్బు అంటే దాదాపు 8 లక్షల కోట్ల రూపాయలు ఇండియాకు పంపారంటే అది ఇంగ్లీషు విద్య ఇతర స్కిల్సు వల్లనే సాధ్య మైనది. వివిధ కోర్టుల్లో సుప్రీంకోర్టు వరకు నియమితులైన న్యాయమూర్తులలో 100% ఇంగ్లీష్ విద్యలో ప్రావీణ్యత వున్న వారనే గుర్తించాలి. అదే విధంగా ఆయా కోర్టుల్లో కేసులు వాదించే ప్రముఖ ప్లీడర్లు అందరు ఇంగ్లీష్ నందు పట్టు ఉన్నవారే.

జిల్లా కలెక్టర్, యస్పీ స్థాయి అధికారులు పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యో గాలు పొందారంటే కారణం వారి కున్న ఇంగ్లీష్ విద్య. దేశ విదేశాల్లో డాక్టర్లుగా రాణిస్తున్న వారంతా ఇంగ్లీషు విద్యలో పాండిత్యమున్న వారే.

ప్రముఖ ఇంజనీర్లు అయిన సర్ ఆర్థర్ కాటన్, మోక్ష గుండం విశ్వే శ్వరయ్య మున్నగు వారంతా ఇంగ్లీషు విద్య నభ్యసించిన వారే. కార్పొ రేట్ రంగంలో రాణిస్తున్న రతన్ టాటా, విప్రో అజీమ్ ప్రేంజీ, ఇన్ఫో సిస్ నారాయణమూర్తి మున్నగు వారంతా ఆ స్థాయికి చేరడానికి ఇంగ్లీషు విద్య కారణం. విదేశీ సంస్థలలో అత్యున్నత స్థాయికి చేరిన సత్య నాదెండ్ల, సుందర్ పిచాయ్ లాంటి వారి ఎదుగుదలకు కారణం ఇంగ్లీష్ విద్యయే. వేల సంఖ్యలో వెలసిన రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలు శ్రీచైతన్య, నారాయణ, భాష్యం, చిరాగ్ లచే స్థాపించబడి లక్షల కోట్ల రూపాయలు సంపాదించడానికి కారణం ఇంగ్లీషు మీడియం విద్య.

దురదృష్టవశాత్తు విదేశాలలో స్థిరపడిన భారతీయులు ముఖ్యంగా తెలుగు కమ్మ, రెడ్డి కులాల వారు తానా, ఆట, నాట, టాట లాంటి కుల ప్రాంతీయ సంఘాలు స్థాపించి వివిధ కులాల మధ్య విద్వేషాలు రేకిస్తున్నారు.

నాణ్యమైన విద్య అందిస్తున్న దేశాలు ఎంతో అభివృద్ధి చెందాయి. విద్య మానవులకు పెట్టుబడి లాంటిది. ఇంగ్లీషు మీడియం విద్యను చదివిన బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, వెలమ కులాలు అభివృద్ధి చెందాయి. ఇంగ్లీష్ విద్య చదవని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆర్థికంగా వెనుక పడిపోయారు. క్రింది కులాలు చదివే తెలుగు మీడియం విద్యను కూడా ఉపయోగం లేకుండా చేయడానికి 1970 నుండి ప్రభుత్వాలు పథకం ప్రకారం ఎంఏ, ఇతర పీజీలు చదివిన వారి చదువు కూడా ప్రమాణాలు లేని విధంగా చేశారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఇంగ్లీషు మీడియం విద్యను 1 నుంచి 6వ తరగతి వరకు అమలు పరచడానికి రెండు జీఓలు జారీ చేస్తే అభివృద్ధి నిరోధక శక్తులు తెలుగు భాష నశించి పోతదని గగ్గోలు పెట్టారు. ఆ గగ్గోలు పెట్టిన పెద్దమనుషుల పిల్లలు ఎవరూ కూడా తెలుగు మీడియంలో చదవలేదు. తెలుగు భాష మీద ప్రేమ వున్న వారు వారి పిల్ల లను, మనవళ్లు, మనవరాళ్లను తెలుగు మీడియంలో చదివించాలి. క్రింది కులాలు ఇంగ్లీషు మీడియం ద్వారా ఎదగటానికి ఇష్టం లేని వారే గగ్గోలు పెట్టారు.

ఇంగ్లీషు మీడియంను వ్యతిరేకించే పెద్ద మనుషులు కోర్టులో పిల్ వేసి ఇంగ్లీషు మీడియం జీఓలను కొట్టి వేయించారు.

ఇంగ్లీషు మీడియంను అమలు చేయాలనే ఉద్దేశంతో వున్న ప్రభుత్వం ఇంగ్లీషు/తెలుగు అనే ఆప్షన్ తో మరో జీవో జారీ చేసినట్లు తెలిసింది.

ఇలాంటి సమయంలో నిజమైన అంబేద్కరిస్టులు, అభ్యుదయ వాదులు పేదల విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలి.

(1) పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఇంగ్లీషు మీడియం ఆప్షన్ లెటర్స్ తీసుకొని అవసరమైతే సంబంధించిన అధికారులకు పంపాలి. (2)ఉపాధ్యాయుల పనితీరు, వారి కమిట్మెంట్ గమనిస్తూ వుండాలి. వారి సమస్యలను కూడా అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి తోడ్పడటం చేయాలి. (3)ఇంగ్లీషు మీడియం బోధన టీచర్లకు అలవాటు లేనందున తల్లిదండ్రులతో మాట్లాడి రోజుకు ఒక గంట స్పోకెన్ ఇంగ్లీషు చెప్పే వ్యక్తులచే స్కూల్ సమయంలో కొంత కాలం టీచ్ చేయించాలి. (4)ప్రయివేటు ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో ఫీజులు ఎక్కువగా తగ్గించే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి.

ఇంగ్లీషు మీడియం కొరకు ఇలాంటి చర్యలను నిజమైన అంబేద్కరిస్టులు, అభ్యుదయ వాదులు తీసుకుని ప్రతి పేద కుటుంబం ఇంగ్లీషు మీడియం విద్య ద్వారా అభివృద్ధి చెందేలాగున బాటలు వేయాలని ప్రార్థించుచున్నాను.

జైభీంలతో

వదల రామోజీ వదల..!

తెరపైకి మళ్లీ మార్గదర్శి కేసు..

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్

అరుంధతి సినిమాలో ఓ పాపులర్ డైలాగ్ ఉంటుంది తెలుసు కదా... 'వదల బొమ్మాళీ, వదల...' ఈనాడు రామోజీరావుకు మార్గదర్శి కుంభకోణం కేసు కూడా అలాగే ఉంది... ఇక అంతా సద్దుమణిగినట్టే అనుకుంటూ ఉంటే... అకస్మాత్తుగా మళ్లీ ఆ మార్గదర్శి కేసు జడలు విప్పుకుని, వదల రామోజీ వదల అంటూ భీకరంగా తెర మీదకు వచ్చింది... దీనికి కారణం పట్టువదలని మాంత్రికుడు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్... చట్టాల పట్ల చాలా అవగాహన, అధ్యయనం ఉండే తను చాలారోజులుగా దీన్ని కెలికే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు... ఇప్పుడు అది కదలికకు నోచుకుంది... అసలు ఆ కేసుల్లో రామోజీరావును డిశ్చార్జ్ ఎలా చేస్తారని ఉండవల్లి పిటిషన్... ఈరోజు విచారణకు వచ్చింది..

ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా (అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్... మరి ఇప్పుడు ప్రతివాదిగా ఏ రాష్ట్రం..? ఈ క్లారిటీ రావల్సి ఉంది...) చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది... అంతేకాదు, రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక అధికారిని కూడా ఈకేసులో భాగస్వామిని చేసింది... ఈమేరకు వెంటనే ఓ మెమోను దాఖలు చేయాలని కూడా చెప్పింది... అసలే కాక మీదున్నాడు జగన్... తనకు ఏం చాన్స్ దొరుకుతుందా అని చూస్తాడు... హైదరాబాద్ బేస్డ్ కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తే... కేసీయార్ ఏం చేస్తాడనేది ప్రశ్నే... ఈనాడు పట్ల కేసీయార్ వైఖరి స్పష్టాస్పష్టంగా ఉంటుంది..



అప్పట్లో వైఎస్ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల ఆర్థిక మూలాల్ని పెకిలించాలని అనుకున్నాడు... రామోజీ ఫిల్మ్ సిటీలో అసైన్డ్ భూముల కొనుగోలు ప్లస్ మార్గదర్శి ఇష్యూలను టేకప్ చేయించాడు... ఫిల్మ్ సిటీ వ్యవహారాన్ని వేరేవాళ్లకు, మార్గదర్శి ఇష్యూను ఉండవల్లికి అప్పగించాడు...మార్గదర్శికి పెద్ద కుదుపు ఆరోజుల్లో... సరే, రకరకాల న్యాయవివాదాలు గట్రా సాగుతూ ఉండగానే వైఎస్ మరణించడం, తరువాత రాష్ట్ర విభజన... కేసు గురించి దాదాపు అందరూ మరిచిపోయారు... కానీ అలా మరిచిపోతే తను ఉండవల్లి ఎలా అవుతాడు... తవ్వుతూనే ఉన్నాడు..


అసలు కేసు ఏమిటీ అంటే..? ఆర్బీఐ చట్టం ప్రకారం మార్గదర్శి వేల కోట్ల డిపాజిట్లను సేకరించింది అనేది అభియోగం... అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం డిపాజిటర్ల ప్రయోజనాల రక్షణ పేరిట ఆర్థిక శాఖ సలహాదారు రంగాచారిని కూడా నియమించింది... ఆర్బీఐ చట్టం మేరకు చర్యలు తీసుకోవాలని సీఐడీ ఐజీ కృష్ణరాజును కూడా నియమించింది... ఇక కోర్టుల్లో వ్యాజ్యాలు ప్రారంభమయ్యాయి... అవి సాగి సాగి 2011లో మార్గదర్శి క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై హైకోర్టులో స్టే తెచ్చుకున్నది... అయితే రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరిస్తూ, ఏ కేసులోనైనా స్టే కాలవ్యవధి ఆరు నెలలకు మించి ఉండకూడదు అని చెప్పింది కదా... దాంతో ఈ స్టే కాలపరిమితి తీరిపోయినట్టయింది... పొడిగించాలని కోరుతూ మార్గదర్శి సుప్రీంకోర్టును ఆశ్రయించింది... కానీ స్టే దొరకలేదు... హైకోర్టును ఆశ్రయించారు... అది మార్గదర్శిపై ఉన్న క్రిమినల్ సీసీ నెంబర్ 540ని కొట్టేసింది... దీనిపై ఉండవల్లి సుప్రీంను ఆశ్రయించారు... ఇప్పుడు సుప్రీం వెలువరించిన కీలకనిర్ణయాల ఫలితంగా మళ్లీ మార్గదర్శి చర్చల్లోకి వచ్చింది... మార్గదర్శి కథ ముగియలేదు... నిజానికి అసలు కథ ఇప్పుడే ఆరంభమైనట్టుంది...!!

మహానటసార్వభౌమ....

బాబు బయోపిక్

- శ్రీనివాస్





చంద్రబాబు...దక్షిణాదిలో సీనియర్ రాజకీయవేత్త. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక ఎత్తుపల్లాలున్నాయి. బాబు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా గడించిన అనుభవం ప్రస్తుత వర్తమాన రాజకీయాల్లో మరే ఇతర రాజకీయ నేతకు ఉండవంటే అతిశయోక్తి కాదు. దివంగత ఎన్టీఆర్‌ను నాదెండ్ల భాస్కర్‌రావు పదవీచ్యుతుడిని చేసి, తాను ఆ పదవిని లాక్కున్న సందర్భంలో చంద్రబాబు పోషించిన పాత్ర అద్భుతమైందని ఇప్పటికీ చెప్పుకుంటారు. అలాగే ఇదే చంద్రబాబు తనకు పిల్లనిచ్చిన మామ అని కూడా ఆలోచించకుండా 1995లో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసి, దిగ్విజయంగా ప్రజామోదం పొందిన నేతగా చరిత్రకెక్కాడు. అలాగే దేశ రాజకీయాల్లో తనదైన రాజకీయ ముద్ర వేసుకున్నాడు. ఏ పార్టీకైతే వ్యతిరేకంగా తెలుగునాట తెలుగుదేశం ఆవిర్భవించిందో...అదే పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లిన ఘన చరిత్ర కూడా బాబు సొంతం చేసుకున్నాడు. 23 మంది ప్రత్యర్థి ఎమ్మెల్యేలను టీడీపీలోకి చేర్చుకుని, వాళ్లలో ఐదుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టడమే కాదు... ప్రజాస్వామ్య విలువల గురించి గుక్క తిప్పుకోకుండా ఉపన్యాసాలు ఇచ్చిన, ఇస్తున్న మహానాయకుడు మన చంద్రబాబు. కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐని ఏపీలో అడుగు పెట్టకుండా జీవో ఇచ్చిన ధైర్యశాలి చంద్రబాబు. కానీ జగన్‌పై నమోదైన సీబీఐ కేసుల గురించి ప్రస్తావిస్తూ, ఆయన ఎంత అవినీతిపరుడో చూడండి అంటూ జనానికి లెక్చరర్లు ఇవ్వడం ఒక్క బాబుకే సొంతం. తాను ప్రత్యర్థి పార్టీ నుంచి చేర్చుకున్న ఎమ్మెల్యేల సంఖ్యే చివరికి 2019 సార్వత్రిక ఎన్నికల్లో దక్కించుకున్న దయనీయ స్థితి బాబుది. ఒకవైపు బీసీలకు 34% రిజర్వేషన్లు చెల్లవని సొంత పార్టీ నాయకుడితో కోర్టులో పిటిషన్ వేయించి, తాను కోరుకున్నట్టుగానే తీర్పు రావడంతో ఆనందించిన బాబు...బీసీల ద్రోహి జగన్ అని విమర్శించిన కొంటె తనం బాబు సొంతం. తనకు అవకాశం ఉన్నప్పుడు గుర్తు రాని దళితులు, తగుదునమ్మానంటూ ఏ మాత్రం బలం లేని పరిస్థితుల్లో రాజ్యసభ సీటుకు ఓ దళితుడిని ముందు పెట్టి రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్న గొప్ప నట చక్రవర్తి మన చంద్రబాబు. రాజకీయాల్లోనే కాదు నటనలో కూడా మామకు మించిన అల్లుడు చంద్రబాబు అని నిరూపించుకున్నాడు. ఇప్పుడాయన రాజకీయ జీవితంపై సినిమా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకప్పటి దక్షిణ భారత సినీనటి సావిత్రి జీవిత కథ ఆధారంగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో మహానటి పేరుతో సినిమా తీయడం, అది బంఫర్ హిట్ సాధించడం తెలిసిందే. తాజాగా చంద్రబాబు రాజకీయ జీవిత కథ ఆధారంగా మహానటుడు అనే టైటిల్‌తో సినిమా తీస్తే మహానటి మించిన విజయాన్ని సాధిస్తుందనడంలో సందేహం లేదు. ఈ దిశగా రాజమౌళి, త్రివిక్రమ్, నాగ్ అశ్విన్ లేదా రాంగోపాల్‌వర్మ లాంటి కళాత్మక దర్శకులు ఆలోచిస్తే బాగుంటుంది.

శ్రీశ్రీ రాసిన 'హరికథ' కథ!?

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్



కథాబలం కలిగిన కొన్ని గొప్ప సినిమాలు బాక్సాఫీసువద్ద ఎందుకు విఫలమవుతాయో అంతుతెలియని ప్రశ్న. ఆ కోవకి చెందిన సినిమా కవితా చిత్ర నిర్మాణతలో వచ్చిన 'వాగ్దానం' (1961). కె.సత్యనారాయణ, డి.శ్రీరామమూర్తి నిర్మాతలుగా మనసు కవి ఆచార్య ఆత్రేయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా, ప్రముఖ బెంగాలీ రచయిత శరత్ బాబు 1918లో రచించిన 'దత్త' నవలకు తెరరూపం. హేమాహేమీలైన అక్కినేని నాగేశ్వరరావు, గుమ్మడి, రేలంగి, చలం, కృష్ణకుమారి, సూర్యకాంతం, గిరిజ వంటి నటీనటవర్గంతో నిర్మించిన ఈ సినిమాలో పెండ్యాల స్వరపరచిన పాటలన్నీ హిట్లే. అయితే ఎందుకు ఈ సినిమా విజయవంతంగా ఆడలేకపోయింది? అనే ప్రశ్నకు ఎంత వెదకినా జవాబు దొరకదు. ఈ చిత్రానికి ఇది ఒక పార్శ్వమైతే, ఇందులో దర్శకుడిగా ఆచార్య ఆత్రేయ చేసిన ప్రయోగాలు అమోఘాలు. తన సొంత సినిమా అయినా సహచర సినీకవులకు ప్రాధాన్యమిస్తూ, దాశరథి వంటి గొప్ప కవిని వెండితెరకు పరిచయం చేస్తూ ఆత్రేయ చేసిన ప్రయోగం మెచ్చుకోవలసిన అంశం. 'వాగ్దానం' చిత్రంలో మొత్తం 8 పాటలుండగా, 'నాకంటి పాపలో నిలిచిపోరా' అనే పాటను దాశరథి చేత రాయించారు. నాలుగు పాటలను ఆత్రేయ, 'తప్పెట్లో తాళాలో' అనే ఒక పాటను నార్ల చిరంజీవి చేత, మిగిలిన రెండు పాటలను మహాకవి శ్రీశ్రీ చేత ఆత్రేయ రాయించారు. శ్రీశ్రీ రాసిన రెండుపాటల్లో ఒకటి 'సీతాకళ్యాణ సత్కథ'. గతంలో వచ్చిన సినిమాలలో శ్రీరాముని మీద అనేక పాటలైతే వచ్చాయిగాని, హరికథకు సంబంధించి వచ్చిన తొలి పాటగా ఈ సీతాకల్యాణాన్ని చెప్పుకోవాలి.

మకుటాయమానమైన ఈ హరికథను రచించేందుకు మహాకవి శ్రీశ్రీ ఎంతో పరిశోధన చేశారు. వామపక్ష భావాలు కలిగిన శ్రీశ్రీ ఈ హరికథను అక్షరబద్ధం చేసిన తీరు అనితరసాధ్యం. అలాగే ఆ హరికథకు సమ్మోహనమైన సంగీతాన్ని సమకూర్చిన పెండ్యాల నాగేశ్వరరావు, గంగా ప్రవాహంలా మాటకు, పాటకు, పద్యాలకు సమానంగా భావోద్వేగాలకు తన గళంలో స్వరవిన్యాసాలు పలికించిన ఘంటసాల, తెరమీద తనదైన శైలిలో రక్తికట్టించిన రేలంగి, పద్మనాభం, సూర్యకాంతం ఈ హరికథను అజరామరం చేశారు. శ్రీశ్రీ నాస్తికుడు కావచ్చు... కానీ పురాణ ఇతిహాసాలను కూలంకషంగా చదివి వాటిని ఆవపోసన పట్టిన మహా పండితుడు అనే విషయం కొందరికి మాత్రమే తెలుసు.


శ్రీశ్రీ కలానికి ఎంతటి పదునుందో 'తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా', 'పాడవోయి భారతీయుడా', 'కలకానిది విలువైనది', 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై', 'ఓ రంగయ్యో పూల రంగయ్యో', 'తూరుపు సిందూరపు మందారపు వన్నెలలో ఉదయరాగం', 'ఎవ్వరికోసం ఈ మందహాసం ఒకపరి వివరించవే', 'ధర్మక్షేత్రం ఇది కురుక్షేత్రం', 'నందుని చరితము వినుమా', 'నినుచూడ మనసాయేరా' (జావళి)వంటి కొన్ని పాటలు గుర్తు చేసుకుంటే చాలు. కానీ ఈ హరికథలో శ్రీశ్రీ, నలుగురు మహానుభావులను స్మరిస్తూ వారు రచించిన పద్యాలను, కీర్తనను వాడి ఆ హరికథకు వన్నె తెచ్చారు. ఆ మహనీయుల్లో మొదటివారు బమ్మెర పోతనామాత్యుడైతే, రెండవవారు కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి. తరువాత వరసగా హరికథా భాగవతార్ పెద్దింటి దీక్షిత దాసు, తిరుపతి వేంకట కవుల సమకాలీనులులైన దాసు రామారావు. శ్రీశ్రీ ఉపయోగించుకున్న పద్యాలను తను రాయలేక కాదు....కానీ ఆ

మహనీయులు ఎంత హృద్యంగా సీతాకల్యాణసత్కథలో వర్ణన చేశారన్నది ముఖ్యం. శ్రీశ్రీ ఈ హరికథ కోసం ఎన్ని గ్రంధాలను, సాంప్రదాయాలను ఆశ్రయించారో తెలిస్తే ఆశ్చర్యమేస్తుంది.

రాత్రివేళ పెట్రోమాక్స్ దీపకాంతుల్లో అమర్చిన వేదికవద్ద ఈ హరికథ "శ్రీనగజా తనయం సహృదయం... చింతయామి సదయం, త్రిజగన్మహోదయం" అంటూ కానడ రాగంలో మొదలవుతుంది. ఈ ప్రారంభ కీర్తనను శ్రీశ్రీ ఒకప్పటి ప్రముఖ హరికథా విద్వాంసులు, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వాస్తవ్యులైన పెద్దింటి దీక్షితదాసు రచించి, ఆలపించిన కీర్తన నుంచి సేకరించి ఉపయోగించుకున్నారు. వెంటనే "శ్రీరామభక్తులారా! ఇది సీతాకల్యాణ సత్కథ" అంటూ వచన వర్ణనతో హరికథ ప్రారంభమౌతుంది. సీతాదేవి స్వయంవరానికి ముల్లోకాల నుంచి వచ్చిన వీరాధివీరుల్లో అందరినీ ఆకర్షించిన ఒకే ఒక దివ్యసుందరమూర్తి రఘురాముడు... అంటూ తిన్నగా విషయానికి వచ్చేస్తారు శ్రీశ్రీ. ఇక్కడ రఘురాముడు ముల్లోకాల నుంచి వచ్చిన వీరాధివీరులకన్నా ఎందుకు దివ్యసుందరుడో వివరిస్తారు. రాముడు నెలరేడుకు సరిజోడు అని, అతని కనులు మగమీలను ఏలుతాయని, అతను నవ్వితే రతనాలు రాలుతాయని.... అన్నిటికన్నా ఆ రఘురాముని చూచిన మగవారు కూడా మైమరచి మరులుగొనేటంతటి మనోహరుడు అని వర్ణిస్తారు. ఇక సీతాదేవి ఆ మనోహర విగ్రహాన్ని అంతఃపుర గవాక్షం నుంచి ఓరకంట చూసి, చెలికత్తెలతో 'ఎంతసొగసుగాడే, మనసు ఇంతలోనే దోచినాడే' అంటుంది. అంటే స్వయంవర సంరంభం ఎలావున్నా రఘురాముని ఆ సీతమ్మ తొలిచూపులోనే మనసు దోచేసుకున్నదని, తన నోము ఫలమతడేనని నిర్ణయించుకున్నదని ఒక్క వాక్యంలోనే శ్రీశ్రీ చెప్పేశారు. సీతాదేవి అలా పరవశమై వుండగా, మరొక సన్నివేశానికి శ్రీశ్రీ వేగంగా వెళ్లిపోతారు. అక్కడ సభామంటపంలో జనక మహీపతి సభాసదులకు సీతాదేవిని పరోక్షంలో పరిచయం చేస్తారు. ఆమె వినయవిధేయతలు కలిగిన సద్గుణవతి అంటూ ముఖవిజిత లలిత జలజాత అని, శివధనుస్సును అవలీలగా కదిల్చిన ఆమెకు, ఆ శివధనస్సును ఎక్కుపెట్టగలవీరుడే సరిజోడు అవుతాడని, అట్టివీరునికే సీతమ్మ మాల వేసి పెళ్లాడుతుందని నిబంధన విధిస్తూ స్వయంవర ప్రకటన చేస్తాడు. ఆ ప్రకటన వినగానే ఎక్కడివారు అక్కడ చల్లబడిపోయారని, చివరకు స్వయంవరంలో పాల్గొన వచ్చిన రావణాసురుడు కూడా 'ఇది నా ఆరాధ్య దైవమైన పరమేశ్వరుని చాపము, దానిని తాకడమంటే మహాపాపము' అని భావించి వెనుతిరిగి పోయాడని చెబుతారు. ఈ సంభాషణాలంకార వర్ణన అవగానే శ్రీశ్రీ ఒక అద్భుతమైన పద్యాన్ని రచించారు. తనరచనకు తోడుగా శ్రీదేవీ భాగవతాన్ని తెలుగులో రచించిన దాసు రామారావు (తిరుపతి వేంకటకవుల సమకాలికులు) పద్యంలోని కొంత భాగాన్ని కూడా ఉపయోగించుకున్నారు. "ఇనకుల తిలకుడు నిలకడగల క్రొక్కారు మెరుపువలె నిల్చి, తన గురువగు విశ్వామిత్రుని ఆశీర్వాదము తలదాల్చి" అనే పద్య పాదాలవరకు తాను రచించి, దాసు రామారావు రచించిన "సదమల మదగజ గమనముతోడ స్వయంవర వేదిక చెంత...మదనవిరోధి (శివుడు) శరాసనమును తన కరమును బూనినయంత" అనే రెండు వాక్యాలను తన పద్యానికి అనుసంధానించి అద్భుత ఫలప్రయోజనాన్ని చేకూర్చారు. ఇంకాస్త ముందుకెళితే...ఈ పద్యానికి అనుసంధానమైన పద్యాన్ని కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి 1959లో రచించిన 'ఉదయశ్రీ' అనే కావ్య ఖండికలో వచ్చే 'ధనుర్భాగం' లోని ఒక పద్యాన్ని ఈ పద్యానికి అనుసంధానించి, ఆ హరికథ నడకతీరును వేగిరపరుస్తూ గొప్ప లయ (టెంపో)ను సమకూర్చారు. కరుణశ్రీ రాసిన పద్యం ఇక్కడి సన్నివేశానికి ఎంత చక్కగా అమరిందంటే... "ఫెళ్ళు" మనే విల్లు గంటలు "ఘల్లు"మనె, "గుభిల్లు"మనె గుండె నృపులకు ... "ఝల్లు"మనియె జానకీ దేహ మొక నిమిషమ్ము నందె నయము జయమును భయము విస్మయము గదుర" అంటూ సమయస్ఫూర్తితో "శ్రీమద్రమారమణ గోవిందో హరి" అనిపించారు. ఈ పద్య మాధుర్యాన్ని గమనిస్తే... శ్రీరాముడు ఎక్కుపెట్టగానే శివధనుస్సు ఫెళ్ళుమని విరిగింది. ఆ వింటికి కట్టివున్న చిరుగంటలు ఘల్లుమని మ్రోగాయి. సభలో ఆసీనులైవున్న రాజకుమారులందరి గుండెలు ఆ భీకరనాదానికి గుభిల్లుమన్నాయి. ఇక, సీతాదేవి శరీరము ఝల్లుమని పులకరించిపోయింది... ఎంత అందమైన, మనోహరమైన వర్ణన! ఈ చిన్నిపద్యంలోనే అక్కడి వాతావరణాన్ని కరుణశ్రీ ఎంత మనోజ్ఞంగా మన కనుల ముందర నిలిపారో అనే విషయం శ్రీశ్రీకి తెలుసు కనుకనే వారి పద్యాన్ని ఇక్కడ వాడుకున్నారు. ఆవిధంగా శ్రీరామచంద్రమూర్తి శివ ధనుర్భంగం కావించగానే జరిగిన తదుపరి తంతు కోసం బమ్మెర పోతనామాత్యుడు రచించిన శ్రీమద్భాగవతంలో నవమస్కందంలోని 'శ్రీరామచరిత్ర'లో వుదహరించిన కందపద్యంలో రెండు పంక్తులను శ్రీశ్రీ వాడుకున్నారు. "భూతలనాథుడు రాముడు ప్రీతుండై పెళ్ళి యాడె... భృథుగుణమణి సంఘాతన్ భాగ్యోపేతన్ సీతన్... అనే వాక్యం వరకే ఈ పాటకు వాడుకొని "ముఖకాంతి విజిత సితఖద్యోతన్" అనే వాక్యాన్ని వదిలేశారు. లోకనాయకుడైన రాముడు గొప్ప గుణవంతురాలు, అదృష్టవంతురాలు, చంద్రుణ్ణి అతిశయించిన ముఖకాంతిగల సౌందర్యవతి సీతను ప్రీతితో పెండ్లాడినాడు అని ముగించడం ఒక శ్రీశ్రీ మహాకవికే దక్కింది... ఇంతమంది మహనీయుల వర్ణనలను శ్రీశ్రీ అనుసంధానించినా ఎక్కడా అలంకార భేదం గోచరించదు సరికదా, వైలక్షణ్యాభావం కూడా చెడదు. అదే శ్రీశ్రీ రచనా చమత్కృతి!

శ్రీశ్రీ ఒప్పుకున్న తప్పు నిజాన్ని నిర్భయంగా చెప్పడానికి, తప్పును అంతే ధైర్యంగా ఒప్పుకోవడానికి శ్రీశ్రీ ఎప్పుడూ వెనుకాడలేదు. నటుడు కృష్ణ నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు' (1974) చిత్రంలో శ్రీశ్రీ రచించిన "తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా" అనే పాటకు జాతీయస్థాయిలో ఉత్తమ గేయరచన బహుమతి లభించింది. ఆ సందర్భంగా జరిగిన ఒక సన్మాన సభలో శ్రీశ్రీ మాట్లాడుతూ ఆ పాటలో సాంకేతికంగా ఒక తప్పుదొర్లిందని చెప్పారు. ఆ పాట మూడవ చరణంలో "ప్రతి మనిషి తొడలు గొట్టి శృంఖలాలు పగులగొట్టి, చురకత్తులు పదునుపెట్టి తుదిసమరం మొదలుపెట్టి, 'సింహాలై'గర్జించాలి, సంహారం సాగించాలి" అంటూ రాశారు. "ప్రతి మనిషి" అన్నప్పుడు "సింహంలా గర్జించాలి" అని వుండాలి కానీ సింహాలై గర్జించాలి అని తప్పు దొర్లినట్టు చెప్పి తన తప్పును ఒప్పేసుకున్నారు. మరొక సంఘటనలో హాస్యనటుడు పద్మనాభం నిర్మించిన తొలి చిత్రం 'దేవత' (1965) సినిమాకు "బొమ్మను చేసి ప్రాణము పోసి" అనే క్లైమాక్స్ పాట కోసం వేటూరి తొలుత రెండు పల్లవులు రాశారు. మొదటిది "నవ్వలేవు ఏడ్వలేవు ఓడిపోయావోయ్ మేధావి.. నవ్వించువాడు, యేడ్పించువాడు వున్నాడు వేరే మాయావి" రెండవది "బొమ్మనుచేసి ప్రాణముపోసి ఆడేవు నీకిది వేడుకా" అనేది. మొదటి పల్లవిలో దబ్బింగు ఛాయలు ఉండడంతో రెండవ పల్లవినే అందరూ "ఒకే" చేశారు. కానీ ఇరవై రోజులు గడచినా ఈ పాటకు చరణాలు కుదరలేదు. ఒకవైపు సావిత్రి గర్భవతి కావడంతో త్వరగా సినిమా పూర్తి చేయాలని, అప్పుడు పద్మనాభం మహాకవి శ్రీశ్రీని కలిశారు. పల్లవిని మార్చకుండా శ్రీశ్రీ రెండు చరణాలను వెనువెంటనే రాసి ఇచ్చేశారు. వేటూరి రాసిన పల్లవిని మార్చకుండా చరణాలు రాసి తన గొప్పమనసును చాటుకున్న నిజమైన మహాకవి శ్రీశ్రీ.

సంస్కర్త మహాత్మా జోతిరావు పూలే



విద్యావేత్తగా, తత్వవేత్తగా, కవిగా, రచయితగా, పత్రికాసం పాదకునిగా, స్త్రీ జాతి ఉద్ధోరకుడిగా, శూద్ర, అతిశూద్ర కులాల విమోచకుడిగా తన జీవితాన్ని సంఘసంస్కరణకు అంకితమిచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి మహాత్మజోతిరావు పూలే. ఈ దేశంలో బ్రాహ్మణీయ శక్తులు 'మను' 'అ'ధర్మ శాస్త్ర సిద్దాంతంతో బడుగుల జీవితాలను పాతాళానికి తొక్కడాన్ని నిరసించాడు ఆయన. మనిషిని మనిషిగా కూడా చూడని బ్రాహ్మణులపై సమరశంఖాన్ని పూరించాడు. బడుగుల జీవితాలకు 'పూల'బాటలు వేసిన వ్యక్తి పూలే. భారతదేశ చరిత్రలో సంఘసంస్కర్తలుగా వారి జీవితాంతం సమాజాసేవకు అంకితమైన భార్యాభర్తలు మహాత్మా జోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే మాత్రమే.

1884లో తన బ్రాహ్మణ స్నేహితుడి వివాహం సందర్భంగా పూలేకి జరిగిన అవమానంతో పూలేలో రేకెత్తిన ఆలోచన సామాజి కన్యాయానికి పునాది వేసింది. పూలే కేవలం 'మాలి' కులం అని బ్రాహ్మణులు అతనిపై కులవివక్ష చూపించి అవమానించారు. ఆచర్యతో పూలే తలపెట్టిన బ్రాహ్మణాధిపత్య వ్యతిరేక ఉద్యమం దేశంలోనే మొదటి సామాజిక ఉద్యమంగా అవతరించింది. అక్కడి నుంచి ఈసమాజంలో ఈ సామాజిక అసమానతలు పోవాలంటే విజ్ఞానం రావాలని, అది కేవలం విద్య ద్వారానే సాధ్యమవుతుం దని నాటి నుంచి విద్యావ్యాప్తికి అవిరాళంగా కృషి జరిపారు. విద్యావ్యాప్తికి మహాత్మాపూలే హంటర్ కమిషన్‌కి నివేదిక సమర్పిం చారు. ఈదేశంలో బాలికల కోసం 1848 లొనే తొలిసారిగా పాఠశాలను స్థాపించాడు. దీనికి ముందు భారతదేశ విద్యావిధా నాన్ని పరిశీలిస్తే 1813లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ విద్యకోసం కొంత నిధులను వెచ్చిచారు. కాని అవి కనీ వినియో గానికి నోచుకోలేదు. 1855 నాటికి 200 మిలియన్ల జనాభా కోసం 1474 విద్యాసంస్థలు మాత్రమే ప్రభుత్వం అధీనంలో నడు సున్నాయి. ఈ పాఠశాలలో 67,569 మంది విద్యార్థులు మాత్రమే విద్యను పొందుతున్నారు. వీటికి అదనంగా కొన్ని క్రిస్టియన్ మిష నరీ పాఠశాలలు ఉన్నాయి. బలమైన విద్యావ్యవస్థ రూపకల్పనకు లార్డ్ రిప్పన్ విలియమ్స్ హంటర్ నేతృత్వంలో 1882లో కమిషన్ ఏర్పాటు చేశారు. అప్పటికే పూలే తన భార్య సావిత్రీ బాయి పులేతో కలిసి 1850 లో ఒక పాఠశాలను, 1852 లో మరో రెండు పాఠశాలలు స్థాపించారు. అక్కడినుంచి అనేక పాఠశాలలను నెలకొల్పే క్రమంలో 1855 లో శ్రామిక ప్రజల కోసం రాత్రిబడి కూడా ప్రారంభించారు. శ్రామికులను విద్య వైపున కు మరల్చే ప్రయత్నం చేశారు. పూలే మనుధర్మశాస్త్రం వలన అణగారిన కులాలు ఎంతటి వివక్షకు గురికాబడుతున్నారో, నిమ్న కులాలకు విద్య అందాలంటే ప్రభుత్వం ఏమిచెయ్యాలో సవివరంగా వినతిపత్రాన్ని అందజే శారు. ఈ సందర్భంగా విద్య అందరికి తప్పనిసరి చేయాలని సాక్ష్యాలతో కూడిన విషయాన్ని ఆయన చర్చించారు. వెనుకబడిన వర్గాల్లో విద్యాకాంక్ష రేకెత్తించాలని ఆశించారు. విద్య సమాజంలో ఉన్నత వర్గాల నుండి సామాన్య ప్రజల్లోకి వెళ్లాలని కోరారు. 12 సంవత్సరాల లోపు పిల్లలకు ఖచ్చితంగా విద్యను అందించాలని నివేదించారు. వెనుకబడిన వారికి చదివు పై ఆసక్తి కలగటానికి వార్షికంగా బహుమతులు, ఉపకారవేతనాలు రూపొందించాలని కోరారు. శూద్ర, అతిశూద్రకులాల ప్రజానీకానికి మహిళలకు, ప్రత్యేక అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. వీరికి జ్ఞానం నేర్పించటానికి బ్రహ్మణేతరులను ఉపాధ్యాయులుగా నియమించాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల వారికి జ్ఞానం బహుమతిగా వచ్చిందని, వారు వెనక బడినవారికి విద్య నేర్పరని చెప్పారు. విద్య అనేది ఉన్నత వర్గాల గుత్తాధిప త్యంగా ఉందని తెలిపారు. పూలే ఇచ్చిన పత్రం ఆధారంగా తరువాత కాలంలో ఎన్నో పాఠశాలలు వెలిశాయి. విద్యార్థుల సంఖ్య బాగా పెరిగి పంజాబ్ యూనివర్సిటీ వంటివి వెలిశాయి.

స్త్రీల కోసం పూలే సాగించిన పోరాటం

భారతదేశంలో స్త్రీల కోసం, వారి అభ్యుదయం కోసం పోరాడిన మొట్ట మొదటి సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే. స్త్రీల చదువుకోసం దేశంలోనే తొలిసారి బాలికల పాఠశాలను నెలకొల్పారు. అంతేకాకుండా ప్రకృతి పరంగా చూస్తే మగవారికంటే స్త్రీలే ఎక్కువ శక్తి కలవారని, లింగ వివక్ష నేరమని ఆనాడే చాటిచెప్పిన వ్యక్తి పూలే. అందుకే ఆయన ఈ దేశానికి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిభాయిని అందించగలిగారు. బాల్యవివాహాలపై అలుపెరగని పోరుసాగించారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వలన వారు గర్భం దాల్చిన పిమ్మట భర్త చనిపోతే అలాంటి గర్భిణీ స్త్రీలకు 1864లో 'బాలహత్య ప్రతిబంధక్ గృహ' ను స్థాపించి వారికి అండగా నిలిచారు. అటువంటి గర్భిణీ స్త్రీలకు జన్మించిన పిల్లలకోసం ఒక సేవాసదనం ప్రారంభించారు. వితంతు పునర్వివాహాలు తానే స్వయంగా జరిపించడంతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేశారు. 1873 సెప్టెంబర్ 24న సత్య శోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశారు. బ్రాహ్మ ణుల నుండి శూదులను కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశ్యం. దేశంలోనే

ఇది మొట్టమొదట సంస్కరణోద్యమం. తదనంతర కాలంలో డాక్టర్ అంబేద్కర్ కొనసాగించి అనేక విజయాలు సాధించారు.

తెలుగువారితో పూలేకు ఉన్న అనుబంధం

జోతిరావు పూలేకు తెలుగువారితో ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంది. అప్పట్లో ముంబయిలోని తెలుగు ప్రజల పితామహుడు కాంట్రాక్టర్ రామయ్య వెంకయ్యయ్యవారు పూలేతో పరిచయమయ్యారు. సత్యశోధక్ సమాజ్ కార్యక లాపాల్ని విస్తరింపజేయటానికి, పాఠశాలలను నిర్వహించడానికి వారికి ఆర్థిక సహాయాన్ని అందించారు. పూలే రాసిన గ్రంథాల్లో బాగా ప్రసిద్ధమైన 'గులాంగిరి' (బానిసత్వం) ప్రచురణ చేసింది కూడా వెంకయ్యనే. సత్యశోధక్ సమాజ్ తోపాటు, పూలే ముంబాయి వేదికగా నడిపిన దీనబంధు పత్రికకు కూడా తెలుగుప్రజలు ఆర్థిక వనరులు సమకూర్చడం విశేషం. పూలేకు అతి ముఖ్యమైన అనుచరుడిగా చివరివరకు తోడుగా ఉన్న జాయా కారాడి లింగు కూడా తెలుగువాడే. గాంధీజీ కంటే ముందే వేలాదిమంది మధ్యలో మహాత్మా బిరుదును అందుకున్న జ్యోతిరావు గోవిందరావు పూలే. ఈయన రైతుల సమస్యలపై అవిశ్రాంతంగా పోరాడాడు. కార్మికనాయకుడు లోం ఖాడేతో కలిసి కార్మికులసమస్యలపై పోరాడాడు. థామస్ రచించిన 'మానవ హక్కులు' పుస్తకపఠనంతో పూలే ప్రభావితుడయ్యారు. అమెరికా స్వాతంత్ర్య పోరాటం, ఫ్రెంచ్ విప్లవం, జార్జ్ వాషింగ్టన్ జీవితచరిత్ర వంటి గ్రంథాలను పూలే అధ్యయనం చేశారు. భారతదేశములో కులం గురించిన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలి దార్శనికుడు పూలే. దేశమనే దేహానికి శూద్రులు ప్రాణం, రక్త నాళాల వంటివారు అని వెలుగెత్తిచెప్పారు. 170 సంవత్సరాల క్రితమే 'కుల వివక్ష'ను చీల్చి చెండాడిన యోధుడు పూలే. 'సామాజిక ప్రజాస్వామ్యం సాధించటమే భారత దేశానికి ప్రధాన లక్ష్యం కావాలని పోరాటం చేసిన సంస్కర్త. పూలేని స్ఫూర్తిగా తీసుకుని గురువుగా స్వీకరించిన డా అంబేద్కర్ ప్రపంచదేశాల్లో వివిధ అధ్యయనాలు చేసి ప్రపంచ మేధావిగా భారతదేశానికి రాజ్యంగాన్ని ప్రసాదించారు.

డాక్టర్ అంబేద్కర్ స్ఫూరికి కొనసాగింపునకు మాన్యవీర్ కాన్షిరాం అతిపెద్ద రాష్ట్రమయిన ఉత్తరప్రదేశ్‌కు ఒక దళిత మహిళను ముఖ్యమంత్రిని చేయగలిగారు. పెరియార్ రామస్వామి నాయకర్ ద్రవిడ ఉద్యమం ద్వారా తమిళనాట వెనకబడిన కులాలకు రాజ్యాధికారాన్ని సాధించగలి గారు. ఈ పరిణామాలను బహుజనులు గమనించి రాజ్యాధికార దిశగా పయనించాలి. అదే మనకోసం తమ జీవితాంతం పాటుపడిన పూలే దంపతులకు మనమిచ్చే నిజమైన నివాళి.



డా॥ దాసరి శ్యామ్ చంద్ర శేషు
(న్యాయవాది)
9505746555

ఈసీ ఆ సంస్కరణ చేస్తే...అద్భుతమే....,

- **ఎస్.సిహెచ్. వెంకటేష్,** ఎం.ఎ., ఎం.పిల్ - బెంగళూరు



టీఎన్ శేషన్ భారత ఎన్నికల ముఖ్య అధికారిగా బాధ్యతలు తీసుకున్న తర్వాతే...మన దేశంలో ఎన్నికల సంఘం అంటూ ఒకటుందని, దానికి విశేషమైన అధి కారాలున్నాయని తెలిసొచ్చింది. ఎందుకంటే టీఎన్ శేషన్ మాత్రమే ఎన్నికల సంఘం విశేష అధికారా లను సక్రమంగా వినియోగించి... ప్రజలకు స్వేచ్ఛా యుత ఓటు హక్కు కల్పించారు. ఆ తర్వాత వచ్చిన వాళ్లు... టీఎన్ శేషన్ అంత కాకపోయినా, ఆ ఒరవ డిని కొనసాగించారని చెప్పవచ్చు. తాజాగా చెన్నై ఐఐటీ వాళ్లతో కలిసి భారత ఎన్నికల సంఘం మరో అద్భు తమైన, విప్లవాత్మక మార్పునకు పరిశోధన చేస్తోంది. అదేంటంటే ఓటరు ఎక్కడున్నా తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఆన్‌లైన్‌లో ఓటింగ్ ప్రక్రియపై పరిశోధన చేస్తున్నట్టు ఇటీవల భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. నిజంగా ఇది కార్యరూపం దాలిస్తే మాత్రం అత్యున్నత భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓ గొప్ప మార్పు నకు శ్రీకారం చుట్టినట్టు అవుతుంది. ఇప్పటికే ఈవీఎంల వాడకంతో రిగ్గిం గ్ను బాగా అరికట్టకలిగారు. ఒకప్పుడు బ్యాలెట్ బాక్సులను ధ్వంసం చేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేయడం చాలా సర్వసాధారణ విషయంగా ఉండేది. దానికి అడ్డుకట్ట వేసే క్రమంలో ఈవీఎంలను ఎన్నికల ప్రక్రియ లోకి తీసుకొచ్చారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతిప క్షాలు పాలకపక్షంపై ఒక తీవ్రమైన ఆరోపణ చేస్తున్నాయి. అదేంటంటే అసలు ప్రతిపక్ష సభ్యుల నామినేషన్లను అడ్డుకుంటోందని, నామినేషన్ పత్రాలను చించివేస్తూ దౌర్జన్యాలకు తెగపడుతున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై కూడా ఎన్నికల సంఘం దృష్టి పెట్టాల్సి వుంది. ఎందుకంటే ఏ పార్టీ కూడా శాశ్వ తంగా అధికారంలో ఉండదు. వ్యవస్థలను మనం సంరక్షించుకుంటే...అవి ప్రజలను అన్ని వేళలా కాపా డుతాయి. ఈ క్రమంలో ఎన్నికల సంఘం నామి నేషన్ల ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో ప్రవేశ పెడితే... భారత ఎన్నికల వ్యవస్థలోనే ఓ సరికొత్త అధ్యాయా నికి శ్రీకారం చుట్టినట్టు అవుతుంది.

ఇప్పుడు ఎలాంటి పరీక్షలైనా, బ్యాంకుల్లో అకౌంట్ ఓపెన్ చేయాలన్నా ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించారు. అలాగే ఉద్యోగాలకు సైతం ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేసుకునే విధానం దేశ వ్యాప్తంగా ఉంది. అంతేకాకుండా హాల్ టికెట్లను కూడా నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్ లోడ్ చేసుకునే సులభ విధానం మన వ్యవస్థలో ఉంది. అలాంటప్పుడు దౌర్జన్యకారుల ఆగడాలను అరికట్టడానికి ఆన్‌లైన్‌లో నామినేషన్ విధానాన్ని ఎందుకు చేపట్టకూడదు. ఈ దిశగా ఎన్నికల సంఘం ఎందుకు సీరియస్‌గా ఆలోచించకూడదు? ఎన్నో సంస్కరణలకు పెట్టింది పేరైన మన ఎన్నికల సంఘం...అందులో భాగంగా మరో అడుగు ముందుకేసి ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేసేందుకు ఆలోచించాల్సిన తక్షణం అవసరం ఎంతైనా ఉంది.

ఇది కరోనా వైరాగ్యం

- కూర్మన చంద్రమోమన్, సీనియర్ జర్నలిస్ట్

ఎవరి చావుకైనా వెళ్లొచ్చినప్పుడు, ఏమిటీ పాడు జీవితం, బుద్బుద ప్రాయమే కదా, ఎప్పుడైనా వెళ్లిపోవాల్సిందే కదా, ఏం కట్టుకుపోతాం, ఈ చిన్న జీవితంలో ఎందుకిలా రాగద్వేషాల్లో పడి కొట్టుకుపోతున్నాం ఎక్స్‌ట్రా ఎక్స్‌ట్రా భావాలతో సతమతం కావడమే స్మశానవైరాగ్యం... కానీ ఆ వైరాగ్యం ఇంటికొచ్చి స్నానం చేసేసరికి సగం మందిలో మాయం అయిపోతుంది... మళ్లీ సేమ్..! అలాగే ప్రసూతివైరాగ్యం... ప్రతి ప్రసవం తల్లికి జీవన్మరణ పరీక్ష.. కాన్పు నొప్పులు భరిస్తూ మొత్తుకుంటుంది... ఆ సుఖం దేనికి, ఈ ప్రసవదుఖం దేనికి, ఏమిటీ పాడు బతుకు, ఏమిటీ పాపిష్టి జీవితం, మళ్లీ మొగడి పక్కలోకి వెళ్లేది లేదు అంటూ నానా ఒట్లూ పెట్టుకుంటుంది... తనకు తనే బోలెడు తిట్లు తింటుంది... ఇలా చాలా వైరాగ్యాలు...

వెరైటీ వైరాగ్యం ఒకప్పుడు... చచ్చిపోయినా బాగుండేది అన్నంతగా..! అప్పట్లో బెంగాల్ ఆకలిచావుల విషాదం... ఎందుకు పుట్టామురా అన్నంతగా..! మధ్యలో స్కైలాబ్ వైరాగ్యం... ఎటూ ముగిసిపోయే బతుక్కి మిగిలినరోజులే పండుగ అన్నట్టు తాగుడు, తినుడు... ఎన్నాళ్లుగానో లోలోపల అణుచుకున్న కోరికలన్నీ తీర్చుకునుడు... మనిషికి అకస్మాత్తుగా వచ్చే కష్టాల్లో, భయాలో తనకు ఆత్మస్పృహ కలిగించే వైరాగ్యాలవుతాయి ఇలా... కానీ ఏ వైరాగ్యంపైనా స్థిరంగా నిలబడనివ్వదు మనిషి జీవితం... నాలుగు రోజులకే మళ్లీ మామూలు మనిషిని చేస్తుంది... యథాపూర్వ జీవితం... సో, వైరాగ్యం ఓ మాయ...

కానీ ఈసారి ఎందుకో చాలా తేడా కొడుతున్నది... కరోనా వైరాగ్యం చాలామంది మనుషుల్లో స్పష్టంగా కనిపిస్తున్నది కానీ భిన్నంగా... కరోనా తాలుకు భయం, నిస్పృహ, వైరాగ్యం కరోనా వ్యాధి వ్యాప్తికన్నా వేగంగా వ్యాపిస్తున్నది... ఓ ఆత్మమథనం సాగుతున్నది చాలామందిలో... ఏమో, కరోనా ఇంకొన్నాళ్లు ఇలాగే భయపెడితే, మరింత నష్టాలపాలు చేస్తే మనుషుల ఆలోచన విధానాల్నే సమూలంగా మారిపోతుందేమో అన్నంతగా... ఇన్నేళ్లలో ఏ దేవుడూ, ఏ మతమూ మనిషికి కరోనా స్థాయిలో ఆత్మప్రబోధాన్ని వినిపించలేదేమో...

రాజకుమారుడు చార్లెస్... బ్రిటన్ ప్రధాని... కెనడా ప్రధాని భార్య... పోప్ భవనం... ఇటలీలో బోలెదు మంది పూజారులు... ఇరాన్‌లో మతప్రచారకులు... మూతపడిన దేవుళ్ల గుళ్లు... ప్రపంచంలో ఎవరూ భద్రంగా లేరు... ఆఫ్టరాల్ మనమెంత..? కరోనా మరింత విలయతాండవం చేస్తే ఎన్ని బతుకులు ఇంకా ఎన్ని రోజులు..? పెరుగుతున్న ఈ ఫీలింగ్స్ ఒకతరం ఆలోచన విధానాల్ని గణనీయంగా మార్చబోతున్నాయా..

ఒకాయన... బాగా సంపాదించాడు... అది సంపాదించటానికి నోరు కట్టేసుకున్నాడు, అవసరాలు కత్తిరించుకున్నాడు, నానా మోసాలూ చేశాడు... కోట్లకుకోట్లు బ్యాంకుల్లో, ప్లాట్లల్లో, షేర్లల్లో... అకస్మాత్తుగా కరోనా వార్తలు తన బుర్రను పూర్తిగా తినేశాయి... అన్నీ వదిలేశాడు... ఊరికి బయల్దేరాడు... రెండు డ్రెస్సులు, రెండు డెబిట్ కార్డులు... అంతే... ఎప్పుడో చిన్నప్పుడు తను పుట్టి, పెరిగిన సొంతూరులోని పూర్వీకుల ఇంటిని అలాగే ఉంచుకున్నాడు... అక్కడ చేరాడు... పిల్లలు ఎలాగూ ఇక్కడ లేరు, వేరే దేశాల్లో ఉన్నారు... తనకేమో వయస్సెక్కువ, సుగర్ ఉంది, బీపీ ఉంది, ఆ నగరంలో ఉంటే కరోనా సోకితే... ఒంటరిగా కూర్చుని, గాలిలోకి చూస్తూ, తన ఇన్నేళ్ల జీవితాన్ని రీఆడిట్ చేసుకుంటున్నాడు...

చిన్న ఉదాహరణ ఇది అంతే... అరె, ఇన్నేళ్లూ నచ్చిన పని చేయలేకపోయానే... అరెరె, ఇన్నాళ్లూ కూడబెట్టడంలో పడి నా బతుకు సుఖాల్నే విస్మరించానే... అబ్బా, కెరీర్ కోసం అన్నీ చంపుకుని బాసుల బూట్లు నాకానే... ఛీఛీ, నాలుగు డబ్బుల కోసం అంత కక్కుర్తి పనులు చేశానే... అకస్మాత్తుగా తనే పోతే....? ఇదుగో, ఇలాంటి ఆత్మ మథనాలు చాలా సాగుతున్నయ్... విచిత్రం ఏమిటంటే... తమ ఫీలింగ్స్ షేర్ చేసుకుంటున్నారు... దాచుకోవడం లేదు... కరోనా వైరాగ్యభావనలు వ్యాపిస్తున్నయ్... పాత దోస్తులకు ఫోన్లు చేస్తున్నారు... ఏవో పంచాయితీలతో దూరం పెట్టిన వారినీ పలకరిస్తున్నారు... కీచులాడిన చుట్టాలతో మాట్లాడుతున్నారు... ఏదో జరుగుతున్నది...

కానీ ఇదీ తాత్కాలిక వైరాగ్యమే... చాలారోజులు ఉండదు... సుఖలాలస, రాగద్వేషాలు, స్వార్థం ఎక్స్‌ట్రా మనిషి సహజలక్షణం... దాన్ని దాటేసేంత స్థితప్రజ్ఞత మామూలు మనుషులకు సాధ్యం కాదు... కానీ ఇప్పుడు మనుషుల్లో వినిపిస్తున్న ఈ వైరాగ్యభావనలు ఎంతోకొంత మనుషుల ఆలోచన రీతుల్ని ప్రభావితం మాత్రం చేస్తుంది... అదెలా ఉంటుందో అంచనా వేయడం ఇప్పుడెవరికీ సాధ్యం కాదు... కరోనా విలయం ఇంకెన్నాళ్లు అనే ప్రశ్నకు జవాబు లేనట్టుగానే..!!



భారతదేశంలో పోలీ కల్చర్ విధానం

మిశ్రమ చేపల పెంపకం



నాన్‌వెజ్ తినే ప్రతి ఒక్కరికి ఇష్టమైన ఆహారం ఫిష్. పేదలు సైతం ఇష్టంగా తినే చేప కొన్ని రకాలే అందుబాటులో వున్నాయి. ధనిక వర్గాలు ఎక్కువగా తినే కొన్ని రకాల చేపలు ధరలు అందనంత ఎత్తున ఎగురుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పేద ప్రజలు చేపలను ముఖ్య ప్రోటీన్లగా ఉప యోగిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు చేపలను ఒక ముఖ్య పౌష్టికాహారంగా తీసుకుంటున్నారు. చేపలలో పోషకాలు మరియు సూక్ష్మపోషకాలు లభించును. ఇవి మానసిక మరియు శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతాయి. ప్రపం చంలో భారత దేశం చేపల పెంపకంలో మూడవ స్థానంలో ఉంది. మరియు ఆక్వాకల్చర్ పరంగా రెండవ స్థానంలో ఉంది. ఆక్వా కల్చర్ పెంపకం ద్వారా 7% చేపలను ఉత్పత్తి చేయడంలో ఉపయోగపడుతోంది. భారతదేశం 17 మెగా బయోడైవర్సిటీ ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటిగా పేరుపొందింది మరియు గ్లోబల్ ఫిష్ బయోడైవర్సిటీగా 10% కృషి చేసింది. దాదాపు 14 మిలియన్ల ప్రజలు మత్స్య వ్యాపారాల్లో లేదా దాని సంబంధిత ఇతర వ్యాపారాల్లో పనిచేస్తు న్నారు. పశ్చిమ బెంగాల్ 29% చేపల ఉత్పత్తితో ప్రథమ స్థానంలో నిలువగా ఆంధ్రప్రదేశ్ మరియు బీహార్ తదితర స్థానాల్లో నిలచాయి. 2017-18 నాటికి అంచనా ప్రకారం చేపల పెంపకం 12-60 మిలియన్ మెట్రిక్ టన్నులు దాదాపుగా 70% భూగోళం ప్రకారం మరియు 50% చేపల పెంపకం ద్వారా ఉత్పత్తి అవుతున్నాయి. చేపల పంపకంలో ఎన్నో పథకాలు ఉన్నాయి. వీటిలో మోలో కల్చర్ మరియు పాలీకల్చర్ పద్ధతులు చేపల పెంపకంలో ఉపయోగపడతాయి.

పాలీకల్చర్ : మోనోకల్చర్ కంటే పాలీకల్చర్ పద్ధతి 8-9 రెట్లు ఎంతో సమర్ధవంతమైనది. పాలీకల్చర్ లేదా కాంపోసిట్ కల్చర్ లేదా మిక్స్‌డ్ ఫార్మింగ్‌లో ఒక జాతికంటే ఎక్కువ జాతుల చేపలను పెంచవచ్చు. ఒకే సమయంలో ఒకటే పొలంలో అనేక జాతుల జలజీవులను ఉత్పత్తి చేయవచ్చు. ఒక యూనిట్ ఎకరంలో ఈ పాలీకల్చర్ గరిష్టస్థాయిలో చేపల పెంపకాన్ని చేయవచ్చు. ఒకే చెరువులో స్పేషియల్ ట్రాపిక్ లేదా పరిపరి విధాలుగా పద్ధతులు ఉపయోగపడతాయి. ఒకే చెరువులో వివిధరకాల చేపలను ఉత్పత్తి చేయడంవల్ల వివిధరకాల ఆహార పద్ధతులు ద్వారా సహజ ఆహార ఉత్పత్తి అందుబాటులో ఉండును.

4000 సం॥ల క్రితం చైనాలో పాలీకల్చర్ మొదలైంది. ఈ పద్ధతి సౌత్ఈస్ట్ ఏషియా వరకు వ్యాప్తి చెందింది. మరియు ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో కూడా వ్యాప్తి చెందింది. ఒక యూనిట్ ఎకరంలో మోనోకల్చర్ కంటే పాలీకల్చర్ పద్ధతి ద్వారా ఎన్నో రెట్లు ఎక్కువ చేపలను పెంచగలరు.

1971లో ICAR సంస్థ All India co-ordinated Research Project ద్వారా భారతదేశంలో చేపల పెంప కాన్ని ఆవిష్కరించింది మరియు వలస చేపలు అనుకూ లమైన వాతావరణంలో మన దేశంలో ఒక కేంద్రంగా 6 రాష్ట్రాలు చేపల పెంపకంకు ఉపయోగపడుతున్నాయి. అవి ఏమనగా, ఆంధ్రప్రదేశ్, హర్యానా, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళంలో, కర్నూలు జిల్లాలో నూతనంగా ఆవిష్కరించిన పాలికల్చర్ పద్ధతిని పాటిస్తున్నారు. కొల్లేరు సరస్సులో 2-4 మీటర్ల లోతులో చెరువుల పెంపకంలో 1-40 హెక్టార్ల స్థలంలో వరి పంటల చుట్టు త్రవ్వి పెంచే విధానం 1980 నాటి నుంచి మొదలైంది. ఇందులో వివిధ రకాలు దేశీయ మరియు అంతర్జాతీయ చేపలను పెంచుతున్నారు. ఇందులో పెంచేవి, కట్లా - కట్లా (బొచ్చా). లేబియో రోహు (రోహు), మ్రిగల్ (ఆర్జు) చేపలు.

అర్జు (దిగువ భక్షకులు, నశించిన మొక్కలను జీవులను తింటాయి)

సిప్రినస్ కార్పియో (సర్వ భక్షకుల మరియు మేతరు, మొక్కలను, జీవులను తింటాయి)

టినోప్యారింగోడాన్ ఐడెల్లా గ్ర్యాస్ కార్ప్ (ముతక స్థూల వృక్ష సంపదను తింటాయి)


హైపోతలామిక్తిస్ మెలిట్రిక్స్ - సిల్వర్ కార్ప్ (ఫైటో ప్లాంక్టన్‌ను తింటాయి).

ఈ ఆరు రకాల చేపలను ఉపయోగించి. వీటిలో ఆరు రకాల చేపల జాతులను లేదా నాలుగు రకాల చేపల జాతులను లేదా మూడు రకాల చేపల జాతులను పాలీకల్చర్ ద్వారా ఉత్పత్తి చేస్తారు. మన దేశంలో దేశీయ ప్రధాన కార్ప్స్ సగటు దిగుబడి సం॥ రానికి 4000 కేజి / హెక్టారు మరియు అన్యదేశ కార్ప్స్ సగటు దిగుబడి సంత్సరానికి 3000 కేజీలు హెక్టారుగా నమోదుచేయబడింది. మొత్తం రెండు అనగా దేశీయ ప్రధాన కార్ప్స్ మరియు అన్యదేశ కార్ప్స్ సగటు దిగుబడి సం॥రానికి దాదాపు 8000 నుండి 11000 కేజీలు / హెక్టారుగా నమోదు చేయబడింది. పైన చేప జాతులతో సహా అనేక చేపలు ప్రిడేటరీ క్యాట్ ఫిష్ మరియు ఎర్ర మొట్ట చేపలను కూడా పాలీ కల్చర్‌లో పెంచుతారు పాలీకల్చర్ ఎంతో మెరుగైన పద్ధతిలో అందుబాటులో ఉన్న సహజ ఆహారానిన ఉపయోగించి చేపలను పెంచి లాభాలను చేకూరుతున్నప్పటికీ ఎంతో కష్టతరంగా మారుతుంది. వేర్వేరు తిండి భక్షించే వేర్వేరు చేపలను సాగుచేస్తున్నప్పుడు ఇది కష్టంగా ఉంటుంది. భారతదేశంలో పాలికల్చర్ ఎంతో సజావుగా సాగుతున్నప్పటికీ అనేక బ్యాక్టీరియల్ మరియు ఆరాసైటిక్ వ్యాదులు చేపలను నాశనం చేస్తున్నాయి. అవి ఏమనగా, రెడ్ డిసీస్, ఆర్గులోసిస్, మోనో జీనియస్ ఇన్ఫెక్షన్స్ (డ్యాక్టైలోగైరోసిస్). ఈ వ్యాధులను చేపల చిన్న వయస్సులోనే అరికట్టకపోతే చేపల మరణాలు ఎక్కువగా నమోదుఅవుతాయి.



Dr. V.Anu Prasanna,
M.Sc., Ph.D
Assistant Professor, Head of the Department,
Department of Zoology,
Yogi Vemana University,
YSR Kadapa, A.P

స్థానిక పోరు వాయిదా!



- ఎస్.సిహెచ్.వెంకటేష్

కరోనా పేరు చెప్పి స్థానిక ఎన్నికల్ని ఆరు వారాలపాటు వాయిదా వేసింది ఎన్నికల సంఘం. నిజానికి మంచి నిర్ణయమే... ప్రపంచాన్ని వణికిస్తున్న కరోరా మరింత వ్యాప్తి చెందుతున్నవేళ ఊరేగింపులు, సభలు, ప్రచారాలు, జనసందోహాలు రిస్కియే కాబట్టి ఒక కోణంలో మెచ్చదగిన నిర్ణయమే... కానీ ఓ రేంజ్ ఊపులో చెలరేగిపోతున్న వైసీపీపై నీళ్లు గుమ్మరించినట్టయింది... వైసీపీ ధాటికి దిక్కులు చూస్తూ అచేతనంగా నిలబడిపోయిన చంద్రబాబు క్యాంపుపై పాల వర్షం కురిపించినట్టయింది... సో, కాగల కార్యం ఇక్కడ కరోనా తీర్చింది... ప్రస్తుతానికి చంద్రబాబుకు ఒకింత ఊపిరి పీల్చుకునే వెసులుబాటు దక్కింది...

నిజానికి ఆరు వారాలు వాయిదా అనేది పెద్ద విషయమేమీ కాదు... ఆల్ రెడీ నోటిఫికేషన్లు జారీచేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పురపాలక ఎన్నికలేమో వాయిదా వేశారు... షెడ్యూల్ ప్రకటించిన పంచాయతీ ఎన్నికల్ని అభయెన్స్‌లో పెట్టేశారు... ఇప్పటివరకూ జరిగిన ప్రక్రియ... అనగా పోటీదారులు, ఏకగ్రీవాలు ఎక్సెట్రా యథాతథంగా ఉంటయ్... ఎక్కడ ఆగిందో అక్కడ నుంచే తిరిగి స్టార్ట్ చేస్తారు... ఈ ఆరు వారాల్లో పెద్దగా ఏ పార్టీకి కొత్తగా వచ్చే నష్టం, లాభం ఏమీ ఉండకపోవచ్చు కానీ జగన్ సర్కారుకు ఓ దిగులు పట్టుకుంది...

సకాలంలో స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్రం నుంచి రావల్సిన 5 వేల కోట్ల రూపాయలు రాకుండా పోతయ్... వాటి కోసమే ఇంత అర్జెంటుగా ఎన్నికలకు సిద్ధపడింది... మరి ఇప్పుడు మార్చి 31 లోపు ఎన్నికలు నిర్వహించలేకపోతున్నందున ఆ 5 వేల కోట్ల సంగతేమిటనేది ప్రశ్నార్థకం... నిజానికి కేంద్రం కరోనాను విపత్తుగా ప్రకటించింది... విపత్తుల సందర్భాలలో తీసుకునే నిర్ణయాల్ని కేంద్రం గౌరవించాల్సి ఉంటుంది... గతంలో ఓ కేసులో సుప్రీంకోర్టే విపత్తుల వేళ ఎన్నికల్ని వాయిదా వేయొచ్చునని చెప్పింది... సో, 5 వేల కోట్లకు ఏ ఢోకా ఉండకపోవచ్చు, ఎందుకంటే ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం తప్పు ఏమీ లేదు కాబట్టి..!

మరో విషయం ఇక్కడ ప్రస్తావనార్హం...

చూశారు కదా... ఏపీలో జరిగే ఏ పరిణామానికైనా సరే, తెలంగాణ, ప్రత్యేకించి హైదరాబాదు సెటిలర్లను ముందు పెడుతున్నారు... నెలాఖరు వరకూ ఏపీలో ఎన్నికలు జరుగుతున్నయ్ కాబట్టి, రెండు దశల్లో రూరల్ వోటరు నాలుగు ఓట్లు వేయాలి కాబట్టి ఇక తెలంగాణ నుంచి జనం భారీగా ఏపీకి వస్తారట... అందుకని కరోనా వ్యాప్తి పెరుగుతుందనే అంచనాలతో ఏపీలో ఎన్నికల్ని వాయిదా వేశారట... పరమ ఛండాలంగా ఉంది ఈ సమర్థన, ఈ వాదన...

1) ఇప్పటికీ అంత భారీ సంఖ్యలో ఏపీ, తెలంగాణలో డ్యుయల్ ఓటింగు హక్కులు ఉన్నా సరే, దాన్ని రెండు రాష్ట్రాల ఎన్నికల సంఘాలు చక్కదిద్దలేకపోయాయి... అదీ ఎన్నికల సంఘమే అంగీకరిస్తున్నది... 2) అసలు స్థానికంగా ఉండని ఓటర్లు మీ జాబితాలో ఎలా ఉన్నారయ్యా మహాశయా..? హైదరాబాద్‌లో, తెలంగాణ ఇతర జిల్లాల్లో ఉండేవాళ్లు ఆయా ప్రాంతాల స్థానిక ఓటర్లు అవుతారు... ఏపీ జాబితాల్లోనూ ఎలా ఉంటారు..? ఎందుకు ఉండాలి..? వాళ్లు వచ్చిపోయే వెసులుబాటును ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోవడం ఏమిటి..? 3) ఏపీలో ఓటు హక్కు ఉండి, పొరుగు రాష్ట్రాల్లో పనులు చేసుకునే వారి గురించి ఎన్నికల సంఘం ఆలోచించాలి కదా అంటారా..? ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం ఎలా వెళ్లాలి, అసలు వెళ్లాలా వద్దా, రెండుసార్లు వెళ్లాలా అనే నిర్ణయం ఓటర్లది... స్థానికంగా ఉండక, ఎక్కడెక్కడో ఉండే ఓటర్ల గురించి కాదు, ఎన్నికల సంఘం ఫస్ట్ ప్రయారిటీ స్థానిక ఓటర్ల గురించే.! 4) తెలంగాణలో మాత్రమే కరోనా అధికంగా ఉండి, ఎన్నికల వేళ ఏపీకి మోసుకొస్తారా..? ఇదెక్కడి వాదన..? ఏపీలో అనుమానితులు ఎవరూ క్వారంటైన్‌లో లేరా..? ఏపీ ఏమైనా సేఫ్ జోన్‌లో ఉందా..? తెలంగాణ సెటిలర్లు వస్తేనే డిస్టర్బ్ అవుతుందా..? కరోనా వ్యాప్తి భయంతో ఎన్నికల వాయిదా అనేవరకూ వోకే... కానీ ఇక్కడా తెలంగాణ సెటిలర్లనే ముందుపెట్టి నిర్ణయాల్ని ప్రకటించడం దేనికి..?

ఇదేసమయంలో ఎన్నికల సంఘం లేటుగానైనా, ప్రకటించిన కొన్ని నిర్ణయాలు కరెక్టు... చిత్తూరు జిల్లా, గుంటూరు జిల్లా ఎస్పీ, కలెక్టర్లను ఎన్నికల విధుల నుంచి తప్పించడం... గుంటూరు జిల్లా మాచర్ల సి.ఐ సస్పెన్షన్... శ్రీకాళహస్తి, పలమనేరు డిఎస్పీల బదిలీ... తిరుపతి, రాయదుర్గం, తాడిపత్రి సి.ఐ లపై బదిలీ వేటు... తిరుపతి, మాచర్ల, పుంగనూరులలో అవసరం ఐతే, కొత్త షెడ్యూల్ విడుదలకు రెడీ... ఇలాంటివి... ఎటొచ్చీ ఎన్నికల వాయిదాకు పొరుగు రాష్ట్రాల స్థితిగతులను చూపడమొక్కటే బాగాలేదు...

***

మీడియా పై కరోనా కాటు

- ఆర్. శ్రీనివాసరావు,

మీడియాకు ఎదురుదెబ్బలు కొత్తకాదు. అయితే ఎన్ని కఠిన పరీక్షలు ఎదురైనా నిలదొక్కుకున్నాయి కొన్ని మీడియా సంస్థలు. అయితే ఈసారి వాటికి తగిలిన దెబ్బ అలాంటిలాంటిది కాదు. దశాబ్దాల్లోనే ఇప్పటివరకు చవిచూడని అనుభవాల్ని అవి చూస్తున్నాయి. దీంతో పలు మీడియా సంస్థల్లో ఉద్యోగాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. తెల్లారితే ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో తెలియని అయోమయ పరిస్థితి.



సాధారణంగా ప్రతి మీడియా సంస్థ అడ్వర్టయిజ్ మెంట్లపైనే ఆధారపడి ఉంటుంది. వాటికి ప్రధాన వనరు అది. సరిగ్గా ఇక్కడే కరోనా కాటేసింది. దేశవ్యాప్తంగా లాక్ డౌన్ ప్రకటించడం, అన్ని వాణిజ్య సంస్థలు మూతపడ్డంతో యాడ్స్ తగ్గి, మీడియా సంస్థల రెవెన్యూ పూర్తిగా పడిపోయింది. పత్రికలు, ఛానెళ్లకు ప్రభుత్వం నుంచి యాడ్స్ ఎప్పుడో తగ్గిపోయాయి. కాబట్టి ఆ దిశగా కూడా మీడియాకు ఆశల్లేవు.

ముందుగా ప్రింట్ మీడియా విషయానికొద్దాం.. అన్ని రంగాల్లానే ఈ కరోనా టైమ్ లో ప్రింట్ మీడియా కూడా అతలాకుతలమైంది. ఇప్పటికే పత్రికలన్నీ జిల్లా ఎడిషన్లు తగ్గించేశాయి. ఇది చాలదన్నట్టు జిల్లాల్లో పనిచేస్తున్న సబ్-ఎడిటర్లను ఇంటికి సాగనంపే ప్రక్రియను కూడా ప్రారంభించాయి. జిల్లా డెస్క్ స్థాయిలో పనితీరు ఆధారంగా జాబితా ఇవ్వాలని, టాబ్లాయిడ్ డెస్క్ ఇంచార్జీలకు సమాచారం అందింది. ఆ జాబితా ప్రకారం కనీసం 50శాతం మెన్-పవర్ తగ్గించాలని చూస్తున్నాయి పత్రికలన్నీ. సాక్షి యాజమాన్యం 30శాతం వరకు భారాన్ని తగ్గించుకునే దిశగా ఆలోచన చేస్తుంటే.. ఆంధ్రజ్యోతి యాజమాన్యం దాదాపు 50శాతం వరకు ఉద్యోగుల్ని తగ్గించుకునే పనిలో పడింది. కేవలం డెస్క్ మాత్రమే కాకుండా, మార్కెటింగ్-అడ్వర్టైజ్ మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు తగ్గించబోతోంది. ఇక సర్కులేషన్ పరంగా నంబర్ వన్ లో ఉన్న ఈనాడు కూడా ఈ దిశగా పొదుపు చర్యలు పాటించింది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కంట్రిబ్యూటర్లు అందరికీ కరోనా మినహా, ఇతర వార్తలేవీ పంపించొద్దనే సమాచారాన్ని అందజేసింది. వార్తకు ఇంత మొత్తం అనే పద్ధతిలో కంట్రిబ్యూటర్లు నెలవారీ జీతం అందుకుంటారు. ఇతర వార్తలేవీ ప్రచురితం కాకపోవడంతో వాళ్లకు ఇప్పుడు ఒక్కసారిగా జీతం తగ్గిపోయింది.

పత్రికలన్నీ ఇప్పుడిప్పుడే కాస్ట్ కటింగ్ పై ఆలోచన చేస్తుంటే.. నవ తెలంగాణ అనే పత్రికైతే ఏకంగా దాన్ని అమలు చేసింది. ఇప్పటికే 50శాతం మందిని తొలిగించిన ఆ పత్రిక.. తెలంగాణలో కొత్త జిల్లాల కోసం ఏర్పాటుచేసిన జర్నలిస్టులందర్నీ తీసేసి పాత జిల్లాల స్టాఫ్ రిపోర్టర్లను మాత్రమే కొనసాగించాలని నిర్ణయించుకుంది. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో నడిచే నమస్తే తెలంగాణ సైతం కాస్ట్ కటింగ్ దిశగా ఆలోచన చేస్తోంది. కొన్ని ఫీచర్స్ ఎత్తేసి, ఆ మేరకు ఉద్యోగుల్ని వదిలించుకోవాలని చూస్తున్నట్టు సమాచారం. ఇక ఇంగ్లిష్ పేపర్లు డెక్కన్ క్రానికల్, ఇండియన్ ఎక్స్ ప్రెస్ అయితే ఆల్రెడీ జీతాల్లో కోతలు విధించిన సంగతి తెలిసిందే.

ఇక న్యూస్ ఛానెల్స్ విషయానికొస్తే.. వీటి పరిస్థితి మరింత దుర్భరం. మామూలు టైమ్ లోనే ఇవి నష్టాల్లో నడుస్తుంటాయి. అలాంటిది కరోనా కాటుకు ఇవి విలవిల్లాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ కేంద్రంగా నడిచే AP 24X7 అనే ఛానల్ ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో ఉంది. ఆమధ్య ఈ ఛానల్ నుంచి ఏకంగా ఛైర్మన్ తప్పుకోవడంతో పాటు, పలు అభియోగాలు చేశారు. ఛానల్ ఆర్థిక పరిస్థితిని కళ్లకు కడుతూ బహిరంగ లేఖ విడుదల చేశారు. ఇప్పుడు కరోనా రాకతో ఆ ఛానల్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

గత ప్రభుత్వం హయాంలో నిధుల కొరత లేకుండా సాగిన మరో ఛానల్ పరిస్థితి కూడా ఇప్పుడు గందరగోళంలో పడింది. దాదాపు ఏడాదిగా ఈ ఛానల్ ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. జిల్లా స్టాఫర్లకు ఇది పేమెంట్స్ ఇవ్వడం ఎప్పుడో ఆపేసింది. యాడ్స్ తీసుకొచ్చిన రిపోర్టర్ కు అందులో కమీషన్ ఇస్తుంది. అదే జీతం అనుకోవాలి. ఆ టైపులో నడుస్తున్న ఈ ఛానల్ ఇప్పుడు కరోనా దెబ్బతో దాదాపు లాక్-అవుట్ స్టేజ్ కు వచ్చేసింది. డెస్క్ లో ప్రస్తుతం 10 మందితో 3 షిప్టుల్లో ఈ ఛానల్ పనిచేస్తోందంటే పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు. ఓ ఎన్నారై పెట్టిన మరో చిన్న న్యూస్ ఛానల్ పరిస్థితి కూడా ప్రస్తుతం ఇలానే ఉంది.

టాప్ ఛానల్స్ గా పేరున్న మరికొన్ని న్యూస్ ఛానల్స్ కూడా ఇప్పుడు ఆలోచనలో పడ్డాయి. ఇద్దరు బడా వ్యాపారవేత్తలు కలిసి ఆమధ్య 2 ఛానల్స్ కొనుగోలు చేశారు. వాటిలో ఒక ఛానల్ ను ఇప్పుడు వదిలించుకునే ఆలోచనలో ఆ యాజమాన్యం ఉంది. ఇక అత్యధికంగా మెన్-పవర్ కలిగి ఉన్న ఎన్టీవీ, ఈటీవీ-2 ఛానల్స్ కూడా ఆలోచనలో పడ్డాయి. ఇవి ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నాయనేది ప్రస్తుతానికి బయటకురాలేదు. అటు తెలుగుదేశం పార్టీ సపోర్టర్స్ గా పేరుతెచ్చుకున్న మరో 2 ఛానల్స్ మాత్రం ఉద్యోగుల్ని తొలిగించడానికే నిర్ణయించుకున్నాయి.. తద్వారా ఆర్థికభారాన్ని తగ్గించుకునేందుకు ప్లాన్ చేస్తున్నాయి.

మొత్తంగా కరోనా రాకతో మీడియా రంగం అతలాకుతలం అయింది. నేషనల్ ఛానల్స్ నుంచి గల్లీ స్థాయి పేపర్ వరకు ప్రతి సంస్థపై కరోనా దెబ్బ గట్టిగా పడింది. చూస్తుంటే, రాబోయే రోజుల్లో చాలా ఛానెళ్లు చేతులు మారేలా కనిపిస్తున్నాయి.

సౌదీ యువరాజు ఆయిల్ జూదం

- కె.వి.రమణ, ఎం.ఎ.,బి.ఇడి

సౌదీ అరేబియా పాలన యిప్పటివరకు సోదరుల మధ్యనే సాగుతూ వచ్చింది. రాచకుటుంబంలోని ముఖ్యులందరికీ ఏదో ఒక ప్రభుత్వ పదవి కట్టబెట్టడంతో వాటి ద్వారా ప్రభుత్వనిధులను తమకు కావలసినవారికి పంచుకునే వెసులుబాటు ఉండడంతో అందరూ ఖుషీగానే ఉంటూ వచ్చారు. పైగా అధికారాలన్నీ రాజు చేతిలో ఉండేవి కావు. 'ఫస్ట్ ఎమాంగ్ ఈక్వల్స్' (సమానుల్లో ప్రథముడు) అనే సిద్ధాంతానికి కట్టుబడి, అందర్నీ సంప్రదించి మెజారిటీ అభిప్రాయాన్ని అనుసరించి మెలగేవాడు. అందుకే యిన్నేళ్లూ సౌదీ అరేబియాలో కుట్రలు జరగలేదు.

అయితే ప్రస్తుత రాజు సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ 2015లో గద్దె నెక్కిన దగ్గర్నుంచి పద్ధతి మారిపోయింది. అందుకే అసంతృప్తి ఎక్కువవుతోంది. ఇతను గద్దె నెక్కేనాటికి మహమ్మద్ బిన్ నయీఫ్ అనే అతని అన్న కొడుకు యువరాజుగా, హోం మంత్రి (ఇంటీరియర్ మినిస్టర్)గా వుండేవాడు. ఇతను అతన్ని తీసేసి తన కొడుకు మహమ్మద్ బిన్ సల్మాన్‌ను 2017 జూన్‌లో యువరాజుగా, డిఫెన్స్ మంత్రిగా, ఉపప్రధానిగా, ఎకనమిక్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమించాడు. ధృతరాష్ట్రుడు దుర్యోధనుడికి సర్వాధికారాలు కట్టబెట్టినట్లు కొడుక్కి పూర్తి అధికారాలు యిచ్చేశాడు.

నిజానికి ప్రస్తుత రాజు తర్వాత జీవించి వున్న అతని సొంత సోదరుడు అహ్మద్ బిన్ అబ్దుల్ అజీజ్ రాజు కావాలి. ఇప్పుడు యువరాజు సల్మాన్‌కి అతనిపై కన్ను ఉంది. అతన్ని ఎలాగైనా తప్పించేసి, తనే రాజు అయిపోవాలని యితని ఆశ. తనకు అధికారం దక్కగానే 2017 నవంబరులో అవినీతిపై, మనీలాండరింగ్‌పై పోరాటం పేరుతో 40 మంది రాచబంధువులను ఖైదు చేశాడు. వారిలో మాజీ యువరాజు మహమ్మద్ నయీఫ్ ఒకడు.

పాత రాజు అబ్దుల్లాకు దన్నుగా నిలిచిన వ్యాపారస్తులను, మంత్రులను, దాయాదులను మొత్తం 500 మందిపై విచారణ జరిపించి, వారి బ్యాంకు ఖాతాలు స్తంభింపచేసి, 800 బిలియన్ డాలర్ల ఆస్తులను ఎటాచ్ చేసి, యిబ్బంది పెట్టాడు. చివరకు 2019 జనవరిలో అవినీతినిరోధక కమిటీ వర్క్ పూర్తయిందని ప్రకటించింది. 381 మంది వ్యక్తుల నుండి 107 బిలియన్ డాలర్లు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు చేర్చారు. ఇదంతా తనకు ఎదురు లేకుండా చేసుకోవడానికి చేసిన కుట్రే అని అందరి అనుమానం.

ఇప్పుడు మార్చి 6న మళ్లీ రాజుగారిపై కుట్ర అంటూ కొందరిని ఒక హోటల్లో బంధించినట్లు వార్తలు వచ్చాయి. ప్రభుత్వం వాటిని ధృవీకరించలేదు, నిరాకరించలేదు. ఈ సారి బందీలైన వారిలో భవిష్యత్తులో రాజు కావలసిన అహ్మద్ బిన్ అబ్దుల్, అతని కుమారుడు నయీఫ్ బిన్ అహ్మద్, మాజీ యువరాజు మహమ్మద్ బిన్ నయీఫ్ ఉన్నారట. తన సోదరుణ్ని, సోదరుల కొడుకులను బందీలుగా చేయడానికి రాజు ఎందుకు ఒప్పుకున్నాడు అనేదే యింకా అర్థం కావటం లేదు.

కరోనా భయంతో మక్కాలోని గ్రాండ్ మసీదు మూసివేయడాన్ని అహ్మద్ ఎద్దేవా చేశారని, ఆ విషయం యువరాజు వెళ్లి చెప్పడంతో రాజుకి కోపం వచ్చి ఆదేశాలు యిచ్చాడని అంటున్నారు. అతను గతంలోనే యెమెన్‌పై తండ్రీకొడుకులు చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకించాడని అంటారు. వ్యాఖ్యలు చేస్తే కుట్ర అయిపోతుందా?

అసలు సంగతేమిటంటే అహ్మద్, నయీఫ్ యిద్దరూ గతంలో హోం మంత్రులుగా పని చేసినప్పుడు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పరచారు. తాము భవిష్యత్తులో రాజులైనప్పుడు తిరుగుబాట్లు జరిగితే ముందే కనిపెట్టేందుకు నిఘా వ్యవస్థలు ఏర్పాటు చేశారు. అవి యిప్పుడు యువరాజు సల్మాన్‌కు



యిబ్బందిగా పరిణమించాయి. జర్నలిస్టు ఖషోగ్గిని చంపిస్తే ఆ విషయం బయటకు వచ్చేసింది. దాన్ని యితరులపై నెట్టేసి ఏదో కాలక్షేపం చేశాడు కానీ రాచకుటుంబం అతనిపై గుర్రుగా వుండడంతో ఒక ఏడాది పాటు తగ్గి వున్నాడు. ప్రజలకు నచ్చిన సంస్కరణలను కొన్ని ప్రవేశపెట్టి వాళ్ల అభిమానంతో లాక్కు వద్దామని చూస్తున్నాడు.

ఇప్పుడు ఆయిల్ విషయంలో దేశ ఆర్థిక వ్యవస్థతో ఒక ప్రయోగం చేద్దామనుకుంటున్నాడు. అది బెడిసికొడితే ప్రజల్లో అసంతృప్తి కలిగి, తిరుగుబాటు రావచ్చు, తనకు తన విరోధులుగా ఉన్న బలమైన రాచబంధువులు దానికి మద్దతు యివ్వవచ్చు. అది జరగకుండా చూడాలంటే ముందు వాళ్లని నిర్వీర్యం చేయాలి. బాబాయికి 78 ఏళ్లు ఉన్నా తన కజిన్ మహమ్మద్ నయీఫ్‌కు 60 ఏళ్లే. అంటే తన కంటె 26 ఏళ్లు మాత్రమే పెద్ద. అతన్ని యువరాజు పదవి నుంచి దింపేసి, తను ఎక్కినపుడు అతను అభినందించడానికి వచ్చాడు కానీ విధేయత (బయా) ప్రకటించలేదు.

ఈ ఆయిల్ ప్రయోగం యిప్పుడే ఎందుకు చేయాలి అంటే మూడేళ్ల ఒపెక్ ప్లస్ ఒప్పందం యీ నెలతో ముగిసిపోతోంది. ఏదో ఒక సాహసం చేసి రష్యాకు, అమెరికాకు బుద్ధి చెప్పి ప్రజల చేత ఓహో అనిపించుకోవాలని ఐడియా. మరో పక్క చూస్తే 84 ఏళ్ల తండ్రి అస్వస్థుడిగా ఉన్నాడు. ఆయనపై దాయాదులకు ఉన్న గౌరవం తనపై లేదని, ఆయన మరణానంతరం తనను లెక్క చేయరని తెలుసు. అందువలన వీళ్లను యిప్పుడే తండ్రి పేరు మీద ఖైదు చేసి, తన ఐడియా ఛేదిస్తే తనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించే నాయకుడు లేకుండా చేయాలని అనుకున్నాడు.

2030 నాటికి సౌదీ అరేబియాను గ్లోబల్ పవర్‌గా చేస్తానని, దానికి గాను దాని పెట్టుబడులను డైవర్సిఫై చేస్తానని యువరాజు సల్మాన్ చెప్పి వున్నాడు. కానీ ఆయిల్ ధరలు తగ్గిపోతూ రావడంతో దేశం ఆర్థికవ్యవస్థ దెబ్బ తింటోంది. కరోనా వైరస్ కారణంగా ఆర్థిక కార్యకలాపాలు తగ్గి చైనా సౌదీ నుంచి తన ఆయిల్ దిగుమతులను తగ్గించింది. ఇతర దేశాల్లో కూడా కరోనా వ్యాపిస్తూన్న కారణంగా ఆయిల్ ధరలు పడిపోయాయి. 2019 డిసెంబరు 31కి 66 డాలర్లున్న బారెల్ మార్చి రెండోవారానికి సగం రేటుకి లభిస్తోంది. ఈ టైములోనే ఒపెక్ ప్లస్ ఒప్పందంపై సమీక్ష చేయవలసిన అవసరం వచ్చింది.

2014 తర్వాత ఆయిల్ ధరలు దారుణంగా పడిపోయినప్పుడు సౌదీ నాయకత్వంలోని ఒపెక్ (ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్), దానిలో సభ్యత్వం లేని రష్యా కలిసి ఒక ఒప్పందానికి వచ్చాయి. ధర పెరగాలంటే డిమాండ్ ఎక్కువ, సప్లయి తక్కువ ఉండాలి. సప్లయి తక్కువ

వుండాంటే ఉత్పాదన తగ్గించాలి. అందుకని ఉత్పత్తి తగ్గించాలని యీ దేశాలన్నీ అంగీకరించాయి. ఆ ఒప్పందం యీ నెలాఖరుతో ముగుస్తుంది. ఇప్పుడు కరోనా, యితర కారణాల వలన ధర పడిపోయింది కాబట్టి మన ఉత్పాదన మరింత తగ్గిద్దాం అని సౌదీ ప్రతిపాదించింది.

కానీ రష్యా దానికి ఒప్పుకోవటం లేదు. ఎందుకంటే ఉత్పాదన తగ్గించి రష్యా కొన్ని విధాలుగా నష్టపోయింది. దాని ఎనర్జీ కంపెనీలు నష్టాల పాలయ్యాయి. దానితో సౌదీకి కోపం వచ్చింది. రష్యాను ఎలాగైనా దెబ్బ కొట్టాని, ధరలు యింకా తగ్గించాలని ఉత్పత్తి పెంచేసింది. రోజుకి 97 లక్షల బారెల్స్ యిప్పుడు తయారు చేస్తున్నాం కదా, ఏప్రిల్ నుంచి 123 లక్షలు చేస్తాం అంటోంది. పైగా ధరలపై డిస్కౌంట్ కూడా ఆఫర్ చేస్తోంది. ఇలా రష్యాను దెబ్బ కొట్టి అది దాసోహం అన్నాక, అప్పుడు ఉత్పత్తిని బాగా తగ్గించేయాలని ప్లాను. ఒకవేళ రష్యా లొంగి రాకపోతే కనీసం రష్యన్ మార్కెట్టయినా తనకు కైవసం అవుతుంది.

దీనితో బాటు అమెరికాను కూడా దెబ్బ కొట్టాలని చూస్తోంది సౌదీ. అమెరికాలో షేల్ ఆయిల్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలున్నాయి. వీళ్లు బావుల నుంచి తైలాన్ని బయటకు తీస్తే వాళ్లు శిలాజాలనుంచి తయారు చేస్తారు. నెలకు 12 బిలియన్ బ్యారెల్లను తయారు చేసి మార్కెట్‌ను ముంచెత్తుతున్నారు. కానీ ఆ తయారీ ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు సౌదీ పడగొట్టేసిన ధరకు అమ్మితే వాళ్లు దివాళా ఎత్తుతారు. అదే సౌదీకి కావలసినది. దెబ్బకి రష్యా, అమెరికా రెండూ కుదేలవుతాయి. అవి నాశనమయ్యాక తను ఎంత రేటుకి కావాలంటే అంత రేటుకి అమ్ముకుని సూపర్ పవర్‌గా ఎదగవచ్చు.

అయితే యీ లోపున సౌదీ ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లకు గురవుతుంది. ఇప్పటికే దాని బడ్జెట్ లోటు 50 బిలియన్ డాలర్లుంది. దాని ఆదాయంలో 90% పెట్రోలియం సెక్టార్ నుంచే వస్తుంది. బడ్జెట్ బాలన్స్ కావాలంటే బ్యారెల్ కనీసం 60 డాలర్లకు అమ్మాలి. రష్యా వేచి చూసే పాలసీ అవలంబిస్తోంది. ఏదో ఒక విధంగా సౌదీ అమెరికన్ షేల్ కంపెనీను నాశనం చేస్తే మార్కెట్లో వాటి పోటీ తప్పిపోతుంది. పైగా రష్యా ఆదాయంలో 30% మాత్రమే ఆయిల్ నుంచి వస్తుంది. అందువలన ఆ సెక్టార్‌లో నష్టాల వలన దాని బడ్జెట్ మరీ కుదుపుకు గురి కాదు.

సౌదీ పరిస్థితి అది కాదు కాబట్టి, అమెరికాను, రష్యాను దెబ్బ తీసే క్రమంలో ఒపెక్ దేశాన్నీ బలహీనపడతాయని రష్యా ఆశ. తన ఆయిల్ కంపెనీలు బలహీనపడుతూంటే అమెరికా చూస్తూ ఊరుకోదు కదా. ఎంత మిత్రదేశమైనా సౌదీని దెబ్బ కొట్టాలని చూడవచ్చు. అది తెలిసి కూడా యువరాజు సల్మాన్ యీ జూదమాడుతున్నాడు. పర్యవసానం ఎలా ఉన్నా జూదక్రీడ సాగేటంతకాలం సౌదీ పౌరులకు సౌకర్యాలు తగ్గించవలసి రావచ్చు. దానివలన ప్రజల్లో అసంతృప్తి కలుగుతుందని, దాన్ని రాచకుటుంబంలోని తన పోటీదారులు సొమ్ము చేసుకుంటారనే భయంతోనే వారిని ముందుగా బంధించాడని అనుకోవాలి.

చివరగా యీ ఆటలో ఇండియాకు దక్కే అరటిపండు ఏమైనా ఉందా అంటే మనం మన అవసరాల్లో 83% ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాం కాబట్టి ధరలు తగ్గితే కేంద్ర ప్రభుత్వ ఖజానాకు లాభమే. ఇక సామాన్యుడి మాట కొస్తే ఏమైనా లాభమా అంటే నమ్మకం లేదు. ప్రస్తుతానికైతే పెట్రోలు, డీజిలు ధర ఎనిమిది నెలల క్రితం ఉన్న ధరకు వచ్చింది. అంతర్జాతీయంగా ధర సగానికి పడిపోయింది కదా, మనకెందుకు పడదు అంటే యీ ప్రభుత్వ విధానం అది!

కేంద్రమూ పన్ను వేసి ఆర్జించుకుంటోంది, వివిధ పార్టీల ఆధీనంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలూ ఆర్జించుకుంటున్నాయి. ఏమైనా అంటే ప్రజలు ఎక్కువగా సొంత వాహనాలు వాడకుండా, కాలుష్యం పెరగకుండా చూడడానికి యిలా చేస్తున్నాం అంటారు. ఆర్టీసీ బస్సులు, ప్రయివేటు బస్సులు, లారీలు యివన్నీ ధరలు పెంచుతాయి. వస్తువుల రవాణా కాస్ట్‌లీ కావడంతో వస్తువుల ధరలుపెరుగుతాయి. కాస్టింగ్ ఎఫెక్ట్‌తో అన్ని ధరలూ పెరుగుతాయి. ఇవి పాలకులకు తెలియదా? అయినా బుకాయిస్తారు.

ఈసీ ,... కరోనా....

- ప్రజామీడియా నెట్‌వర్క్

రాష్ట్ర ఎన్నికల సంఘం నిమ్మగడ్డ రమేష్ కుమార్ దూకుడు నిర్ణయాల పుణ్యమాని గతంలో ఎన్నడూ లేనంత అపకీర్తిని మూటగట్టుకుంది. రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలతో.. వారి పనితీరు మీద మచ్చ పడింది. రాష్ట్రంలో పరిపాలన అసలు సాగనిచ్చే ఉద్దేశం లేదా అన్నట్లుగా.. సుప్రీం కోర్టు అక్షింతలు వేయడం కూడా జరిగింది. ఇంత జరిగినప్పటికీ.. తన పరిధితో నిమిత్తం లేని మరో రకం ఆదేశాలతో ఎస్ఈసీ మరోసారి వార్తల్లో నిలుస్తున్నారు.

ఎన్నికలను ఆరు వారాల పాటు వాయిదా వేసి.. అప్పటిదాకా ఎలాంటి సంక్షేమ పథకాల అమలు కూడా సాధ్యం కాకుండా ఉండేలా... కోడ్ ను సజీవంగా ఉంచిన ఈసీకి మొట్టికాయ పడింది. దాంతో ఎన్నికల కోడ్ ను ఎత్తివేశారు. అయితే కరోనా అనే బూచిని కారణంగా చూపించి ఆరు వారాల పాటు ఎన్నికలను వాయిదా వేసిన నిమ్మగడ్డ రమేష్ కుమార్... తదుపరి ఎన్నికల షెడ్యూలును ప్రకటించే వరకు ఎవరూ ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదంటూ ఆదేశిస్తున్నారు. ఇదెక్కడి పితలాటకమో తెలియడం లేదు. ఎన్నికల ప్రచారం నిర్వహించడం వలన కరోనా వ్యాపించే అవకాశం ఉన్నదంటూ సెలవిస్తున్నారు.

చూడబోతే ఇప్పుడు ప్రతివాడూ తాము చేయదలచుకన్న ప్రతిపనికీ కరోనా ముసుగు తగిలించుకోవడం అనేది రివాజుగా మారినట్లున్నది.



సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలంటే ఎమ్మెల్యే ఎంపీ ఎలక్షన్లంత పెద్దవి కాదు. ఏదో గ్రామం యూనిట్ చిన్ని చిన్న ప్రాం తాల్లో మాత్రమే జరిగేవి. ఈ ఎన్నికల ప్రచారం జరిగినా సరే.. అందులో బహిరంగ సభలుండవు, భారీ ర్యాలీలు ఉండవు. ఏదో పల్లెలో, వార్డుల్లో పోటీచేస్తున్నవారు ఇంటింటికీ తిరిగి ఓట్లు అడ గడం మాత్రమే ఉంటుంది. ఇంత చిన్న ఎన్నికలకు కూడా ప్రచార నిషేధం ఏంటో అర్థం కాని సంగతి. ఈసీకి అధికారం అప్పజెబితే గనుక.. కరోనా సోకుతుందనే భయంతో... నలుగురూ కలవకూడదు గనుక.. కేబినెట్ మీటింగులు కూడా పెట్టకూడదని, గ్రామాల్లో రచ్చబండ వద్ద కూడా జనం జమకూడరాదని, గుడులూ స్కూళ్లూ మాత్రమే కాదు... హోటళ్లూ, టీకొట్టులూ కూడా మూసివేయాలని... బస్సులు, రైళ్లు కూడా సమస్తం ఆపివేయాలని.. ఇంకా ఎన్నెన్ని అరాచక నిర్ణయాలు చూపించవచ్చునో అన్ని రకాలుగా చిన్నెలు చూపించేలా ఉన్నారు. అయినా ప్రజలకు ఒక డౌటు.. అధికార్లను బదిలీచేయమన్న ఉత్తర్వులనే ప్రభుత్వం పట్టించుకోకపోగా.. ప్రచారం వద్దనే ఆదేశాలకు పల్లెల్లో ఖాతరు ఏమాత్రం ఉంటుందో?



చిత్ర పరిశ్రమ చిత్తవుతుందా???

ఎన్నో గడ్డు పరిస్థితులను చూసి ఆరితేరిన, గట్టిపడిన ఇండస్ట్రీ 'టాలీవుడ్'. నాటకాల నుంచి ప్రేరేపితమై చలనచిత్రంగా రూపుదిద్దుకున్న సినిమా ను పరిశ్రమగా మార్చిన ఘనతలో వాటా మన తెలుగువాళ్లకూ వుంది. మదరాసు పట్టణంలో చిత్ర పరిశ్రమ బలంగా వేళ్లూనుకోవడంలో తెలుగువారి కృషి చాలా వుంది. మదరాసు నుంచి హైదరాబాద్ కు తరలి వచ్చి, టాలీవుడ్‌గా రూపాంతరం చెందిన తరువాత అనేక ఒడి దుడుకులు ఎదుర్కొంటూ వచ్చింది.

అడ్డంకులు వచ్చిన ప్రతిసారీ ఎదురీది, ఎదిగి, మరింత గట్టిపడింది. టీవీలు వచ్చినపుడు ఇక సినిమాలు అంతే అనుకున్నారు. టీవీలో పబ్లిసిటీ చేయనిదే సినిమా లేదు. సినిమా లేనిదే టీవీ లేదు అనే పరిస్థితికి వచ్చి, సినిమా గెలిచి నిలిచింది. యూ ట్యూబ్ యుగంలో సినిమాకు గడ్డుకాలమే అనుకుంటే, ఆ ప్లాట్ ఫారమ్ కు కూడా కంటెంట్ అందించేది సినిమానే అని మరోసారి ప్రూవ్ చేసింది. ఆ తరువాత ఆన్ లైన్ ప్లాట్ ఫారమ్ లు ప్రారంభమయ్యాయి. వాటికి కూడా కంటెంట్ ఇవ్వాల్సింది టాలీవుడ్ నే అని మరోసారి రుజువయింది.

ఇలా ప్రతి సారీ ఏదో ఒక వైపు నుంచి పోటీ ఎదురు అవుతున్నా కూడా, టాలీవుడ్ గెలిచి నిలుస్తోంది. అయితే టాలీవుడ్ గెలిచి, నిలుస్తున్నా కూడా మరోపక్క వేరే విధంగా మార్పు తప్పడం లేదు. ఎంతో కొంత ఓటమి తప్పడం లేదు. యూ ట్యూబ్, ఆన్ లైన్ ప్లాట్ ఫారమ్స్‌ను టాలీవుడ్ తట్టుకున్నా, సినిమాలకు ఫౌండేషన్ లాంటి థియేటర్ల వ్యవస్థ మాత్రం తట్టుకోలేకపోతోంది. ప్రతి సారీ ఎంతో కొంత నష్టపోతూనే వుంది.

రియల్ ఎస్టేట్ ఊపందుకున్న తరువాత థియేటర్ల వ్యవస్థ మీద తొలి దెబ్బ పడింది. చాలా థియేటర్లు ఫంక్షన్ హాల్స్ గా మారాయి. వర్కవుట్ కాక చాలా మంది షాపింగ్ కాంప్లెక్స్‌లుగా, అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లుగా మార్చేసారు. ఆ విధంగా థియేటర్లు తగ్గడం ప్రారంభమైంది. ఇలాంటి టైమ్ లో మల్టీప్లెక్స్‌లు వచ్చాయి. ఇలా మోడరన్ గా వుంటే థియేటర్లకు జనం వస్తారు అని ఫిక్స్ అయ్యారు. మళ్లీ సింగిల్ థియేటర్లు అన్నీ కొత్తగా కళకళలాడడం ప్రారంభమైంది.

పెద్ద పెద్ద వాళ్లు అంతా థియేటర్ల వ్యాపారంలోకి దిగాక, పాత థియేటర్లు అన్నీ కొత్త పెళ్లి కూతుళ్ల మాదిరిగా ముస్తాబు అయ్యాయి. అటు మల్టీప్లెక్స్‌లు, ఇటు కొత్తగా మారిన సింగిల థియేటర్లు కలిసి, ఆదాయం పెంచి, సినిమా పరిశ్రమను కళకళలాడించాయి. జనం ఎంత టికెట్ పెట్టినా సినిమాకు వస్తున్నారు. మొన్నటికి మొన్న జనవరిలో వందల కోట్ల ఆదాయం థియేటర్ల మీదుగా సినిమారంగంలోకి వచ్చింది.

కరోనా దెబ్బ

ఇలా ప్రతి సారీ ఏదో రూపంలో వస్తున్న దెబ్బను టాలీవుడ్ తట్టుకుంటూ వస్తోంది. కానీ ఈసారి బలమైన దెబ్బ తగిలేలా కనిపిస్తోంది. ఈ దెబ్బకు టాలీవుడ్ పునాదులు కదులుతాయేమో అన్న భయం వ్యక్తం అవుతోంది. ఎందుకంటే ఇప్పటి వరకు ఎన్ని పోటీలు వచ్చినా, టాలీవుడ్ స్తంభించిపోలేదు. నడుస్తూనే వుంది. నడుస్తూనే ఎదుర్కొంటూ వుంది. కానీ ఇప్పుడు చలన చిత్ర పరిశ్రమ కదలిక ఆగింది. బహుశా టాలీవుడ్ పుట్టిన తరువాత ఇదే తొలిసారేమో ఇలాంటి పరిస్థితి రావడం.

సినిమా పరిశ్రమ పునాదులైన థియేటర్ల దగ్గర నుంచి హీరోల వరకు కరోనా కల్లోలం వల్ల ఇబ్బంది పడని వారు లేరు. ఇక్కడ డబ్బులు వున్నాయా? లేవా? అన్నది కాదు పాయింట్. పని వుందా లేదా అన్నది క్వశ్చను. అదే సమయంలో సినిమా పరిశ్రమ మీద ఆధారపడి బతుకున్నవారిలో కనీసం యాభై శాతం మంది అయినా డబ్బు సమస్య కూడా ఎదుర్కొంటున్నారనే చెప్పాలి.

థియేటర్ల గోడు

టాలీవుడ్‌లో ఇప్పుడు అతి పెద్ద సమస్యను ఎదుర్కొంటున్నది థియేటర్ల యజమానులే. చాలా వరకు థియేటర్లు లీజులో వున్నాయి. సురేష్‌బాబు, అల్లు అరవింద్, ఆసియన్ సునీల్, దిల్‌రాజు, యువి వంశీ లాంటి ప్లేయర్లు వున్నారు. వీరంతా గ్రౌండ్ లీజులు తీసుకున్నవే ఎక్కువ. అలాంటపుడు సిబ్బంది జీతాలు అన్నీవీరే చూసుకుంటారు. ఇక్కడే వస్తోంది సమస్య. వీరంతా హైదరాబాద్‌లో వున్నారు. కిందన మేనేజర్లు వుంటారు. వీళ్లకు వుండే అధికారాలు పరిమితం. సిబ్బందికి పూర్తి కాలం జీతాలు ఇవ్వకుంటే పరిస్థితి దారుణంగా వుంటుంది. ఇస్తారో ఇవ్వరో క్లారిటీ లేదు. పూర్తి కాలం జీతాలు వేరు బేటాలు / బత్తాలు వేరు. థియేటర్ పని చేయని కాలంలో బత్తాలు ఇస్తారో ఇవ్వరో అన్న అనుమానం.

ఇదే యజమాని స్వంతంగా థియేటర్ నడుపుకుంటే వర్కర్స్ తో ఒక అనుబంధం వుంటుంది. వారి మంచి చెడ్డలు తెలుసుకుని, చూసుకుంటారు. ఇప్పుడు ఆంధ్ర అంతటా ముఖ్యంగా ఈస్ట్, వెస్ట్, ఉత్తరాంధ్రలో థియేటర్ల వర్కర్లు దాదాపు పస్తులు వుండే పరిస్థితి వుంది. ఈ విషయంలో థియేటర్లు లీజుకు తీసుకున్న బడాబాబులు కానీ ఎగ్జిబిటర్ల సంఘాలు కానీ ముందుకు వచ్చి ఏం చేస్తాయన్నది ఇప్పటి వరకు క్లారిటీ లేదు. ఎందుకంటే కరోనా ఎఫెక్ట్ అన్నది థియేటర్ల మీద కనీసం మరో నెల నుంచి రెండు నెలలు వుంటుందని అంచనా.

నిర్మాణాలు-రిలీజులు

మరోపక్కన టాలీవుడ్ 2020 సమ్మర్ ను కోల్పోతోంది. ఏప్రియల్ 15 వరకు థియేటర్లు బంద్. ఇది ప్రస్తుతానికి వున్న ఆదేశాలు. ఆ తరువాత ఎలా వుంటుందో తెలియదు. ఓవర్‌ఆల్ అయితే కనీసం మరో రెండు నెలల వరకు థియేటర్లు తెరవరు అని టాక్. ఇలాంటి నేపథ్యంలో ఈ సమ్మర్ విడుదల టార్గెట్‌గా తయరయిన, తయారవుతున్న సినిమాలు అన్నీ అలా వుండిపోయాయి.

ఏప్రియల్ లో దాదాపు చిన్న, పెద్ద కలిపి పది సినిమాల వరకు ప్లాన్ చేసుకున్నారు. ఇప్పుడు అవన్నీ ఆగిపోయాయి. ఇవి కాక, సమ్మర్ విడుదల కోసం రెడీ అవుతున్నాయి మరో పది సినిమాల వరకు. అవన్నీ ఎక్కడివక్కడ ఆగిపోయాయి. దాదాపు అన్నీ కలిసి మూడు నుంచి అయిదు

వందల కోట్ల వరకు టర్నోవర్ ను ఆపేసినట్లే.

మళ్లీ పరిస్థితి నార్మల్‌కు వచ్చి, డేట్‌లు అన్నీ సర్దుబాటు చేసుకుని, సెట్ మీదకు వెళ్లేసరికి,. అలాగే థియేటర్లలోకి వచ్చేసరికి ఎంత కాలం పడుతుందో, పరిస్థితి ఎలా వుంటుందో తెలియదు.

ఎకానమీ ప్రభావం

టాలీవుడ్‌లో పెట్టుబడులు అన్నీ రకరకాల మార్గాల నుంచి వస్తాయి. రాజకీయ నాయకుల బ్లాక్‌మనీ, కాంట్రాక్టర్లు, బడాబాబుల బ్లాక్ మనీ అప్పుల రూపంలో సినిమా రంగంలోకి వస్తుందనే టాక్ వుంది. ఇప్పుడు ఆర్థికంగా ప్రపంచం అతలాకుతలం అయిపోతోంది. దాంతో టాలీవుడ్‌కు ఫండ్స్ సమస్య తప్పదు. అదే సమయంలో ఫైనాన్సియర్లు కరుణిస్తే సరి లేదంటే, వడ్డీలు తడిసి మోపెడు అవుతుంది.

నిర్మాతల సమస్య ఇలా వుంటే, సినిమా రంగంలోని కార్మిక వర్గం మరీ తీవ్రమైన సమస్య ఎదుర్కోబోతోంది. హీరోలు, దర్శకులు, పెద్ద టెక్నీషియన్‌లను పక్కన పెడితే, మిగిలిన వారంతా ఏదో విధంగా రోజువారీ కార్మికుల కిందే లెక్క. షూటింగ్‌లు వుంటేనే పైసలు వస్తాయి. కాల్‌షీట్‌కు లక్షలు అయితేనేం, వేలు అయితేనేం షూటింగ్ వుంటేనే వచ్చేది.

ఇక లైట్ బాయ్‌లు, మేకప్ మ్యాన్‌లు, ప్రొడక్షన్ బాయ్‌లు, కెమేరా అసిస్టెంట్‌లు ఇలా ఒకరేమిటి వేలాది మంది రోజువారీ జీతాల మీద పడి బతకాల్సిందే. ఇక చిన్నా చితక జూనియర్ ఆర్టిస్ట్‌ల సంగతి చెప్పనక్కరలేదు. పైగా టీవీ సీరియళ్లు, లైవ్ షోలు కూడా ఆగిపోయాయి. జబర్దస్త్, అదిరింది, ఇలా అనేక షోలకు హాజరై గ్యాలరీల్లో కూర్చుని పకపకా నవ్వుతూ, తప్పట్లు కొడుతూ కనిపించే అనేకానేక మంది యువతరానికి రోజువారీ భత్యం లేకుండా పోయింది. సినిమా షూటింగ్‌లు వుంటే కనీసం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం గడచిపోయేది ఇప్పుడు అది కాస్తా లేకుండా పోయింది.

పెద్దల మెహర్బానీ

ఇలాంటి నేపథ్యంలో టాలీవుడ్ పెద్దలు మెహర్బానీ ప్రారంభమైంది. టాలీవుడ్ పెద్దలు అనేక మంది కేంద్రానికి, రాష్ట్రాలకు విరాళాలు ఇవ్వడం ప్రారంభించారు. నిజానికి ప్రభుత్వానికి విరాళాలు అందివ్వడం తప్పు కాదు. కానీ ప్రభుత్వాలు అవి చేయాల్సిన పని అవి చేస్తాయి. ఇక్కడ టాలీవుడ్ పరిస్థితి గమనించాలి. ఇక్కడ కార్మికులను ఆదుకోవాలి. 24 క్రాఫ్ట్ సంఘాల ద్వారా ఆయా కార్మికులకు చేయూతనివ్వాలి. అలా చేయకుండా కేంద్రానికి, రాష్ట్రానికి కోట్లు కుమ్మరించడం అంటే కేవలం మెహర్బానీ కోసం అనుకోవాల్సి వస్తుంది.

ఇలాంటి టైమ్‌లో కొంతమంది దళారులు కూడా రెడీ అయిపోతారు. తమ సేవా సంఘాల ద్వారా కార్మికులకు సాయం అందిస్తామంటూ, తమకు పెద్దలతో వున్న ర్యాపో ను వాడేసుకుని, డబ్బులు దండేసుకునే వ్యవహారం వుండనే వుంటుంది. లక్షలు చేతిలో పడితే, వేలు విదిలించి, డబ్బు చేసుకుంటారనే ఆరోపణలు వుండనే వున్నాయి.

టాలీవుడ్ పెద్దలకు కూడా అదే కావాలి. వారంతట వారు సాయం చేసేంత తీరుబాటు, ఓపిక వుండవు. ఇచ్చాం అనిపించేసుకుంటే చాలు.

ఇప్పట్లో ఆగకుంటే..

కరోనా ప్రభావం ఏప్రియల్ తో ముగిసిపోతే పర్వాలేదు. టాలీవుడ్ మరోసారి మరో ఉపద్రవాన్ని తట్టుకుని నిల్చుంటుంది. అలా కాకుండా వినిపిస్తున్న రకరకాల గ్యాసిప్‌ల ప్రకారం జూన్ వరకు కనుక కరోనా హడావుడి వుంటే మాత్రం, టాలీవుడ్ తట్టుకోవడం కష్టం. నిర్మాతలు, హీరోలు, దర్శకులు తట్టుకున్నా, టాలీవుడ్‌ను నమ్ముకున్నమిగిలిన వారు మాత్రం కుదేలైపోతారు. వారినే కావచ్చు, థియేటర్ల జనాలనే కావచ్చు, ఆదుకోవడానికి ఇప్పటి నుంచి ప్రణాళికలు రూపొందించాలి. అలా కాకపోతే మాత్రం టాలీవుడ్ కదిలిపోతుంది.

చాణక్య
writerchanakya@gmail.com

ఎక్కడా ఎక్కడ

దేవుడెక్కడ?.. పూజలెక్కడ?.. పూజారులెక్కడ?

భక్తి ఎక్కడ?.. భక్తులెక్కడ?..అర్చనలెక్కడ?.. ప్రత్యేక ధర్శనాలెక్కడ?

వాస్తులెక్కడ?.. జ్యోష్యమెక్కడ?.. జ్యోతిష్యులెక్కడ?..

కులమెక్కడ?..మతమెక్కడ?..మధమెక్కిన మనిషెక్కడ?

స్వైరమెక్కడ?..వైరమెక్కడ?..అణగద్రొక్కే ఆలోచనెక్కడ?..

పరువెక్కడ?..ప్రతిష్టెక్కడ?..విర్రవీగే తత్వమెక్కడ?..

ఈర్ష్యలెక్కడ?..ద్వేషమెక్కడ?..గర్జించే గర్వమెక్కడ?..

అబద్దం అబద్దం అంతా అబద్దం..

భూటకం భూటకం మనిషి జన్మే ఓ నాటకం..

మనిషి బ్రతకడానికి దారులులేనప్పుడు,మనిషికి మనిషిగా బ్రతికే ఓపికలేనప్పుడు పుట్టిన ఆలోచనలే ఈ గర్వం,కులం,మతం,ఈర్ష్య, ద్వేషం వగైరాలు......

ప్రాణానికి ప్రమాదముందంటే చాలు మనిషి వెంటనే తుచ్చమైనవి మరిచి, ఇచ్చమైన, ఉచ్చమైన స్థితిని (బ్రతికుంటే చాలు) మాత్రమే కోరుతాడు.

“కరోనా” ప్రభావం వల్ల టీవీ చానల్స్ లో పొద్దు పొద్దున్నే తిట్టుకునే డిబేట్స్ లేవు??, హత్యలు,దోపిడీలు,దొంగతనాలు,మానభంగాలు,దొంగ బాబాల అరాచకాలు,దొంగ స్వామీజీల అఘాయిత్యాలు , ఏమీలేవు.

మనిషి “కరోనా”లా ప్రపంచాన్ని భయపెట్టి బ్రతుకుదామనుకుం టాడు?,కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మనిషి చేసే వికృతాలు ఎంత తుచ్చమో “కరోనా”తో కనువిప్పు కలిగితే అదే ఆదర్శం..అదే అనంతం..అదే అవసరం కూడా ?

“కరోనా”ని కలిసికట్టుగా జయిద్దాం?.. మనలో ఉన్న “కరోనా”లను హరిద్దాం

కల చెదిరి, కథ మారి... కలం కన్నీరు..!

– మధుసూదన్



మీడియా స్వరూప, స్వభావాలు మారుతున్నాయి. డిజిటల్ మీడియా వేగం, విస్తృతి, వైవిధ్యం ముందు సంప్రదాయ మీడియా విలవిలలాడుతోంది. కరోనా సెగ మీడియాకు కూడా తగిలింది. యాజమాన్యాల వైఖరి, లాభనష్టాల గురించి చాలా చర్చ జరుగుతోంది. మనం జర్నలిస్టుల కోణానికే పరిమితమవుదాం.

ఎక్కడా ఉద్యోగం దొరకక్క జర్నలిజంలోకి వస్తున్నారా? ఇష్టంగా వస్తున్నారా? వచ్చి ఇరుక్కుపోతున్నారా? ఆనందంగా ఉన్నారా? ఉద్యోగ భద్రతతో ఉన్నారా? ఆరోగ్యంగా ఉన్నారా? అన్న ప్రశ్నలకు రకరకాల సమాధానాలు రావచ్చు.

కరోనా పేరిట ఖర్చులు తగ్గించుకోవాలనుకున్న తెలుగు మీడియా రంగంలో యాజమాన్యాలు ఒక్కసారిగా ఉద్యోగులను తొలగించాయని, జీతాల్లో కోతపెట్టాయని రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. నిజానిజాలు పెరుమాళ్ళకే ఎరుక.

ప్రపంచమంతా తెలిసి ఉండాల్సినవాళ్లు జర్నలిస్టులు. రెండు మూడు భాషలు రావాలి. అనువాదాలు చేయగలగాలి. వేగంగా రాయాలి. అందంగా మాట్లాడాలి. పరిశోధించాలి. సమాచారం రాబట్టాలి. ప్రశ్నించాలి. నిలదీయాలి.తేలికగా అర్థమయ్యేలా విశ్లేషించాలి.

వీటికి తోడు ఆధునిక జర్నలిస్టుకు డ్రైవింగ్ రావాలి. కెమెరా తెలియాలి. టైపింగు తప్పనిసరి. పేజ్ మేకప్ విధిగా రావాలి. నైట్ డ్యూటీ చేయగలగాలి. రాత్రికి రాత్రి యాజమాన్యం మనసేవలు అండమాన్ లో అవసరమనుకున్నప్పుడు మౌనంగా వెళ్లగలగాలి. యూనియన్లలో ఉండకూడదు. పార్టీల్లో ఉండకూడదు. పార్టీలకు వెళ్ళకూడదు. పెళ్లికి చావుకు రెండు నెలలముందే పర్మిషన్ తీసుకోవాలి. వారంలో ఏరోజు ఆఫ్ ఇస్తే అదే సెలవనుకోవాలి.

జర్నలిస్టు క్యాంటిన్ కు వెళ్లినా, బాత్ రూముకు వెళ్ళినా యాజమాన్యం గమనిస్తోందన్న స్పృహ ఉండాలి. ఇల్లు వాకిలి కట్టుకుంటే భయం భయంగా గృహ ప్రవేశం చేయాలి. స్కూటరో కారో కొంటే యాజమాన్యం ఏమనుకుంటుందో అని భయపడాలి.

డెస్కు పెద్దలు, బ్యూరో హెడ్డులు రాసిందే భాష, పెట్టిందే హెడ్డింగుగా అంగీకరించే సబ్మిస్సివ్ నేచర్ ఉండాలి. యాజమాన్యం ప్రతినిధులను గుర్తించి వారి గుడ్ లుక్స్ లో ఉండడానికి పాటుపడాలి.

యాజమాన్యం ఇష్టాలే మన ఇష్టాలు కావాలి. వారి ద్వేషం మన ద్వేషం కావాలి. వారు నడిచినట్లే నడవాలి. వారు తిన్నట్లే తినాలి. వారిలాగే ఆలోచించాలి.

కాలం చిత్రంగా దొర్లిపోతుంటుంది. ఈలోపు మన వేగం తగ్గుతుంది. మనకు మనమే తప్పుకోవాలి. లేదా తప్పిస్తే సిద్ధంగా ఉండాలి. సబ్జెక్ట్ లేని వారు, విషయపరిజ్ఞానం లేనివారు హెడ్డులుగా మనకు హెడ్డులేదని నిరూపిస్తే– మనం హెడ్డు ఉందని చూపకుండా తలవంచుకోవాలి. లేదా తల నరుక్కోవాలి. పట్టు పరిశ్రమ పట్టు విడుపులు తెలియాలి.

తెలుగు పాత్రికేయ భాషా సరస్వతి మురిసిపోయేలా ఏళ్లతరబడి మనం రాస్తున్నా– మన ఊరు పేరు పాతక ప్రపంచానికి తెలియకుండా అగస్త్య భ్రాతగా అజ్ఞాతవాసం గడపాలి. యాజమాన్యానికి మనం బరువయినప్పుడు మన ఐడి కార్డును సెక్యూరిటీ గేట్లోనే ఇచ్చి వచ్చేయాలి. ప్రశ్నించి ప్రశ్నించి ప్రపంచానికి సమాధానాలను పంచిపెట్టే జర్నలిస్టులు యాజమాన్యాలను కనీసం మనసులోకూడా ప్రశ్నించకుండా మౌనంగా, కన్నీళ్లు కూడా రాకుండా రోదించాలి. రోదిస్తూనే ఉండాలి.

ఇదేం జర్నలిజం?? ఇదేం ప్రతిపక్షం?

ప్రతిపక్షాల వికటాట్టహాసం... మీడియా కరాళ నృత్యం

- పి.ఫని కుమార్

జనపక్షం ప్రతిపక్షం. జనహితం జర్నలిజం. ఇది ఇప్పుడు మనం నోటి కొచ్చినట్లు చెప్పుకునే మాట కాదు. వాటి నైతిక ధర్మం అది. అందుకే ఓడినా ప్రతిపక్షానికి ఆ స్థానం. నేరుగా ఏమి చేయలేకపోయినా జర్నలిజా నికి ఆ గౌరవం. కానీ, ఎప్పుడెప్పుడు ఈ రాష్ట్ర ప్రజలు కష్టాల కడలిలో మునిగిపోతారా? అని వేయికళ్ళతో ఎదురు చూస్తోంది ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షం. జనావాసా లకు నిప్పుపెట్టి ఎప్పుడెప్పుడు తాను చలి కాచుకుం దామా? అని ఎదురు చూస్తోంది రాష్ట్రంలోని ఎల్లో మీడియా. అందుకే అవకాశం దొరికినప్పు డల్లా ప్రభుత్వంపై ప్రతిపక్షం వికటాట్టహాసం చేస్తుంటే, ఎల్లో మీడియా కరాళ నృత్యం చేస్తోంది.

విశ్వాన్నికరోనా తన కబంధహస్తాల్లో ఊపిరాడకుండా చేస్తోంది. ఆ రక్కసి కోరల్లోంచి తమను తాము రక్షించుకోవడానికి సర్వ మానవాళి నిద్రాహారాలు మాని పోరాడుతుంటే, ఆంధప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిపక్షం, ఎల్లో మీడియా విజ్ఞత మరచి వ్యవహరిస్తున్నాయి. మండలాల వారీగా తీసుకుంటే 86.4 శాతం భూభాగం గ్రీన్ జోన్‌లో ఉంది. ఒక్క కేసు కూడా నమోదు కాని భూభా గంగా ఉంది. రెడ్ జోన్‌లో ఉన్న భూభాగం కేవలం 6.21 శాతం మాత్రమే.

ఇదే ప్రతిపక్షాలకు ఏ మాత్రం రుచించని విషయం. సాధారణంగా అయితే తమ రాష్ట్రంలో ఇంత భాగం సురక్షితంగా ఉందని సంతోషించాలి. ఇంకా ఎక్కడెక్కడ కరోనా కేసులు ఉన్నాయో వెతికి పట్టుకుని నిర్మూలనకు చేయు తనియ్యాల్సిన ప్రతిపక్షం బురదజల్లే కార్యక్రమాన్ని నెత్తికెత్తుకుంది. విశాఖలో కేసులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని దాచిపెడుతున్నారనే ఆరోపణలు చేశారు. రకరకాల ఆరోపణలు చేసి రాష్ట్రాన్ని అల్లరిపాలు చేశారు. 40 ఏళ్ళ రాజకీయ అనుభవం అని చెప్పుకునే ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు బాధ్యత మరచి వ్యవహరించారు. అదే సమయంలో ఎల్లో మీడియా దానికి తాళం వేయడం మొదలు పెట్టింది.

టీవీ 5 గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆంధ్రజ్యోతి పత్రికను ఈ రోజు చదివితే నాకు భయమేసింది. 33 వేల మందికి కరోనా లక్షణాలు ఉన్నట్లు మొదటి పేజీలో ప్రచురించి తన దిగజారుడు తనాన్ని, తెంపరితనాన్ని చాటుకుంది. ఇప్పటి వరకూ దేశ వ్యాప్తంగా 11వేల మందికి కరోనా పాజిటివ్ కేసులు ఉంటే, ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 33 వేల మందికి ఆ లక్షణాలున్నట్లు ప్రచురించడాన్ని చూస్తే అసహ్యమేసింది. పత్రికలు ఉండేది ఆపత్కాల జనానికి భరోసా కల్పించడానికా? లేక అధి కార పక్షంపై కక్ష తీర్చుకోవడానికి జనాన్ని ఇంతగా భయపెట్టాలా? అని కంపరం పుట్టుకొస్తోంది. ఇలాంటి ప్రతిపక్షాలు, మీడియా సంస్థలు ఆంధ్ర రాష్ట్రాన్ని ఏమి చేస్తాయోనని భయమేస్తోంది. దేశపరిరక్షణలో భాగంగా మీడియా తమకున్న వెసలుబాటును ఇంత దారుణంగా వాడుకోవడం బహుశా ఇంకెక్కడా జరగదేమో. ఒక వైపు బీజేపీ నాయకులు, ఎల్లో మీడియా ప్రధాన ప్రతిపక్షం తీవ్రంగా కృషి చేసి జగన్‌ను కష్టాల్లోకి నెట్టేశామని ఆనందపడుతున్నాయి. కానీ, వారు ప్రమాదంలోకి నెట్టింది అధికారపక్షాన్ని, ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డిని కాదు. ఏకంగా రాష్ట్రాన్నే ప్రమాదంలోకి నెట్టేశారు.

ఇది ఒక ఎత్తయితే. లేని ప్రాంతాలను రెడ్ జోన్లగా ప్రకటించడం వల్ల ప్రతిపక్షాలకు, కేంద్రానికి, ఎల్లో మీడియాకు ఆనందం కావచ్చునేమో కానీ, భవిష్యత్తు అంధకారమే. ఇంత పెద్ద ఎత్తున కరోనా ప్రమాదం ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందు కురారు. ఇప్పటికే ఉన్నఅప్పులతో రాష్ట్రం పరిస్థితి మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టుగా తయారవుతుంది. సరిగ్గా ప్రతిపక్షాలకు, ఎల్లో మీడి యాకు కావాల్సింది కూడా ఇదే. రాష్ట్రం అధోగతి పాలైనా ఫార్వాలేదు. జగన్మోహన్ రెడ్డి ఇబ్బంది పడాలి. సంక్షేమ పథకాలు ఆగిపోవాలి. ఇలాం టి కుహానా రాజకీయ నేతలు, రాజకీయాలు ఉన్నంత కాలం రాష్ట్ర భవి ష్యత్తుకు దినదినగండమే.

అంతా మనమంచికే

సముద్రంలో ప్రయాణిస్తున్న ఒక నావ అకస్మాత్తుగా ప్రమాదానికి గురైంది. అందులో కేవలం ఒక వ్యక్తి మాత్రమే అదృష్టవశాత్తు బతికి బయటపడి ఒక కొయ్య దుంగ మీద తేలుతూ జన సంచారం లేని ఒక దీవిలోకి వచ్చి పడ్డాడు. ఆ ప్రమాదం నుండి రక్షించమని రోజూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాడు. ఎవరైనా తనని రక్షించడానికి వస్తారేమో అని సముద్రం వైపు ఆశగా ఎదురుచూసే వాడు. కానీ ఎవరూ రాలేదు..చూసి చూసి విసిగిపోయాడు. ప్రకృతి శక్తుల నుండి రక్షణ కోసం తేలుతూ వచ్చిన చెక్కలతో ఒక చిన్న గుడిసె నిర్మించుకున్నాడు. ఆ గుడిసె అలల తాకిడికి కొట్టుకొచ్చిన కొన్ని పనికొచ్చే వస్తువులను దాచుకున్నాడు. ఇలా ఉండగా ఒకరోజు ఎంత తిరిగినా ఆహారం దొరకలేదు. తిరిగి గుడిసె దగ్గరకు వచ్చేసరికి అది తగలపడిపోయి పొగలు పైకి వస్తున్నాయి. తనకున్న ఒక్క ఆధారం కూడా అగ్నికి ఆహుతై పోయింది. అతనికి ఏమ్ చేయాలో తోచలేదు. బాధతో కుంగిపోయాడు. తనకు పట్టిన దుర్గతిని తలచుకొని దుఃఖిస్తూ అలాగే నిద్రపోయాడు. తెల్లవారి లేచి చూసేసరికి ఒక నావ దీవిని సమీపిస్తూ కనిపించింది. అది అతన్ని రక్షించడానికి వచ్చిందని తెలిసి అతని సంతోషానికి అవధుల్లేవు. అప్పుడు అతను ఆ నావలో ఒకరిని "నేను ఇక్కడ ఉన్నానని మీకెలా తెలిసింది.."!? అని అడిగాడు.

"నీవు మంట పెట్టి పొగ ద్వారా మాకు సంజ్ఞలు చేశావు కదా దానిని గుర్తుపట్టి ఇక్కడకు రాగలిగాము"..అన్నాడు.

కొసమెరుపు: ఒక్కసారి మన ఆశల సౌధాలు ఇలాగే తగలపడి పోవచ్చు. కానీ అవే మంటలు మీ మంచికి సంకేతం కావచ్చు. రేపు పదిగంటలకు మోడీ ప్యారోం భాయీ అంటూ లాక్ డౌన్ మరో పది రోజులు పొడిగించవచ్చు. భయపడకండి!!

'రాజకీయం వేరు. పరిపాలనా సామర్ధ్యం వేరు'

- కూర్మన చంద్రమోమన్, సీనియర్ జర్నలిస్ట్

కేంద్ర ప్రభుత్వం కొరోనా వైరస్ వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకున్న చర్యల గురించి తెలుసుకుంటే 21 రోజుల లాక్‌డౌన్ నిర్ణయం ఎందుకు తీసుకున్నారనేది తెలుస్తుంది.

అసలు ఈ కఠినమైన నిర్ణయం వెనుక మొత్తం 30 మందితో కూడిన టీమ్ ఉన్నది. వారిలో డాక్టర్లు, శాస్త్రవేత్తలు ఉన్నారు. 30 మంది రెండు గ్రూపులుగా పని చేస్తున్నారు.

ఈ టీమును ఈ నెల మొదటి వారంలో ప్రారంభించారు. ఒక దేశం తరువాత మరొక దేశాన్ని కబళిస్తున్న ఈ వైరస్‌ను ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయం మీద 30 మందిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒకటి 20 మంది డాక్టర్లతో కూడినది. మరొకటి 10 మంది శాస్త్రవేత్తలతో కూడినది.

ఈ మొదటి టీమ్ యొక్క ప్రధాన లక్ష్యం ఆ వ్యాధికి సంబంధించిన సాంకేతిక సహాయంతో విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ప్రధానికి సహకరించడం. అలాగే వ్యాధి లక్షణాలు, ఏవిధంగా వ్యాపిస్తోంది, ఎంతమందికి వ్యాధి సోకింది అన్న వివరాలు ప్రధానమంత్రికి అందజేయడం.

ఈ గ్రూపు నీతీఆయోగ్ సభ్యుడైన డా॥ వి.కె.పాల్ ఆధ్వర్యంలో నడుస్తుంది. రెండో గ్రూపు డా॥ పాల్‌తో పాటు ప్రధానికి సాంకేతిక సలహాదారుడైన కె. విజయ రాఘవన్‌ల సారధ్యంలో ఏర్పాటయింది.

రెండు గ్రూపులు కూడా పరస్పరం అనుక్షణం సహకరించుకుంటూ సమాచారాన్ని, నిర్ణయాలను, సలహాలను ప్రధాని ప్రిన్సిపల్ సెక్రెటరీ అయిన పి.కె.మిశ్రా ద్వారా ప్రధానికి చేరవేస్తుంది.

కొన్ని సందర్భాలలో ప్రధానమంత్రే స్వయంగా ఆగ్రూపు సభ్యులతో మాట్లాడుతున్నారు.... పరిస్థితి తీవ్రతను అర్ధం చేసుకోడానికి.


21 రోజుల లాక్‌డౌన్ నిర్ణయం వెనుక ఉన్నవారు డా॥వి.కె.పాల్, కేంద్ర ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ప్రీతి సూదాన్, ఎయిమ్స్ డైరెక్టర్ డా॥ రణదీప్ గులేరియా, ఐసిఎంఆర్ డైరెక్టర్ జనరల్ డా॥బలరామ్ భార్గవ ఇతర ప్రజారోగ్య నిపుణులు, మైక్రో బయాలజీ నిపుణులు ఉన్నారు.

వీరే కాకుండా శాస్త్రవేత్రలయిన అంటువ్యాధుల స్పెషలిస్టు అయిన డా॥రామన్ గంగాఖేడ్కర్, డా॥నివేదితా గుప్తా మొదలైన వారు ఉన్నారు.

ఇంకా తెర వెనుక కథ నడిపించేవారిలో Institute of Epidemiology వారు ఈ వ్యాధి లక్షణాలు మరియు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతుందన్న విషయంపై mathematical modelling తయారు చేసి ప్రధానికి అందచేసారు.

ఈ గ్రూపుల సమిష్టి నిర్ణయమే 21 రోజుల లాక్ డౌన్. మొదట 14 రోజుల లాక్ డౌన్ అనుకున్నారు. ఐతే ఈ వైరస్ యొక్క mathematical modelling ను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం దానిని 21 రోజులకు పెంచింది. అంతేకాదు .... అనేక దేశాల నుండి వస్తున్న అధికారిక సమాచారాన్ని విశ్లేషించడం, ఒకవేళ 21 రోజులలో ఈ వ్యాధిని ఆపలేకపోతే దేశ ఆర్ధిక వ్యవస్థ మీద పడే ప్రభావం, ఇతర దేశాలు అనుసరిస్తున్న పద్ధతులు, వాటి యొక్క ప్రభావం మొదలైనవి ఈ గ్రూపు విశ్లేషించి ప్రధానమంత్రికి సలహాలు, నిర్ణయాలను తెలియచేస్తుంది.

మొదట 21 రోజుల లాక్ డౌన్ పేదలపై పడే ప్రభావం గురించి సంశయిస్తున్న ప్రధానికి 'ఇది తప్పని సరి' అయిన చర్య .... లేకుంటే



జరిగే వినాశనం ఏ స్థాయిలో ఉంటుందో కూడా ఊహించలేమని చెప్పడంతో కేంద్రం లాక్ డౌన్ నిర్ణయం తీసుకున్నది. అదే సమయంలో ప్రధాని డాక్టర్ల, శాస్త్రవేత్తల నిర్ణయాన్ని అమలు చేస్తూనే ఫైనాన్స్ సెక్రెటరీ చేత ఆర్బీఐతో చర్చలు జరపించడం .... BPL కుటుంబాలకు ఆర్థిక సహాయం చెయ్యాలన్న నిర్ణయం తీసుకోవడం, అలాగే మధ్య తరగతి వారికి, ఉద్యోగులకు, పరిశ్రమల వారికి ఊరట కలిగించే EMI ల వాయిదా నిర్ణయం తీసుకోవడం జరిగాయి.

ఈ గ్రూపులు కూడా సోషల్ డిస్టాన్సింగ్ పాటిస్తూ ముగ్గురు లేదా నలుగురు ఒక సబ్ గ్రూపుగా ఏర్పడి విడి విడిగా సమావేశమౌతూ సంప్రదింపులు జరుపుతున్నారు.

మొదట కేవలం విదేశాలనుండి వచ్చిన వారికి మాత్రమే పరీక్షలు చేయించాలని ICMR నిర్ణయించింది. అయితే టాస్క్ ఫోర్స్ ఆ నిర్ణయాన్ని ఒప్పుకోక ఇప్పటికే ఈ వ్యాధి దేశంలోకి ప్రవేశించి ఉండవచ్చునని, అందుచేత అనుమానితులనందరినీ పరీక్షించాలని నిర్ణయం తీసుకున్నది. కేంద్రం అవే ఆదేశాలను రాష్ట్రాలకు సూచించింది.

శాస్త్రవేత్తల గ్రూపు యొక్క బాధ్యతలలో సాంకేతిక సంస్థల మధ్య సమన్వయం, పరిశోధనలపై వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం, అమలు చేయడం ముఖ్యమైనవి.

వీటిలో CSIR, DRDO, CCMB, ICMR ఆధ్వర్యంలోని Indian Institute of Virology, Institute of Physics, Institute of Engineers మొదలైనవి పని చేస్తున్నాయి .... 24x7.

ఈ గ్రూపుల నిర్ణయమే దేశంలోని అన్ని జాతీయ పరిశోధనా సంస్థలకు వ్యాధి నిరోధక వాక్సిన్ తయారీకి కావలసిన పరిశోధనలు చేసే అవకాశం కలగడం.

దేశం ఒక విపత్తును ఎదుర్కోవాలంటే కేవలం కరిష్మా చాలదు. నాయకత్వానికి ముందు చూపు ఉండాలి. ఎవరితో ఏ పని అవుతుందో వారికి ఆ పని అప్పగించాలి. వారి వారి రంగాలలో నిపుణులైన వారి మాటను ఆచరించాలి. అప్పుడే ఈ విపత్తునుండి దేశం బైట పడుతుంది. అదే ఈ గ్రూపుల ఏర్పాటు.

తెర వెనుక జరిగే వ్యవహారం ఇది. సరైన నాయకుడు లభిస్తే చాలు .... మన వైద్యులు, శాస్త్రవేత్తలు ఏ పనినైనా సాధించగలరు. ఆ విశ్వాసం ప్రజలలో కలిగించినవాడే నాయకుడు.

'అంతా నేనే' .... 'నాకు ఫుల్ మెజారిటీ ఉంది కాబట్టి నా అంత వాడు లేదు' అనుకుంటే దేశం నాశనం అవడానికి ఎంతో కాలం పట్టదు.

'రాజకీయం వేరు .... పరిపాలనా సామర్ధ్యం వేరు'

హెలికాప్టర్ మనీ.., మోడీకి అంత సీన్ ఉందా??

- కె.రాజా



భారీ వరదల్లో చిక్కుకుని, ప్రాణాలు దక్కించుకుని, ఓ ఇంటి కప్పుపైనో నిలబడి, ఆకలితో ఎదురుచూస్తున్న బాధితుడిపైకి ప్రభుత్వం హెలికాప్టర్ల ద్వారా ఆహారపొట్లం జారవిడిచినట్టేనా..! అదేనా కేసీయార్ చెప్పే హెలికాప్టర్ మనీ అంటే..? రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రత్యేక హెలికాప్టర్లలో ప్రగతి భవన్‌పైనో, తాత్కాలిక సచివాలయంపైనో డబ్బు మూటలు విడిచిపెట్టడమేనా..? హహహ... సరదాగా చెప్పుకోవటానికి బాగానే ఉంటుంది కానీ... హెలికాప్టర్ మనీ అంటే వేరు... ప్రభుత్వాల ఆదాయాలు పడిపోయినప్పుడు... మార్కెట్లో లిక్విడిటీ సంక్షోభం ఏర్పడినప్పుడు... అసాధారణ తరహాలో రిజర్వ్ బ్యాంకు ఎకనామీ బూస్టప్ కోసం అవలంబించే ఒక పద్ధతి... తక్కువ వడ్డీ రేట్లతో వివిధ రకాలుగా మార్కెట్‌లోకి మనీని పంప్ చేయడం... తద్వారా ఎకనామిక్ యాక్టివిటీని పెంచడం..!

మోడీకి కేసీయార్ మరో సూచన కూడా చేశాడు... సూచన కాదు, డిమాండ్ చేశాడు, లేఖ రాశాడు... క్వాంటిటేటివ్ ఈజింగ్ పద్ధతి ప్రవేశపెట్టాలన్నాడు... అంటే క్యూఈ పద్ధతి... కేసీయార్ రెండూ ఒకటే అన్నట్టుగా మాట్లాడాడు గానీ... హెలికాప్టర్ మనీ వేరు, క్యూఈ వేరు... క్యూఈ పద్ధతిలో ప్రభుత్వాలు ప్రవేశపెట్టే తక్కువ వడ్డీ బాండ్లను రిజర్వ్ బ్యాంకు తీసుకుని, నగదు ఇస్తుంది... ఎప్పుడు ఆర్థికమాంద్యం తలెత్తినా ఈ రెండు పద్ధతులూ చర్చల్లోకి వస్తాయి... మరీ ఆర్థిక పరిభాషలోకి వద్దు గానీ... మరి ప్రభుత్వాలకు ఆదాయం లేకపోతే, నగదుకు దిక్కులేకపోతే... మన చేతిలో పనే కదా... లక్షల కోట్లు అదనంగా ప్రింట్ చేస్తే సరిపోదా అనేవాళ్లూ ఉన్నారు.

ఎలాపడితే అలా కరెన్సీ ముద్రించటానికి ఉండదు... అలా చేస్తే మన కరెన్సీ చిత్తుకాగితాలతో సమానం అవుతుంది... ఏ దేశమైనా తన దగ్గర ఉన్న బంగారం నిల్వలు, విదేశీమారక నిల్వలను బట్టి ఎంత కరెన్సీ ముద్రించాలో అంతే ముద్రిస్తుంది... సరే, ఇక ఇప్పుడు అసలు విషయానికొద్దాం... నిజమే, తెలంగాణ రాష్ట్ర ఆదాయం ఏప్రిల్‌లో 4 వేల కోట్లు రావాలి... 100 కోట్లు వచ్చింది... మరెలా..? అందుకని డియర్ మోడీ భయ్యా, వెంటనే క్యూఈ పద్ధతి లేదా హెలికాప్టర్ పద్ధతి పెట్టేసెయ్ అంటున్నాడు కేసీయార్.

దానికి ఓ లెక్క చెబుతున్నాడు... మన దేశం స్థూల ఉత్పత్తి ఏడాదికి 203 లక్షల కోట్లు.. అందులో కనీసం 5 శాతం... అంటే ఓ 10 లక్షల కోట్లను ఆర్బీఐ ద్వారా మార్కెట్లోకి రిలీజ్ చేయాలని అంటున్నాడు... అంతేకాదు... ఎఫ్ఆర్బీఎం పరిమితి పెంచేయాలంటున్నాడు... అంటే, అప్పులు తీసుకోవటానికి ఇంకాస్త స్వేచ్ఛ అడుగుతున్నాడు... ఇప్పుడు పరిమితి 3 నుంచి 3.5 శాతమే... దాన్ని ఏకంగా 5 నుంచి 6 శాతం చేయాలంటున్నాడు... కేంద్రానికి కట్టాల్సిన అప్పులన్నీ రీషెడ్యూల్ చేయాలన్నాడు... 6 నెలలపాటు పైసా కూడా కట్టే సీన్ లేదుపో అంటున్నాడు... వడ్డీ రాయితీలు గట్రా చాలా కోరికలు మోడీ ముందు పెట్టాడు... అయితే..?

అసలు మోడీకి అవన్నీ తీర్చే సీన్ ఉందా..? లేదు..! ఎన్నాళ్లుగానో ఆర్బీఐ దగ్గర కొంత అదనపు మనీ ఉండేది... అత్యవసర స్థితిలో అది ఉపయోగపడేది... కానీ ఎందరు నిపుణులు చెప్పినా వినకుండా, కొందరిని ఇళ్లకు పంపించేసి మరీ... మొన్నమొన్న 1.75 లక్షల కోట్లను ఆర్బీఐ నుంచి తన ఖజానాకు మళ్లించుకుని మోడీ ప్రభుత్వం మొత్తం మింగేసింది

ఒక్క కేసీయార్‌కే కాదు... దేశం మొత్తం స్తంభించిపోయింది కాబట్టి కేంద్రానికి కూడా ఆదాయం లేదు... రాష్ట్రాలు వసూలు చేసిస్తేనే కదా కేంద్రానికి ఆదాయం... కేంద్రం కూడా బోలెడు అప్పులు, కిస్తీలు, మిత్తీలు కట్టాల్సి ఉంది... ఆమధ్య కరోనా దాటి నుంచి, ఆర్థిక మాంద్యం నుంచి కాపాడటానికి ఓ ఉద్దీపన పథకం ప్రవేశపెట్టారు... ఆ తరువాత మరో దఫా ప్రవేశపెట్టాలి కానీ... ఖజానాలో డబ్బుల్లేవు..! మరోవైపు కరోనాపై పోరాటానికి ఎన్నాళ్లు, ఎంత ఖర్చు చేయాల్సి ఉంటుందో తెలియదు... సో, కేసీయార్ కోరినట్టుగా హెలికాప్టర్ మనీ మార్కెట్‌లోకి పంప్ చేసే పరిస్థితులు పెద్దగా కనిపించడం లేదు..! ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలనే డిమాండ్ కూడా.. !!

పురోహితులకు కరోనా కాటు

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్



ప్రజలంతా ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని, సిరి సంపదలతో సుభిక్షంగా ముందుకు సాగాలని, నిత్యం దేవుని చల్లని ఆశీస్సులు మెండుగా ఉండాలని మంత్రాలు జపిస్తూ దేవదేవునికి సేవ చేసుకుంటూ సమాజంలో ప్రత్యేక సాంప్రదాయాలను పాటిస్తున్న అర్చకులు, పురోహితులు, నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలు సైతం కరోనా కాటుకి విలవిలలాడి పోతున్నాయి. నిత్యం మంత్రాలు జపించే ఆ గొంతుల్లో నేడు ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. భక్తులు చల్లగా ఉండాలని నిండు మనస్సుతో ఆశీర్వదించే ఆ చేతులు చేయూతనిచ్చే వారి కోసం ఆశగా ఎదురుచూస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలు ఆకలితో అలమటించిపోతున్నాయి. దేవాలయాల్లో పూజలు లేక తమకు కొద్దోగొప్పో చేయూతను అందించే భక్తులు ఆలయాలకి వచ్చే పరిస్థితి లేకపోవడం, సాధారణంగా జరిగే పూజలు, పెళ్లిళ్లు వంటి పవిత్ర కార్యక్రమాలు సైతం కరోనా ధాటికి రద్దు కావడంతో బ్రాహ్మణ కుటుంబాల్లో ఒక్కసారిగా చీకట్లు అలుముకున్నాయి. గత నెల 22వ తేది నుంచి రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలవుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ పరిధిలోని ప్రధాన ఆలయాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని దేవాలయాల్లో భక్తుల దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. కేవలం ఆలయాల్లో దేవతామూర్తులకు నిత్యం జరిగే కైంకర్యాలను ఏకాంతంగా జరుపుతున్నారు. దీంతో ఆయా దేవాలయాల్లో పనిచేసే ప్రధాన (ప్రభుత్వ) అర్చకులకు మాత్రం పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. వారికి సహాయకులుగా పనిచేసే తాత్కాలిక అర్చకులు, ఆయా ఆలయాల పరిధిలో ప్రత్యేక పూజలు , పునస్కారాలు జరిపించే ప్రైవేటు అర్చక పౌరోహితులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సాధారణ రోజుల్లో ఆయా దేవాలయాలకు వచ్చే భక్తులు వారి చేసే పూజలకు మెచ్చి కానుకల రూపంలో వారికి ఎంతోకొంత చేతులో పెట్టేవారు. అదే విధంగా వివిధ రకాల పూజల్లో పాల్గొని రోజుకు 500 నుంచి 1000 రూపాయల వరకు సంపాదించుకునే వారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి ఎక్కడా లేకపోవడం , దేవాలయాల్లో ఏకాంత పూజలు మాత్రమే జరుగుతుండడంతో పేద బ్రాహ్మణులకంతా పూట

గడవడమే కష్టంగా మారింది. దీంతో దేవుడా .. నీవే దిక్కు అంటూ బ్రాహ్మణ కుటుంబాలు ఆదుకునే వారి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి

రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల పరిధిలో సుమారు 23 వేల దేవాలయాలు ఉన్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ లెక్కలను బట్టి చూస్తే వాటిలో 115 దేవాలయాల వరకు కోటి రూపాయలకు పైగా ఆదాయవ వచ్చే ఆలయాలు ఉన్నాయి. విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవాలయం, శ్రీ కాళహస్తిలో శ్రీ కాళహస్తీశ్వర, కాణిపాకంలో వరసిద్ధి వినాయక, శ్రీశైలంలో మల్లికార్జున స్వామి, ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి, సింహాచలం నరసింహస్వామి, అన్నవరంలో శ్రీ సత్యనారాయణ స్వామి, మహానంది వంటి ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఉన్నాయి. అలాగే ఇవి కాకుండా ఏడాదికి 25 లక్షల నుంచి కోటికి పైబడి ఆదాయం వచ్చే ఆలయాలు కూడా ఉన్నాయి. అలాగే 2 లక్షల నుంచి 25 లక్షలు ఆదాయం వచ్చే 794 ఆలయాలు ఉండగా , కేవలం 2 లక్షల లోపు వచ్చే ఆలయాలు 22,788 దేవాలయాలు ఉన్నట్లు దేవాదాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇవన్నీ అధికారిక లెక్కలే అయినప్పటికీ ఇవి కాకుండా దేవాదాయ శాఖ పరిధిలో దూపదీప నైవేద్యం పథకం కింద మరో 1400 దేవాలయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా దేవాలయాలపై ఆధారపడి సుమారు 1,20,000 మంది అర్చకులు జీవనం సాగిస్తున్నారు.

అదే విధంగా ఆయా దేవాలయాల్లో అత్యవసర సమయాల్లో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తూ పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగించే బ్రాహ్మణులు అయితే 2 లక్షల వరకు ఉన్నారు. ప్రస్తుతం కరోనా కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో దర్శనాలను పూర్తిగా రద్దు చేయడంతో దేవాదాయ శాఖ పరిధిలో రెగ్యులర్ అర్చకులుగా ఉన్న వారికి మాత్రం జీతభత్యాలకు ఇబ్బంది లేకపోయినప్పటికీ తాత్కాలిక అర్చకులుగా పనిచేస్తున్న వేలాది మంది పేద బ్రాహ్మణులకు మాత్రం ఆర్థికంగా కష్టాలు మొదలయ్యాయి. వారితో పాటు పౌరోహిత్యం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే 2 లక్షల మంది నిరుపేద కుటుంబాలు సైతం గడిచిన నెల రోజులుగా పూజలు లేక .. పెళ్లిళ్లు జరగక .. చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్థికంగా చితికిపోతున్నారు.

ప్రభుత్వ సాయం కొంతమందికే పరిమితం

కరోనా నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థికంగా సతమతమవుతున్న అర్చకులను ఆదుకునేందుకు ప్రభుత్వం గత 10 రోజుల క్రితం వారికి కొంత చేయూతను అందించింది. అయితే దేవాదాయ శాఖ పరిధిలో అర్చకులుగా పేరు నమోదైన వారికి మాత్రమే ఆ మొత్తం అందింది. శాఖ పరిధిలో పేర్లు లేని నిరుపేద బ్రాహ్మణులకు మాత్రం అక్కడ కూడా మొండిచేయి మిగిలింది. వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా 1000కు పైన దేవాలయాల్లో దూపదీప నైవేద్యం కింద ప్రతి దేవాలయానికి నెలకి 3వేల రూపాయలను ఖర్చు చేస్తుంటారు. ఆ దేవాలయాల్లో పనిచేసే అర్చకులు కూడా ఆ సొమ్ములో నుంచే కొద్దోగొప్పో గౌరవ వేతనం అందుకుని, భక్తులు ఇచ్చే కానుకలపై ఆధారపడే జీవనం సాగిస్తుంటారు. ప్రస్తుతం ఆయా దేవాలయాలకి భక్తులు వచ్చి కానుకలు వేసే పరిస్థితి లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ బ్రాహ్మణ కుటుంబాలు ఆకలితో అలమటించిపోతున్నాయి.

జగత్సర్వం దైవాధీనం, తత్ దైవమ్ మంత్రాధీనంబీ తన్మంత్రం బ్రాహ్మణాధీనమ్, బ్రాహ్మణో మమ పరదేవతాః.. ఇది పురాణవాక్యం. జగత్తంతా దైవాధీనమైతే.. ఆ దైవం మంత్రానికి ఆధీనుడై ఉంటాడట. ఆ మంత్రం బ్రాహ్మణుడి ఆధీనంలో ఉంటుంది. కాబట్టి బ్రాహ్మణుడు పరదేవతాస్వరూపమని అర్థం. కానీ.. ఇప్పుడు కరోనా పుణ్యమా అని మంత్రం బ్రాహ్మణుడి ఆధీనంలో కూడా లేకుండాపోయింది. సాంకేతిక పరిజ్ఞానం ఆధీనంలోకి వెళ్లిపోయింది. రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలు కారణంగా వివాహాది శుభకార్యాలు వాయిదాపడ్డాయి. ఆకస్మికంగా చేపట్టాల్సిన కొన్ని కార్యాలు, అపరకర్మలను చేయించడానికి పురోహితులు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. పురోహితులు తాముంటున్న ప్రాంతాల నుంచి కిలోమీటర్ దాటి పోవడంలేదు. తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితుల్లో.. కార్యక్రమం నిర్వహించాల్సిన కర్త కోరిక మేరకు స్మార్ట్‌ఫోన్లలోనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాట్సాప్‌లు, జూమ్ వంటి వీడియో యాప్‌ల ద్వారాకానీ.. ఫోన్ ఆడియో ద్వారా కానీ సంకల్పంచెప్పి క్రియావిధానాన్ని వివరిస్తూ కార్యక్రమం పూర్తి చేయిస్తున్నారు. ప్రత్యక్షంగా కార్యక్రమాలను నిర్వహించలేకపోవడం వల్ల పురోహితుల ఆదాయం గణనీయంగా పడిపోయింది. అయినప్పటికీ ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ, సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. లాక్‌డౌన్‌ను పొడిగిస్తే.. ఆన్‌లైన్‌లో పూజలు పెరుగవచ్చు. కానీ.. ప్రత్యక్షంగా చేయాల్సిన శుభాశుభ కార్యక్రమాలు ఆగిపోవడం వల్ల తమకు ఆర్థిక కష్టాలు ఎదురుకావొచ్చని పురోహితులు ఆందోళన చెందుతున్నారు.

ఈ నెలలోనే ఎక్కువ ముహూర్తాలు

సాధారణంగా పురోహితులకు ముహూర్తాలు ఎక్కువగా ఉన్నప్పుడే ఆదాయం వస్తుంది. ఈ ఏడాది వివాహాలకోసం ముహూర్తాలు ఏప్రిల్ లోనే ఉన్నాయి. లాక్‌డౌన్ కారణంగా ఏప్రిల్ నెలంతా ఒక్క పెండ్లి కూడా జరుగని పరిస్థితి. శంకుస్థాపనలు, భూమిపూజలకు కూడా ఈ నెలలోనే అవకాశమున్నది. ఏప్రిల్ 30 దాకా లాక్‌డౌన్ పొడిగింపుతో అన్ని కార్యక్రమాలు వాయిదాపడక తప్పదు. ఒకవేళ మే 1 లాక్‌డౌన్ ఎత్తేసినా పురోహితులకు మాత్రం కలిసొచ్చేది ఏమీలేదు. మే 3 నుంచి వాస్తు కర్తరి, మే చివరలో శుక్రమౌఢ్యం మొదలవుతుంది. దీంతో నిర్మాణాలు, ప్రారంభాలకు బ్రేక్ పడుతుంది. జూన్ మొదటివారం దాకా ముహూర్తాలు కరువే. జ్యేష్ఠ మాసంలో వివాహ ముహూర్తాలు ఉన్నప్పటికీ కొన్ని మాత్రమే ఉన్నాయి. జూలైమాసం అంతా ముహూర్తాలు లేవు. శ్రావణమాసం ఒక్క నెల పురోహితులకు కలిసొచ్చేకాలం. భాద్రపదంలోనూ ముహూర్తాలు ఉండవు. ఇక ఆశ్వయుజ మాసంలో మహాలయ పక్షాల్లో పితృతర్పణాలు తప్ప ఇతరత్రా చేసేందుకు లేదు. అధికమాసంలో కార్యక్రమాలు చేయరు. నిజమాసంలో మాత్రమే శుభకార్యాలు చేయాల్సి ఉంటుంది. నవంబర్ తర్వాత కానీ పరిస్థితి చక్కబడదు. దీంతో లాక్‌డౌన్ ఎత్తివేసినా పేద బ్రాహ్మణులు మాత్రం ఆర్థిక సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుందని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

❑▫❑

లాక్ డౌన్... సమతుల్య ఇంటిభోజనం

- కె.ప్రసాద్



కొవిడ్-19 మన జీవితాలపై పెను ప్రభావాన్నే చూపుతోంది. లాక్‌డౌన్ వల్ల ముఖ్యంగా ఆహార అలవాట్ల పరంగా అధిక మార్పులు వస్తున్నాయి. ఇంట్లో తీసుకునే ఆహార పరిమాణమూ పెరిగింది. దాంతో పాటుగా బయట తీసుకునే ఆహారం గణనీయంగా తగ్గింది. హోటల్ ఇండస్ట్రీపై ఇది చూపే ప్రభావం ఎలాగున్నా నగరవాసుల్లో ఆరోగ్య పరంగా మాత్రం మంచి మార్పునకు నాంది పలుకుతోందని న్యూట్రిషియనిస్ట్‌లు, డైటీషియన్లు అంటున్నారు. ఈ లాక్‌డౌన్ పుణ్యమా అని ఇంటి ఫుడ్‌కు మించినదేముందంటూనే భారతీయ ఆహారపు అలవాట్లకు జై కొడుతున్నారు. ఆరోగ్యవంతమైన ఆహారంతో రోగనిరోధకశక్తి పెరిగి కరోనా నుంచి రక్షణ పొందొచ్చని పౌష్టికాహార నిపుణులంటున్నారు. ఇప్పుడు ప్రజల ఆలోచనా విధానంతోపాటు ఆహార అలవాట్లు కూడా మారాయి. ఉదయమే నిమ్మరసం తాగడం మొదలు పప్పుదినుసులు, ఆకుకూరలు వంటి వాటికి తమ డైట్‌లో చోటు కల్పిస్తున్నారు. సమీ-సబిన్సా గ్రూప్ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అంజు మజీద్ మాట్లాడుతూ విటమిన్ సి,ఇ తోపాటు కొన్ని రకాల హెర్బల్స్ వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు.

డైట్ ఎలా ఉండాలంటే...

ఉదయం పూట.. ఆరు గంటలకు టీ, కాఫీ లేదంటే లెమన్ జ్యూస్ లాంటివి తీసుకోవాలి. 6-7 గంటల మధ్యలో సింపుల్ వ్యాయామాలు చేయాలి. ఉదయం 7-8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేసుకుని, 9-10 గంటలకు జ్యూస్‌లు తాగాలి. 12.30-1 గంట లోపు లంచ్ తీసుకోవాలి. కాకపోతే బ్యాలెన్స్‌డ్ డైట్ ఇంపార్టెంట్. ఒక రోజులో అది కుదరదనుకుంటే వారంలో అయినా లభించేలా చూసుకోవాలి. మధ్యాహ్నం 3-4 గంటలకు స్నాక్స్ తీసుకోవాలి. సాయంత్రం 6-7 గంటల మధ్య డిన్నర్ పూర్తవ్వాలి. రాత్రి 9 గంటలకు గ్లాసు పాలు తాగితే మంచిది.

సమతులాహారం తీసుకుంటే మంచిది...

ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలి. శరీరానికి విటమిన్స్, మినరల్స్ కావాలి. విటమిన్ ఎ, బి, సి లాంటివి పండ్లు, కూరగాయల నుంచి వస్తాయి. టిఫిన్స్‌లో ఇడ్లీ, దోసెలను రోటి పచ్చళ్లతో తీసుకుంటే కొంత మేరకు బెటర్. క్యారెట్ తురుము, కొత్తిమీర, కరివేపాకు లాంటివి చట్నీలలో జోడిస్తే విటమిన్స్, మినరల్స్ అందుతాయి. తద్వారా ఇమ్యూనిటీ పెరుగుతుంది. జీర్ణక్రియకూ తోడ్పడతాయి. లెమన్, ఆరెంజ్ లాంటి సిట్రస్ ఫ్రూట్స్, టమాటా లాంటివి డైట్‌లో భాగం చేసుకోవాలి. మధుమేహ బాధితులకు కార్బోహైడ్రేట్స్‌తో ఇబ్బంది ఉంటుంది కదా అని అంటే కార్బోహైడ్రేట్స్‌లో రెండు రకాలుంటాయి. సింపుల్ కార్బో హైడ్రేట్స్‌లో రైస్ లాంటివి ఉంటాయి. కానీ, సింపుల్ కార్బోహైడ్రేట్‌ను కాంప్లెక్స్ చేయాలంటే రైస్ క్వాంటిటీ తగ్గించి, వెజిటెబుల్ కొంత, లీఫీ వెజిటెబుల్ కొంత యాడ్ చేసుకుంటే, బ్లడ్‌లోకి షుగర్ స్లోగా కలుస్తుంది. వెంట వెంటనే ఆకలిగా ఫీలవ్వకుండా మెయిన్‌టెన్ చేయొచ్చు. వైట్ రైస్ బదులు బ్రౌన్ రైస్‌లో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో ఉన్నా ఏదో ఒక సమయంలో వ్యాయామాలు చేస్తే బెటర్. రోజూ కనీసం రెండు రకాల పండ్లను తీసుకోవాలి.

- గాయత్రి, కన్సల్టెంట్ డైటీషియన్, అపోలో హాస్పిటల్స్, హైదర్‌గూడ

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి...

ఇప్పుడు ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. చాలా కుటుంబాల్లో సంప్రదాయ వంటకాలకు ప్రాధాన్యం పెరిగింది. సిట్రస్ ఫ్రూట్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. రోజుకు రెండు మూడు సార్లు నిమ్మరసం తీసుకుంటే మంచిది. విటమిన్ సి ఉంటే శరీరంలో ఐరన్ కంటెంట్ బాగుంటుంది. టమాటా కూడా తీసుకోవచ్చు. ఆయిల్స్‌తో ఫ్రైస్ కాకుండా కూరలు వండుకోవాలి. ఆకుకూరలను డైట్‌లో భాగం చేసుకోవాలి. కిచిడీ లాంటివి ఆరోగ్యానికి మంచిది. పుదీనా రైస్, లెమన్ రైస్ లాంటివి కూడా తీసుకోవచ్చు. స్నాక్‌లా బజ్జీలు తినడం కాకుండా వెజిటెబుల్స్, ఫ్రూట్స్ తీసుకోవాలి. టీ, కాఫీ తప్పదనుకునే వారు స్పైసెస్ జోడించుకోవాలి. రాత్రి పూట పుల్కా, రోటీలాంటివి తీసుకోవచ్చు.

- కమలజ, సీనియర్ సైంటిస్ట్, ఫుడ్ అండ్ న్యూట్రిషియనిస్టు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం



మోడీ...లాజిక్ ఏదీ?

- వై.మహేష్



గత నెలలో కరోనాను కట్టడి చేసేందుకు జనతా కర్ఫ్యూకు ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. దేశం యావత్తు చిత్తశుద్ధితో విజయవంతం చేసింది. అలాగే ఆ రోజు సాయంత్రం అందరూ చప్పట్లు కొట్టి వైద్య సిబ్బంది, పోలీసులను అభినందించారు. ఇంత వరకూ బాగానే ఉంది. ఎందుకంటే ప్రాణాలకు తెగించి సేవలందించే పనిలో వాళ్లున్నారు కాబట్టి. కొందరు పోలీసుల పనితీరు విమర్శలకు దారి తీస్తోంది. అది వేరే విషయం.

ఆ తర్వాత మూడు రోజులకు మోడీ మళ్లీ జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ దఫా 21 రోజుల పాటు లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చారు. మళ్లీ జనం ఆయన మాటపై గౌరవంతో లాక్‌డౌన్‌లో ఇంటి నుంచి బయటికి రావడం లేదు. ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వాళ్లను పట్టించుకునే దిక్కు లేదు. ఏదో మొక్కుబడిగా రేషన్‌కార్డు ఉన్న వాళ్లకి కాసిన్ని బియ్యాన్ని, ఇతర నిత్యావసర వస్తువులను అందచేస్తూ ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయి. మోడీ మళ్లీ శుక్రవారం ఓ వీడియో సందేశం ఇచ్చారు. ఈ ఆదివారం దేశ ప్రజలంతా కరోనాను తరిమి కొట్టే సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి 9 గంటలకు 9 నిమిషాల పాటు లైట్లు ఆఫ్ చేసి కొవ్వొత్తులు, దివ్వెలను వెలిగించాలని ఆయన పిలుపునిచ్చారు. 130 కోట్ల మంది తమ సమయాన్ని తనకివ్వాలని ఆయన కోరారు. సంకట సమయంలో 9 నిమిషాల పాటు తాను చెప్పినట్టు చేయడం వల్ల భారతీయులకు శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తుందని ఆయన నమ్మ పలికారు.

అసలు 9 నిమిషాల పాటు లైట్లు ఆఫ్ చేసి కొవ్వొత్తులు, దివ్వెలను వెలిగించడం వల్ల భారతీయులకు శక్తి, ఉత్సాహం ఎలా వస్తాయో బొత్తిగా అర్థం కావడం లేదు. కరోనా దెబ్బతో ఉపాధి కోల్పోయి జీవితాన్ని అంధకారం అలుముకుంటోంది. ఆల్రెడీ ప్రతి ఒక్కరి జీవితాల్లో చీకట్లు నింపే దిశగా కరోనా పయనిస్తోంది. తన కోసం సమయం ఇవ్వాలని మోడీ పదేపదే కోరుతూ...తొమ్మిది నిమిషాలు కొవ్వొత్తులు వెలిగించండి, లైట్లను ఆఫ్ చేయడం లాంటి మాటలు...ప్రజలను కేవలం మభ్య పెట్టేలా ఉన్నాయని ప్రతిపక్షాలతో పాటు ఇతరత్రా మానవ హక్కులు, ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఏదైనా ప్రజలకు తిండి పెట్టే పనులు చేయడం మానేసి...మభ్య పెట్టే మాటలు చెప్పడం ఒక్క మోడీకే చెల్లుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మోడీ చెబుతున్న దాంట్లో సైంటిఫిక్ రీజన్ ఏముందో, లాజిక్ ఏంటో ఎవరికీ అంతు చిక్కడం లేదు. పాలకుల మాటలు ప్రజల కడుపు నింపవు. ఇది మాటలతో మాయ చేసే తరుణం కాదు. చేతలకు పని చెప్పాల్సిన విలువైన సమయం.

అంబేద్కర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా?

- ప్రజామీడియా నెట్‌వర్క్



భారతదేశంలో ఉనికే లేని ప్రజలకు అస్తిత్వాన్ని కల్పించిన మహనీయుడా యన. దేశంలో దళితులను జంతువుల కంటే హీనంగా, పురుగుల కంటే నీచంగా చూసే ఈ నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను ధ్వంస రచన చేస్తూ మనువాదాన్ని మంటల్లో విసిరివేసిన ధీరోదాత్తుడు. దళితులు, పీడితుల విముక్తి– అభివృద్ధికై నిరంతరం తపించిన మహాజ్ఞాని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. అట్టడుగు వర్గాల..ఆశా జ్యోతి వై పుట్టావు ..! చిన్నతనం నుండి.. యెన్నో విమర్శలు, చీదరింపులు, అవమానాలు.. యెదురుకున్నా వు ..!! అమానుష.. అంటరానితనం వ్యాప్తిని.. కుల, జాతి, వివక్ష ను నిరసించిన.. నిర్మూలించిన మహానుభావుడు, మహనీయుడు ..!!!
దాహంతో వున్న తమ్ముడి దాహార్తిని తీర్చలేని, గుక్కెడు నీళ్ళు ఇవ్వలేని.. ధనిక, అమానవీయతకు.. క్షోభించిన హృదయం.. పాపం ఆ.. అంబేద్కరుడిదే ..!
“రాజ్యాంగం” ను రచియించిన అపర.. మేధావి, భారత రాజ్యాంగ ..నిర్మాత ..అతడు. మనిషిలో ..వుండవలసింది.. మానవత్వ.. జాడలే గాని, కుల మతాలు, ఉచ్ఛ–నీచాలు కాదని ..బల్ల గుద్ది చెప్పిన.. బారిష్టరు అతడు..!! పుట్టుక నీది, చావు నీది “బ్రతుకంతా.. దేశ సేవకు “అన్న కాళోజీ మాటను.. నిజం చేసిన గొప్ప.. స్ఫూర్తి ప్రదాత, మహా మహుడు.. అంబేద్కర్..!! ఆ మహనీయుని కి జయంతి శు భాకాంక్షలతో ..

పుస్తకాల పండగ

- కెబి.రమేష్



పుస్తకం ఒక మంచి స్నేహితుడులాంటిదని పెద్దలు చెప్తారు. ముద్రిత అక్షరాల విస్తరి పుస్తకం. అన్ని అలవాట్లలో కన్నా పుస్తక పఠనం అత్యున్నతం. సోషల్ మీడియా విస్తృతంగా వ్యాపించిన ఈ రోజులలో కూడా పుస్తక ప్రియులు ఎక్కువగా వున్నారని చెప్పవచ్చు. అందుకు ప్రత్యక్ష సాక్షి ఏటేటా జరుగుతున్న హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన. జ్ఞాన సముపార్జన కావాలనుకున్న ఏ వ్యక్తయినా పుస్తకాలతో సహవాసం చేయవలసిందే. ఫలానా పుస్తకం ఎక్కడ దొరుకుతుందో అని అనేక బుక్ స్టాల్స్ తిరిగే అవసరం లేకుండా సమస్త భాండాగారం ఒకే చోట లభించడం అనేది పుస్తక ప్రియులకు నిజంగా పండగే. హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గ్రౌండ్స్ (తెలంగాణ కళా భారతి)లో 33 వ జాతీయ పుస్తక ప్రదర్శన కొలువుదీరింది. ఈ ప్రదర్శనను గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇక్కడ కొలువుదీరిన ఎన్నెన్నో పుస్తకాలు సందర్శకులకు హస్తభూషణాలుగా మారాయి.

అక్షర బద్ధుడైన ప్రతి వ్యక్తి విజయం వెనుక ఒక మంచి పుస్తకం ఉంటుందని అంటారు. ప్రపంచ అత్యంత కుబేరుల్లో ఒకరైన వారెన్ బఫెట్ ప్రతిరోజూ కొన్ని వందల పేజీలు చదువుతారని ప్రతీతి. దాదాపు ఎనభైశాతం సమయాన్ని పుస్తక పఠనానికే కేటాయిస్తారట. అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మార్క్ క్యూబన్ రోజుకు మూడు గంటలపాటు పుస్తకాలు చదువుతారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఏడాదికి యాభై పుస్తకాలు చదవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుతారని చెప్తారు. మన ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇలా.. జీవితంలో ఉన్నతశిఖరాలను అధిరోహించిన వారందరి విజయం వెనుక పుస్తకం ఉంటుందని వారి అనుభవాలే మనకు తెలియ చెప్తున్నాయి. .

మన జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు వార్తాపత్రికలు,పుస్తకాలు పరిష్కారం చూపుతాయి. పుస్తకాలు చదివే అలవాటున్నవారికి సమస్యలేవైనా ఎదురైతే వాటికి తరుణోపాయం వెతుక్కునే గుండెధైర్యం నిండుగా వుంటుంది. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు మానసిక వికాసాన్ని కలిగించే పుస్తకాలను కూడా చదువుతుంటే భవిష్యత్తు బాగుంటుంది. హడావిడి జీవితాలతో, ఉరుకులు పరుగుల ఉద్యోగాలతో , సంపాదనకోసం చేసే ఆరాటంలో పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. ఇలాంటి పరిణామాల వల్ల చిన్న సమస్యలకే మనుషులు కుంగిపోతున్నారని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. పుస్తకాలను బహుమతులుగా ఇచ్చే సంస్కృతిని పెంపొందించాలని పుస్తక ప్రదర్శన నిర్వాహకులు కోరుతున్నారు. దీన్నొక సంప్రదాయంగా మలచాలని సూచించారు. చిన్నారులు విజయాలు సాధించినపుడు వారిని అభినందిస్తూ పుస్తకాలు అందజేయాలని, అలా చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుచేయాలని కోరారు.

దాదాపు 330 పుస్తక స్టాళ్లలో, లక్షలాది పుస్తకాలు కొలువుదీరాయి. వీటిలో తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ, తమిళం, ఆంగ్లంతో పాటు దేశంలోని పలు ప్రాంతీయ భాషల్లోని రచనల్ని అందుబాటులో వుంచడం జరిగింది. ఈ సారి వెలసిన పుస్తక ప్రదర్శన 33వది కాగా, తొలుత నగరంలో 1984లో చిక్కడపల్లిలోని కేంద్ర గ్రంథాలయం వేదికగా పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. ఆ తర్వాత కేశవ్ మెమోరియల్ మైదానం, ఎగ్జిబిషన్ మైదానం, నిజాం కళాశాల, పీపుల్స్ ప్లాజాలు వరుసగా పుస్తక ప్రదర్శనకు వేదికలయ్యాయి. అయితే గత కొన్నేళ్లుగా కవాడిగూడలోని ఎన్టీఆర్ స్టేడియంలోనే ఈ ప్రదర్శనను ఏటేటా నిర్వహిస్తున్నారు. పిల్లలకు వినోదాన్ని,విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు, పెద్దలకు ఆధ్యాత్మిక గ్రంథాలు ఇక్కడ కొలువుదీరాయి. గతంలో లాగే కొత్త రచయితల పుస్తకాలను పరిచయం చేసుకునే అవకాశం కల్పించారు.

అటు షష్టిపూర్తి.. ఇటు వివాహం!!

జాతీయం

- కూర్నన చంద్రమోహన్, సీనియర్ జర్నలిస్ట్



ప్రజాజీవితంలో ఉన్నవాళ్లలో కొందరి పెళ్లిళ్ల అంశం ఎప్పుడూ చర్చనీయాంశంగా ఉంటుంది... కొందరి పెళ్లిళ్లు అకస్మాత్తుగా చర్చల్లోకి వస్తుంటాయి... రాహుల్ గాంధీ పెళ్లి చేసుకోలేదు... అదుగో ఆమెను చేసుకుంటాడట అంటూ అకస్మాత్తుగా ఓ పేరు ప్రచారంలోకి వస్తుంది... నో, నో, ఆల్ రెడీ చేసేసు కున్నాడు, విదేశీ యువతి, విదేశాల్లోనే ఉంటుంది, అప్పుడప్పుడూ విదేశాలకు వెళ్లేది తనకోసమే అని మరో ప్రచారం తెరమీదకు వస్తుంది... పెళ్లి చేసుకుంటే ఇండియాకు తెచ్చేసుకోవచ్చు కదా అంటే, నో, నో, ఇప్పటికే తల్లి పరదేశీ, ఇక భార్య కూడా పరదేశీ అని తెలిస్తే రాజకీయంగా నష్టం కాబట్టి బయటికి చెప్పడం లేదు... పేరుకు బ్రహ్మచారి అని చెప్పుకుంటాడు అంటూ మరో సమాధానం కూడా ప్రచారంలోకి వచ్చేస్తూ ఉంటుంది.అదే కాంగ్రెస్‌కు సంబంధించి దిగ్విజయ్ సింగ్ చూడండి...

2013లో తన భార్య ఆశాదేవి మరణిస్తే, జస్ట్, రెండేళ్లలో అమృతసింగ్ అనే జర్నలిస్టును పెళ్లి చేసుకున్నాడు, బోలెడు ఏజ్ గ్యాప్, అప్పుడు తన వయస్సు ఏకంగా 68 ఏళ్లు... ఆ వయస్సులో పెళ్లేమిటయ్యా అనడిగితే, పెళ్లికి వయస్సుకూ లింకేమిటి అని ఎదురు ప్రశ్నించాడు తను... కావచ్చు, ఆ పెళ్లి కోసం ఆమె కూడా ఒత్తిడి తెచ్చిందట, లీగల్ హక్కులు కావాలి కదా మరి. మోడీజీ ఉన్నాడు... పెళ్లయ్యింది, చిన్నప్పుడే వదిలేశాడు, రాజసన్యాస యోగం పట్టాడు... తనది వేరే కథ... అదే యూపీ సీఎం యోగిని చూడండి, ఆజన్మ బ్రహ్మచారి తను... వాస్తవ సన్యాసయోగం... బీజేపీ ప్రముఖుల్లో కొందరు బ్రహ్మచారులే కాదు, బ్రహ్మచారిణులు కూడా ఉన్నారు... మన తెలుగునాట ఇలా బాగా చర్చల్లోకి వచ్చి, తెలుగు రాజకీయాలనే బాగా మలుపు తిప్పిన పెళ్లి ఏమిటయ్యా అంటే ఎన్.టి.ఆర్, లక్ష్మీపార్వతి పెళ్లి... పవన్ కల్యాణ్, కమల్ హాసన్ పెళ్లిళ్ల సంఖ్య మీద విమర్శలు, ఎత్తిపొడుపులు సరేసరి.... ఇప్పుడు తాజాగా ఏమిటంటే..? ఈయన పేరు తెలుసు కదా... ముకుల్ వాస్నిక్... కాంగ్రెస్ అధ్యక్ష పదవి వద్దే వద్దని గనుక రాహుల్ తన మొండిపట్టుకే కట్టుబడి ఉంటే... కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యే అవకాశాలున్నట్టు ప్రచారం జరిగిన వారిలో వాస్నిక్ పేరు కూడా ఉంది... పార్టీలో అంత సీని యర్ ప్లస్ అంత పవర్‌ఫుల్... పెళ్లి చేసుకోలేదు... తనూ బ్రహ్మచారే... ఇప్పుడు ఏమనుకున్నాడో ఏమిటో అకస్మాత్తుగా నేను పెళ్లి చేసుకుంటాను రండి అంటూ పార్టీలో సీనియర్లకు వర్తమానం పంపించాడు... ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో కొద్దిమంది ఆహ్వానితుల నడుమ పెళ్లి జరిగింది...

ఇప్పుడు తన వయస్సు 60 ఏళ్లు. తను చేసుకున్నది కూడా తన పాత దోస్త్ రవీనా ఖురానా... ముప్పయ్ ఏళ్లుగా వాళ్లు కలిసే ఉంటున్నారని అంటారు... ఆమె వయస్సు కూడా సేమ్ 60... ఈ పెళ్లికి రాజస్థాన్ సీఎం గెహ్లాట్, కాంగ్రెస్ వ్యవహారాల స్టీరింగ్ అహ్మద్ పటేల్ కూడా అటెండయ్యారు... మరి ఇన్నేళ్లు ఎందుకు చేసుకోలేదు, ఈ వయస్సులో పెళ్లి అనే ఆలోచన హఠాత్తుగా వచ్చిందేమిటీ అనేది ఢిల్లీ గుస గుస... కానీ అవి వాళ్ల పర్సనల్... వాళ్ల ఇష్టం... కరెక్టే, కానీ ఇన్నేళ్లూ ఆగీ ఆగీ అకస్మాత్తుగా మరీ ఈ లేటు వయస్సులో పెళ్లి అనే బంధంలోకి ఒదగాల్సిన అవసరం ఏమొచ్చింది అనేది ఇంట్రస్టింగు ప్రశ్న... ఎవరికి తోచిన సమాధా నాలు వాళ్లు చెప్పుకుంటూ ఉంటారు... పోనీలే... హేపీ మేరీడ్ లైఫ్ ముకుల్ అండ్ రవీనా.



కొందరికి సవాలు, కొందరికి శాపం

– **జి. చిన్నబ్బాయి,** జిల్లా ప్రధాన కార్యదర్శి, UTF విశాఖపట్నం జిల్లా.

NRC / CAB / CAA పేరు యేదైనా.. అది BJP పన్నిన పన్నాగం లో దేశ ప్రజలకు ఒక సవాలుగా.. కొందరికి శాపంగా మారింది.

BJP అధికారం చేపట్టిన మొదట నుండీ ఏదో ఒక సంచలనం సృష్టించి పబ్బం గడుపు కోవాలని చేస్తున్నట్లు అనిపిస్తోంది.

నోట్ల రద్దు, GST, కాశ్మీర్ ప్రత్యేక హెూదా, రామమందిరం, ట్రిపుల్ తాలాక్, surgical స్ట్రైక్స్, శబరిమలలో స్త్రీల ప్రవేశం..

ఇలా ప్రతీ అంశం తెరపైకి తెచ్చారు.. తద్వారా ప్రజల మనో భావాలను వాడుకొంటున్నారు. ప్రజలను వర్గాలు గా చీల్చి.. అధికారం తమ నుండి జారి పోకుండా ఉండేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు.

మోడీ ప్రభుత్వం చేసిన తప్పులకు ఫలితంగా ఈ రోజు మన దేశ ఆర్థిక వ్యవస్థ తిరోగామి పద్ధతి లో వెనుకకు మళ్ళిందని చెప్పాలి.

ఫలితంగా GDP 4.5 శాతానికి పడి పోయింది.

చాలా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేసి.. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరించడం చాలా దారుణం. దేశ భక్తి ముసుగులో కార్పొరేట్లకు సేవ చేయడం ప్రజలు గమనిస్తున్నారు.

ఆ సంచలనాల లో భాగమే ఢిల్లీ అల్లర్లు జరగడానికి కారణం అయిన NRC / CAA /CAB.

ప్రజల కోసం ఉపయోగపడే ఏ విధమైన పని చేయకుండా కాలం వెళ్లదీస్తున్న BJP కి.. ప్రజల దృష్టి మళ్లించే పనే ఈ NRC.

ఈ దేశవాసిని అనడానికి తగిన ఋజువులు చూపలేకపోతే విదేశీయులమవుతామా? సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్పీఆర్ సమస్య ఇది.

దీన్ని హిందూ, ముస్లిం సమస్యగా చర్చలోకి తెచ్చి, హిందూ ఓట్లను కొల్లగొడదామని అధికార పార్టీ BJP పన్నిన వ్యూహం.

ఈ దేశంలో పుట్టిన వారందరూ, వారి పిల్లలూ భారతపౌరులే అనే సార్వజనిక విశ్వజనీన నియమం ప్రకారం రాజ్యాంగం వారికి పౌరసత్వం లభిస్తుందని నిర్దేశించింది. రాజ్యాంగం, 1955 పౌరసత్వ చట్టం, దానికి చేసిన అన్ని సవరణలలో కూడా ఆ అధికారాన్ని ప్రభుత్వానికి, పార్లమెంటుకు ఇవ్వలేదు. కానీ దాన్ని చట్టంద్వారా కాకుండా, రూల్స్ ద్వారా కేంద్రం చేజిక్కించుకుని రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు అప్పగించడం దారుణం.

కేంద్రానికి కొందరు విదేశీయులకు, వలసదారులకు, శరణార్థులకు పౌరసత్వం ఇచ్చే విచక్షణాధికారం ఉంది. దాన్ని 1955 చట్టం స్పష్టంగా గుర్తించింది. ప్రపంచంలో ఏ ప్రభుత్వానికైనా బయటనుంచి వచ్చే కాందిశీకుల పౌరసత్వాన్ని నిర్ధారించే, నిరాకరించే అధికారం పూర్తిగా ఉంటుంది.

కానీ, రాజ్యాంగాన్నే ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా సవరించిన ప్రభుత్వం నియమాలు మార్చడం ద్వారా చట్టం లక్ష్యాలను అతిక్రమించే ప్రయత్నం చేస్తున్నది. ముస్లింలను మతం ప్రాతిపదికన మినహాయించడం రాజ్యాంగ వ్యతిరేకమే.

ఎన్ఆర్సీ జనపట్టిక వివరాలతో పౌరసత్వానికి ప్రమాదం వస్తుందని ఊహించలేం. ఆ ప్రమాదాన్ని చాలా జాగ్రత్తగా రూల్స్ రూపంలో ప్రవేశపెట్టారు. ఈ లంకె 2003లోనే పెట్టారు. జనపట్టిక వివరాలు సరిచూసి, దాని ప్రాతిపదికగా పౌరపట్టిక తయారవుతుందని చాలా స్పష్టంగా రూల్స్‌లో ప్రకటించి, అదేమీ లేదని, ప్రచారం చేస్తున్నారు.

నిజానికి జనపట్టికలో వచ్చిన వివరాలను సరిపోల్చినపుడు అనుమానం వస్తే పౌరుడిని సందేహాస్పద పౌరుడుగా వేరు చేసి రిజిస్టర్ చేయకుండా ఆపే అధికారం కిందిస్థాయి వరకు ఇచ్చారు. అనుమానిత పౌరుడు జిల్లా మేజిస్ట్రేట్ ముందు అప్పీలు చేసుకోవాలి. అతను కూడా కింది అధికారుల నిర్ణయాన్ని ఆమోదిస్తే ఆపౌరుడి గతి అధోగతే. ఇక్కడ కేంద్రం ఇంకో వల పన్నింది. అదేమంటే పౌరసత్వం చట్టం కింద చేసిన నియమాలలో సందేహంతో ఆపివేసి, మిగతా పరిణామాల గురించి ఫారినర్స్ ఆర్డర్ కింద రూల్స్‌లో కొత్త చేర్పులు చేసింది. దాంతో సీఏఏకు, ఎన్ఆర్సీకి కొత్త లంకె వేశారు. మామూలుగా బయటపడని ఈ లంకెను ఫారినర్స్ చట్టం 1946లో చేశారు. దీనికింద 1964లో ఫారినర్స్ ట్రిబ్యునల్ ఆర్డర్ రూపొందించారు.

అనుమానించిన ప్రతి పౌరుడిపై విదేశీయుడుగా ముద్రపడే ప్రమాద స్థలం ఈ ట్రిబ్యునల్. దీని కారణంగా ఎన్నో దశాబ్దాలనుంచి దేశంలో ఉన్న పౌరులు మతంతో పనిలేకుండా వలసవచ్చిన వారితో సమానంగా, చొరబాటుదారులుగా లేదా శరణార్థులుగా భావింపబడే ప్రమాదానికి గురి అవుతారు. దేశంలో ఎంత మంది ప్రజల దగ్గర తాము పౌరులమని రుజువు చేసుకోగల పత్రాలు ఉన్నాయి? ఉన్నా తుఫాన్ లోనో మరో కారణం వల్లో కోల్పోతే వారి గతి ఏమిటి? వీరంతా విదేశీయులైపోతారు కదా? కనుక ఇది ముస్లింలు, సెక్యులరిస్టులు, వామపక్షాలు అనుకుంటున్నట్టు కేవలం ముస్లింల వేర్పాటు సమస్య కాదు. విదేశీ ముస్లింల సమస్య కూడా కాదు. ఇది ఈ దేశంలో పుట్టి ఈ దేశంలోనే దశాబ్దాల నుంచి ఉంటున్న ప్రతి వ్యక్తి ఎదుర్కోవలసిన గడ్డు సమస్య.

పౌరసత్వం ముస్లింలకు మతం పేరుతో దూరం చేయడం అరాచకం అవుతుంది. 1974 కు ముందు మన పూర్వీకులజన్మ కు సంబంధించిన డాక్యుమెంట్లు ఇప్పుడు ఈ చట్టం ప్రకారం ప్రొడ్యూస్ చేయడం చాలా వర్గాలకు అసాధ్యం.. ముఖ్యంగా చదువు కు దూరంగా ఉన్న SC STలు మరియు శూద్ర వర్గాలు ఈ డాక్యుమెంట్లు లేక శరణాలయంల (detention camps) కు అస్సామ్ లో మాదిరి తరలి పోయే ప్రమాదం ఉంది.

అస్సామ్‌లో చేసిన NRC సర్వే లో సుమారుగా 19 లక్షల మంది తమ పౌరసత్వం నిరూపించుకో లేక capmeలలో మగ్గుతున్నారు.

అందులో విచిత్రంగా 17 లక్షల మంది హిందువులు!.

ఈ సంఘటన తరువాత దేశంలో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు NRCకి తాము వ్యతిరేకమని ప్రకటించాయి. అయినా అమిత్‌షా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ మేము NRC నుండి వెనుకకు మళ్లేది లేదని ప్రకటనలు చేయడం వల్ల ఇంకా చాలా మంది ప్రజలు అభద్రతా భావంలో మరియు ఘర్షణ వైఖరి లో చిక్కుకున్నారు. విభజించి పాలించడం BJP.. దాని మూల సంఘాలు.. బ్రిటిష్ వారి నుంచి నేర్చుకున్నారు.

ఎంతైనా వారి మూల పురుషుడు V.D Savarkar బ్రిటీష్ వారి కి క్షమాపణలు చెప్పి విధేయుడు గా ఉంటామని మాట ఇచ్చాడు కదా!

ఇప్పటికైన ప్రజలు ఈ కాషాయ మూక ల కుట్రలు తిప్పి కొడతారని ఆశిస్తు..

ఇది ఇల్లనుకున్నారా! ఆఫీసనుకున్నారా!

\- కె.సి.పున్నయ్య



ఉపద్రవాల్లో ద్రవాలను వెతకవచ్చు. నిజానికి శబ్దంగా ఉపద్రవంలో ద్రవం ఉండనే ఉంది. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవడం కొందరికి నెస్లే సెరిలాక్ తో పెట్టిన విద్య. అలా అవకాశాలుగా మలచుకోవడానికి సంక్షోభాలు రాకపోతే వారు క్షోభ పడతారు. ఇప్పుడు జగతికి కరోనా సంక్షోభం. ప్రపంచ పారిశ్రామిక జగతికి కరోనా కొట్టిన దెబ్బకు జరిగిన నష్టం లెక్కకట్టడానికి సున్నాలు చాలడం లేదు. ఒక్క భారత దేశంలో పదిరోజుల కరోనా లాక్ డౌన్ నష్టం అక్షరాలా ఏడున్నర లక్షల కోట్ల రూపాయలు. ఈ లెక్కన కరోనా కనుమరుగై, గృహనిర్బంధాల ఆంక్షలు సడలి, ముక్కుమూసుకుని ప్రపంచం మళ్లీ రోడ్డుమీద పడేలోపు జరిగే ఆర్థిక నష్టం ఊహాతీతం.

అసలే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనంతో భారత పారిశ్రామిక రంగం బిక్కచచ్చి దిక్కులు చూస్తోంది. మూలిగే నక్కపై కరోనా వైరస్ పడ్డట్లు ఇప్పుడు పారిశ్రామిక రంగానికి జరిగిన కొల్లాటరల్ డామేజ్ అంతా ఇంతా కాదు. ఇంగ్లిష్ బిజినెస్ దినపత్రిక ఎకనమిక్ టైమ్స్ లో ఒక వార్త వచ్చింది. ఆఫీసుకు రావాల్సిన అవసరం లేని కొన్ని ఉద్యోగాలు ఇంటి నుండే చేసుకోవడానికి వీలుగా "వర్క్ ఫ్రమ్ హోమ్" పద్ధతి ఎప్పటినుండో ఉన్నదే. ప్రత్యేకించి సాఫ్ట్ వేర్, కన్సల్టెన్సీ లాంటి రంగాల్లో ఇప్పటికే వర్క్ ఫ్రమ్ హోమ్ ఉంది. కరోనా స్వీయ గృహ నిర్బంధం ఆంక్షలతో ఈ రంగాల వారు మరింతగా ఖర్చు తగ్గించుకునే అవకాశాలను అన్వేషించడానికి రకరకాల ఐడియాలు వచ్చాయన్నది టైమ్స్ వార్త సారాంశం.

నిజానికి ఇంటర్నెట్, ఈ మెయిల్స్, వీడియో కాన్ఫరెన్స్ కాల్స్ వచ్చాక భౌతిక మయిన పెద్ద పెద్ద ఆఫీసులకంటే వర్చువల్ ఆఫీసుల భావన పెరిగింది. కాకపోతే భారతీయ ఫ్యూడల్ భావజాలంలో యజమాని ముందు బిక్కుబిక్కు మంటూ ఉద్యోగి ఫిజికల్‌గా కనిపించకపోతే యజమాని ఈగో సాటిస్‌ఫై కాదు. ఉద్యోగికి కూడా ఉద్యోగం చేస్తున్న ఫీలింగ్ కలగదు. ఎందుకూ కొరగాని, ఎక్కడా బతకలేని, చదువురాని ఉద్యోగులను దయతో, అనవసరంగా భరిస్తున్నట్లు యజమాని ప్రతిక్షణం అనుకుంటూ, విసుక్కుంటూ ఆ విషయం స్పష్టంగా ఉద్యోగులకు చెబుతూ ఉంటాడు. అక్షరం ముక్క రాని యజమాని, ఆయన పరివారం అనంతంగా జ్ఞానాన్ని నూరిపోయడం అర్థంకాక, అర్థం చేసుకోలేక ఉద్యోగులు సర్దుకుపోతుంటారు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఉద్యోగం పోగొట్టుకుంటారు. ఉద్యోగి అన్న శబ్దంలోనే ఇరుక్కున్న ఫీలింగ్ ఉంది. యజమానికి ఒత్తుల్లేవు. కానీ యజమాని అందరినీ ఒత్తగలడు/దు. శబ్దం తేలికగా, గంభీరంగా, అహంభావంగా ఉంది. అలాగే ఉండాలి కూడా. యజమాని పిల్లలు విదేశాల్లోనే చదివి రావాల్సిన చారిత్రక, సామాజిక, భౌతిక, ఆర్థిక అవసరాలను ఆ భగవంతుడు సృష్టికి పూర్వమే డిజైన్ చేసి పెట్టాడు కాబట్టి ఇది డిబేటబుల్ సబ్జెక్ట్ కాదు. దాంతో వారు విదేశీ విజ్ఞానంతో స్వదేశీ బుర్రలేని ఉద్యోగుల మెదళ్ల మీద అనుక్షణం జాలిపడుతూ పనిచేయించుకోవాల్సి రావడం సృష్టి లోపమే కానీ, దృష్టి దోషం కాదు. ఆఫీసు అన్న తరువాత ప్రతి ఉద్యోగికి ఫ్యాను, ఫోను, ప్యూను, రాను పోను ఖర్చులు, క్యాంటీను, పి ఎఫ్, ఈ ఎస్ ఐ, బోనస్, గ్రాచ్యుటి, ఇంక్రిమెంట్, ఆర్జిత సెలవులు , అనార్జిత సెలవులు. . . ఇలా నానా బాదర బందీ. అదే ఇళ్లల్లో కూర్చుని పని చేసుకోండి– అంటే ఏ సి, నెట్టు, పేపర్, టీ కాఫీ, టేబులు , కుర్చీ , లైటు , ప్రింటరు , పవర్ కనెక్షన్ అన్నీ వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగి బాధ్యత. యాజమాన్యాలకు హీన పక్షం ముప్పయ్ శాతం ఖర్చు తగ్గుతుందట. లాక్ డౌన్ లో కొన్ని కొత్త అనుభవాలు, పాఠాలు, గుణపాఠాలు దొరికాయి. ఇంతకు ముందు ఖచ్చితంగా ఆఫీసుకొచ్చి చేయాల్సిన పనులు ఇప్పుడు ఇళ్ళనుండి ఉద్యోగులు చేయగలుగుతున్నారు. దాంతో భారత కార్పొరేట్ రంగానికి కొత్త ఐడియాలు పుట్టుకొచ్చాయట. ఇక మీరు ఇళ్లకే పరిమితం కండి. ఆఫీసుకు రానే వద్దు. ఇళ్లనుండే పనిచేయండి– ఇంటికే జీతం పంపిస్తాం. మీ ఖర్మ కాలిన రోజు ఉద్యోగం ఊస్టింగ్ మెయిల్ కూడా మీ మెయిల్ బాక్స్ లో పడేస్తాం. ఆఫీసుకొచ్చి మీ మొహం కూడా చూపించాల్సిన పనిలేదు. మీ మొహం చూడాల్సిన అవసరం మాకు లేదు– అని చెప్పదలుచుకున్నాయట

ఇది ఇల్లనుకున్నారా? ఆఫీసనుకున్నారా?

అన్నది ఇక ఎంత మాత్రం తిట్టు కాదు.

ఇలా ఉంటే రోజూ వివాహ దినోత్సవం'

- ఆర్. శ్రీనివాసరావు



శ్రీనివాస్ నమ్మకం, గౌరవం, కష్టాలు వచ్చినప్పుడు ఒకరికొకరు అండగానిలబడడం, మానసికంగా మనసా, వాచా కర్మేణా తన భాగస్వామితోనే జీవన సౌఖ్యం పొందడం, సత్సంతానంగా పుట్టిన బిడ్డను పెంచి పెద్ద చేయడం, ఇద్దరి తల్లిదండ్రులను గౌరవించి ఆదరించడం, వృద్ధాప్యంలో తోడూనీడగా జీవన సంధ్యలా గడుపుకోవడం! ఇదే వివాహ బంధం.. ఇలా ఉంటేనే అది అన్యోన్య దాంపత్యం.. పెండ్లంటే ఇంకేదో కాదు. ప్రేమలో పడడం. ప్రతిరోజూ ఒకే వ్యక్తితో ప్రేమలో పడడం. ఆ ప్రేమలో ఎంత లోతు మునిగితే, పెండ్లి అంత విజయవంతమైనట్టు. ప్రత్యేక కథనం

వివాహం ఒక లేలేత గులాబీ లాంటిది. కంచె పెట్టినంత శ్రద్ధగా, నీళ్ళు పోసినంత ప్రేమగా, ఎరువులేసినంత నైపుణ్యంగా... వివాహ బంధాన్నీ కాపాడుకోవాలి. అప్పుడే కాపురం పచ్చగా ఉంటుంది!

వివాహ వ్యవస్థలో ఎన్నో లోపాలున్నాయి.. కోపాలున్నాయి.. గొడవలున్నాయి.. రాజీలున్నాయి.. అయితే ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ఒక ఆడ, ఒక మగ.. ఇద్దరినీ ఒక్కటి చేసేందుకు ఇంతకంటే బలమైంది.. ఇంతకంటే పవిత్రమైంది.. ఇంతకంటే చట్టబద్ధమైంది.. ఇంకేమార్గం లేదు వైవాహిక జీవిత ప్రాముఖ్యాన్ని గుర్తిస్తూ సమాజనిర్మాణానికి ఆధారం, భార్యాభర్తల్ని కుటుంబ పెద్దలుగా భావించి, గౌరవించే సంప్రదాయాన్నీ పాటించాలని దాన్నో సంస్కృతిగా అలవరుచుకోవాలనే సందేశము అందిస్తోంది.

సరిదిద్దుకోవాలి..

ప్రేమకు షరతులుండవు. 'నిబంధనలు వర్తిస్తాయి' అన్న నక్షత్రం గుర్తులుండవు. మనకు నచ్చని క్షణాలు ప్రేమించుకుంటున్న రోజుల్లోనో, పెండ్లయిన కొత్తలోనో బయటపడకపోవచ్చు. బయటపడినా, ఆకర్షణ తీవ్రత వల్ల అంత తీవ్రంగా అనిపించకపోవచ్చు. ఆ తర్వాత అసంతృప్తిగా అనిపించవచ్చు. అయినా సరే.. ఆ లోపంతో సహా ఎదుటి వ్యక్తిని ప్రేమించాలి. అలాగని వ్యసనాల్ని, దురలవాట్లని ప్రోత్సహించమని కాదు. అలాంటివి ఉంటే, చర్చించుకోవాలి. సరిదిద్దుకునే అవకాశం ఇవ్వాలి. అందుకు మనవంతు సహకారం తప్పక అందించాలి.

వ్యక్తం చేయాలి..

ఖర్చుచేసినప్పుడే డబ్బుకు విలువ. ప్రేమ కూడా అంతే. గుండెనిండా ఉండొచ్చు. మనసులో గుడి కట్టుకొని ఉండొచ్చు. ఎప్పుడైనా చెప్పారా?, నువ్వంటే నాకిష్టమని మనసు విప్పారా? వ్యక్తం చేసినప్పుడే ప్రేమకు విలువ. ప్రేమను వ్యక్తం చేయడానికి ఒక మార్గం... నిజమైన ప్రశంస. అవును, ప్రశంస పాయసంలో జీడిపప్పులాంటిది. కాపురాలకి కొత్తరుచి తెస్తుంది. అలాగని స్తోత్రపాఠాలు చెప్పనక్కర్లేదు. మనస్ఫూర్తిగా ఓ మాట చాలు. కాస్త రొమాంటిక్‌గా చెప్పడం అదనపు ఆకర్షణ.

మనసు విప్పి మాట్లాడుకోవాలి

ప్రతి క్షణం భాగస్వామితో కలిసి గడపాలనుకోవడం అంత మంచిది కాదు. అంటి పెట్టుకు తిరగడం వలన, వెన్నంటి ఉండడం వలన అతడు / ఆమె కు ఆ పరిస్థితి ఇబ్బందికరంగా ఉండవచ్చు. దానివలన ఏం చేయడానికైనా సరిగా ప్రయత్నించలేరు. సహా చెప్పడాడుకి సమయానికి ఆయనో, ఆవిడో లేదని అనుకోని పరిస్థితి ఎదురయ్యే విధంగా మసులుతూ ఉండాలి. అభిప్రాయాలు నిర్మొహమాటంగా వెల్లడించుకోవాలి. ప్రశాంతంగా వ్యవహరించుకోవాలి. ఆరోపణ, అభియోగా ధోరణి ఉండకూడదు. ఇద్దరి మధ్య చర్చ ఉండకూడదు, స్పష్టత ఉండాలి. భాగస్వాముల్లో ఏకపక్ష నిర్ణయాలు ప్రయత్నాలు ఆశించినంత ఫలితాలివ్వవు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉండకూడదు. వారాంతం రోజుల్లో షికారులు, సినిమాలు ఉండాలి. పెళ్ళిళ్ళ ఫంక్షన్లు, గుడి గోపురాలకు కలిసే వెళ్లాలి. భక్తి అయినా రక్తి అయినా ఒకే బాటలో నడవాలి.

రాజీ పడడం అవసరం

నమ్మకం ఎంత బలంగా ఉంటే కాపురం అంత సంతోషంగా ఉంటుంది. ఎంత బలహీనపడితే, అంత నరకం అవుతుంది. నమ్మకం ఉన్నచోట అభద్రత ఉండదు.. అనుమానాలు ఉండవు.. హింస ఉండదు.. రహస్యాలు ఉండవు.. వాటిని కప్పిపుచ్చుకోడానికి ఆత్మవంచనలుండవు. నమ్మకం ఒకరోజులో ఏర్పడదు. ఒకరోజుతో బలపడదు. ఇద్దరూ కలిసి దాన్నో బిడ్డలా పెంచి పెద్దచేయాలి.

'సముద్రంలో కెరటాలు ఎంత సహజమో, సంసారంలో అంతే సహజం. ఎంత ఎగిరిపడినా కెరటం సముద్రాన్ని వీడిపోనట్టే.. సంసారంలో ఎంతటి తీవ్రస్థాయి తగువు చోటుచేసుకున్నా భార్యాభర్త బంధం విచ్చిన్నం కాకూడదు' అన్నది పెద్ద మాట. ఆలుమగలు ఒకరినొకరు అర్థం చేసుకొని అన్యోన్యంగా ముందుకు సాగితే సంసారం సాఫీగా సాగుతుంది. అయితే కాపురం అన్నాక తగువు సహజం. ఏదోక సందర్భంలో చిచ్చు రేగడం ఖాయం. ఇటువంటప్పుడే భార్యాభర్త పట్టువిడుపు ప్రదర్శిస్తే సంసార జీవితం సుఖమయమవుతుంది. కుటుంబ వ్యవస్థ పరిఢవిల్లుతుంది.

పెండ్లనేది రెండు మనసులు ముడివేసే బంధం. మనసున మనసై, బతుకున బతుకై తోడునీడుగా ఒకటయ్యేందుకు జీలకర్ర బెల్లం సజీవ సాక్ష్యం.. ఒక జంట జీవితాంతం కలిసి సాగించే జీవనయానానికి ఏడడుగులే నాంది. ఎన్నటికీ విడిపోమని బాస చేసుకొని కోటి ఆశలతో కొత్త కాపురాలు ఆరంభిస్తారు దంపతులు. కొత్తలో అన్యోన్యంగా సాగిన

సంసారాల్లో తర్వాత వచ్చిపడే బాధ్యత కారణంగా తగువులు రేగుతుంటాయి. ఆలుమగల మధ్య అపార్థాలు అనుమానాలకు ఆస్కారం ఏర్పడితే దూరం పెరుగుతుంది. కాపురం కల్లోల కడలిలో చిక్కుకున్న నావ చందంగా తయారవుతుంది. భార్యాభర్త మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తకుండా చూసుకోవాలి. గొడవలు రేగినప్పుడు ఎవరో ఒకరు సర్దుకుపోతే సమస్యే ఉండదు.

ఆధునిక కాలంలో ఆలుమగల బంధం పుంచబడుతున్నట్టు కనబడుతోంది. ఆధిక్య భావనతో అభిప్రాయాలు అభిరుచులు కలవకపోయినా విడిపోయేం దుకూ వెనుకాడడం లేదు. చిన్న చిన్న విషయాలకే వివాహ బంధాన్ని విచ్ఛిన్నం చేసుకోవడం వేడుకగా మారిందిప్పుడు. స్వల్ప పొరపొచ్చాకే వైవా హిక బంధం తెంచేసుకుంటున్న దంపతుల సంఖ్య క్రమేపీ అధికమ వుతుండడమే దీనికి నిదర్శనం. వైవాహిక విచ్ఛిన్నం సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మానవీయ విలువులు కూడా ప్రశ్నార్థకమ వుతున్నాయి. సమాజంలో ఒంటరి మహిళే అనేక విధాలుగా దోపిడీకి, వేధింపులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా దంపతులు ఆదిలోనే సమస్యను పరిష్కరించుకుంటే విడాకుల ఊసే ఉండదు.

పెండ్లంటే నూరేళ్ల పంట. దంపతులిద్దరు పరస్పర అవగాహనతో కలిసి ముందుకు సాగితే సంసారం సుఖమయమవుతుంది. సర్దుబాటుతో సహకరించుకుంటూ, ఒకరికొకరు తోడుంటే వివాహ బంధం విరాజిల్లుతుంది. పంతాలు పట్టింపులకు తావులేకుండా నడుచుకుంటే ఆ కాపురం పది కాలాలు పాటు పచ్చగా ఉంటుంది. కుటుంబం బావుంటే సమాజం బాగుంటుంది. సమాజం సవ్యంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుంది.

మనసుపెట్టి ప్రయత్నిస్తే..ఉరుకుల పరుగు జీవితం వైవాహిక బంధాల్ని సైతం ప్రశ్నార్థకంగా మార్చుతోంది. పెళ్లంటే నూరేళ్ల పంట అంటారు. కానీ ఇప్పుడా వివాహబంధం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇద్దరు మనుషులు కలిసి జీవించడానికి కావలసిన వాతావరణం ఇవాల్టి సమాజంలో కనిపించడంలేదు. ఒకరినొకరు అర్థం చేసుకోవడం, సర్దుకోవడం అనే మాటకు స్థానం కరువవుతోంది. ఫలితంగా వివాహబంధం మూణ్నాళ్ల ముచ్చటగా మారుతోంది. చిన్న చిన్న విషయాలకే తగువు పడేవారు... బంధాన్ని తెంచుకుందామనుకునేవారు రోజు రోజుకూ పెరుగుతున్నారు. ఇళ్లు.. ఉద్యోగం.. వంటి బాధ్యతల్లో తలమునకలూ తీరికలేక జీవితాన్ని గడుపుతుండడం కూడా అందుకొక కారణమంటున్నారు విశ్లేషకులు. కానీ కాస్త మనుసు పెట్టి ప్రయత్నిస్తే.. వైవాహిక జీవితాన్ని సంతోషంగా గడపవచ్చని సూచిస్తున్నారు.

చిన్న చిన్న కారణాలను విస్మరించాలి..

పెండ్లికి ముందు జీవితాల్లో ఉన్న ఆనందం పెండ్లి తరువాత లేదని చెప్పేవాళ్లే ఎక్కువ. ఓ ప్రయివేటు సంస్థ దేశవ్యాప్తంగానిర్వహించిన సర్వే ఇదే విషయం స్పష్టమైంది. పెండ్లికి ముందు సంతోషంగా గడిపిన జంటలే పెండ్లయిన కొన్నాళ్లకే అనాసక్తిగా గడుపుతున్నట్టు సర్వేలో స్పష్టమైంది. అందుకుఉద్యోగాలు ఆర్థికపరమైన కమిట్‌మెంట్స్ ప్రధానమవుతుండడంతో కుంటుంబాన్ని నెట్టుకురావడంపైనే ధ్యాస ఉంటోంది తప్ప ఆనందంగా గడపాల్సిన క్షణాల్ని విస్మరిస్తున్నారని విశ్లేషకలు అంటున్నారు. బయటకువెళ్లడం, సరదాగా గడపడం వంటివి కూడా తగ్గిపోతున్నాయని అంటున్నారు. కాస్తో కూస్తో సమయం చిక్కినా.. దాన్ని సద్వినియోగం చేసుకోవడం కష్టంగా మారుతోంది. దీంతో వైవాహిక జీవితాల్లో సంక్లిష్టత పెరిగి.. నిత్యం వందలాది జంటలు కోర్టు చుట్టూ పడుతున్నాయి. సినిమాకి వెళ్దామంటే రాలేదని, రాత్రి గురక పెడుతున్నారనే కారణాలకు సైతం విడాకులు తీసుకున్న దాఖలున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితి. దీనినుంచి బయటపడేందుకు తమకు తాముగా ప్రయత్నం చేయాల్సిన అవసరముందని నిపుణులు అంటున్నారు. రోజువారి పనుల ఉద్యోగంలో ఒత్తిడి నుంచి కేవలం కుటుంబంలోనే ఉపశమనాన్ని వెతుక్కోగలిగితే... ఇలాంటి పరిస్థితి రాదంటున్నారు.

సాన్నిహిత్యం...

వివాహబంధాలు కూడా రోజువారి సమస్యలన్నింటిపై అతిగా స్పందిస్తూ ఇంట్లో వాటికి ప్రతి చర్యను ప్రదర్శించడం ప్రధాన కారణం. చిన్న చిన్న విషయాలకే గొడవ పడడం వల్ల అది మానసికంగా ఒత్తిడికి గురిచేయడంతో పాటు.. భార్యా భర్తల నడుమ దూరానికి కారణమవుతోంది. కోపం.. చిరాకు క్రమంగా.. భార్యా భర్తలు కలిసి ఉండవద్దనే స్థితికి వస్తుంది.

భార్యాభర్తుగా సహజీవనం చేయడమంటే ఒకరినొకరు అర్థం చేసుకోవడం తప్ప ఒకరిపై ఒకరికి అధికారం ఉందనుకోవడం కాదు. ఈ విషయంలో ఎవరి వ్యక్తిత్వాన్ని వారు కాపాడుకోవాలని అనుకుంటారు. కలిసి జీవించినంత మాత్రాన ఎదుటి మనిషికి వ్యక్తిగత జీవితం ఉండకూడద నుకుంటే పొరపాటే. సహజంగా వివాహ బంధం అనగానే.. ఎదుటివారిపై తమకు పూర్తి హక్కు ఉంటుందన్నట్టుగా భావిస్తారు. కుటుంబ జీవితం తోపాటు ప్రతి ఒక్కరికీ సామాజిక జీవితం ఉంటుందని గుర్తించాలి. అలాంటి అంశాల్లో జోక్యం చేసుకోకుండా ఉండగలగాలి. అప్పుడు మాత్రమే మనస్ప ర్థలకు తావులేకుండా వివాహబంధం కొనసాగే అవకాశం ఉంటుంది.

ఇష్టాయిష్టాలు వైవాహిక జీవితంలో ఎలాంటి తగువు లేవంటే అది పెద్ద అబద్ధం. ఎందుకంటే.. ఏ ఇద్దరి మధ్య అయినా.. భిన్నాభిప్రాయాలుండడం సహజం. కానీ వాటిని ఒకమేరకు అర్థం చేసుకోవచ్చు తప్ప. ఎదుటివారి అభిప్రాయంతో అంగీకారించాల్సిన అవసరం ఉండదు. అది భార్యాభర్త విషయంలోనైనా. ఒకవేళ ఎవరైనా ఎలాంటి వాదన లేకుండా జీవితం సాఫీగా సాగుతుందంటే... ఎవరో ఒకరు సర్దుకు పోతున్నారనే అర్థం. అది కూడా దుష్పరిణామాకే దారితీస్తుంది. భార్యాభర్త ఇద్దరూ ఒకేలా ఆలోచించాలని ఒకేలా ప్రవర్తించాలని ఏమీ లేదు. కానీ కుటుంబంలో సహజంగా ఒకరు తీసుకున్న నిర్ణయం ఇంకొకరు పాటించాలన్నట్టు వాదను జరుగుతుంటాయి. అది మనుష్యుల మధ్య దూరం పెంచే అవకాశం ఉంటుంది. ఇలాంటి విషయాల్లోనే ఈ మధ్య ఎక్కువ జంటలు విడాకులు కోసం వస్తున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. అన్నిసార్లు ఎదుటివారితో ఏకీభవించాలనేమీ ఉండదు. కానీ వారిద్దరిని కలిపి ఉంచే అశాలుంటాయి. ఎదుటివారిలో ఇష్టమైన అంశాలుంటాయి. వాటిపై ఆసక్తి చూపడం వల్ల ఇతరత్రా విషయాలు అంతగా ప్రభావం చూపవు అంటున్నారు డాక్టర్ల అంచనా...

ఇద్దరు వ్యక్తులు కలిసి జీవితం పంచుకోవాలనుకోవడమే ఆలస్యం ఎదుటి వ్యక్తి నుంచి అంచనాలు మొదవుతాయి. అది సంపాదన నుంచి.. ఉద్యోగం నుంచి... ఇంటి పనులు వరకు అలా ఎదుటివారి నుంచి తాము ఆశించినవేవీ లభించనప్పుడు వాటిని అధిగమించడానికి ప్రయత్నం చేయాలి. కానీ మొండిగా వాటికోసం ప్రయత్నం చేయడం ముఖ్యంగా భార్యాభర్తల మధ్య దూరం పెరుగుతుంది. ఎదుటివారి నుంచి ఆశించడం కంటే.. వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకోగలగడం అనేది అవసరమని నిపుణులు అంటున్నారు. అలాంటి వాతావరణమే వైవాహిక జీవితాన్ని సంతోషమయంగా ఉంచగలుగుతుందని అంటున్నారు.

జ్యోతిరాదిత్య తొందర పడ్డాడ?

- ఎస్.సిహెచ్.వెంకటేష్

జాతీయం



ఇన్నాళ్లూ ఆగీ ఆగీ... జ్యోతిరాదిత్య సింధియా ఇప్పుడు హఠాత్తుగా బీజేపీ ప్రలోభాలకు గురై... ఆఫ్టరాల్ ఓ కేంద్ర మంత్రి పదవి కోసం, తను కష్టపడి నిర్మించుకోవటానికి అవకాశమున్న మంచి కెరీర్‌ను వదిలేసుకున్నాడా..? తన వర్గం మొత్తాన్ని బీజేపీలో నిమజ్జనం చేస్తున్నాడా..? చాలామంది రాజకీయ విశ్లేషకుల భావన అదే... కర్నాటకలో చేసినన్ని తిక్క పొరపాట్లు ఈసారి బీజేపీ ఏమీ చేయకపోవచ్చు, తెల్లవారుజాము ప్రమాణ స్వీకారాలూ ఉండకపోవచ్చు... మధ్యప్రదేశ్‌లో అధికార మార్పిడి సజావుగానే జరగవచ్చు... 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు ఎస్పీ, బీఎస్పీ ఎమ్మెల్యేలు ఇద్దరు బీజేపీవైపు జంప్... ముగ్గురు ఇండిపెండెంట్లు కూడా సహజంగానే సేమ్... కమల్‌నాథ్ ఇంటికి... శివరాజ్ మళ్లీ సీఎం కుర్చీపైకి...! కానీ సింధియా సాధించేది ఏముంది..? ఆఫ్టరాల్ ఓ కేంద్ర మంత్రి పదవి... అంతేనా. రాజకుటుంబీకుడు... చదువుకున్నవాడు... ఓ రాజకీయ పార్టీని నడిపించటానికి సరిపడా సొంత ఆస్తిపాస్తులున్నయ్... తనకంటూ కాంగ్రెస్‌లో ఓ వర్గం ఉంది... పార్టీని వదిలేసి, ఒక్కడే జనంలోకి వస్తే, ఓ సొంత పార్టీ పెట్టుకుంటే, బలవంతుడైన ప్రాంతీయ పార్టీ నేతగా ఎమర్జ్ కాగలిగే అవకాశాలున్నయ్... జగన్మోహన్‌రెడ్డి ఉదాహరణే తీసుకుంటే... చెప్పినట్టు వినడం లేదని తనను కాంగ్రెస్ టార్గెట్ చేసింది... తెలుగుదేశం టార్గెట్ చేసింది... పార్టీ వదిలేశాడు... సొంతంగా పార్టీ పెట్టుకున్నాడు... జనంలో తిరిగాడు... మొదట్లో వైఎస్ లెగసీ తనకు ఉపయోగపడింది... కానీ 2014లో వర్కవుట్ కాలేదు... మొండి, అలాగే నిలబడ్డాడు... జనంలో ఉన్నాడు... తన గురి అంతా ముఖ్యమంత్రి పదవి... అర్జునుడి బాణం పిట్ట కంటిని తప్ప ఇంకేమీ చూడనట్టు జగన్ ఇంకేమీ చూడలేదు... ఫలితం సీఎం అయ్యాడు.

మరి సింధియా...? ఓ రాజ్యసభ సభ్యత్వం ప్లస్ ఓ కేంద్ర మంత్రి పదవి... రాజీపడ్డాడా..? రాజకీయాల్లో బేరాలు ప్రధానం... మంచి బేరగాడు మంచి రాజకీయవేత్త కాగలడు... తను నిజంగా ముఖ్యమంత్రి పదవికే గురిపెట్టాల్సింది... బీజేపీ ఒప్పుకోలేదు అనుకుందాం... సింధియాకు జరిగే నష్టం ఏమీ లేదు... ఒకసారి బీజేపీలో నిమజ్జనం అయిపోయాక ఇక తనకంటూ ఓ వర్గం ఉండదు, మందలో తను ఒకడు... అంతే... కానీ విడిగా ఉండి ఉంటే... తనకు కావల్సినది ఏమిటో సరిగ్గా బేరమాడుకుని ఉంటే, దక్కే ఆ ప్రాధాన్యం వేరు... తను ఎటు వెళ్లడానికైనా మార్గం ఉండేది... ఇప్పుడిక అన్నీ క్లోజ్.

రాజస్థాన్‌లో సచిన్ పైలట్ కూడా గెహ్లాట్ మీద బాగా కోపంగా ఉన్నాడు... తనకూ ఓ వర్గం ఉంది... కానీ తొందరపడటం లేదు... బీజేపీ తనను కూడా టచ్‌లోకి తెచ్చుకుంది... కానీ అక్కడ అధికార మార్పిడి జరగాలంటే ఈ పదీపదిహేను మంది జంపర్లు సరిపోరు... చాలామంది కావాలి... అందుకే సైలెంటు... ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యేలను కూడగట్టగలిగితే, తన బేరమాడే కెపాసిటీ వేరేగా ఉంటుంది. హర్యానాలో దుష్యంత్ చౌతాలా జననాయక్ జనతా పార్టీ అని విడిగా ఓ దుకాణం పెట్టుకున్నాడు... మొన్న ఓ పది సీట్లు వచ్చాయి... బీజేపీ అడిగినా సరే, విలీనం చేయలేదు... మద్దతు ఇస్తానన్నాడు... ఇచ్చాడు... పముఖ్యమంత్రి అయ్యాడు... తను ఇప్పుడు ఎటంటే అటు వెళ్లడానికి స్కోపుంది... ఓ ప్రెజర్ గ్రూపుగా కూడా ఉండగలడు... తనపై ఆధారపడిన ప్రభుత్వం కాబట్టి తనకు దక్కే ప్రాధాన్యమే వేరు... మరి సింధియా..?

ఈ 22 మందితో బయటికొస్తే, వీళ్లందరిపైనా స్పీకర్ అనర్హత వేటు వేస్తే..? అందరినీ ఓ సొంత పార్టీ బ్యానర్ కింద గెలిపించుకోలేను అనుకున్నాడా..? బీజేపీ అయితేనే బెటర్ అనుకున్నాడా..? అలాంటప్పుడు ఆగి ఉండాల్సింది... ఎలాగూ మోడీ 2022లో జమిలి ఎన్నికలకు వెళు_న్నాడు... 49 ఏళ్ల సింధియా ఓ రెండేళ్లు వేచి ఉండలేకపోయాడా..? సొంత పార్టీ పెట్టినా, పెట్టలేకపోయినా... అప్పటికైనా బీజేపీ ద్వారాలు ఇలాగే తెరిచే ఉండేవి కదా... మరెందుకు తొందరపడినట్టు..?!

ఎస్‌బీఐ ఉద్ధరించింది ఏమీ లేదు..! అంతకంతా కోసిపారేస్తున్నది....



- టి.వరప్రసాద్

ఆర్థికం

అబ్బబ్బ... శుభవార్త... గుడ్ న్యూస్... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఔదార్యం... మినిమం బ్యాలెన్స్ లేకపోతే ఇక జరిమానాల్లేవ్... పండుగ చేసుకొండి.... అన్నట్టుగా నిన్నటి నుంచీ సోషల్ మీడియా, వెబ్ మీడియా, టీవీలు, మెయిన్ స్ట్రీమ్ పత్రికలు తెగ ఊదరగొట్టేస్తున్నాయి... మధ్యతరగతి, పేదప్రజలకు అత్యంత ప్రయోజనమని ఆర్థిక నిర్మలక్క కూడా చెప్పింది... ఇదీ మా మోడీ పాలన అని స్మృతి ఇరానీ సంబరపడి పోయింది... 44.5 కోట్ల మంది ఖాతాదారులకు ప్రయోజన మంటూ బిజినెస్ పత్రికలు ఫెస్టివల్ చేసుకున్నాయి... కస్టమర్ ఫస్ట్ అనే నినాదంతో సేవ చేస్తున్నట్టు ఎస్‌బీఐ చెప్పుకున్నది... పాపం... నిజమా..? లక్షల కోట్ల తప్పుడు రుణాలు ఇచ్చి, వసూలు చేయక, చేయలేక, రద్దు చేస్తూ, చేతులెత్తేస్తూ, మళ్లీ కేంద్ర ఖజానా నుంచి వేల కోట్లను సాయం తీసుకుంటూ, మళ్లీ అప్పులిస్తూ తప్పుడు బ్యాంకింగుకు ఓ పక్కా ఉదాహరణగా నిల్చిన ఈ బ్యాంకు... అంత ఔదార్యం కనబర్చిందా..? కస్టమర్లను ముష్టివాళ్లలా చూసే ఈ జాతీయ బ్యాంకు అంత గొప్పపని చేసిందా..? నిజమేనా..?

నిజమే... మినిమం బ్యాలెన్స్ ఉండాలనే నిబంధన తీసేసింది నిజమే... కానీ... ఇదేరోజు సేవింగ్స్ వడ్డీ రేట్లను కూడా కోసేసింది... అది కదా గమనించాల్సింది... నెల రోజుల్లో వడ్డీ రేట్లను తగ్గించడం ఇది రెండోసారి... ఇంతకుముందు 3.25 శాతం ఉన్న సేవింగ్స్ వడ్డీ రేటు 3 శాతానికి పడిపోయింది... స్వల్పకాలిక ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేటు 4.5 నుంచి 4 శాతానికి తగ్గించేశారు... చివరకు సీనియర్ సిటిజెన్ల వడ్డీ రేట్లను కూడా 10 పైసలు కోసేశారు... అన్ని బ్యాంకులూ కలిపి ఈ మూడేళ్లలో దాదాపు 10 వేల కోట్లను మినిమం బ్యాలెన్స్ జరిమానాలు ప్లస్ దానిపై పన్ను రూపంలో వసూలు చేశాయి... ఇప్పుడదంతా త్యాగం చేస్తున్నట్టు పెద్ద ఫోజులు... అసలు తప్పుడు రుణాల పేర్లతో నాశనం చేస్తున్న సొమ్ముతో పోలిస్తే ఇదెంత..? పైగా ఇప్పుడు కోసేసిన వడ్డీ రేట్లతో ఆ మినిమం బ్యాలెన్స్ నష్టాన్ని పూడ్చుకుంటున్నట్టే కదా... ఇక త్యాగం ఏముంది..? నష్టం ఏముంది..? మీరు ఎస్ఎంఎస్‌లు సరిగ్గా ఫాలో అయితే ఓ విషయం గుర్తుండే ఉంటుంది... హఠాత్తుగా మీ ఖాతా నుంచి 147.50 రూపాయలు కట్ అయ్యాయి ఆమధ్య... ఏందయ్యా అంటే..? డెబిట్ కార్డు ఛార్జీ అట... ప్రతి ఖాతాకు డెబిట్ కార్డు తప్పనిసరి... ప్రతి కార్డుకూ సర్వీస్ ఛార్జి తప్పనిసరి... డిజిటల్ కరెన్సీ అంటూ, కార్డు లావాదేవీలు అంటూ మన కేంద్ర ఆర్థిక శాఖ ఉద్ధరించేది ఇదే... ఒకసారికి 15 వేలు, 20 వేలు రోజువారీగా ఏటీఎం నుంచి డబ్బులు తీసుకోవడానికి పరిమితి పెడతారు... మళ్లీ నెలకు 5 లావాదేవీలు దాటితే ప్రతి లావాదేవీకి 23 రూపాయలు కోసేస్తారు... తక్కువ విత్ డ్రా పరిమితి పెట్టి, ఎక్కువ లావాదేవీలకు వాయిస్తూ, ఇదీ మన బ్యాంకు మనల్ని ఉద్ధరించేది... చివరకు ఏటీఎంలో డబ్బుల్లేకపోయినా, లావాదేవీ డిక్లయిన్డ్ అని వచ్చినా రూ.23 కట్ అవుతున్నాయి కొన్నిచోట్ల... పోనీ, క్యాష్ డిపాజిట్ మెషిన్లలో మనం డబ్బు వేసినా, ఒక్కో లావాదేవీకి 25 రూపాయలు కట్... ఇక బ్యాంకు శాఖలోకి వెళ్లి, చచ్చీచెడీ ఏదైనా లావాదేవీ పూర్తి చేస్తే, ప్రతి దానికీ వడ్డింపు... ఇలాంటి బ్యాంకు మినిమం బ్యాలెన్స్ జరిమానాల్ని ఎత్తేసి ఏదో పెద్ద త్యాగం చేసినట్టుగా ప్రచారం ఒకటి... నిజానికి ఎస్‌బీఐ సర్వీస్ వైఫల్యాలపై ఇలాంటి ఉదాహరణలు చాలా చాలా చిన్నవి... చాలామందికి పెద్ద పెద్ద చేదు అనుభవాలు కూడా... విసుగెత్తి ఖాతాల్ని రద్దు చేసుకుని, దండం పెట్టేసిన కస్టమర్ల సంఖ్య లక్షల్లో.

మతాల మధ్య పూల వంతెన

ముస్లిముల పూల సాగు- హిందువుల గుడికి సాగు

ఆధ్యాత్మికం

- ఎడిటోరియల్ బోర్డు సభ్యులు

ప్రఖ్యాత కవి పుట్టపర్తి నారాయణాచార్యులు వందకు పైగా పుస్తకాలు రాశారు. వాటిలో శివతాండవం ఆణిముత్యం.

"రాలెడు ప్రతి సుమమేలా నవ్వును?

హైమవతీ కుసుమాలంకారమునందున తానొక్కటవుదునుటంచునో"

అని శివుడు నాట్యం చేయడానికి ముందు చెట్లు ఆనందంతో కొమ్మలను కదిలిస్తూ పొంగిపోయాయట. అలా కొమ్మలు ఊగేసరికి గుత్తులు గుత్తులుగా పూలు నేల రాలుతున్నాయి. లోకంలో ఎక్కడయినా తల్లి ఒడి వదిలే పూలు బాధపడాలి. కానీ, ఇక్కడ రాలుతున్న ప్రతి పువ్వు పెదవుల రెక్కలు విచ్చి నవ్వుతున్నాయట. ఎందుకంటే శివుడి నాట్య వేదిక ముందువరుసలో కూర్చోవడానికి వెళుతున్న పార్వతికి సరస్వతీ దేవి అన్ని అలంకారాలను సిద్ధం చేస్తోంది. మరికొన్ని క్షణాల్లో పార్వతి మెడలో పూల హారంగా తాము తమ జన్మను సార్థకం చేసుకోబోతున్నామని రాలే పులకు ఒక ఆనందం. పార్వతి మెడలో కొలువై ప్రత్యక్షంగా ముందువరుసలో శివుడి సాయం సంధ్యా తాండవం చూడబోతున్నామన్నది అంతకుమించిన మరో ఆనందం. పూలతో పాటు జల జలపారే జలపాతాలు, ఎగిరే పక్షులు, దూకే జింకలు అన్నీ ఉబ్బి తబ్బిబ్బవుతున్నాయట శివుడి తాండవం చూడబోతున్నామని.

"దానే దానే పర్ లిఖా హై ఖానే వాలే కా నామ్! "

పండే ప్రతి గింజ మీద తినేవాడి పేరు ముందే రాసి పెట్టి ఉంటుందని లోకంలో బహుళ ప్రచారంలో ఉన్న నానుడి. అలాగే పూసే ప్రతి పువ్వు మీద అదెక్కడికి చేరాలో ముందే రాసిపెట్టి ఉంటుంది.

కేరళకు గాడ్స్ ఓన్ కంట్రీ- దేవుళ్ల స్వస్థలం అని పేరు. పచ్చదనం పరవశించి పుడమికి పట్టుచీర కట్టినా,

బ్యాక్ వాటర్స్ లో గూటి పడవల్లో నీటిమీద నడకసాగినా,

నేలకు తాంబూలమిచ్చినట్లు సుగంధ ద్రవ్యాలు పండినా,

ఆకాశ దేశాన మబ్బులకు ఆహ్వానమిస్తూ కొబ్బరి చెట్లు తలలు ఊపినా,

ప్రకృతి తనను తాను మైమరచి పులకింతల గీతాలు పాడినా- అది కేరళకే చెల్లు.

ఎంత రాసినా ఎంతో మిగిలిపోయే అందం కేరళది.

అలాంటి కేరళ కొలనుల్లో యాభై ఏళ్లుగా కొన్ని ముస్లిం కుటుంబాలు తామర పూల సేద్యం చేస్తున్నాయి. రోజూ దాదాపు ఏడెనిమిది వేల తామర మొగ్గలు కేరళ, తమిళనాడు, కర్ణాటక గుడులకు ఇక్కడినుండి వెళుతున్నాయి. ఒక్కో తామర కాడ రెండు నుండి అయిదు రూపాయల ధర పలుకుతోంది. మిగతా పంటలతో పోలిస్తే ఇదేమీ పెద్ద లాభసాటి వ్యాపారం కాదు. కానీ,కొన్ని వందల మంది ముస్లిములకు రెండు మూడు తరాలుగా తామర సాగు ఒక్కటే జీవనాధారం. అనంతపద్మనాభస్వామి, గురువాయూరు మొదలు ఎందరో దేవుళ్లకు తమ తామరలు పూజా పుష్పాలు కావడం కంటే ఇంకేమి కావాలి? అన్న పూలరైతు ముస్తఫా మాట వెయ్యి వేదాల పెట్టు.

ముస్తాఫా లాంటి రైతులు ఇక్కడ పూయించే తామరల కోసం దేవదేవుళ్లు ఒళ్లంతా కళ్లు చేసుకుని చూస్తే కళ్లకు పండగ.

చదివితే మనసుకు పండగ.

అర్థమయితే జీవితానికి పండగ.



WOMEN EMPOWERMENT

నా మనోభావం

- కె.సత్యప్రభ

ఆలస్యమైనా న్యాయం గెలిచిందనుకోవాలా?
ఏడ్చి ఏడ్చి కన్నీరుకార్చిన తల్లికి కన్నీరు తుడిచిపెట్టింది అనుకోవాలా?
ఏడు సంవత్సరాలు నిరభ్యంతరంగా బ్రతికేసారు అనుకోవాలా?
తెల్లవారేవరకు బ్రతకాలనే పిటీషన్ తీసుకుంటున్న చట్టాలు ఉన్నయనుకోవాలా?
దుర్మార్గుల తరపున వాదించే గొప్ప న్యాయవాదులు ఉద్ధరిస్తున్నారనుకోవాలా?
ప్రతిరోజు ప్రతిక్షణం కుట్రలు కుతంత్రాల మయమై వెలుగుతున్న సమాజం చూడాలనుకోవాలా?
దేనికోసం ఇంత ఎదురుచూపులు?.....
తల్లిలా వెలిగి తనయిలా మెలిగి స్నేహమైత్రిగా కలిసి
కరిగి వాడి నేలరాలుతున్నందుకా
భరతమాత న్యాయాలు చట్టాలు మారాలనా
మనసున్న మనుషులు మధ్య మనలేని రూపాలెన్నో
ఆకలిచూపులెన్నో అదనుచూసి పంజావిసిరే మృగాలెన్నో
ప్రేమనో పెళ్లి అనో అంతరంగ హృదయతరంగాలతో ఆడే మూర్ఖులెందరో
కొడుకని కూతురని భర్తని చూడని ఆడపిశాచాలు ఎన్నో
మారుతున్న కాలంలో మసిగొటుకుపోతున్న హృదయాలెన్నో
డబ్బనే యాత్రికలోకంలో సుఃఖమనే బ్రతుకుకొసం
నడి సంద్రంలో ఈదులాడుతున్న జీవాలెన్నో
చిన్న పెద్దతేడాలేక తీస్తున్నా పైశాచిక మృత్యనాట్యాలెన్నో
క్షణం క్షణం ప్రోగుతున్న మరణమృధంగాలెన్నో
చంపేవాడు చరిచెవాడు పగవాడు ఇంటివాడు సొంతవాడు ఎక్కడ చూసినా దాగిన మృత్యువు నీడలై తిరుగుతూ
నమ్మకాలు కూలుతూ ఆడబిడ్డ అమ్మకాలు పెరుగుతూ
స్నేహాలు కాలుతూ అనురాగాలు అవహేళన చేస్తూ
మమతలు మాడిపోతూ న్యాయాలు చట్టాలు నత్తనడకేస్తూ
న్యాయాన్ని అమ్ముకొంటూ అన్యాయాలను ఆరాదిస్తూ
మరోసారి చేసుకోందాం చావక చావక చచ్చిన పిశాచాలను చూసి
అంతో ఇంతో గోరంత వెలుగుచూస్తూ కొండత ఆశలు నింపుతూ
మన భారతావనికి పట్టిన కరోనాన్ని కాదు చంపాల్సినది
దుర్మార్గులను దుర్మార్గాలను అంతం చేసినప్పుడే నిజమైన ఆరోగ్యకరమైన దేశమై ఆదర్శం కాగలదు
కాదంటారా? ఏకిభవిస్తారా? సమర్ధిస్తారా?

ఒక్క నిర్భయ కేసు... ఒక్క ఉరి శిక్ష... బోలెడు వైఫల్యాలు..!

న్యాయం వేరు... చట్టం వేరు... ధర్మం వేరు... నిర్భయకు న్యాయం జరిగింది అనే భావన ఓ అబ్సర్డ్... ఒకసారి ఆమె పూర్తిగా అన్యాయమై పోయి, లోకం నుంచే భరించలేని వేదనను అనుభవిస్తూ వెళ్లిపోయింది... ఇక ఆమెకు దక్కే న్యాయం ఏముంటుంది..? కానీ వాళ్లను వదిలేయవద్దు కదా అంటారా..? అది వేరు, అది శిక్ష... అది చట్టం... చట్టం తను న్యాయం అనుకున్నదే చేస్తుంది... ఒక్కో దేశం న్యాయాన్ని ఒక్కోవిధంగా నిర్వచించుకుంటుంది... దాన్ని బట్టే చట్టం చేసుకుంటుంది... అంతెందుకు మన దేశంలోనే మతాన్ని బట్టి చట్టాలుంటాయి... వాటి పరిధుల్లో న్యాయాలు ఉంటాయి... అందుకని నిర్భయకు న్యాయం జరిగిందోచ్ అనే ఫీలింగ్ వదిలేయండి... పోనీ, ఆమె తల్లికి రిలీఫ్ కదా అంటారా..? అవును, ఎట్టకేలకు మన చట్టం వాళ్లను శిక్షించింది అనే రిలీఫ్ తప్ప ఆమెకు జరిగిన న్యాయం ఏమీ లేదిక్కడ...

మరి ధర్మం...? అవును, ఏముంది ధర్మం...? ఆ ఆరుగురు కిరాతకుల్లో... ఒకడు జైలులోనే ఆత్మహత్య చేసుకుని చచ్చిపోయాడు... మరొకడేమో పిల్ల దోషి అట... అనగా జువనైల్... కాబట్టి పేరుకు ఓ మూడేళ్లు జైలులో పెట్టేసి, ప్రభుత్వమే ఉపాధికి డబ్బులిచ్చి, పేరు కూడా బయటపెట్టకుండా దక్షిణ భారతదేశం వెళ్లి, ఏదో ఓ మారుపేరుతో బతుకుపో అనేసింది... అసలు ఆ వయస్సులో ఆ కిరాతకపు ఆలోచనలు, చర్యలే దారుణం... అసలు తనను కదా అందరికన్నా ముందు శిక్షించాల్సింది..? ఇక ధర్మం ఏమున్నట్టు..? రేప్, హత్య అనే ఆ పైశాచిక చర్యలో తను ఉన్నాడా లేదా..?

పోనీ, ఈ నలుగురినీ ఏం చేశాం..? ఏం చేయగలిగాం..? ఇన్నాళ్ల శిక్ష అమలు జాప్యం ద్వారా... ఓ లాయర్ అతి తెలివి వేషాల వల్ల... తాము చాలాకాలం నిక్షేపంగా బతకొచ్చు అనే ధీమాను కలిగించాం వారిలో... మన న్యాయవ్యవస్థ లోపాలతో, శిక్ష నుంచి తప్పించుకుంటాంలే అనే భరోసాను కలిగించాం... పోనీ, ఒక్కడిలోనైనా పశ్చాత్తాపం కనిపించిందా..? నెవ్వర్... ప్రతి ఒక్కడూ మేం దోషులమే కానీ, మా శిక్షను తగ్గించండి అని వేడుకున్నవాడే... ఎందుకు అంటే..? శిక్ష తగ్గింపుకి మన సిస్టంలో బోలెడు అవకాశాలు ఉన్నాయి, మాకు వర్తింపజేయండి అనే వాదనే తప్ప.... మేం తప్పే చేశాం, మారడానికి చాన్స్ ఇవ్వండి, మంచిగా బతుకుతాం అని ఏ ఒక్క దశలోనూ అనలేదు...

ఇలా శిక్ష అమలును నాన్చీ నాన్చీ ఏం సాధించాం..? న్యాయవాదుల చేతుల్లోనే న్యాయవ్యవస్థను నవ్వులపాలు చేశాం... ఇప్పటికే మన న్యాయవ్యవస్థను సమాజం నమ్మడం లేదు... ఆ నమ్మకాన్ని మరింత కోల్పోవటానికి ఈ కేసు ఓ కారణమైంది... తప్పు చేసినా సరే, ఈ లోపాలతో బతికిపోతాంలే అని నేరస్థులకు మాత్రం ఓ నమ్మకాన్ని క్రియేట్ చేశాం మనం.... కానీ, తప్పదు, వృత్తిపరమైన ఈ ఘర్షణ... ప్రాసిక్యూషన్‌కూ, జడ్జికీ, డిఫెన్స్‌కూ నడుమ ఇది అనివార్యం కదా అంటారా..? కానీ ఎంత కాలం..? అదీ అసలు ప్రశ్న...

అంతిమంగా ఏం జరిగింది..? సత్వర న్యాయమే కరెక్టు...

దర్యాప్తుతోపాటు విచారణ, తీర్పు, శిక్ష, సత్వర అమలు కూడా పోలీసుల చేతికి వెళ్లడమే కరెక్టు... ఎన్‌కౌంటర్లే బెటర్ అనే నిస్పృహలోకి సమాజం క్రమేపీ వెళ్లిపోతున్నది... ఇక్కడ ఏపీ సింగ్ అనే లాయర్ కరెక్టా..? తెలంగాణ సజ్జనార్ కరెక్టా అంటే... ఇప్పుడు సమాజం సజ్జనార్ మార్క్ న్యాయమే సరైన న్యాయం అని ఎందుకు అంటున్నది..? ఇది కరెక్టా కాదా అనేది వేరే చర్చ... కానీ దానికి తావిస్తున్నది ఏ లోపం..? ఏ వైఫల్యం..? ఈ సమగ్ర చర్చ జరగకపోతే ఇక అర్థం లేదు... ఆఫ్టరాల్, ఈ నలుగురు హంతకుల్లాంటి వాళ్లు పుడుతూనే ఉంటారు, చస్తూనే ఉంటారు... ఏపీ సింగ్ వంటి లాయర్లు వాదిస్తూనే ఉంటారు... కానీ ఇలాంటి కేసుల తరువాత మన చట్టాలు, మన అడుగులు అవసరమైన మార్పుల దిశలో మారకపోతే ఎలా..? ఏమీ ఉండదు, నాలుగు రోజులైతే అందరూ ఈ ఉరిని మరిచిపోతారు అంటారా..? అవును, ఎక్కువసార్లు జరిగేది అదే... అదే మన అసలు వైఫల్యం...

అబద్ధం తో ఉరి ఆగింది!!!అప్పుడెప్పుడో... 1993 నాటి చిలకలూరిపేట బస్సు దహనం కేసు... 23 మంది మరణించారు... కేసులు రుజువైంది... అందులో దోషులు చలపతిరావు, విజయవర్ధన్‌రావు... సుప్రీం దాకా రకరకాల కోర్టుల్లో కేసులు, విచారణలు, అప్పీళ్లు... 1995లో ఉరిశిక్ష తీర్పు వెలువడింది... రెండుసార్లు అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ క్షమాభిక్ష పిటిషన్లనూ తిరస్కరించాడు... ఇక రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉరితీయాల్సి ఉంది... తెల్లవారు జామున 3 గంటలకు... అన్ని రకాల ఫార్మాలిటీస్ పూర్తవుతున్నయ్... 4 గంటలకల్లా శవాల్ని అప్పగిస్తామని జైలు అధికారులు బంధువులకు చెప్పారు... అందరూ నిరీక్షిస్తున్నారు విషాదంగా...

కానీ ఉరికి ముందు రోజు మరో చివరి ప్రయత్నం చేద్దామని రచయిత్ర మహాశ్వేతాదేవి, మానవహక్కుల నేతలు రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ మరోసారి ఇచ్చారు... ఇప్పటికే రెండుసార్లు రిజెక్ట్ చేశాను, ఇక నన్నేమీ అడక్కండి అన్నాడాయన... కానీ ఓ మహిళ లాయర్ మదిలో ఓ థాట్ మెరిసింది... ఓ చిన్న అబద్ధాన్ని ఆడాలని అనుకున్నారు... అక్కడి నుంచి ఓ సుప్రీంకోర్టు జడ్జి దగ్గరకు వెళ్లారు, రాష్ట్రపతి సానుభూతితో పరిశీలిస్తామన్నాడు... ఉరిని వాయిదా వేసి, ఆ నిర్ణయం వెలువడేదాకా టైం ఇవ్వండి అన్నారు... ఆయన నమ్మాడు... మరో జడ్జిని కూడా కలవండి అన్నాడు... రెండో జడ్జిని వెతికి, ఆ రాత్రి ఎలాగోలా బతిమిలాడి, మొదటి జడ్జి దగ్గరకు తీసుకువచ్చారు... సరే, రాష్ట్రపతి నిర్ణయం వరకూ ఉరిని వాయిదా వేయిద్దాం అనుకున్నారు... అప్పటికప్పుడు ఉరి ఆపాలని ఆదేశాలు ఇచ్చారు...

ఒక అబద్ధం మొత్తం సీన్‌నే మార్చేసింది... అప్పటికే రాత్రి 11... ఆ సమాచారం రాజమండ్రి సెంట్రల్ జైలుకు చేరేదెలా..? హుటాహుటిన కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఇంటికి వెళ్లారు... సుప్రీం ఆర్డర్ చూపించారు... కళ్లు నలుముకుని మరోసారి చూసి, కరెక్టే అని ఒకటికి పదిసార్లు చదువుకుని... ఏపీ హోం శాఖ కార్యదర్శికి ఫోన్ చేసి, ఉరి ఆపాలని ఆదేశించాడు ఆయన... అర్ధరాత్రి అవుతున్నది... హోం శాఖ కార్యదర్శి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ మీద సమాచారం ఇచ్చాడు...

ఉరికంబం వైపు వాళ్లను తీసుకుపోయే టైం సమీపిస్తున్నది... ఎక్కడ ఏ ఫోన్ లైన్ కలవకపోయినా... ఏ అధికారి దొరకకపోయినా ఇంత శ్రమా, ఈ అబద్ధాలు వృథా అవుతాయి... కలెక్టర్ రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారులకు ఫోన్ చేశాడు... విషయం చెప్పాడు... 'అభిలాష' సినిమాలో ఉరి చివరి క్షణంలో ఆగినట్టుగా, ఈ ఉరి కూడా ఆగిపోయింది. గుర్రమెక్కిరావచ్చు అని ఎందుకు అంటున్నామంటే.... ఈ ఉరి ఆగిపోయాక ప్రధాని దేవెగౌడ కుర్చీ దిగాల్సి వచ్చింది... ప్రభుత్వం కూలింది... రాష్ట్రపతి ఈ వ్యవహారాల్లో బిజీ... ఇతరత్రా పిటిషన్లు చూసే టైం లేదు... ఈ హక్కుల ఉద్యమకారులు వెళ్లి సుప్రీం జడ్జిలను కలిశారు... మరో 3 నెలల వ్యవధి అడిగారు... (నిజంగా రాష్ట్రపతి సానుకూలంగా క్షమాభిక్ష పిటిషన్ పరిశీలిస్తాను అని చెప్పాడా లేదా అనీ సుప్రీం జడ్జిలు నిర్ధారించుకోలేదు)... సరేనని వ్యవధి ఇచ్చారు... ఈ గడువు అయిపోయేలోపు రాష్ట్రపతి పదవీకాలం అయిపోయింది... కేఆర్ నారాయణన్ రాష్ట్రపతి అయ్యాడు... మళ్లీ ఓ పిటిషన్... ఆయన ఉరిశిక్షను యావజ్జీవశిక్షగా తగ్గించాడు... రాసిపెట్టి ఉండాలే గానీ... ఎన్ని పరిస్థితులు అనుకూలిస్తాయో చూడండి... చలపతి, విజయవర్ధన్ నెల్లూరు సెంట్రల్ జైలులోనే ఉన్నారు...!

దేవుడు నవ్వుతున్నాడు

నువ్వు బ్రతుకు ఇతరులను జీవాలను బ్రతికించు, ప్రకృతి నుండి పాఠాలు నేర్చుకోనే బ్రతుకు అందంగా దిద్దుకో??

అన్ని నేనే...అంతా నేనే అని మిడిసిపడ్డ మనిషికి...నువ్వెంతరా ఆఫ్టాల్ గాడివి అంటూ ...బుద్ధి వచ్చేట్టు చేసిన ప్రకృతి శాసనం!

దేవుడిని కూడా తమ అవసరాలకు తగ్గట్టు వాడుకొంటూ...

అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు పట్టుకునే... మనిషి నీచ నైజం చూసి, చూసి.. విసుగెత్తి, అసహ్యంతో... బుద్ధి చెప్పాలని దేవుడు ఆడుతున్న ఆట ఇది. భూమి మీద ఉన్న ప్రతి ప్రాణిని పట్టి, చంపి.. తనకోసం ఆహారం అంటూ విర్రవీగిన మనిషి జాతికి... సిగ్గు వచ్చేట్టు...

మనిషి తప్పు... తన దర్శనం సకల జీవులకు కలిగించాడు...ఆహా... ఎం స్క్రీన్ ప్లే??

రోడ్డుమీద వీధికుక్క..యేదేశ్చగా తిరుగుతుంది...,

కానీ మన బతుకు కుక్క కన్నా నీచం అంటూ భగవంతుడు...విరగబడి నవ్వుతున్నాడు.

కాకి, పావురం...ఏవో పిట్టలు...హాయిగా వస్తున్నాయి...పోతున్నాయి...

పిచ్చి కోరికలతో నన్ను విసిగించింది చాలు...మీ దొంగ భక్తి కట్టి పెట్టండి అంటూ...గుడి తలుపులు మూసేసాడు...


తన గుడి గోపురంపై వాలిన పక్షుల కువ,కువలు వింటూ ఆనందిస్తున్నాడు. ఎలా వస్తుందో... ఎటునుండి వస్తుందో తెలియని మహమ్మరిని పంపి...మానవ జాతికి గుణపాఠం నేర్పిస్తున్నాడు!

ఇక నైనా...ప్రకృతితో ఆటలాడటం మాని.. మనిషి మానవత్వంతో బతుకుతూ..మనతోటి ప్రాణులను కూడా బతకనివ్వాలని కోరుకొంటూ

సర్వే జనా సుఖినోభవంతు??

ఇక్కడ చీరలకు ప్రవేశం లేదు!

- వాసుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్



ఇప్పుడంటే తెలుగుపాటల్లో తెలుగు భాష, తెలుగు వేషం కొడిగడుతున్న దీపంలా మిణుకుమిణుకుమం టున్నాయి కానీ, ఒకప్పుడు తెలుగు పాట చీర కట్టి సింగారించుకుంటే నా సామిరంగా! అని ప్రేక్షకులు, శ్రోతలు పరవశించి పాడుకునేవారు. చెంగావి రంగు చీర కట్టుకున్న చిన్నది- దాని జిమ్మదీయ! అందమంతా కొంగులోనే ఉన్నది అని హీరో కొంగుబట్టుకుని తిరిగేవాడు. చీర ఆరేసుకో బోయి పారేసుకుంటే అడవిరాముడు ఆటాడుకున్నాడు. చుట్టూ చెంగావి చీర కట్టాలే చిలకమ్మా! అంటూ సీతాకోక చిలకలే చీరకట్టాయి.

కొంగున ముడివేసుకోమని హీరో కాళ్లా వేళ్లా పడేవాడు.

చీరకు సిగ్గు అందం సిగ్గుకు చీర అందం అని చెప్పీ చెప్పక చీరను చూస్తూ హీరో దశాబ్దాలపాటు కాలక్షేపం చేసేవాడు.

నువ్ పట్టు చీర కడితే తరిస్తుంది ఆ పట్టుపురుగు జన్మ- అని చీరను హిమాలయమంత ఎత్తుకు తీసుకెళ్లారు.

భారతీయ సంప్రదాయంలో చీర సారె పెట్టడం ఆచారం. మర్యాద. మంగళకరం. చీర అందం చీరదే. వృత్తులను బట్టి వేషధారణ మారుతుంటుంది. కాలాన్ని బట్టి ఫ్యాషన్లు మారుతుంటాయి. మారాలి కూడా. కొందరికి కొన్ని రకాల డ్రెస్సులు నప్పుతాయి. కొందరికి కొన్ని రకాల డ్రెస్సులు ఇష్టం. ఎవరి అభిరుచులు వారివి.

డాక్టరు తెల్ల కోటు వేసుకోవాలి. లాయర్ నల్ల గౌను వేసుకోవాలి. పోలీసు ఖాకీ డ్రెస్ వేసుకోవాలి. ఇవి తప్పనిసరి.

కానీ, ఢిల్లీలో యాంబియెన్స్ మాల్లో ఒక రెస్టారెంటుకు కూడా యూనిఫామ్ తప్పనిసరి. ఆ మాల్లో తిరుగుతూ ఆకలిగా ఉండి ఒక మహిళ రెస్టారెంట్లోకి వెళ్ళబోయింది. అక్కడున్న ద్వారపాలకులు మంచి ఇంగ్లీషులో మర్యా దగా ఆమెను అడ్డుకున్నారు. మేడం, మీరు చీర కట్టుకుని ఉన్నారు. మా రెస్టారెంట్లోకి ఇలాంటి పాత చింతకాయపచ్చడి చీరలు, పైటలు, భారతీయ సంప్రదాయ దుస్తులను అనుమతించం అని తెగేసి చెప్పాడు. ఈ రోజుల్లో చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటుంది కాబట్టి- ఆమె కూడా అంతే మర్యాదగా ఆ చెప్పినవాడిని వీడియో రికార్డు చేసి, మారు మాట్లాడకుండా వెనక్కు వచ్చేసింది. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయ్యింది. నిజానికి ఇది ఆమెకు జరిగిన అవమానం కాదు. మొత్తంగా మహిళలకు, భారతీయ తకు జరిగిన అవమానం. మహిళలు ఏ డ్రెస్సు వేసుకోవాలి? ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అని చర్చించకూడదు అని ఒకవైపు దేశమంతా రచ్చ జరుగుతుంటే- ఢిల్లీ యాంబి యెన్స్ రెస్టారెంట్ వాడు చీరతో తమ యాంబియెన్సుకు అవమానం జరుగుతుందని అనుకున్నట్లున్నాడు.

నిజమే- కలకత్తాలో ఈశ్వర చంద్ర విద్యాసాగర్ మొదట పంచె కట్టుతో వెళితే పంక్తి భోజనానికి రానివ్వలేదు. సూటు, బూటు వేసుకుని వస్తే లోపలికి రానిచ్చారట. దాంతో ఆయనకు ఒళ్ళు మండి బట్టలను భోంచేయమని అడిగాడట. ఎందుకలా అడుగుతున్నారంటే- నాకు విలువ లేదు. నా బట్టలనే వీరు లోపలికి రానిచ్చారు. అందుకు వాటినే తినమంటున్నా అని మొహం పచ్చడి అయ్యేలా చెప్పాడని ఎలిమెంటరీ స్కూల్ నీతి పాఠాల్లో చదువుకున్నాం.

అసభ్యతకు- సభ్యతకు సరిహద్దు రేఖ చెరిగిపోయి చాలా కాలమ య్యింది. ఇప్పుడు హై సొసైటీ లో సభ్యతగా చీర కట్టుకో వడం అమర్యాద. అపచా రం. ప్రవేశం నిషేధం.

ఎలాంటి డ్రెస్ వేసుకుంటే ఆధునిక నక్షత్ర హోటళ్లు, బార్ లు, పబ్బులు, రెస్టారెంట్లు లోపలికి అనుమతిస్తాయో చెప్పడం భావ్యం కాదు. అది ఎవరికి వారు తెలుసుకోవాల్సిందే. అదే మర్యాద! అదే ఆచారం!

అభిమానం..అసహనం

- సి.రాంబాబు

మనం కొన్ని విషయాలను, కొందరు వ్యక్తులను అభిమానిస్తాం. ఈ అభిమానం ఎలా ఏర్పడుతుంది అంటే చెప్పడం కష్టం. ఒక పాట, ఒక రచన, ఒక కళారూపం మనసుకు హత్తుకుంటుంది. ఇది పూర్తిగా వ్యక్తిగతం. అదే పాట యింకోర్ని మెప్పించలేక పోతుంది. మరి వీరి కెందుకు నచ్చింది అంటే వీళ్ల అభిరుచి, సంస్కారం, కుటుంబనేపథ్యం, పెరిగిన సామాజిక వాతావరణం యిలా అనేక కారణాలుండవచ్చు. మన తెలుగువాళ్లకు కర్ణాటక సంగీత బాణీ నచ్చినంతగా హిందూస్తానీ శాస్త్రీయ సంగీతం తలకెక్కదు – దాన్ని సరళీకరించి, హిందీ సినిమా పాటగా మలిస్తే తప్ప! భరతనాట్యం, కూచిపూడి నచ్చినట్లుగా కథక్, కథాకళి నచ్చవు. మళ్లీ మనలో అందరికీ కర్ణాటక సంగీతమూ, భరతనాట్యం నచ్చవు. దానికి కుటుంబనేపథ్యం ఒక కారణం అనుకోవాలేమో! కానీ అలాటి నేపథ్యం ఉన్న అందరికీ నచ్చదు, ఆ నేపథ్యం లేకపోయినా నచ్చేవాళ్లున్నారు. అందువలన ఏది ఎవరికి ఎందుకు నచ్చుతుందో చెప్పలేం.

ఆ నచ్చడం కూడా స్థిరంగా ఉంటుందన్న గ్యారంటీ లేదు. చిన్నపుడు ఒక్కొక్క స్కూలు టీచరు అంటే పడి ఛస్తాం పెద్దయ్యాక అలా ఎందుకు పడి చచ్చామా అని మనమే ఆశ్చర్యపడతాం. చిన్నపుడు ఎత్తుగా కనబడిన బురుజులు, విశాలంగా కనబడిన వీధులు, గంభీరంగా కనబడిన వక్తలు పెద్దయ్యాక అంత ఎత్తుగా, విశాలంగా, గంభీరంగా ఆనరు. సినీతెరపై చిన్నపుడు మురిపించిన కత్తియుద్ధాలు, గుఱ్ఱపుస్వారీలు పెద్దయ్యాక నవ్వు తెప్పిస్తాయి తప్ప థ్రిల్ కలిగించవు. చిన్నప్పుడు పులకింపచేసిన ప్రేమ నవలలు పెద్దయ్యాక చప్పగా, చైల్డిష్‌గా అనిపిస్తాయి. చిన్నపుడు ఆరాధించిన అపరాధపరిశోధకుడు పెద్దయ్యాక హాస్యాస్పదంగా తోస్తాడు. ఇలా మన అభిప్రాయాలు, అభిమానాలు నిరంతరం మార్పుకు గురవుతూనే ఉంటాయి. ఒక్కోసారి అవి పలుచనవుతాయి. మరి కొన్ని సందర్భాల్లో అవి ఆవిరై పోతాయి. ఇంకొన్ని సందర్భాల్లో వెగటు కలిగిస్తాయి కూడా.

అభిరుచుల విషయంలోనే కాదు, రుచుల విషయంలో కూడా మార్పులు వస్తాయి. చిన్నపుడు అమ్మ చేతి వంటే అమృతం. హాస్టల్‌కో, ఉద్యోగరీత్యా పొరుగూరికో వెళ్లినపుడు కొత్త రుచులు అలవడి, అవీ నచ్చుతాయి. అమ్మ వంటను పోల్చి చూసి మార్కులు వేస్తూంటాం. అలాగే దేవుడి విషయం. చిన్నపుడు యింట్లో ఏ దేవుణ్ని మొక్కితే ఆ దేవుడే సర్వస్వం అనుకుంటాం. తర్వాత ఆ దేవుడు మార్కులు సరిగ్గా తెప్పించలేదనో, ఉద్యోగం యిప్పించలేదనో, క్లాసుమేటు చెప్పిన దేవుణ్ని ట్రై చేసి చూస్తాం. అది క్లిక్కయితే ఆయన్ని నమ్ముకుంటాం. కొంతకాలానికి ఏ దేవుడూ పనిచేయడం లేదన్న విసుగుతో దేవుడే లేడంటాం, వయసు మీద పడిన కొద్దీ, మన చేతిలో ఏమీ లేదని గ్రహించినకొద్దీ దేవుడిమీద మళ్లీ నమ్మకం పెంచుకుంటాం.

ఎందుకొస్తున్నాయి యిలాటి మార్పులు? అనుభవం వలన! మన దృష్టి విశాలమై, మన జ్ఞానం విస్తరించిన కొద్దీ మన పూర్వవిశ్వాసాలు సడలుతాయి. మనకు ఎక్స్‌పోజర్ పెరుగుతున్నకొద్దీ కొత్త సంగతులు తెలిసి, ఆలోచనా పరిధి పెరుగుతుంది. హైస్కూలులో ఉండగా యింటి పక్క అమ్మాయే రంభలా అనిపిస్తుంది, కాలేజీలో పక్క వూళ్ల నుంచి వచ్చిన అమ్మాయిలను కూడా చూసిన తర్వాత అనిపించడం మానేస్తుంది. యూనివర్శిటీలో పక్క జిల్లాల అమ్మాయిలను కూడా చూసిన తర్వాత కాలేజీ అమ్మాయిలను చూసి నోరు చప్పరిస్తాం. వాళ్లకు ప్రేమలేఖలు ఎందుకు రాశామా అని ఆశ్చర్యపడతాం. పర రాష్ట్రం, పరదేశం వెళితే యిక చెప్పనే అక్కరలేదు.

హిమాలయాలకు వెళ్లేవరకూ తిరుపతి కొండే మహాపర్వతం. మన వీధిలోనే ఉన్నంత కాలం గొప్పవాళ్లంతా మన కులంలోనే పుట్టారనుకుంటాం. లోకం తెలుస్తున్న కొద్దీ అర్థమవుతుంది – మన కులమే కాదు, అన్ని కులాలూ గొప్పవేనని, మన ప్రాంతమే కాదు, అన్ని ప్రాంతాలూ గొప్పవేనని. మనం ఒక దానిలో రాణిస్తే, వాళ్లు మరో దానిలో రాణిస్తున్నారు అని గ్రహించేసరికి మన కులాభిమానం చెదురుతుంది. పరిపూర్ణ జ్ఞానం రావాలంటే ఎక్స్‌పోజర్ పెరగాలి. ప్రపంచ భాషల్లో కల్లా తెలుగే గొప్పది అనే స్టేటుమెంటు యిచ్చే ముందు ప్రపంచంలోని సకల భాషల పేర్లయినా తెలుసుకోవాలి. విశ్వమతాలన్నిటిలో హిందూమతం గొప్పది అనే ముందు, లోకంలోని సమస్త మతాల సిద్ధాంతాలు, అవి అమలవుతున్న విధానం తెలుసుకోవాలి. అభిమానంగా ఉన్నంతవరకు పెద్దగా పేచీలు రావు. అది అంతటితో ఆగకుండా దురభిమానంగా మారడంతోనే వస్తాయి చిక్కులు. మాఅభిమాన నటుడు గొప్ప, మాఅభిమాన నాయకుడు గొప్ప, మాఅభిమాన స్వామీజీ గొప్ప అంటూ కొట్లాటలకు దిగడం జగడాలకు దారి తీస్తుంది. ఒక నటుడి నట నంటే యిష్టం పెంచుకుని అతని సినిమాను తప్పకుండా చూడడం అభిమానం కింద వస్తుంది. ఫ్యాన్స్ అసోసియేషన్‌గా ఏర్పడి, కటౌట్లకు క్షీరాభిషేకాలు చేయడం అభిమానంలో తారస్థాయి. ఇతర నటుల కటౌట్ల మీద దాడి చేయడం, వాళ్ల సినిమాల కెళ్లి యీలలేసి, వెబ్‌సైట్‌లలో వెకిలి వ్యాఖ్యలు చేయడం దురభిమానం కింద వస్తుంది. మా చిన్నప్పుడు ఎన్టీయార్ అభిమానులు ఎయన్నార్ సినిమాల వాల్‌పోస్టర్లపై పేడముద్దలు కొట్టేవారు. ఎయన్నార్ అభిమానులు బదులు తీర్చేసేవారు. బాగా చదువుకుని, మామూలు పరిస్థితుల్లో పేడ ముట్టుకోవడానికి అసహ్యం చుకునే వారు కూడా యిలా చేయడానికి కారణం వారి దురభిమానం.

దేని గురించైనా అభిప్రాయం ఏర్పరచుకోవాలంటే విషయం పూర్తిగా తెలిసి వుండాలి. తర్జనభర్జనలు చేసుకోవాలి. తర్కం ఉపయోగించాలి. క్రాస్‌చెక్ చేసుకోవాలి. కొన్ని అసత్యవార్తల్లో ఫలానావారు దీన్ని ధృవీకరించారు అని రాసినా నమ్మే పరిస్థితి లేకుండా ఉంది. అందువలన ఆ సోర్స్‌ను కూడా చెక్ చేసుకోవాల్సి వస్తోంది. దీనికంతా సమయం పడుతుంది. కానీ మన కంత ఓపిక ఉండటం లేదు. ఏదైనా చెడు వినగానే, యితరుల కంటె ముందు మనం ప్రచారంలో పెట్టేయాలనే యావ ఉంటోంది. సోషల్ మీడియాలో, వాట్సప్‌లలో యీ అబద్ధాలు వీరవిహారం చేసేస్తున్నాయి. ఇవి చదివిన మిడిమిడి జ్ఞానంతో వాదనకు దిగుతున్నారు కొందరు. అంతటితో ఆగకుండా దానికి వ్యతిరేకమైన వాదన వినిపించినవారి పట్ల అసహనం చూపుతున్నారు. ఇది మన భారతీయ సమాజానికి కీడుగా పరిణమిస్తోంది.

ఎందుకలా? 'మీకు తెలుసా?'

- పి.సురేష్‌బాబు

ఇవటూరి చినవీర బసవరాజు గారు జ్యేష్ఠ పేరుతో కథలు రాశారు. ఆయన కథల్లో వ్యంగ్యం ఉంటుంది, చదివించే, ఆలోచింపచేసే గుణం ఉంటుంది. మనుషులు చిత్రమైనవారు. ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో చెప్పలేం. ఎందుకలా ప్రవర్తించారో అర్థం కాక బుర్ర పగలగొట్టుకుంటాం. లంచాలతో కోట్లు కూడబెట్టి, ఏ ఐదువేలకో కక్కుర్తి పడి ఎసిబి వాళ్లకు పట్టుబడ్డవాడి వార్త చదివి తెల్లబోతాం.. ఏ ఐదు లక్షల్లో అయితే ఫర్వాలేదు కానీ బొత్తిగా ఐదువేలా? అనుకుంటాం. బాగా డబ్బుండి హోటల్లో వందలాది రూపాయలు టిప్పులిచ్చే వాళ్లు అరటిపళ్ల దగ్గరో, కరివేపాకు దగ్గరో బేరాలాడడం చూసి నవ్వుకుంటాం. 'వాడొట్టి పిసినారి. అలాటిది నీకెలా అప్పిచ్చాడురా బాబూ?' అని ఆశ్చర్యపడతాం. ఏం మాయ చేశాడో చెప్పమంటాం. అవతలివాడు 'ఏమో, వెళ్లి అడిగానంతే' అంటాడు. నమ్మబుద్ధి కాదు. ఈ కథలో అలాంటి చిత్రాన్ని ఒకదాన్ని చెప్పి, అలా ఎందుకై ఉంటుందో కారణం మీకు తెలుసా? అని అడుగుతాడు రచయిత.

చిరుద్యోగి ఐన ఆనంద్‌కు సుబ్బులు అనే నిరుద్యోగి ఫ్రెండున్నాడు. చిరకాలంగా నిరుద్యోగి. విసిగి వేసారి తన 30వ యింటర్వ్యూకి యీ వూరు వచ్చాడు. ఎవరికైనా సిఫార్సు చేసి, ఉద్యోగం యిప్పించరా అన్నాడు. నాకెవరూ తెలియదన్నాడితను. వీళ్లింటికి దగ్గర్లోనే పెద్ద తోట, దానిలో పెద్ద మేడ ఉంది. అది డాక్టర్ భగవాన్ గారిది. ఆయన యింటికి చుట్టపు చూపుగానే వస్తాడు. ఆయన భార్య శివరాణి పెద్ద సోషలిష్టు. మినిస్టర్ల దగ్గర్నుంచి ప్రజాకవుల వరకు అందరూ ఆవిడ దగ్గరకు వస్తూంటారు. అనేక రకాల లావాదేవీల్లో సూత్రధారిణి. 'మీ కాలనీలోనే ఉంటుంది కాబట్టి, వెళ్లి పరిచయం చేసుకుని నా గురించి చెప్పరా. నేను వెళ్లి కాళ్ల మీద పడతాను.' అన్నాడు సుబ్బులు. 'నేనెప్పుడూ వెళ్లలేదు. వాళ్లింట్లో కుక్కల్ని చూస్తే భయం. అడిగినా లాభం ఉండదు' అన్నాడు ఆనంద్.

వీళ్లిలా ఆ యింటి ముందు నిల్చొని చర్చించుకుంటూ ఉండగా సుబ్బులు యింటర్వ్యూకి హాజరు కావల్సిన కంపెనీ జనరల్ మేనేజర్ కారు వచ్చి యింటిముందు ఆగింది. ఇక సుబ్బులు ఆగలేదు. 'ఏదైనా గట్టి ప్రయత్నం చేస్తే ఆ ఉద్యోగం ఖాయంరా' అని తొందర పడిపోయాడు. కారు వచ్చిందని గేటు తీయడానికి వచ్చినవాడు కారును లోపలికి పంపించి, వీళ్లను చూసి దగ్గరకు వచ్చి సిగరెట్టు ఉందా అని అడిగాడు. అతను ఆవిడ డ్రైవరు. పేరు నూకరాజు. వంటవాడూ, గేట్ కీపరూ సెలవు పెట్టడంతో ఆ పనులు చేయాల్సిరావడంతో బయటకి వెళ్లి సిగరెట్టు కాల్చే అవకాశం లేకుండా పోయింది. వీళ్లను అడిగి తీసుకున్న సిగరెట్టు కాలుస్తూ మంచీచెడ్డా మాట్లాడాడు.

ఆవిడ కాకపోయినా, ఆవిడ పనివాడైనా దొరికాడు కదాని వీళ్లు తమ గోడు చెప్పుకుని మీ అమ్మగారికి చెప్పు అన్నారు. అతను ఫెళఫెళ నవ్వి 'పులుల్ని కాల్చేవాణ్ని ఉడతలు కాల్చమన్నట్లుంది. సిమ్మెంట్ కోటాలు, ఎమ్మెల్యే టిక్కెట్లు, స్థలాల సెటిల్‌మెంట్స్, మర్డర్ మేనేజ్‌మెంట్స్ లాంటివైతే చెప్పండి. 5 వేలకు యిలాటి చిన్నాచితకా ఉద్యోగాలు వేయించే రాయుడు గారి దగ్గరకు వెళ్లండి.' అన్నాడు నిర్మొహమాటంగా. అది విని సుబ్బులు రోడ్డు మీద చతికిలపడి ఏడవడం మొదలుపెట్టాడు. ఆనంద్ నూకరాజుతో 'చూస్తున్నారుగా వీడి అవస్థ. ఆత్మహత్యే శరణ్యం. ఐదారేళ్లగా మీరు ఆవిడ దగ్గర పని చేస్తున్నారుగా, చెప్పి చూడండి. నీట ముంచినా, పాల ముంచినా మీదే భారం.' అంటూ సుబ్బులు పేరు, కంపెనీ పేరుతో బాటు ఓ యాభై రూపాయల నోటు అతని జేబులో పెట్టేశాడు.

నాలుగు వేకెన్సీల ఇంటర్వ్యూకి 450 మంది వచ్చారు. సుబ్బులుకి ఆశ పోయింది. ఏమైనా తెలుస్తుందేమోనని నూకరాజు దగ్గరకి వెళ్లబోయి కుక్కలను చూసి పారిపోయి వచ్చారు. పది రోజుల తర్వాత సుబ్బులుకి ఉద్యోగం వచ్చింది. ఏభై రూపాయలు యిచ్చాం కదాని నూకరాజు సిఫార్సు చేశాడే అనుకుందాం. ఆవిడ డ్రైవరు మాట ఎందుకు వింటుంది? అతనికి ఎందుకంత విలువ యిచ్చింది? అని వీళ్లకు అర్థం కాలేదు.

కొన్నాళ్లకు సైకో ఎనాలిసిస్ తెలిసున్న పెంటారావుతో యీ విషయం చర్చించబోతే అతను పెద్ద థియరీ చెప్పాడు - ఫ్రాయిడ్ అన్ని సంబంధాలకూ సెక్సే కారణమన్నాడు. భర్తతో ఆవిడకు పెద్ద బంధాలు లేవు. హైక్లాసు వాళ్లు పదిమందితో ఉన్నా వెరైటీ కోసం లోక్లాస్ వాడైన నూకరాజుతో పెట్టుకుని వుంటుంది. బాగా ఎంజాయ్ చేస్తూండవచ్చు కూడా. అందుకని అతని మాట కొట్టేయలేక పోయింది అంటూ. ఇది విని సుబ్బులు 'అన్నం పెట్టిన శివరాణి గార్ని ఒక్కమాట అంటే చంపేస్తా' అంటూ శివతాండవం చేసేశాడు. 'ఇతనికి మదర్ ఫిక్సేషన్' అంటూ పెంటారావు మరో థియరీ ప్రతిపాదించాడు. చివరకు ఆనంద్ అతన్ని ఎలాగోలా పంపించివేశాడు.

రెండు నెలలు గడిచాయి. సుబ్బులుకి పెళ్లయింది. ఇంటికోసం వేటాడు తూండగా ఓ పాక గుమ్మంలో చిన్న పిల్లాణ్ని ఎత్తుకుని నూకరాజు కనబడ్డాడు. మేం ఫలానా అని వీళ్లు గుర్తు చేయగానే అతను ఆ ఏభై గురించి వచ్చారనుకుని కంగారుపడి 'ఇదిగో యీ పిల్లాడి తోడు. ఆ యాభై అమ్మగారికే యిచ్చాను. మీ ఉద్యోగం రాకపోయినందుకు నన్నేమీ అనకండి సార్' అని బతిమాలాడు. 'అదేవిటి, ఆవిడకిచ్చావా?' అని వీళ్లు తెల్లబోయారు.

'అవును, నాకెందుకండి, ఉద్యోగం కోసం ఆవిడకే యిచ్చారనుకుని మంచి మూడ్‌లో ఉన్నపుడు మీరిచ్చిన కాగితాలతో పాటు అదీ యిచ్చానండి. ఆవిడ విరగబడి విరగబడి నవ్వారు. తర్వాత ఆ జనరల్ మేనేజర్ గారితో ఇంగ్లీషులో ఏదో మాట్లాడారు కూడానండి. లక్షలతో బంతాట లాడే ఆ యమ్మకు ఏభై రూపాయలు ఏం ఆనతాయండి, అందుకే ఆ వుద్యోగం రాలేదు' అన్నాడతను. వీళ్లు ఉద్యోగం వచ్చిందని చెప్పి, ఓ యిరవై రూపాయలు అతనికి బక్షీసుగా యిచ్చి పక్కకు వచ్చి మళ్లీ ఆలోచనలో పడ్డారు. ఏభై రూపాయలు గడ్డిపరకతో సమానం. అయినా ఎందుకిలా చేసింది అని. ఏమీ తేలలేదు.

పది రోజుల తర్వాత పేపర్లో న్యూస్ వచ్చింది. శివరాణి న్యూయార్కులో ఓ డిపార్టుమెంటల్ స్టోర్సులో రెండు జతల మేజోళ్లు దొంగిలిస్తూ పట్టుబడిందని, కోర్టు జుల్మానా విధించిందని వుంది దానిలో. 'అది క్లెప్టోమానియా, థ్రిల్ కోసం చేసే చిన్న దొంగతనం.' అని పెంటారావు విశ్లేషించాడు. 'బహుశా అనుకోకుండా ఆశించకుండా నూకరాజు మా ఏభై రూపాయలూ చేతిలో పెట్టేసరికి అలాంటి థ్రిల్ వచ్చిందేమో ఆవిడకి, ఆ మురిపెంతో వెంటనే సిఫార్సు చేసిందేమో. అంతకంటె ఏమనుకుంటాం? ఇంకేదైనా కారణం ఉందేమో నాకు తెలియదు. మీకు తెలుసా?' అని కథకుడు కథ ముగించాడు.

పెంటారావు సైకో ఎనాలిసిస్‌ను రచయిత అంతకుముందే

వెక్కిరించాడు. క్లెప్టోమానియాకు దీన్ని ముడిపెట్టడం సూచించి వదిలేశాడు కానీ అలాటిది ఏమీ లేకపోయినా, పెద్దపెద్ద వాళ్లు చిన్న విషయాలకు థ్రిల్ కావడం చూస్తూ ఉంటాం. ఫైవ్ స్టార్ హోటళ్లలో తినితిని బోరు కొట్టి, రోడ్డు పక్కన పిడత కింద పప్పును రెలిష్ చేసేవాళ్లని చూశాను. ముళ్లపూడి రమణ గారు రాశారు – "అత్తగారి కథలు"కు పారితోషికంగా భానుమతి గారికి పది రూపాయలు పంపుదామని రమణగారు అంటే ఆంధ్రపత్రిక వాళ్లు అభ్యంతర పెట్టారట. ఆవిడ సినిమాల్లో వేలల్లో సంపాదిస్తుంది. స్టూడియో ఓనరు. మనం పంపింది చూసి తిట్టిపోస్తుంది అన్నారట. అలా కాదని ఒప్పించి, పంపిస్తే భానుమతి గారు రమణగారికి ఫోన్ చేసి ప్రత్యేకంగా థాంక్స్ చెప్పారట. సినిమాల్లో వేలు సంపాదించినా రాని కిక్ దీనిలో వచ్చింది. ఇది రచయిత్రిగా సంపాదన. దీనితో మా అత్తగారికి ఒక సైను పంచె, నాకో జాకెట్టు గుడ్డ, మా ఆయనకి రుమాళ్లు కొన్నాను అంటూ సంబరంగా చెప్పారట. ఆంధ్రప్రభ వీక్లీకి ఎడిటరుగా పనిచేసిన వల్లూరి రాఘవరావు ఓ సారి చెప్పాడు. పివి నరసింహారావు గారు ప్రధానిగా ఉండగా ఆయన్ని అడిగి 'శీనయ్య కథ "అనే పెద్ద కథ వీక్లీలో ప్రచురించి దాని పారితోషికంగా వెయ్యో, రెండు వేలో చెక్కు పట్టుకెళ్లి హైదరాబాదు వచ్చినపుడు యిస్తే పివి మురిసిపోయారట. పక్కనున్న వాళ్లతో 'నా కథకు చెక్కు యిస్తున్నా దయ్యా యీ కుఱ్ఱాడు' అంటూ పడిపడి నవ్వారట. ఆ చెక్‌ను ఎన్‌క్యాష్ చేసుకున్నారు కూడా. ఈ కథలో శివరాణికి కూడా అలాటి కిక్కే కలిగి వుంటుంది. నూకరాజు అమాయకంగా ఏభై రూపాయల లంచం యివ్వడం ఆమెను టికిల్ చేసి వుంటుంది. ఇలాటి ఉద్యోగం యిప్పించడం ఆమెకు చిటికెలో పని. పోనీలే అని చేసేసింది. మళ్లీ ఆ సుబ్బులు వచ్చి తనకు కనబడాలని కూడా ఆశించి వుండదు. అది సుబ్బులుకి జీవన్మరణ సమస్య కానీ ఆవిడకు ఓ పిల్లచేష్ట. కావాలంటే పీకించడం కూడా అంత ఫ్రివోలస్ రీజన్‌కు చేయగలదు. ఈ కథకు క్లెప్టోమానియా సంఘటన చేర్చి వుండకపోతే పాఠకులను కన్విన్స్ చేయడం కష్టమయ్యేదని, దాని స్థానంలో పెద్ద ఫుట్‌నోట్ రాయాల్సి వచ్చేదని రచయిత భావించి వుంటారు.

వలస పక్షుల విలాపం

- బి.మల్లిక

విదేశాల్లో స్థిరపడడమే జీవితాశయంగా పెట్టుకొని పాటుపడిన వాళ్ళు ... సంపాదన ఒకటే పరమార్థంగా ఎంచి మానవ సంబంధాలు పాడు చేసుకున్న వాళ్ళు ఇండియా లో ఏముంది మట్టి తప్ప అని చీకాకు పడిన వాళ్ళు ఆశలు తీరాలనుకుని స్పెయిన్, ఇటలీ, అమెరికా... ఇత్యాది దేశాలకు ఎగిరిపోయిన వాళ్ళు.... ఇవాళ మాతృ స్పర్శ కోసం ఆరాటపడు తున్నారు. అతిశయోక్తి అనుకోకపోతే... అయినవాళ్ళు మరణించినపుడు కూడా ఇండియా రాని కొందరు అతిప్రయోజకులు కూడా ఇప్పుడు ఇండియా వచ్చేస్తే అదేచాలని ఆశపడుతున్నారు.

ఇప్పుడు వాళ్ళు ఈ జబ్బుతో బాధపడుతున్నారని కాదు.. అక్కడ వైద్య సదుపాయాలు లేవనీ కాదు...

ఇండియా లో ఈ జబ్బు లేదని కాదు.. రాదనీ కాదు... లేక ఇక్కడ గొప్ప ఆధునిక వైద్య సదుపాయాలున్నాయనీ కాదు... ఇప్పుడు పరిస్థితి ఎలా ఉన్నా.. ఒకవేళ రేపు చావే అనివార్యం అయితే ఈ అమ్మ ఒడిలో కన్ను మూయాలనే వారి ఆశ. ఇవాళ ఈ విపత్కర పరిస్థితి తలెత్తింది కాబట్టే ఇలాంటి ఒక పార్శ్వం వారిలో ఉందన్న విషయం బయటప డింది. ఇప్పుడు వారిలో ఎంత ఆశ ఉన్నా, వారి ప్రాణం మాతృ స్పర్శ కోసం ఎంత కొట్టుకున్నా వచ్చే అవకాశాలు దాదాపు మృగ్యం!

ఇది చాలామందికి ఓ గుణపాఠం....

వ్యవసాయం, పౌరోహిత్యం, అర్చకత్వం, కిరాణా వ్యాపారం, కమ్మరి, కుమ్మరి, చేనేత.. ఇలా, అనేక వృత్తులు వంశ పారంపర్యంగా లేదా పుట్టుక చేత, కులపరంగా సంక్రమించాయి. వాటిని పాటిస్తూ ఇక్కడే ఉన్న ఎంతోమంది ఇవాళ నా అనుకునే వాళ్ళకి కళ్ళముందే ఉన్నారు. ఇవాళ ఈ ప్రాణాంతక వ్యాధి ఎంతమందిని బలి తీసుకుంటుందో.. మరి ఇక ఎందరు మిగులుతారో, తర్వాతి విషయం!

కనీసం ఈ ఆఖరి క్షణంలో అయినా, తమ వాళ్ళతో.. తమ గడ్డ మీద ఉన్న సంతృప్తి వీళ్ళకి దక్కింది. ఆఖరి క్షణాల్లో అయినవాళ్ళ కోసం



కలవరిస్తూ, అనాథల్లా అలమటించే దుస్థితి వీళ్ళకైతే లేదు. అంచేత సంపాదన మాత్రమే కొలబద్దగా ఎప్పుడూ తీసుకోవద్దు... ఉన్నచోట, తమవాళ్ళ మధ్య, తమ దేశంలో జీవనయాత్ర సాగించే అవకాశాలు ఏమాత్రం ఉన్నా, వదులుకోవద్దు.

ఇప్పటికైనా సత్యం గ్రహించాలి!

కళ్ళముందు బిడ్డలు ఉండడమే అసలైన సంపద... కన్నవారితో కలిసి ఉండగలగడమే నిజమైన సార్థకత...

కనీసం ఇకపైన అయినా, ఈ అవకాశం నా భారతదేశానికి కలగాలనీ, జంటలుగా కాక.. కుటుంబాలుగా కలిసి జీవించేవారు కనిపించాలనీ, విదేశీ మోజును, డాలర్ల ఆశను భారతీయులు జయించాలని.. సంతృప్తే ప్రాతిపదికగా సరికొత్త శకం ఆరంభం కావాలని... అలాంటి కొత్త సమాజాన్ని భగవంతుని అనుగ్రహంతో మనం అందరమూ మళ్ళీ చూడగలగాలని మనసారా కోరుకుంటున్నాను.

చైనా బ్యాంకులుకి అంబాని ఎక్కువేంటి?

ఆర్థికం

- కె.వి.రమణ, ఎం.ఎ.,బి.ఇడి



బ్యాంకు రుణాల్ని, బకాయిల్ని, ఇతర అప్పుల్ని చెల్లించరు మన ధనిక ప్రభావశీల వ్యాపారులు... అవసరమైతే దివాలా ప్రకటిస్తారు... తమ వ్యాపార సంస్థల్ని తామే నిండా ముంచేస్తారు... ఫలితం : అప్పులిచ్చిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మునిగిపోతయ్... కానీ వీళ్లు బాగానే ఉంటారు... వేల కోట్ల నివాసాలు, విలాసాలు, ఆడంబరాలు, అట్టహాసాలు, కుబేరుల్లాగా ధనకళ... వారి జీవనశైలిలో వీసమెత్తు తేడా ఉండదు... అదెలా సాధ్యం..? మామూలుగా మన చుట్టూ ఉన్నవాడు ఎవరు దివాలా తీసినా, మళ్లీ మార్కెట్‌లో చిల్లిగవ్వ కూడా అప్పు పుట్టదు... మొహాలు చాటేసుకుని తిరుగుతారు... కొందరు అవమానాలు భరించలేక ఆత్మహత్య కూడా చేసుకుంటారు... మరి మన దేశంలోని ధనిక వ్యాపారుల ఇండ్లు, ఫామ్ హౌజులు, వాహనాలు, సొంత పేర్ల మీద ఆస్తులు గట్రా క్షేమంగా ఎలా ఉంటయ్... సరిగ్గా 4 రోజుల క్రితం లండన్ హైకోర్టుకు కూడా ఇదే డౌట్ వచ్చింది... అదీ ది గ్రేట్ అనిల్ అంబానీ వ్యవహారంపై. విషయం ఏమిటంటే..? అనిల్ 2012లో చైనాకు చెందిన మూడు ప్రభుత్వ బ్యాంకుల నుంచి 550 మిలియన్ పౌండ్ల అప్పు తీసుకున్నాడు... అంటే దాదాపు 5300 కోట్ల రూపాయలు... అదంతా వ్యక్తిగత పూచీకత్తుపైనే..! ఇండియా బ్యాంకుల్లాగే అనుకున్నాడు... వడ్డీ కూడా చెల్లించడం మానేశాడు... నిజానికి తన వ్యాపారాలన్నీ దెబ్బతిన్నయ్, నిజమే... కానీ అప్పు ఇచ్చినవాడు ఊరుకోడు కదా... ఆ మూడు చైనా బ్యాంకులూ ఓ టీంగా ఏర్పడి లండన్ హైకోర్టులో కేసు వేశాయి... మొన్నటి డిసెంబరులో ఓసారి విచారణ జరిగింది... నాలుగు రోజుల క్రితం మళ్లీ విచారణ జరిగింది. నా కంపెనీ షేర్ల విలువ జస్ట్ 63.7 మిలియన్ల డాలర్లు... నగదు జీరో... నేను ఏమీ చెల్లించే స్థితిలో లేను అనేది అనిల్ వాదన... ఆమధ్య స్వీడెన్ కంపెనీ ఎరిక్సన్ ఇలాగే ఒత్తిడి చేస్తే ఆయన సోదరుడు ముఖేష్ 60 మిలియన్ పౌండ్లను చెల్లించాడనీ, ఇక ఆయన కూడా ఆదుకునే సీన్ లేదని అనిల్ అంబానీ లాయర్ వాదించాడు... ఈ సందర్భంగా బ్యాంకుల న్యాయవాది మాట్లాడుతూ... "దాదాపు 330 కోట్ల విలువైన విలాసవంతమైన విహారపడవ ఉంటుంది మీకు... (సేమ్ ముఖేష్ తన భార్యకు కొని గిఫ్ట్ ఇచ్చినట్టుగానే అనిల్ కూడా తన భార్యకు ప్రపంచంలోకెల్లా టాప్ టెన్‌లో ఒకటైన విహారపడవను కొని గిఫ్ట్‌గా ఇచ్చాడు)... దాదాపు 580 కోట్ల విలువైన బోయింగ్ జెట్ ప్రైవేట్ విమానం ఉంటుంది మీరు తిరగటానికి... దాదాపు 20 వేల కోట్ల రూపాయల 27 అంతస్థుల నివాసభవనం ఉంటుంది మీరు ఉండటానికి... కానీ అప్పులు చెల్లించటానికి మాత్రం మీ దగ్గర చిల్లిగవ్వ కూడా ఉండదా..?" అని ప్రశ్నించాడు... వావ్... ఎంత సూపర్ ప్రశ్న... సూటిగా. ఇక్కడే జడ్జి డేవిడ్ వాక్స్‌మన్ కూడా జోక్యం చేసుకుని "ఒకప్పుడు ప్రైవేటు హెలికాప్టర్‌లో తిరిగిన తమరు ఇప్పుడు ప్రైవేటు జెట్ విమానంలో తిరుగుతున్నారు... మీకున్న 11 కార్ల విలువే 22 కోట్లు... అప్పులు చెల్లించటానికి మాత్రం డబ్బుల్లేవు అంటుంటారు... తప్పదు, మార్చి 20 లోపు అప్పు చెల్లించేయండి..." అని ఆదేశించాడు... నిజానికి చైనా బ్యాంకుల నుంచి అప్పు తీసుకున్న తరువాత అనిల్ స్టీఫెన్ స్పీల్ బర్గ్ దర్శకత్వం వహించిన లింకన్ అనే హాలీవుడ్ చిత్రానికి ఫైనాన్స్ చేశాడనీ, భారీగా డబ్బులు వచ్చాయనీ వార్తలొచ్చాయి... అయితేనేం..? నా దగ్గరేముంది బూడిద అంటున్నాడు ఇప్పుడు.

నాలుగైదేళ్ల వార్తలు ఓసారి పరిశీలించండి... ఎవరెవరో ఎందుకు..? విజయ్ మాల్యా దాకా అక్కర్లేదు... మన తెలుగునాట ఉద్దేశపూర్వక రుణఎగవేతదార్లు, దివాలా ప్రకటించినవాళ్ల జీవితాల్లో ఏ తేడా ఉండదు... వాళ్ల ఇళ్లు, వాళ్ల విలాస జీవనశైలి, వాళ్ల రాజకీయాలు, వాళ్ల ఇతర సంపాదన, వాళ్ల అట్టహాసాలు యధావిధిగా కొనసాగుతూనే ఉంటయ్... బ్యాంకులు వాళ్లు తాకట్టు పెట్టిన ఆస్తుల్ని వేలం వేయటానికి ప్రయత్నిస్తాయి... అవి అమ్మితే వచ్చే సొమ్ము కొన్నిసార్లు కాగితాల ఖర్చుకు కూడా సరిపోదు. పత్రికల్లో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆస్తుల వేలం ప్రకటనలు వచ్చాయి... దాదాపు 150 కోట్ల రికవరీ కోసం... ఇది రెండోసారి... మన బ్యాంకుల్ని దోచుకున్న ఎవ్వరూ దెబ్బతినలేదు... వాళ్లకు ఏ నష్టమూ ఉండదు... గంటా మాత్రమే కాదు... అలా బోలెడు మంది... ఇచ్చిన బ్యాంకులు మునిగిపోవాల్సిందే తప్పు, ఎవరికీ ఏమీ కాదు.

గతమెంతో.. ఘనకీర్తి తెలుగోడా..

- ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు

కొంతమంది వ్యక్తులు, కొన్ని వ్యవస్థలు, కొన్ని సంస్థలు చరిత్రపుటల్లోకి వెళ్లిపోతాయి. లోకం మెల్లగా మర్చిపోతుంది. అవన్నీ కాలగర్భంలో కలిసిపోతాయి. వారందరూ కాలప్రవాహంలో కలిసిపోతారు.అందులో, నిన్నటి జ్ఞాపకంగా ఆంధ్రాబ్యాంక్, మొన్నటి చరితగా భోగరాజు పట్టాభిసీతారామయ్య మిగిలిపోయారు. గతమయ్యె.. ఘనచరిత! దాదాపు వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఆంధ్రాబ్యాంక్ మొన్ననే యూనియన్ బ్యాంక్ లో విలీనమైంది. ఆ పేరు ఇక వినిపించదు, కనిపించదు. ఇంతటి వ్యవస్థను, సంస్థను నిర్మించిన మహావ్యక్తి భోగరాజు పట్టాభిసీతారామయ్యకూడా ఇక వినిపించడు.నిన్న మొన్నటి వరకూ ఆంధ్రాబ్యాంక్ కార్యాలయాల్లో ఫోటోల్లో దర్శనమిచ్చిన ఆ పుణ్యమూర్తి ఇక కనిపించడు.ఆ ధన్యకీర్తిని ఒకమారు తలచుకుందాం.కట్టులో, పట్టులో, నడకలో, నడతలో తెలుగుదనం నిలువెల్లా మూర్తీభవించి, తెలుగు కోసం తపించి, తెలుగుకోసం చలించి, తెలుగులోనే చరించిన తెలుగు తేజుడు భోగరాజు. అయన స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు, చేయితిరిగిన రాయసకాడు. కాంగ్రెస్ నాయకుడు, వైద్యుడు,ఆంధ్రబ్యాంక్ వ్యవస్థాపకుడు. ఇన్నింటి కలబోత మన తెలుగువాడు, పట్టాభిసీతారాముడు.ఈరోజు తెలుగువారికోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందంటే అది అయన చలువే. ఎప్పుడో 1908లోనే ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి ఆయన నడుంకట్టాడు.కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగం ఏర్పాటు ఆయన చొరవే.కాంగ్రెస్ పార్టీకి తొలి జాతీయ అధ్యక్షుడుగా ఎంపికైన ఘన చరిత ఆయన సొంతం. వ్యాపారవేత్తగా అయన పట్టిందల్లా బంగారమయ్యింది. ముట్టిందల్లా మేలుబంతి అయ్యింది.ఆంధ్రాబ్యాంక్ తో పాటు ఆంధ్రా ఇన్సూరెన్స్ కంపెనీ, భారత లక్ష్మీబ్యాంక్, కృష్ణాజిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ లు ఆయన స్థాపించినవే. రైతులకు రుణాలిచ్చి వ్యవసాయ అభివృద్ధికి అయన ఇచ్చిన తోడ్పాటు మరువలేనిది.చిన్న చిన్న మొత్తాల్లో డిపాజిట్లు సేకరించి, పొదుపును కూడా ఉద్యమంగా చాటిచెప్పాడు.ప్రత్యేక తెలుగురాష్ట్రం కోసం పోరాటం ఒకపక్క – అడుగడుగునా తెలుగుభాష వాడుకకోసం కృషి ఇంకొక పక్క సాగించాడు.తాను స్థాపించిన అన్ని సంస్థల్లోనూ లావాదేవీలు, ఉత్తరప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే ఉండాలని శాసించాడు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా, ఎంపీగా, గవర్నర్ గా అత్యున్నత పదవులు అలంకరించినా? తన అడుగులు ఎప్పుడూ తెలుగుమీదే నిలుపుకున్న తెలుగుభక్తుడు భోగరాజు.అపారమైన జ్ఞాపకశక్తి, అనర్గళమైన ఇంగ్లిష్ భాషా జ్ఞానం అయన సొత్తు.1600 పేజీల్లో కాంగ్రెస్ చరిత్రను కేవలం రెండు నెలల్లోనే రాశాడు.అందులోని విషయాలన్నీ , కేవలం మెదడులో గుర్తుపెట్టుకొని, రచనలోకి తెచ్చిన సంచలన రచయిత అయన. చేయితిరగడం అంటే? నిజంగా ఇదే! అంతటి అసాధారణ ధారణ, ధార కలిగిన ప్రతిభామూర్తి భోగరాజు పట్టాభిసీతారామయ్య. విలియం టారెన్సు రాసిన ఎంపైర్ ఆఫ్ ఆసియా అనే పుస్తకాన్ని తెలుగులో అనువాదం చేశాడు.బందరులో జన్మభూమి అనే ఇంగ్లిష్ వార పత్రికను 1919 లో స్థాపించాడు.ఆయనే దానికి సంపాదకుడు. పదకొండేళ్లపాటు, 1930 వరకూ ఆ పత్రికను విజయవంతంగా నడిపాడు.ఆ సంపాదకీయాలు చూస్తే? అయన ఇంగ్లిష్ ప్రతిభాప్రభ మనకు దర్శనమౌతుంది.స్వాతంత్ర్య సాధనలో, క్విట్ ఇండియా ఉద్యమంలో మూడేళ్లపాటు జైలుశిక్ష అనుభవించాడు. బయటవ్యక్తులతో ఎటువంటి సంబంధ బాంధవ్యాలు లేకుండా, జైలులో ఆంగ్లేయులు భోగరాజును చిత్రహింసలకు గురిచేశారు.ఈ అనుభవాలను “ ఈకలు – రాళ్లు “ అనే పుస్తకంగా తీసుకొచ్చాడు.తెలుగుజాతి కోసం, భారత దేశం కోసం ఇంతగా జీవితాన్ని త్యాగంచేసిన పట్టాభిసీతారామయ్య భోగరాజు కాదు. త్యాగరాజు.ఇదంతా ఒక ఎత్తు – ఆంధ్రాబ్యాంక్ స్థాపన మరొక ఎత్తు. ఆంధ్రాబ్యాంక్ స్థాపన ఒక అద్భుతం. ఒక ప్రయోగం. బహుళ ప్రయోజనం.

1923, నవంబర్ 28 వ తేదీ తన కార్యస్థానంగా భావించే మచిలీపట్నంలోనే భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంధ్రాబ్యాంక్ స్థాపించాడు. గ్రామసీమల ప్రగతి,ఉపాధి, పొదుపు, సాంకేతికత, దేశ సమగ్ర అభివృద్ధికి ఆలవాలంగా నిలిచి, వందేళ్ల పయనానికి చేరువ అవుతోన్న దశలో ఆ పేరు అంతర్ధానమైపోయింది. శరవేగంగా అభివృద్ధి సొంతం చేసుకున్న ఆంధ్రాబ్యాంక్ 1980లో జాతీయమయ్యింది. జాతీయమైన తొలినాళ్ళలోనే ప్రయోగాలకు తొలి అడుగు వేసింది. 1981 లోనే, దేశంలోనే మొట్టమొదటిసారిగా క్రెడిట్ కార్డ్స్ వ్యవస్థను తీసుకు వచ్చింది. బ్యాంకింగ్ రంగానికి క్రెడిట్ కార్డ్స్ సేవలు తొట్టతొలిగా పరిచయం చేసింది. 2003 నాటికే నూటికి నూరుశాతం కంప్యూటరీకరణ సాధించి, మిగిలిన బ్యాంక్ లకు మార్గదర్శనం చేసింది. ఈరోజు మనం విరివిగా వాడుకునే బయో మెట్రిక్ ఎ. టి. ఎమ్ లను 2007 లోనే, మొట్టమొదటిగా పరిచయం చేసిన ఘనత కూడా ఆంధ్రాబ్యాంక్ సొంతమే. పెట్టుబడులు రాబట్టడంలోనూ, ఆసియాలోనే ఆంధ్రాబ్యాంక్ ది అగ్రస్థానం. గ్రామీణ ప్రాంతాలకు యాభైశాతం తగ్గకుండా రుణాలు అందించిన ఘనత కూడా ఈ బ్యాంక్ ఖాతాలోకే వస్తుంది. 1, 30, 000 షేర్ హోల్డర్లు, 1.372 కోట్ల ఖాతాదారులు కలిగి, బ్యాంక్ లను జాతీయం చేసిన తర్వాత, సమర్థంగా, సమగ్రంగా నడిచిన చరిత్ర ఆంధ్రాబ్యాంక్ సంపాయించుకున్న ఘనత. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆంధ్రాబ్యాంక్ ఈ ఏప్రిల్ 1 వ తేదీ నుండి యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా లో విలీనమయ్యింది. ఇక నుండి యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియాగానే పిలువబడుతుంది. ఇక నుండి ఆంధ్రాబ్యాంక్ అనే పేరు కనిపించదు. వినిపించదు. బ్యాంక్ ల విలీనం వల్ల, బ్యాంక్ ల సంఖ్య తగ్గించి, పెద్ద బ్యాంక్ లుగా మార్చడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. గతంలో విలీనమై, పెద్ద బ్యాంక్ లుగా ఏర్పడిన బ్యాంక్ లు ఎటువంటి కొత్త ప్రగతిని సాధించాయో? విలీనం వల్ల ప్రభుత్వాలకు, ప్రజలకు, దేశానికి ఎంతటి ఫలితాలు వచ్చాయో? ప్రయోజనాలు కలిగాయో? సగటు భారతీయునికి పెద్దగా తెలియదు. బ్యాంకింగ్ వ్యవస్థను అజమాయిషీ చేసే, చేయవలసిన రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, తత్ సంబంధిత అధికార వ్యవస్థలు గత విలీనాలపై సమీక్షలు జరిపాయా? నివేదికలు అందుబాటులో ఉంచాయా? అంటే? ఆర్థిక రంగ విశ్లేషకులు కొందరు పెదవి విరుస్తున్నారు. మళ్ళీ, ఇప్పుడు జరిగిన విలీనం వల్ల ఏమేమి ప్రయోజనాలు ఉంటాయో? అనే అనుమానాలూ వారు వ్యక్తం చేస్తున్నారు. నిజంగా, బ్యాంక్ ల విలీనం వల్ల బహుళ ప్రయోజనాలు, మరింత ప్రగతి ఉంటే? మంచిదే. ఈ చర్యను స్వాగతిద్దాం... అని కొందరు ఆర్థికరంగ నిపుణులు అంటున్నారు. ఒక చారిత్రక జాతి, రాష్ట్రం పేరుతో ఏర్పడిన బ్యాంక్ ఆంధ్రాబ్యాంక్. ఒక మహావ్యక్తి నిర్మించిన మహా ఆర్థిక సౌధం ఈ సంస్థ. ఇటువంటిది కనుమరుగవ్వడం బాధాకరం. విలీనం అనివార్యమైనా? కనీసం, పేరులో “ ఆంధ్ర” అనే శబ్దాన్ని నిలబెట్టుకోవడంలో మనం విఫలమయ్యామనే బాధ అందరిలో ఉంది. ఘన చరిత్ర సృష్టించిన ఆంధ్రాబ్యాంక్, ఘన చరిత కలిగిన భోగరాజు పట్టాభిసీతారామయ్య నిన్నటి జ్ఞాపకాలుగా , చరిత్రపుటలుగా మిగిలిపోక, తెలుగువారి హృదయపీఠాల్లో ఎన్నటికీ చిరంజీవులుగా నిలుస్తారని, ఆ చరిత నిత్యస్మరణీయంగా నిలుస్తుందనీ ఆకాంక్షిద్దాం.”తెలుగోడు పట్టాభి” కి చెయ్యెత్తి జై కొడదాం....

... జై తెలుగుతల్లి ...

రేవంతుడిని ఒంటరి చేయడం వెనుక మర్మమిదా..?!



- జి.వినోద్

కేటీయార్ ఫామ్ హౌజుపై రేవంత్‌రెడ్డి పోరాటం తన వ్యక్తిగతమట... దానికి పార్టీతో సంబంధం లేదట... ముందు తనపై వచ్చే ఆరోపణలకు సమాధానం చెప్పాలట... అసలు ఈ రేవంతుడి వ్యవహారంపై పార్టీలో సీరియస్ చర్చ జరగాలట... ఈ విషయాల్ని చెబుతూ చెబుతూ మన కాంగ్రెస్ హన్మంతన్న... నోరుజారి... అరె, ఆ జీవో 111 పరిధిలో కాంగ్రెసోళ్ల ఫామ్ హౌజులే ఎక్కువగా ఉన్నయిర భయ్, ఎవరికి వాళ్లే ఇలా కార్యక్రమాలు చేస్తే మన కాంగ్రెసోళ్లకే నష్టం కదా అనేశాడు. హహహ... అదన్నమాట సంగతి... జగ్గారెడ్డి కూడా అది రేవంత్‌రెడ్డి సొంత వ్యవహారం అంటాడు... దామోదర రాజనర్సింహ దాదాపు అదే అన్నాడు... అసలు రేవంత్‌రెడ్డిని అనుమతి లేకుండా డ్రోన్ ఉపయోగించాడు అనే ఓ టెక్నికల్ కేసు పెట్టి లోపలేస్తే... కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడలేదు సరికదా విచిత్రంగా డిస్ ఓన్ చేసుకుంటున్నది... కనీసం మౌనంగా కూడా ఉండటం లేదు... కేసీయార్ కేసు పెట్టి, భలే లోపలేశాడులే అన్నట్టుగా మాట్లాడుతు న్నారు... (కేసీయార్ గనుక కేసు పెట్టకపోతే ఒకరిద్దరు కాంగ్రెసోళ్లే కేసులు పెట్టేవాళ్లేమో...!!) వారెవ్వా... ఇప్పటికిప్పుడు కేసీయార్ దిగిపోయి, కాంగ్రెసోళ్లు గద్దెనెక్కాలన్నంత బలమైన అభిమానం ఉన్నవాళ్లకు కూడా చిరాకు పుట్టించే స్థాయికి కాంగ్రెస్ రాజకీయాలు చేరుకుంటున్నయ్. అసెంబ్లీలో మిగిలిందే ఆరుగురు... అదుగో మంథని శ్రీధర్ బాబు కారు ఎక్కబోతున్నాడూ అంటూ ఓ ప్రచారం మొదలవుతుంది... నేను పార్టీలో ఉండాలో, కొత్త పార్టీ పెట్టాలో, ఇంకేదైనా జాతీయ పార్టీలో ఉండాలో తేల్చుకుంటాను అంటూ హఠాత్తుగా కోమటిరెడ్డి స్వరం భగ్గుమంటుంది... జగ్గారెడ్డి మాటతీరు అప్పుడప్పుడూ అలాగే విచిత్రంగా ఉంటుంది... మరోవైపు ఎంపీ రేవంత్‌రెడ్డి తన దోవన తను కేసీయార్‌కు చిర్రెక్కించే కార్యక్రమాలు చేస్తూ వెళ్తుంటాడు... ఇప్పుడు హఠాత్తుగా రేవంత్ అనుకూల సోషల్ మీడియాలో తను సొంత పార్టీ పెట్టే అవకాశాలపై చర్చ మొదలైంది... ఉత్తముడిని తీసేస్తున్నారు, అదుగో కొత్త పీసీసీ అధ్యక్షుడు, ఇదుగో కొత్త నాయకుడు అంటూ రకరకాల వార్తలు ప్రచారంలోకి వస్తూ ఉంటయ్... ఊదు కాలదు... పీరు లేవదు... ఎటొచ్చీ పొడెం వీరయ్య, భట్టి విక్రమార్క, సీతక్క తదితరులు మాత్రం సంయమనం కోల్పోకుండా, పార్టీ లైన్ తప్పకుండా వ్యవహరిస్తున్నారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు గాకుండా చాలామంది కాంగ్రెస్ నేతలే తన కాళ్లకు కట్టెలు అడ్డం పెడుతున్నారు... తనకు దూకుడెక్కువ... ఈ స్థితిలో పీసీసీ పగ్గాలు కూడా ఇస్తే ఇక కాంగ్రెస్ పార్టీలో తమ పాత్ర మరింత పరిమితం అయిపోతుందనే ఆందోళన చాలామంది సీనియర్లలో ఉంది... అందులో కొందరినైనా తనకు అనుకూలంగా కలుపుకుని పోవాలనే ధ్యాస రేవంత్‌కూ లేదు... తెలంగాణలో కాంగ్రెస్‌కు సంస్థాగతంగా బలముంది... పరుగులు పెట్టించే మంచి నాయకుడు లేకపోవడమే దానికి శాపం అని గుర్తించలేకపోవడం ఏఐసీసీ తప్పు... అసలు ఏఐసీసీలోనే నాయకత్వ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు... సింధియా వంటి నేతలే సొంత దారి చూసుకుంటున్నప్పుడు, ఇక తెలంగాణ గురించి ఆలోచించేవాళ్లు ఎవరున్నారు..? కానీ ఏమాటకామాట... ఇప్పుడు కేసీయార్ దరిదాపుల్లోకి కూడా రాజకీయంగా వెళ్లగల స్థితిలో కాంగ్రెస్, బీజేపీ లేవు... కానీ కాంగ్రెస్ పార్టీ బలహీనపడేకొద్దీ, ఎంతోకొంత బీజేపీ పెరుగుతూ ఉంటుంది... పెరుగుతున్నది... అది కూడా గమనించే సోయిలో కాంగ్రెస్ లేకపోవడం పార్టీకి అసలైన విషాదం.!!

దినసరి కూలీలకు ఆహారం సరఫరా





సికింద్రాబాద్(హైద్రాబాద్, తెలంగాణ) : జంట నగరాలైన హైద్రాబాద్ మరియు సికింద్రాబాద్ నగరాల్లో కరోనా వ్యాధి కారణంగా ఎవ్వరు ఇబ్బంది పడకుండా పకడ్బంది ఏర్పాట్లు జరిపినట్లు తెలంగాణ అసెంబ్లీ ఉపసభాపతి తీగుల్ల పద్మారావు గౌడ్ వెల్లడించారు. బుధవారం అయన సికింద్రాబాద్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 'లాక్ డౌన్' పరిస్థితులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నామాలగుండు లోని తన క్యాంపు కార్యాలయంలో జిమెచ్ఎంసి ఉప కమీషనర్ రవి కుమార్, చిలకలగూడ ఇనిస్పెక్టర్ బలగంగి రెడ్డి, ఇతర అధికారులు, కార్పొరేటర్ సామల హేమ, ఇతర నాయకులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భయంకరమైన కరోనా వ్యాధి నివారణకు ప్రభుత్వం పకడ్బంది ఏర్పాట్లు జరుపుతోందని, వ్యక్తిగత పరిశుభ్రత, తగినంత దురాన్ని పాటించడం ద్వారా ప్రజలు సహకరించాలని పద్మారావు గౌడ్ వివరించారు. లాక్ డౌన్ కారణంగా సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన నిరుపేదలు ఇబ్బంది పడకుండా కనీసం ఓ 10వేల మంది దినసరి కూలీలకు భోజనం సమకూర్చాలని నిర్ణయించామని, అవసరమైన పక్షంలో వ్యక్తిగత నిధులను సైతం అందించి పేద ప్రజలకు ఉచితంగా భోజనాన్ని సమకూరుస్తామని పద్మారావు గౌడ్ ప్రకటించారు. అదే విధంగా ఓ దయగ్నస్తిక్ సెంటర్ సహకారంతో మాస్కులు, సానీటైజర్స్‌లను ఉచితంగా ప్రజలకు అందించాలని నిర్ణయించామని తెలిపారు. ఆపద సమయంలో ప్రజలు తాము అండగా నిలుస్తామని, ఎవ్వరు ఆందోళనకు గురికాకుండా ప్రజలు ప్రభుత్వంతో సహకరించి కరోనా వ్యాప్తిని నివారించేందుకు సహకరించాలని పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. ఉచితంగా మాస్కులు, శానిటైజర్ల పంపిణి సికింద్రాబాద్ పరిధిలోని నామాలగుండు, సీతాఫలమండి, ఉప్పల్ బస్తి తదితర ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పర్యటించి సన్ రైజ్ డయాగ్నొస్టిక్ సంస్థ సహకారంతో మాస్కులు, శానిటైజర్లను ఉచితంగా పంపిణి చేశారు.

– కెబి.రమేష్

లాక్ డౌన్ నిబంధనలు తుంగలో తొక్కి మద్యం వ్యాపారులతో కుమ్మకైన ఎస్సై సస్పెండ్

శంషాబాద్ (సైబరాబాద్ కమిషనరేట్), తెలంగాణ : అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా వారితో కుమ్మక్కైనందుకు ఓ ఎస్సై సస్పెన్షన్‌కు గురయ్యాడు. విది నిర్వహణలో భాద్యతారహితంగా వ్యవహరించినందుకు అతడిని మొదట సిపి అఫీసుకు అటాచ్ చేసి పూర్తి విచారణ అనంతరం సస్పెండ్ చేశారు అధికారులు. సైబరాబాద్ కమిషనరేట్ శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో ఇటివల లాక్ డౌన్ ఉల్లంఘించిన మద్యం వ్యాపారులు రాత్రిపూట వైన్ షాపును ఓపెన్ చేసి ఆక్రమంగా మద్యం తరలించారు. ఈ విషయమై ఫిర్యాదు రావడంతో దర్యాప్తు చేసేందుకు రంగం లోకి దిగిన ఎస్సై శ్రీధర్ మద్యం వ్యాపారుల పై ఏలాంటి చర్యలు తీసుకోకుండా వారితో కుమ్మక్కైనట్లుగా అరోపణలు వచ్చాయి. దీంతో ఎస్సై ని కమిషనర్ ఆఫీస్ కు అటాచ్ చేసి ఈ మొత్తం వ్యవహారం పై విచారణ చెపట్టిన సైబరాబాద్ కమీషనర్ విసి సజ్జనార్ ఆరోపణలు నిజమని తేలడంతో అతన్ని సస్పెండ్ చేశారు.



ఎల్ఐసి భవిష్యత్తుకి భీమా వుందా?

- ఇ.పాల్‌కుమార్

ఆర్థికం

LIC

योगक्षेमं वहाम्यहम्

भारतीय जीवन बीमा निगम

LIFE INSURANCE CORPORATION OF INDIA

ట్రస్టుగా నడపబడే ఎల్ఐసి విషయంలో వేలు పెట్టే అధికారం ప్రభుత్వానికి ఉందా లేదా అన్న విషయంపై న్యాయనిపుణులు ఎలాగూ కోర్టుకి వెళతారు. అసలు అమ్మే అవసరం ఎందుకు వచ్చింది, మోదీ చేస్తున్నది సవ్యమైన పనేనా? ఇలాగైతే దేశంలో బీమా పరిస్థితి ఏమిటి? సామాన్యుల భవిష్యత్తు సంగతేమిటి?

ఎల్ఐసిని ప్రైవేటు పరం చేయడమంటే చక్రాన్ని వెనక్కి తిప్పినట్లే లెక్క. అసలు ఎల్ఐసి ఆవిర్భవించినదే ప్రైవేటు బీమా సంస్థల వైఫల్యం వలన! అప్పట్లో ధనిక వ్యాపార కుటుంబాలు తమ సంస్థలకు పెట్టుబడుల కోసం బ్యాంకులను, బీమా కంపెనీలను నిర్వహిస్తూ ప్రజల నుంచి అతి తక్కువ రేట్లకు పొదుపు చేసిన సొమ్మును తీసుకునేవారు. దాన్ని తమ వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టి మంచి లాభాలు ఆర్జించేవారు. 1953లో బీమా వ్యాపారంలో రూ.12 కోట్లు పెట్టుబడి పెట్టిన వీరు మూడేళ్లలో రూ.318 కోట్లు సంపాదించారు.

సామాన్యుడికి ఓ పట్టాన బ్యాంకు ఋణం లభించేది కాదు. బ్యాంకుల జాతీయకరణ చేసిన తర్వాతనే వారికి బ్యాంకుల ఋణాలు అందుబాటులోకి వచ్చాయి. డిపాజిట్ల వడ్డీ రేట్లు పెరిగాయి. బ్యాంకింగ్ సేవలు విస్తరించాయి. బ్యాంకుల జాతీయకరణ కంటె 13 ఏళ్లకు ముందే బీమా వ్యాపారం జాతీయం చేయవలసిన అవసరం ఎందుకు పడిందంటే కొన్ని కంపెనీలు ప్రజలను మోసం చేశాయి, కొందరు మోసగాళ్లు కంపెనీలను మోసం చేసి ముంచేశారు. భార్య పేర బీమా చేయించడం, బొంబాయిలో ఎత్తయిన బిల్డింగుల పైకి తీసుకెళ్లి ఊరు చూపిస్తా అంటూ కిందకు తోసేయడం, ప్రమాదవశాత్తూ చనిపోయిందని బీమా క్లెయిమ్ చేయడం, యిలా కంపెనీలను దోచారు. ఇక కంపెనీలు కూడా బీమా కంపెనీల నిధులను తమ కంపెనీలకు దారి మళ్లించసాగాయి. ఇలా 25 కంపెనీలు చేశాయి.

దాల్మియా గ్రూపు వారి భారత్ ఇన్సూరెన్స్ కంపెనీ పాలసీదారులను రూ. 2 కోట్ల మేరకు దగా చేసింది. బొంబాయిలో రూ. 30 లక్షల గవర్నమెంటు సెక్యూరిటీలు గల్లంతయ్యాయి. ప్రజలకు చావు గురించి ఆలోచించడమే భయం. నీ మరణానంతరం నీ కుటుంబం కోసం బీమా చెయ్యి అంటే జనాలు వినడానికే యిష్టపడేవారు కారు. అందువలన బీమా వ్యాపారం పెద్దగా జరిగేది కాదు. దాంతో కిట్టుబాటు కానంతగా కంపెనీలు ఆఫర్లు యిచ్చేవి. అలా 25 కంపెనీలు మూతపడ్డాయి. ఇవన్నీ దేశ బీమా రంగాన్ని కృంగదీశాయి.

పాలసీదారుల సొమ్ముకు రక్షణ కల్పించాలన్నా, ఉద్యోగులకు, ఏజంట్లకు భద్రత ఉండాలన్నా జాతీయకరణ ఒకటే మార్గం అనుకుని నెహ్రూ ప్రభుత్వం 1956 జనవరిలో ఆర్డినెన్సు జారీ చేసింది. సెప్టెంబరు 1న 245 జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను కలుపుకుని ఎల్ఐసి ఆవిర్భవించింది.

ఎల్ఐసిని ఒకట్రస్టుగా రూపొందించారు. అప్పుడు ప్రభుత్వం మూలధనానికై యిచ్చింది కేవలం రూ. 5 కోట్లు. దాని మీద ఎల్ఐసి ఏటేటా డివిడెండ్ యిస్తూనే వచ్చింది. ఇప్పటిదాకా ప్రభుత్వానికి ఆ రూపేణా వచ్చింది రూ. 26 వేల కోట్లు! అది చాలనట్లుగా ఎల్ఐసి నిధులను ఇష్టం వచ్చినట్లు వాడుకుంది. ఎక్కడ ఏ అవసరం పడినా ఎల్ఐసిని 'నువ్వు వాడికి డబ్బియ్యి, వీడికియ్యి, లాభసాటి కాకపోయినా ఇక్కడ పెట్టుబడి పెట్టు, అక్కడ పెట్టు' అంటూ ఆదేశాలిచ్చింది. ఎల్ఐసి అవన్నీ చేస్తూ పోయింది. ఎవరి డబ్బుతో? పాలసీదారుల డబ్బుతో! అలా చేసినా నిలదొక్కుకుంటూ, విస్తరిస్తూ, సమర్థవంతంగా నిర్వహించుకుంటూ వస్తోంది. గతంలో అయితే మోనోపలీ ఉండేది.

కానీ రెండు దశాబ్దాలుగా ప్రయివేటు ఇన్సూరెన్సు కంపెనీలతో పోటీపడుతూ వస్తోంది. 23 ప్రయివేటు బీమా కంపెనీలున్నా, యిప్పటికీ మార్కెట్లో 73% వాటా ఎల్ఐసిదే.

ఆలాంటి ఎల్ఐసిని ఇప్పుడు దోచుకుని తినేద్దామని ప్రభుత్వం చూస్తోంది. ఏ అధికారంతో? అప్పుడెప్పుడో రూ. 5 కోట్లు యిచ్చినందుకట! మరి అలా అయితే ఈనాడు రూ. 31 లక్షల కోట్ల విలువ చేసే ఆస్తులున్న, ఎల్ఐసిని నిర్మించిన తరతరాల పాలసీదారులకు ఎంత హక్కు ఉండాలి? ప్రస్తుత పాలసీదారులే 40 కోట్ల మంది ఉన్నారు. 12 లక్షల మంది ఏజంట్లున్నారు. ప్రభుత్వం తన నిర్ణయంతో వీళ్లందరినీ గందరగోళంలో పడేసింది.

ఈ బంగారుబాతుపై కన్నుపడడం యిపుడే కాదు, ప్రభుత్వవాటాను 50% అమ్మేసి డబ్బు చేసుకోండి అని మల్హోత్రా కమిటీ 1994లో సిఫార్సు చేసింది. కానీ అప్పటి ప్రభుత్వాలకు ధైర్యం చాల్లేదు. ప్రజలు తిరగబడ తారనుకుని జంకారు. ఇప్పుడు మోదీ సర్కారుకి అలాంటి జంకులు లేవు. 70 ఏళ్లగా పూర్వపాలకులు ఏం చేశారు? ఏం ఒరగబెట్టారు? అని అడుగు తూనే వాళ్లు కూడబెట్టిన, నిలబెట్టిన సంస్థలను అమ్ముకుని తినేస్తున్నారు. పూర్వీకులు వారసత్వంగా యిచ్చిన ఆస్తులను వ్యసనపరులు కరిగించేసినట్లుగా ఉందీ వ్యవహారం. ఇలా అమ్మగా వచ్చిన డబ్బుతో బిఎస్ఎన్ఎల్ వంటి సంస్థను నిలబెడతారా అంటే అదీ లేదు.

అసలు బిఎస్ఎన్ఎల్‌ని తన ఆస్తులు అమ్ముకోనిచ్చినా నష్టాల్లోంచి బయట పడుతుంది. కానీ ప్రభుత్వసంస్థలను కూల్చడం, అమ్మివేయడం చాలాకాలమే ప్రారంభమై యుపిఏ హయాంలో ఊపందుకుని ఎన్‌డిఏ హయాంలో శిఖ రాలకు చేరుతోంది. మోదీ గద్దె దిగేనాటికి ప్రభుత్వరంగ సంస్థ ఏదీ మిగి లేట్లు లేదు. ప్రయివేటు రంగంలో కూడా తమ ఫేవరేట్స్‌కు మేలు చేయ డానికి యితరులను ముంచుతున్నారు. ఒక్క జియో జీవించడానికి ఎన్ని ప్రయివేటు టెలికాం సంస్థలు మునిగాయో చూడండి. వాటికి అప్పులిచ్చి నష్టపోయిన బ్యాంకుల్లో మీ డబ్బు, నా డబ్బు వుందని మర్చిపోకూడదు.

అనేక ప్రభుత్వసంస్థల కంటె ఎల్ఐసి చాలా మెరుగ్గా పనిచేస్తోంది. క్లెయిమ్ పరిష్కారంలో 98.3% అనేది ప్రపంచంలోనే మొదటి స్థానమట. ప్రైవేటు బీమా సంస్థల్లో క్లెయిమ్ తిరస్కరణ రేటు ఎల్ఐసి కంటె 5 రెట్లు ఎక్కువగా ఉంది. నిర్వహణ ఖర్చు కూడా ఎల్ఐసితో పోలిస్తే ప్రైవేటు బీమా కంపెనీల ఖర్చు 5 రెట్లు ఎక్కువ. ఎల్ఐసి ఎన్‌పిఏలు, ఆస్తులతో పోలిస్తే 0.8% మాత్రమే ఉన్నాయి.

ఎల్ఐసి పాలసీదారుకు మాత్రమే కాదు, జాతికి ఎంతో చేసింది. గత ఏడాది మార్చి 31 నాటికి అది ప్రజా సంక్షేమానికి యిచ్చిన నిధులు దాదాపు 30 లక్షల కోట్లు రూ.లు. కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీల్లో, హౌసింగ్‌లో, ఇరిగేషన్‌లో పెట్టినదే రూ.21.50 లక్షల కోట్లు. 2018-19లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు 65 పైసల వడ్డీపై యిచ్చినది రూ.2.23 లక్షల కోట్లు. రైల్వేకు యిచ్చింది రూ. 1.50 లక్ష కోట్లు. నేషనల్ హైవేస్‌కు యిచ్చినది రూ. 1.25 లక్ష కోట్లు!.

నిజానికి ఇవన్నీ ఎల్ఐసి చేయాల్సిన పనులు కావు. మంచి రిటర్న్స్ వచ్చే చోట్ల పెట్టుబడి పెట్టి, తద్వారా వచ్చిన వడ్డీ ద్వారా వచ్చిన లాభాలను బుద్ధిగా పాలసీదార్లకు పంచేయాలి, మంచి బోనస్‌లు యివ్వాలి. కానీ మధ్యలో ప్రభుత్వం అడ్డుపడి, తక్కువ వడ్డీకి ఋణాలిప్పించి, పాలసీదారులకు లాభం రాకుండా చేస్తోంది. పోనీలే దేశానికి ఈ విధంగా సాయపడుతున్నాం అని ఓదార్చుకుంటున్నాం. ఇప్పుడు అసలుకే ఎసరు పెడుతున్నారు.

బ్యాంకుల్లో అయితే వడ్డీ రేటు వాళ్ల యిష్టం. వాళ్లకు లాభాలు బాగా వచ్చినా మనకేమీ పంచరు. ఎల్ఐసిలో అలా కాదు, 5% డివిడెండ్ ప్రభుత్వానికి యిచ్చేసి, తక్కినదంతా పాలసీ దార్లకు పంచేస్తారు. పాలసీల్లో 'విత్ ప్రాఫిట్స్' (ప్రీమియం ఎక్కువ), 'వితౌట్ ప్రాఫిట్స్' (ప్రీమియం తక్కువ) అని రెండు రకాలుంటాయి. బోనస్ ఎటూ వుంటుంది. ఇలా యిచ్చినా ఏటా రూ. 3-4 లక్షల కోట్లను ఇన్వెస్ట్ చేసే కెపాసిటీ ఎల్ఐసికి వుందంటే దాని నిర్వహణ బాగున్నట్లే కదా!

ఎల్ఐసి పాలసీలకు ప్రభుత్వ గ్యారంటీ ఉంటుంది నిజమే, కానీ ఆ గ్యారంటీని ఇన్వోక్ చేసే సందర్భం ఈ 64 ఏళ్లలో ఒక్కసారి కూడా రాలేదు. పైగా ఒక్కోసారి స్టాక్ మార్కెట్‌ను నిలబెట్టడానికో, ఏదైనా ప్రభుత్వ సంస్థ పబ్లిక్ ఇష్యూకి వెళ్లినపుడు ధర పడిపోకుండా చూడడానికో ఎల్ఐసిని వాడుకు న్నారు. ఇప్పుడు దీన్ని అమ్మాలంటే మొదట దాన్ని ప్రభుత్వసంస్థగా మార్చాలట. దానికి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలి. మేజర్ వాటా అంటే 51% ఉంటేనే యాజమాన్యం ప్రభుత్వం దగ్గర ఉంటుంది. కానీ గత సంవత్సరం కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి ఒక ప్రతిపాదన తెచ్చారు - ప్రభుత్వానికి 51% కంటె తక్కువ షేర్లు ఉన్నా యాజమాన్యం ప్రభుత్వానికే ఉండాలని! ఇప్పుడు 5% వాటాతోనే ఎల్ఐసిని అమ్మడానికి సిద్ధపడుతోంది. ఎందుకు?

సంపన్నులపై విధించే ఆస్తిపన్ను 1957 నుంచి అమల్లో ఉంది. మోదీ ప్రభుత్వం 2016లో దాన్ని రద్దు చేసింది. శతాధిక కోటీశ్వరుల వద్ద ఉన్న ఆస్తిపై 1% పన్ను వేసినా ఏటా రూ. 5.60 లక్షల కోట్లు వస్తుందట. కానీ అలా చేయలేదు. బ్యాంకులలో నియంత్రణ కొరవడి, ఆడిటింగ్ సరిగ్గా జరగక గత 20 ఏళ్లగా ఎన్‌పిఏలు, బ్యాంకు మోసాలు పెరుగుతూ పోయాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక కూడా పరిస్థితి మెరుగు పడలేదు. బ్యాంకులు నష్టాల్లో మునిగాయంటూ ఆర్‌బిఐను కొల్లగొట్టి వాటికి డబ్బులిచ్చారు.

దేశంలో నిరుద్యోగిత పెరిగింది కాబట్టి చిన్నా చితకా జనాలకు స్వయం ఉపాధి కల్పించే పథకాలను ప్రవేశపెట్టి, సామాన్య జనాల్లో ధనాన్ని ప్రవహింప చేస్తే వస్తూత్పత్తి, అమ్మకాలు పెరిగి ఉత్పాదక రంగం నిలబడేది. దానికి బదులు ఉద్యోగాలు కల్పిస్తాయంటూ కార్పోరేట్లకు నిధులు సమకూర్చారు. వాటికి పన్ను రాయితీలు యిచ్చారు. ఆ నష్టాలను పూడ్చుకోవడానికి ఈ ఏడాది ప్రభుత్వ సంస్థల వాటాలను అమ్మేసి రూ. 2.10 లక్షల కోట్లను సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు.

ఎల్ఐసి వాటా అమ్మకం ద్వారా రూ. 0.80-1.00 లక్ష కోట్లు వస్తాయని ఆశిస్తున్నారు. కానీ ఎల్ఐసి వంటి ధనిక సంస్థలో వాటాలు కొనాలంటే ప్రయివేటు సెక్టార్ శక్తి చాలదు. అందువలన షేరు ధర అన్యాయంగా తగ్గించేసి, ఏ అదానీకో, అంబానీకో కట్టబెట్టేస్తారనే భయాలు కలుగుతున్నాయి. 3%, 4% వాటాతోనే వాళ్లు ఎల్ఐసి విధానాలు మార్చిపారేయవచ్చనే వంక, జాతీయకరణకు ముందు ప్రయివేటు ఆపరేటర్లు చేసినట్లే చేస్తారేమోనన్న ఆందోళన కలగడం సహజం. అందుకే పాలసీదారులు, ఏజెంట్లు, సిబ్బంది యీ అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్నారు.

చాలామంది నిరుద్యోగులు, గృహిణులు, యువత, ఉద్యోగాల జోలికి వెళ్లకుండా ఏజంట్లుగా పనిచేస్తూ తమకంటూ కొంత ఆదాయం సంపాదించుకుంటున్నారు. ఎల్ఐసిపై పొదుపర్ల నమ్మకం సన్నగిల్లితే తమ గతేమిటని వారికి బెంగ. మోదీ ప్రభుత్వం ధర్మమాని యిప్పటికే బ్యాంకులపై విశ్వాసం సడలింది. ఇప్పుడు బీమా సంస్థలపై నీడలు పడడంతో పొదుపు మొత్తాలు దాచుకునే మార్గాలు మూసుకుపోతున్నాయి. భవిష్యత్తు ఎలా వుంటుందోనన్న ఆందోళన కలుగుతోంది. మోదీకి చేతనైతే తన హయాంలో ఎల్ఐసి వంటి సంస్థను సృష్టించి భావితరాలు గుర్తు పెట్టుకునేట్లు ప్రవర్తించాలి. అనునిత్యం తను తిట్టే నెహ్రూ హయాంలో వెలసిన ఎల్ఐసి వంటి సంస్థను అమ్ముకు తినడంలో ఏం ఘనత ఉంది?

వేటూరి వైభవం

- వాసుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్

ఈ రోజు ఈ టీవీలో మయూరి సినిమా చూసిన తరువాత రాసినది,

వేటూరి వారి ప్రతిభకు మచ్చు తునక లాంటి పాట ఇది. మయూరి చిత్రంలో " అందెలు పిలిచిన అలికిడిలో "పాట. సన్నివేశం సందర్భం సినిమాలో చాలా కీలకమైన ఘట్టంలో వచ్చే పాట. ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న ఓ నర్తకి ప్రియుడి చేత కూడా అవమానించ బడి ఓడిపోయి...కృత్రిమ కాలుతో తిరిగి అదే ప్రియుడి ముందు నాట్య ప్రదర్శన ఇవ్వడం. చాలా విషయం ఉన్న సన్నివేశం. తెలుగు పదనిధి తన కలాన్ని అమృతంలో ఝులిపించి అందుకున్న పల్లవి "అందెలు పిలిచిన అలికిడికి...తన అణువణువు నాట్యం చేయాలనే కోరిక అలజడులు రేపాయిట! స్వతహాగా నర్తకి పాపం కాలు పోయింది. ఎక్కడ మువ్వల శబ్ధం వినిపించినా తనలో రేగే అలజడిని చెప్పారు. యద పదమొకటవు లాహిరి అన్నారు. మనసులో సంకల్పం

నిర్వర్తించిన కృషి ఒకటే కావాలని అప్పుడే రససిద్ధి సాధ్యమని చెప్పారు. సాగర సంగమంలో కమల్ అన్నట్లు యతో మనః తథో దృష్టి" అని. మన సంకల్పానికి మన ప్రయత్నం ఒకటిగా తోడైతే అది ఓ లాహిరి లా కార్యం విజయ గర్వంతో ప్రవహిస్తుందట. ఎన్నడు ఎరగని ఉరవడి...అంటే గతంలో ఇంతకంటే బాబు లాంటి నృత్యం చేసినా కృత్రిమ కాలుతో ఛాలెంజింగ్ గా చేస్తున్న ప్రదర్శన అందుకే మనసులో ఎక్కడో తెలియని గుబులు. అందుకే ఎన్నడూ ఎరగని ఉరవడి అన్నారు. ఇది నా ప్రియ నర్తన వేళ..,ఎన్నాళ్ళో ఎదురు చూసిన శుభ సమయం అని చెబుతూనే తుది లేనిది జీవనహేళ అన్నారు. జీవితంలో కష్టసుఖాలు సహజం దానికి అంతు లేదు. ఏ వయసులోనూ మనకి మన జీవితం అన్ని రకాలుగా సౌకర్యంగా ఉండదు మనమే సౌకర్యంగా మలచుకోవాలనే సందేశం.

ఇక చరణంలో ఉత్తరాన ఉరుమొకటి ఉరిమినా" అని తనకి జరిగిన ప్రమాదం గుర్తు చేసారు. తూర్పు శుభానికి ఉత్తరం అశుభానికి వాడతాం కదా! అలా ఉత్తరంలో ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్లు ఆ ప్రమాదాన్ని వర్ణించారు. ఉలికి చిలిపి మెరుపొకటి మెరిసిందట. అంటే కాలు పోయిందని దేముడిని తిట్టుకుంటూ కూర్చోకా ప్రత్యామ్నయం లేదా అనే ఆలోచన చిలిపి మెరుపు. చిలిపి ఎందుకంటే కాలు లేనిది ఎలోగోలా మళ్ళీ నడిస్తే చాలనుకోవాలి కానీ ఈ పిల్ల ఆ జైపూర్ ఫుట్ తో డ్యాన్స్ చేయాలనుకోవడం. అలాగే ఆ కొత్త కాలుతోనే ఒ కొత్త కదలిక కలిగి అఖండ విజయానికీ చిరు మొదలు లా సాగి గిలిగింతలు పెట్టె కోరిక పుట్టింది. ఈ విషయాన్ని ఆమే తన ప్రియుడితో అన్నట్లన్న మాట. ఒరే కాలు పోగానే కుంటిదానినని వెక్కిరించావ అప్పుడే నాలో కసి కలిగిందని చెప్పడం.



ఇక "నాలుగు దిక్కుల నడుమ పుడమి నా వేదికగా"" అని వేదాల సారాన్నీ ఒక వాక్యంలో రంగరించారు. విద్వాన్ సర్వత్ర పూజియేత్ " అని నేను కళాకారిణిని నాకు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళిన గౌరవం ఉంటుంది. నీ లా నాది చిన్న ప్రపంచం కాదు ఈ భూమి అంతా నాకు నాట్యం చేసే వేదికే అని ప్రియుడికిచ్చిన రివార్డ్ అన్న మాట. ఇక అంతం లేని లయ అంతరాయం లేని గతిలో నేను హాయిగా ఆడుకుంటా పాడుకుంటా అని తన భవిష్య ప్రణాళిక చెప్పిందన్నమాట. సాహెూ వేటూరి.

అతి మఖ్యమైన అర్ధాన్ని రెండో చరణంలో ఒకే వాక్యంలో చెప్పారు మహానుభావుడు లహరిక మధు మదనిక వరాళీ ఎద స్వరాల రోద వేటూరి మార్క్ పదాలు అలరిస్తే..

సుగమ నిగమ సుధ ఎదలోపొంగగా అన్నారు. దీనికి అర్ధం స్వయంగా వేటూరి వారి నోటి వెంట వినే అదృష్టం నాకు మాగంటి మురళీబావకు కలిగింది. విశాఖ నుండి భీమిలి వెళ్తున్నప్పుడు మురళీ అడిగితె చెప్పారు వేటూరి. సుగమ అంటే మంచి చేయాలనే లక్ష్యం నిగమ అంటే నిరంతర కృషి దేవతలందరు కలిసి లోక కల్యాణం కోసం సాగరమధనం అలుపెరుగని రీతిలో చేసారు అలా అంతలా కష్ట పడ్డారు కాబట్టె అమృతమనే "సుధ" (సినిమాలో నటించిన హీరోయిన్ పేరు) పొందారని తాను కూడా కృత్రిమ కాలు తో నృత్యం చేయడానికి రాత్రి పగలు రక్తం చిందించి ప్రాణా లకు తెగించి నేర్చుకున్నాని ఆ నృత్య మధనంలో నేను పొందిన ఆత్మసంతృప్తి ఈ ఆనంద అమృతం గుండెలలో ఉప్పొంగిదనుట!!! అహో ఎంత సునిశిత విశ్లేషణ గురూజీ....

జై వేటూరి....

నటభూషణం...నాగభూషణం

- ఎల్.విజయశర్మ

నడుం చుట్టూ ఓ గళ్ల లుంగీ, బనీను, బుర్ర మీసాలు, చేతిలో కర్ర, బుగ్గపై గాట్లతో పాటు హాల్ దద్దరిల్లేలా వికటాట్టహాసాలు, అరుపులు, కేకలతో భీభత్సాన్ని సృష్టించేవాళ్లనే విలన్లుగా సినిమావాళ్లు ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఆ ఆనవాయితీని బద్దలు కొడుతూ పైకి మెత్తగా, సాధువులా కనిపిస్తూనే అనేకానేక అరాచకాలను చేసే పాత్రల్లో ఎంచక్కా ఒదిగిపోయి విలనిజానికి సరికొత్త భాష్యం చెప్పిన నటుల్లో నాగభూషణం ఒకరు. రక్తకన్నీరు నాగభూషణంగా రంగస్థల ప్రేక్షకులకు సుపరిచితమైన ఈయన వెండితెరపై కూడా తన వైభవాన్ని చాటుకున్నారు. నంగనాచిలా పక్కనే తిరుగుతూ గోతులు తీసే విలన్‌గా నాగభూషణం ప్రదర్శించిన నటనకు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు దక్కాయి. సుమారు 395 సినిమాల్లో నటించి శాశ్వత కీర్తిని పొందిన నాగభూషణం 1922 మార్చి 19వ తేదీన ఒంగోలు తాలూకా అనకర్లపూడి అనే గ్రామంలో జన్మించారు. తండ్రి పేరు రాఘవయ్య, తల్లి సీతమ్మ. తండ్రి నెల్లూరులో రైస్ మిల్లులో ఉద్యోగం చేయడంతో నాగభూషణం పెరిగి పెద్దయినది నెల్లూరులోనే.

విద్యార్థి దశనుంచే నాటకాలపై మక్కువ


హై స్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే ముఖానికి రంగు వేసుకోవడం, పాత్రల్లో పరకాయప్రవేశం చేయడం, ప్రేక్షకులను అలరించడం పట్ల ఆకర్షితుడయ్యారు నాగభూషణం. బొబ్బిలి యుద్ధం, ప్రతాపరుద్రీయంలాంటి నాటకాల్లో కీలక భూమికలు పోషించి రసజ్ఞుల అభినందనలు అందుకున్నారు. అంతే కాదు...నెల్లూరులో లలిత కళానిలయం పేరుతో అప్పట్లో నడిచిన ఓ సాంస్కృతిక సంస్థలో చేరి వివిధ నాటకాలు వేశారు. ఈ సంస్థలో నాటకాలు వేసిన రమణారెడ్డి తర్వాతి కాలంలో మద్రాస్ వెళ్లి సినిమాల్లో రాణించారు. కాగా, అదే వూళ్లో ఉన్న ఘంటశాల బలరామయ్య కూడా నాగభూషణానికి బాగా పరిచయం. ఆయన సినీ నిర్మాతగా మారిన తర్వాత నాగభూషణానికి కొన్ని అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించారు. అయితే, మద్రాస్ వెళ్లకముందు అల్లరి చిల్లరగా తిరిగిన ఇంటర్లో రెండు సబ్జెక్టులు పోవడంతో తండ్రి ఆగ్రహాన్ని చవి చూసిన నాగభూషణం ఇంట్లోంచి పారిపోయి చివరికి తండ్రి చనిపోయాడన్న వార్త విన్న తరువాత మళ్లీ ఇంటికి చేరుకున్నారు. ఆ తరువాత ఇంటికి తానే పెద్ద దిక్కని తెలుసుకున్న ఆయన ఇంటర్ పూర్తి చేసి రైల్వేలో ఉద్యోగం సంపాదించుకున్నారు. మద్రాస్‌లో ఉద్యోగం. అక్కడ ఆంధ్ర కళామండలి అనే సంస్థ స్థాపించారు. అనేక నాటకాలు వేశారు.

పేరు తెచ్చిన రక్త కన్నీరు

నాగభూషణం నటనకు నిలువెత్తు నిదర్శనం రక్త కన్నీరు. కొన్ని దశాబ్దాలపాటు రంగస్థలంపై అనేక సంచలనాలు సృష్టిస్తూ ఈ నాటకం అజరామరంగా నిలిచింది. ఒకేసారి ఒకే నెలల్లో 30 ప్రదర్శనలు కూడా ఇచ్చిన నాటకంగా చరిత్ర సృష్టించింది. ఎన్నివేల ప్రదర్శనలు ఇచ్చినా సమకాలీన సమస్యలను కూడా ప్రస్తావించడం రక్తకన్నీరు విజయవంతమవడానికి ప్రధాన కారణం. సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా రక్తకన్నీరు నాటక ప్రదర్శనను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. ప్రతి నెల మొదటివారం రక్త కన్నీరు ప్రదర్శనకు కేటాయించారు.

ఎన్ని చిత్రాల్లో...ఎన్ని పాత్రలో?

నాగభూషణం 1952లో 'పల్లెటూరు' చిత్రం ద్వారా తెలుగు సినిమాలో ప్రవేశం చేశారు. ఈ సినిమాని తాతినేని ప్రకాశరావు డైరెక్ట్ చేసారు. ఆ తరువాత మూడు దశాబ్దాలపాటు 395 చిత్రాల్లో వివిధ పాత్రలు వేశారు.



కమెడియన్‌గా, కేరెక్టర్ ఆర్టిస్ట్ గా, విలన్‌గా ఇలా అనేక పాత్రల్లో పరకాయ ప్రవేశం చేశారు. 'రేచుక్క', 'ఏది నిజం?', 'భాగ్య రేఖ', 'మాయాబజార్', 'భూకైలాస్', 'చెంచులక్ష్మి', 'భట్టి విక్రమార్క', 'భీష్మ', 'మంచిమనుషులు', 'మూగమనసులు', 'జమీందార్', 'ఆమె ఎవరు?', 'బందిపోటు', 'బంగారు గాజులు', 'రణభేరి', 'వరకట్నం', 'ఆదర్శ కుటుంబం', 'ఆత్మీయులు', 'భలే రంగడులాంటి' ఎన్నో చిత్రాల్లో మంచి పాత్రలు వేసి మెప్పించారు. 'బుద్ధిమంతుడు', 'నాటకాల రాయుడు', 'బాలరాజు కథ', 'ధర్మదాత', 'జైజవాన్, 'చెల్లెలు కాపురం', 'దసరాబుల్లోడు', 'మోసగాళ్లకు మోసగాడు', 'పట్టుకుంటే లక్ష', 'మహమ్మద్ బీన్ తుగ్లక్', 'అందాల రాముడు', 'అందరూ దొంగలే', 'భలే దొంగలు', 'అడవిరాముడు', 'కురుక్షేత్రం', గోపాలరావుగారి అమ్మాయి', 'జాతర', 'గడసరి అత్త...సొగసరి కోడలు', 'నేటి భారతం', 'నంబర్ వన్' చిత్రాల్లో నటించారు. ఈ వైవిధ్య నటుడు మే 5, 1995న స్వర్గస్తులయ్యారు.

నిర్మాతగా నాగభూషణం

నిర్మాతగా కూడా నాగభూషణం కొన్ని మంచి చిత్రాలు నిర్మించారు. వాటిలో 'నాటకాల రాయుడు', 'ఒకే కుటుంబం' చిత్రాలు ఆయనకు పేరు తెచ్చినవి.

◆•◆•◆